1993 నుంచి 2013 వరకు వెలువడిన **నడుస్తున్న చరిత్ర** కు నేటి రూపం

సంపుటి : 9
సంచిక : 7
పుటలు : 52
రు. 25లు
ISSN NO: 2582-8738
యు.జీ.సీ. గుర్తింపు పొందినది

తెలుగుజాతి పత్రిక

# అమ్మనుడి

నుడి నాడు నెనరు

సెప్టెంబరు 2023













గద్దర్ ఏకవ్యక్తి సాంస్కృతిక సైన్యం.

సాహిత్య, సాంస్కృతిక రంగ చరిత్రలో ఆయన చిరస్మరణీయుడు

## పాలకవర్గాల దుర్మార్గాన్ని ఎదుర్కోవాలి

# తెలుగు భాషోద్యమ సమాఖ్య కేంద్ర కార్యాలయం

## గిడుగు వేంకట రామమూర్తి జయంతి (2023 ఆగష్టు29 రోజున) కొత్త చిరునామాకు మారింది






కేంద్ర కార్యాలయం కొత్త చిరునామా ఇది



తెలుగు భాషోద్యమ పతాకావిష్కరణ



సామల రమేష్‌బాబు



గారపాటి ఉమామహేశ్వరరావు



జస్టిస్ ఎ.రామలింగేశ్వరరావు



మొవ్వా శ్రీనివాసులు రెడ్డి



రెవ ఫాదర్ జి.ఎ.పి.కిషోర్



జాన్ ఐర్విన్



గుంటుపల్లి శ్రీనివాస్



కె.జితేంద్రబాబు



'శక్తి' శివరామకృష్ణ



రావూరి లక్ష్మీప్రసన్న



గుత్తికొండ సుబ్బారావు



జి.కృపాచార్య



మాదోసియాన్



వెలమల సిమ్మన్న



మునిరత్నం నాయుడు



అద్దంకి శ్రీనివాస్

## తెలుగు భాషోద్యమ సమాఖ్య

వివరాలు లోపలి పుటల్లో

ప్లాట్ నెం. 89, ఇంటి నెం.54-1/4,1ఎ, వెటర్నరీ కాలనీ,4వ వీధి, 2వ అడ్డరోడ్డు, విజయవాడ - 520008

◆ తెలుగు అభివృద్ధి, సాధికారతల కోసం...
◆ తెలుగు భాషోద్యమ నిర్మాణం కోసం...
◆ ఆంధ్ర, తెలంగాణ, ఇతర రాష్ట్రాలు, విదేశాల్లోనూ ఉన్న తెలుగువారి కోసం...

తెలుగుజాతి పత్రిక

# అమ్మనుడి

సంపాదకుడు : డా॥ సామల రమేష్‌బాబు 9848016136

తోడ్పాటు : డా॥ గారపాటి ఉమామహేశ్వరరావు, డా॥ వెన్నిసెట్టి సింగారావు, డా॥ సుందర్ కొంపల్లి, రహ్మానుద్దీన్ షేక్, సరస్వతుల రామనరసింహం(సరసి), తమ్మా శ్రీనివాసరెడ్డి




సెప్టెంబరు 2023

## రచయితలకు సూచనలు

తెలుగు భాష, సాహిత్యం,సాంస్కృతికతలతో పాటు తెలుగువారి చరిత్రకూ, సంస్కృతికీ, సాధికారతకూ, ప్రగతికీ చెందిన సామాజిక, ఆర్థిక, రాజకీయ అంశాలపై రచనలకు స్వాగతం. రచనలను వ్యాసం, కథ, వచన కవిత, పాట – ఏ రూపంలోనైనా పంపవచ్చు.

1. వ్యాసాలు, కథలు ముద్రణలో 1 నుండి 3 పుటలకు మించకూడదు. కవితలు 20 నుంచి 30 పంక్తులకు మించకూడదు. విమర్శలు విషయం పైనే ఉండాలి. వ్యక్తులపై గురిపెట్టి చేయరాదు. సరళమైన తెలుగులో వ్రాయాలి.

2. రచనలను యూనికోడ్‌లో గాని, అనుఫాంట్స్‌లో గాని టైప్ చేసి పి.డి.ఎఫ్ మరియు పి.ఎం.డి. రెండింటిలోనూ పంపాలి. లేదా ఎ4 సైజు కాగితంపై వ్రాసి, స్కాన్‌చేసి *editorammanudi@gmail. com* కు పంపాలి. కొరియర్ / రిజిస్టర్డ్ / సాధారణ పోస్టులో కూడా పంపవచ్చు.

3. రచనతో పాటు పోస్టల్ చిరునామా, ఫోన్ నంబరు, ఉంటే ఇ–మెయిల్ చిరునామా కూడా ఇవ్వాలి. ఈ వివరాలు లేని రచనల్ని తీసుకోలేము.

**4.** హామీపత్రం తప్పనిసరి: **రచన సొంతమేనని, ఇతర పత్రికలకుగాని, ఇంటర్నెట్ పత్రికలకుగాని పంపలేదని, ఇంతవరకు ఎక్కడా ప్రచురణ కాలేదని హామీ పత్రాన్ని తప్పనిసరిగ రచనతో జోడించాలి. హామీ పత్రంలేని రచనలను, ముందుగా సామాజిక మాధ్యమాల్లో పెట్టిన రచనలను ప్రచురణకు స్వీకరించలేము.**

**5.దయచేసి ప్రచురణ కోసం పంపే రచనలను, వార్తలను ప్రతి నెల 15వ తేదీలోపుగా మాకు చేరునట్లు పంపండి. 20వ తేదీ దాటిన తరువాత చేరే వాటిని వెంటనే పరిశీలించడం వీలుకాదు. వ్యాసాలను ప్రచురించడానికి కనీసం 1–2 నెలల వ్యవధి పట్టవచ్చు.**

## లోపలి పుటలలో....


| | | | |
|---|---|---|---|
| ఇవీ సంగతులు | ...................... | ............... | 05 |
| శ్రద్ధాంజలి | దేశం గర్వించే చిరస్మరణీయ... | జయధీర్ తిరుమలరావు | 06 |
| సంపాదక హృదయం | పాలకవర్గాల దుర్మార్గాన్ని .... | ................. | 07 |
| ప్రధాన ప్రకటన | ప్రకటన మాత్రమే ...... | నందివెలుగు ముక్తేశ్వరరావు | 09 |
| సరైన నిర్ణయం | వాళ్ళభాష, వాళ్ళ భవిష్యత్ ,.... | కృష్ణమూర్తి సుబ్రమణ్యం | 11 |
| సుప్రీంకోర్టు చారిత్రాత్మక | నాణ్యతలేని..... | గుంటుపల్లి శ్రీనివాస్ | 12 |
| సాంకేతికత | తెలుగుభాషా డిజిటీకరణ | రహ్మానుద్దీన్ | 14 |
| పట్టనితనం | పాలకుల అజ్ఞానం...... | నందివెలుగు ముక్తేశ్వరరావు | 18 |
| తెలుగుభాషా దినోత్సవం | సరికొత్త చైతన్యంతో..... | ........................... | 20 |
| విద్యా రంగం–బోధనాభాష | ప్రాథమిక విద్య... | అప్పం పాండయ్య | 24 |
| పరిశోధన పత్రం | సంఘ సంస్కరణ దిశగా.... | భమిడిపాటి గౌరీశంకర్ | 29 |
| పుస్తక పరిచయం | బడిబువ్వ...... | ......................... | 30 |
| పరిశోధన పత్రం | మైళ్ళ దూరంలో మాతృభాష.... | కొత్తిరెడ్డి మల్లారెడ్డి | 31 |
| పరిశోధన పత్రం | జాతరల్లో.... | రాగ్యారాయక్ అదావతు | 35 |
| పరిశోధన పత్రం | ‘భాషా పరిరక్షణ’ నిలయం | బండారి ప్రేమ్ కుమార్ | 36 |
| నోటి సాహిత్యం | అమ్మనోటి సాయి(హి)త్యం..... | బద్రి కూర్మారావు | 38 |
| చంద్రిక కథ | సుబ్రహ్మణ్యభారతి రచన | బంగోరె ముందుమాటలు | 40 |
| సాహిత్య రంగం | నా సాహిత్య ప్రపంచం | మధురాంతకం నరేంద్ర | 43 |
| వారసత్వ సంపద | శంకరన్ గారి తరం.... | పి.శివరామకృష్ణ ‘శక్తి’ | 45 |
| ధారావాహిక | అడుగుజాడలు–ఆనవాళ్ళు–26 | ఈమని శివనాగిరెడ్డి | 47 |
| వెలిసిపోతున్న పదాలు: | లూలామాలం | జి.వి.పూర్ణచంద్ | 50 |



| ముఖచిత్రం, | కార్టూన్లు | కంప్యూటర్ |
|---|---|---|
| చిదంబరం రావు | సరసి | యన్.రాజారావు |

ammanudi.org వలగూటిలో అమ్మనుడి పాత సంచికలను చదువగలరు


**రచనలను, వార్తలను, వాట్సాప్ పంపవద్దు: ‘అమ్మనుడి’లో ప్రచురణకై వార్తలు, ఫోటోలు, రచనలను కొందరు వాట్స్‌యాప్(WhatsApp) లో పంపుతున్నారు. వాటిని ప్రచురణకు స్వీకరించలేము. దయచేసి కొరియర్‌లో / రిజిస్టర్డ్ పోస్టులో, లేదా editorammanudi@gmail.com కు పంపించండి. – సంపాదకుడు**


రచనలు, ఉత్తరాలు పంపుటకు చిరునామా:

సంపాదకుడు: **అమ్మనుడి**, జి–2, శ్రీ వాయుపుత్ర రెసిడెన్సీ, హిందీ కళాశాల వీధి, మాచవరం,విజయవాడ–520004.

సంపాదకుడు : *9848016136* *e-mail* : editorammanudi@gmail.com


రచయితల అభిప్రాయాలు వారి స్వంతం. వారితో పత్రిక యాజమాన్యం, సంపాదకుడు ఏకీభవించవలసిన అవసరం లేదు.

అడుగుజా

తెలుగుజాతి పత్రిక

# అమ్మనుడి

నుడి నాడు నెనరు మాసపత్రిక

చందా వివరాలు: జీవిత చందా: రూ.5000

4 సం॥: రూ.1000, 1 సం॥ :రూ.300

ఎం.ఓ. లేదా తెనాలిలో చెల్లునట్లు బ్యాంకు చెక్కు లేదా డి.డి.ని **'తెలుగుజాతి'** పేర పంపాలి.

### బ్యాంక్‌ఖాతా, ఫోను వివరాలు

ఆన్‌లైన్ ద్వారా చందాను పంపేవారు NEFT / RTGS ద్వారా **'తెలుగుజాతి'**-యాక్సిస్ బ్యాంకు, తెనాలి శాఖకు పంపాలి.

**TELUGU JAATHI - AXIS BANK, TENALI**

అక్కౌంట్ నెం. **914020020387880**

**IFSC Code : UTIB0000556**

Telugu Jaathi
+91 94929 80244

9492980244@okbizaxis

ఈ **QR**కోడ్‌ను స్కాన్ చేసి లేదా **QR**కోడ్ క్రింద ఇచ్చిన యుపిఐ ఐడి నెంబరుకు మీరు విరాళాలు, చందాలు పంపవచ్చును.

ఆన్‌లైన్‌లో చందాను పంపేవారు వెంటనే ఇంటినెంబరు, వీధి పేరు, పోస్టాఫీసు, ఊరిపేరు, పిన్‌కోడ్ నెంబరుతో సహా తమపూర్తి చిరునామాను, ఫోన్‌నెంబరు, మెయిల్‌ఐడి తదితర వివరాలను జాబు ద్వారా తెలుపగలరు.

**94404 48244** లేదా **94929 80244** ఫోన్‌కు సందేశం గాని, వాట్స్‌యాప్ ద్వారా గాని తెలుపగలరు.

చందాలు పంపడం, దానికి సంబంధించిన ఉత్తరప్రత్యుత్తరాలకు చిరునామా

**డా॥ సామల లక్ష్మణబాబు,** ప్రచురణకర్త, 'అమ్మనుడి'
8-386, జీవక భవనం, అంగలకుదురు పోస్టు, **తెనాలి,**
గుంటూరు జిల్లా - 522 211.
ఫోన్ : 94404 48244, 94929 80244,
ఇ-మెయిల్ : ammanudi2015@gmail.com

### చందాదారులకు సూచనలు

1. చందా కాలం, ముగింపు తేదీ- పత్రిక కవరుమీద మీచిరునామా పై భాగంలోనే ఉంటుంది. గమనించండి.
2. చందా కాలం ముగిసిపోయిన తర్వాత పత్రిక పంపబడదు. దయచేసి వెంటనే చందా పైకం పంపి, చందాను కొనసాగించుకోగోరుతున్నాము.
3. చందా పూర్తయ్యేందుకు ఒక నెల ముందే దయచేసి మీ చందాను పంపించండి.
4. మీ ఇంటి నెంబరుతో సహా పూర్తి చిరునామాను, పిన్‌కోడ్ నెంబరుతో సహా తెలియపరచాలి. మీ ఫోన్ నెంబరును, వుంటే మీ మెయిల్ ఐడి ని తెలుపండి.
5. మీ చిరునామా మారినట్లయితే దయచేసి వెంటనే తెలియజేయండి.
6. 'అమ్మనుడి' పత్రికను చందాదారులకు మాత్రమే పోస్టులో పంపించగలము. బయట ఎక్కడా అంగళ్లలో అమ్మకమునకు పెట్టడంలేదు. కనుక కావలసినవారు దయచేసి చందాదారులుగా చేరవలసిందిగా కోరుతున్నాము. చందాదారులు కోరినట్లయితే ఆన్‌లైన్‌లో కూడా పత్రికను పంపగలము. మీ ఇ-మెయిల్ ఐడిని తప్పక తెలియజేయండి.

### గమనిక

పత్రికకు చందాదారులుగా చేరినవారి రచనలను తప్పనిసరిగా ప్రచురిస్తామనే హామీ ఏమీలేదు. ఏ రచనలను ప్రచురించాలో ఎంపిక చేసే బాధ్యత కేవలం పత్రిక సంపాదకుడిదే. దయచేసి ఎవ్వరూ వత్తిడి తేవద్దు. -ప్రచురణకర్త

### ప్రోత్సాహకులుగా చేరండి

రు. 10,000/-లు, ఆపైన- విరాళంగా పంపి, 'తెలుగుజాతి ట్రస్టు'కు ప్రోత్సాహకులుగా మాతో చేరి సహకరించగోరుతున్నాము. అట్టి 'ప్రోత్సాహకులకు' పత్రికను శాశ్వతంగా పంపుతూ, ట్రస్టు ప్రచురించే ఇతర పుస్తకాలను కూడా వారికి సాదరంగా పంపగలము. దయచేసి మీరు ప్రోత్సాహకులుగా చేరి మా కృషికి తోడ్పడగోరుతున్నాము.

## తెలుగుజాతి(ట్రస్టు) ప్రచురణ

# ఇవీ సంగతులు...

**1. ఫోన్‌పే సేవలు తెలుగులో**

యూపీఐ విధానంలో డబ్బుల లావాదేవీలు మొదలయ్యాక ఫోన్‌పే లాంటి సేవలు బాగా ఉపయోగంలోకి వచ్చాయి. అయితే వీటి ఇంటర్‌ఫేస్(అంతరవర్తిని) ఇంగ్లిష్ లో మాత్రమే ఉండటం వలన ఇంగ్లిష్ రాని వారికి ఇబ్బంది అయ్యేది. భారతదేశ మార్కెట్ లో ఇంగ్లిష్ రాని వారు తమ తమ మాతృభాషల్లో లావాదేవీలు జరుపుతున్నారని గమనించిన ఫోన్‌పే సంస్థ తన సేవలను తెలుగులో ప్రారంభించింది. డబ్బు అందుకున్న సందేశం వ్యాపారస్తులకు తెలుగులో వినిపించేలా వ్యవస్థ చేసింది.

**2. ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ ప్రెస్ నుండి కొత్తగా ఇంగ్లిష్-ఇంగ్లిష్-తెలుగు నిఘంటువు విడుదల.**

ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ ప్రెస్ వారు ఒక కొత్త నిఘంటువును ఆగస్టు 29న విడుదల చేసారు. ఇందులో 3,000 కొత్త పదాలను చేర్చుకుని మొత్తం 27 వేల ఇంగ్లిష్ పదాలకు తెలుగులో అర్థాలు ఇచ్చారు.

**3. సౌత్ ఆఫ్రికాలోని వెస్టెర్న్ కేప్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ హెల్త్ అండ్ వెల్‌నెస్ వారు అక్కడి ఆస్పత్రులకు వచ్చే రోగులకు సేవలు వారి మాతృభాషలలో అందించనున్నారు.**

ఆరోగ్య సమాచారాన్ని అక్కడి అధికార భాష ఇంగ్లిష్‌లో అందించడం వలన రోగులు సరైన విధానంలో వైద్యాన్ని అందుకోవడం లేదని, మందులు తీసుకోవటంలో అయోమయ పడుతున్నారని గమనించిన ప్రాంతీయ ప్రభుత్వ వైద్యశాఖ వారు రోగి మాతృభాషలోనే వైద్యం అందించాల్సిందిగా ఆస్పత్రులకు, వైద్యులకు, నర్సులకు మార్గదర్శకాలు జారీ చేస్తూ, కనీస అవసర వైద్య వాడుక పదాల నిఘంటువు ఒకటి ఇస్తూ అందులో ఆ ప్రాంతంలో వాడే ముఖ్యమైన పది భాషల్లో పారిభాషిక పదాలను ఇచ్చారు. బధిరులకు కావాల్సిన సైగల భాషలో సైతం కొందరు నర్సులకు, డాక్టరులకు తర్ఫీదు ఇచ్చి వైద్యపరమైన, మందులకు సంబంధించిన సమాచారాన్ని సైగల భాషలో చెప్పేలా శిక్షణనిచ్చారు.

**4. 'ఇంగ్లిష్ కు మేం వ్యతిరేకం కాదు, కానీ చదువుల్లో విద్యార్థి తప్పనిసరిగా తన మాతృభాషను, హిందీని కూడా నేర్చుకోవాల్సిందే' : అమిత్ షా**

అహ్మదాబాదులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టీచర్ ఎడ్యుకేషన్ సంస్థ స్నాతకోత్సవంలో ముఖ్య అతిథిగా విచ్చేసిన కేంద్ర హోమ్ మంత్రి అమిత్ షా భాషలపై కేంద్ర ప్రభుత్వ వైఖరిని వివరిస్తూ తమ ప్రభుత్వం ఇంగ్లిష్ కు వ్యతిరేకం కాదని, అయితే విద్యార్థులంతా దేశ రాజభాష హిందీలో, తమ సొంత మాతృభాషలో కచ్చితంగా చదువుకోవాలని సూచించారు.

**5. ప్రాథమిక మాతృభాషా మాధ్యమ విద్య సింగపూరులో 2024 నుంచి తప్పనిసరిగా అమలు.**

సింగపూరు విద్యాశాఖామాత్యులు చన్‌చున్‌సింగ్ 2024 నుంచి తప్పనిసరిగా ప్రాథమిక తరగతుల్లో విద్యార్థి మాతృభాషలో విద్యను అమలు చేయాలని నిర్దేశిస్తూ, అందుకు కావాల్సిన బోధనా సామగ్రిని సమకూర్చుకునేందుకు ఒక సింపోజియంను ప్రారంభించారు. ప్రతి బడిలో ప్రయోగాత్మకంగా ఒక నిర్దిష్ట విద్యార్థి-ఉపాధ్యాయ సమూహానికి ఈ మాధ్యమ విద్యలను అమలు చేస్తారు. మెల్లగా అందరు విద్యార్థులను, ఉపాధ్యాయులను ఈ వ్యవస్థలోకి తెస్తారు.

**6. ఒడిషా రాష్ట్ర ప్రభుత్వం జాతీయ విద్యావిధానానికి అనుగుణంగా రాష్ట్ర స్థాయిలో విద్యా విధానాన్ని రూపొందించనుంది.**

జాతీయ విద్యా విధానానికి తగినట్లుగా ఒడిషా రాష్ట్రం రాష్ట్రస్థాయి విద్యా విధానాన్ని రూపొందించనుంది. విద్యా విధానంతో పాటుగా పాఠ్యపుస్తకాలను తిరిగి కొత్తగా రూపొందించనుంది. ఈ పాఠ్యపుస్తకాల్లో ఒడిషా రాష్ట్రంలోని వివిధ తెగల భాషల గురించి తరగతికొక పాఠం చొప్పున ప్రవేశపెడతారు. తద్వారా తమ రాష్ట్రంలో మాట్లాడే భాషల వైవిధ్యం గురించి విద్యార్థులు తెలుసుకుంటారు.

**7. మూల ఇండో-ఐరోపీయా భాష: అన్ని ఇండోయూరోపీయన్ భాషలకు మాతృక భాష ఆనవాళ్ళను కనిపెట్టిన భాషాశాస్త్రవేత్తలు**

నేడు దక్షిణేతరభారతదేశంలో, యూరోప్, ఆసియాలలో ప్రముఖంగా మాట్లాడే భాషలన్నీ ఇండోయూరోపీయన్ భాషా కుటుంబానికి చెందినవి. ఈ భాషలన్నిటికి మాతృక భాష – మూల ఇండో-ఐరోపీయా భాష పుటుక, వ్యాప్తి, ఇప్పటికీ అప్పటి నుంచి మార్పు చెందని పదాలు మొదలగు అంశాలపై ఆసక్తి కరమైన విషయాలను భాషాశాస్త్రవేత్తలు వెల్లడించారు. శాస్త్రీయంగా ఈ భాషా కుటుంబ మాతృకభాష పుట్టుక వరకూ క్రమాన్ని గీసుకొని, క్రీ.పూ. 4500 నుండి క్రీ.పూ. 2500 మధ్య ఈ భాష వాడుకలో ఉన్నట్టు అనుమానించారు. ఉక్రెయిన్ కు తూర్పుగా ఉన్న ప్రాంతంలో ఈ భాష మాట్లాడే వారని, అక్కడి నుంచి పడమరన ఐర్లాండ్ నుంచి తూర్పున హిందూ మహాసముద్రం వరకూ ఈ భాష వ్యాపించిందని ప్రతిపాదించారు.

**8. నైరోబీలో అక్కడి శ్రామికులు తమ మాతృభాష ప్రేమను వినూత్నంగా వ్యక్తపరుస్తున్నారు.**

నైరోబీలో ఎక్కువగా స్వాహిలీ భాష మాట్లాడతారు. అదక్కడ ఆంగ్లంతో పాటుగా అధికార భాష కూడా. అయితే శ్రామిక వర్గం ఎక్కువగా కికూయు అనే జానపద భాషను మాట్లాడతారు. 42 కు పైగా వివిధ ఆదివాసీ తెగలున్న కెన్యాలో స్వాహిలి, ఆంగ్లం రాని శ్రామికులే ఎక్కువ. ఇంగ్లిష్, స్వాహిలి రుద్దుడును అధిగమించేందుకు శ్రామికులు – ఆటోచాలకులు, బస్సు చాలకులు, కూలీ వారు కికూయు లాంటి భాషల్లోనే మాట్లాడటం మొదలుపెట్టారు. పర్యాటకులకు ఇబ్బంది అయినా, అనువాద ఆప్‌ల వలన పెద్ద అసౌకర్యం లేకుండానే లావాదేవీలు జరుగుతున్నాయి. సాంకేతికత అలా కలిసివస్తోంది.

**9. ఎస్టోనియాలో అక్కడి ప్రభుత్వం మాతృభాషా మాధ్యమానికి విరుద్ధంగా తెచ్చిన చట్టం ఐక్యరాజ్యసమితి మానవహక్కులను కాలరాస్తుందని అభిప్రాయపడ్డ నిపుణులు.**

ఎస్టోనియా తూర్పు ఐరోపాలో ఒక దేశం. అక్కడి ప్రభుత్వం మాతృభాషా మాధ్యమాన్ని నిలిపివేస్తూ, విద్యార్థులంతా ఎస్టోనియన్ భాషలో చదువుకోవాలని చట్టం తెచ్చింది. ఇది మానవ హక్కుల ఉల్లంఘన

**తరువాయి 22వ పుటలో**

జయధీర్ తిరుమలరావు
9951942242

# దేశం గర్వించే చిరస్మరణీయ అధ్యాయం




గద్దర్ మరణంతో ఒక ప్రజాసాహిత్య శకం ముగిసింది. మరో శకం ఎలా పుడుతుందో చెప్పలేం. అత్యంత ప్రతిభాపాటవం కలిగిన గద్దర్ ఆనాటి సామాజిక ఆర్థిక రాజకీయ పరిస్థితులలో ఒక మహాశక్తిగా రూపొందాడు. ఆర్ట్ లవర్స్ అనే మామూలు సంస్థలో సభ్యుడిగా చేరి, ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రచారకుడిగా పనిచేసి, ఒక విప్లవ కవి గాయకుడిగా ఎదిగిన తీరు అద్భుతం.

గుమ్మడి విఠల్‌రావు తల్లిదండ్రులు పెట్టిన పేరు. గదర్, గద్దర్‌గా ప్రజాసైన్యం దారిలో పెట్టిన పేరు. గద్దర్ ఏకవ్యక్తి సాంస్కృతిక సైన్యం. తానే సైన్యాధ్యక్షుడు. చరిత్ర సృష్టించిన జననాట్యమండలికి గద్దర్ పర్యాయపదం.

ఎక్కడో మహారాష్ట్ర నుండి వచ్చి, మెదక్ జిల్లా తూప్రాన్‌లో స్థిరపడ్డారు. నిజామాబాద్‌లో ప్రాథమిక విద్య, ఉన్నత పాఠశాల విద్య హైదరాబాదులో, చదువుతున్న ఇంజనీరింగ్ కోర్సు ఆపి, ప్రజాకళల విశ్వవిద్యాలయానికి వైస్ ఛాన్సలర్ తాతలాంటి పదవి పొందాడు. కెనరాబ్యాంకులో చేస్తున్న ఉద్యోగానికి రాజీనామా చేసి ప్రజల కోసం అంకితమయ్యాడు. బ్యాంకులో పదులు,వందలు, లక్షలు వంటి అంకెలతో పనిచేసేవాడు అదే సంఖ్యలో ప్రజల మధ్య ఉద్యమమైపోయాడు.

పీపుల్స్‌వార్ పార్టీ సాంస్కృతిక దళ నాయకుడిగా రహస్య జీవితం గడిపాడు. తదనంతరం అక్కడికన్నా ఎక్కువగా బహిరంగంగా ప్రజల మధ్య ఉండాలన్న అవసరం గుర్తించి బయటకు వచ్చాడు. అలా బయటకు వచ్చిన రోజున నిజాం కళాశాల ఆవరణలో ఐదు లక్షలమంది మధ్య తన ప్రదర్శన ఇచ్చాడు. అలా అలా రాష్ట్రం, దేశం అంతటా ప్రగతిశీల గానం మహోధృతంగా వ్యాపించింది. పలు భాషలలోకి అతని పాటలు అనువాదమయ్యాయి. వందల, వేలాది మంది గొంగళి భుజానికేసి కవి గాయక ప్రదర్శనలు ఇవ్వడం మొదలైంది. గానంలో, ఆహార్యంలో ప్రదర్శనలో గద్దర్ ప్రభావం అనూహ్యంగా దేశం మొత్తం వ్యాపించింది. నిజం చెప్పాలంటే రష్యాలో చైనాలో, క్యూబా వంటి దేశాలలో గొప్ప విప్లవ నాయకులు వచ్చారు . కాని గద్దర్ వంటి సాంస్కృతిక సేనానులు రాలేదు. పాల్ రాబ్సన్, విక్టర్ జారా వంటి గాయకులు ఉన్నారు. కాని వారు విప్లవ సంస్థలలో పనిచేయలేదు. విప్లవోద్యమ చైతన్యాన్ని ప్రజలలో అంతగా ప్రసరింపచేసిన వాళ్ళు ఇంకా ఎక్కడైనా, ఎవరైనా ఉన్నారా అనిపిస్తుంది. లూగున్, గోర్కి వంటి రచయితలు, లిఖిత సాహిత్యం గొప్పదే. కాని మౌఖిక సాహిత్య సృజనకారులలో గద్దర్‌ని మించినవాళ్ళు లేరని అనిపిస్తుంది. గద్దర్ చివరి క్షణం వరకు చివరి గానం సైతం ఒక మహోజ్వల ఘట్టం.

పార్టీలో ఉన్నపుడే ఈ దేశంలో కులం వల్ల దోపిడీకి ప్రజలు గురవుతున్నారని, సమాజంలో, సాహిత్యంలో, కళారంగంలో కృషి చేసిన వారికి గుర్తింపు లేదని అందుకే వర్గంతోపాటు కుల నిర్మూలన దిశగా ఆలోచించాలని డాక్యుమెంట్లు పెట్టాడు. హైదరాబాదు నగరంలో ఉన్న బ్రాహ్మణకరణీక నాయకులు దీనివల్ల తమ ఆధిపత్యానికి చెక్ పడుతుందని గద్దర్‌ని తీవ్రంగా వ్యతిరేకించారు. గద్దర్‌కి, పార్టీకి మధ్య వాదోపవాదాలు నడిచాయి. కాని ఆపార్టీ ప్రజాసంఘాలలోనే పరిష్కారం వెతుక్కోమని సూచించింది. దీంతో గద్దర్ హతాశుడయ్యాడు. పార్టీ అతడి పాత్రని తగ్గించింది. లోకానికి స్పష్టంగా తెలియదుగాని గద్దర్ పార్టీని విడనాడాడా, పార్టీనే గద్దర్‌ని విడనాడిందా?. ఏమైతేనేం గద్దర్ ఒంటరిగానే ప్రజల పక్షం నిలిచాడు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు ప్రాతినిధ్యం వహించాడు.

పార్టీనుండి బయటకు వచ్చాక తన మానాన, తన ఇష్టం వచ్చిన రీతిలో బతికే స్వేచ్ఛ అతనికుంది. తన శరీరంలో తూటా సలుపుతుంటే, గతంలో పెట్టిన కేసుల తీవ్రత కెలుకుతుంటే, వాటి నుండి బయటపడటానికి తొక్కని గడపలేదు. ఎక్కని మెట్టు లేదు. ఈ విషయాలేవీ తెలియని వారికి గద్దర్ రుచించలేదు. విచిత్రం ఏమంటే కుహనా ప్రగతివాదులు, ఉద్యమం నుండి బయటకు వచ్చిన కొందరు అతని మరణ సందర్భాన్ని సైతం వివాదాస్పదం చేశారు. 'ఏనుగ పోతుంటే' సామెత ఇలాంటి వారిని చూసే ఏర్పడి ఉంటుంది.

అతని రాజకీయ పోరాటం, వ్యక్తి ఘర్షణ వంటి వాటిని నిత్యం ఎదుర్కొంటూ కూడా ప్రజాపక్షమే వహించాడు. ప్రజావ్యతిరేకతకి, చర్యలకు ఆమడ దూరంగా ఉన్నాడు. ఏనాడూ పాటకి, చిరునవ్వుకి దూరం కాని పసిపిల్లాడు. ఇతనే తన పేర ఒక యుగాన్ని నిర్మించుకున్నాడు. అందులో ప్రజలకు సముచిత స్థానం కల్పించాడు. వారి తరతరాల సంస్కృతికి, రాగాలకు, గానాలకు సముచిత గౌరవమిచ్చాడు. అదీ గద్దర్ విజయం.

గద్దర్ మరణంతో ఆయన స్థానాన్ని పూర్తిచేయాలంటే సాధ్యం కాదు. ప్రపంచ సాహిత్య సాంస్కృతిక రంగ చరిత్రలో స్మరణీయుడు.

సంపుటి : 9 సంచిక: 7
**అమ్మనుడి**
సెప్టెంబరు, 2023

సంపాదక హృదయం

# పాలకవర్గాల దుర్మార్గాన్ని ఎదుర్కోవాలి

( ఈ సంపాదకీయం డిసెంబరు 2021 'అమ్మనుడి' కోసం వ్రాసి, ప్రచురించబడింది. నాటి పరిస్థితులకు, ఇప్పటికీ పెద్ద తేడా ఏమీ లేదు. మరింత చిక్కుముడులలో ఇరుక్కొన్నాము. చదువరుల జ్ఞాపకాల్ని తట్టి లేపడం కోసం తిరిగి ఇప్పుడు ముద్రిస్తున్నాము. మన్నించగోరుతున్నాను.)

**2012** డిసెంబరులో ప్రపంచ తెలుగు మహాసభలను తిరుపతిలో జరిపింది నాటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం. తెలుగు భావోద్వేగాలను ఎంతో కొంత రగిలించి, తెలుగుజాతి సమైక్యత అనే నినాదాన్ని ప్రయోగించి ప్రత్యేక తెలంగాణ ఉద్యమాన్ని నీరుగార్చి రాజకీయలబ్ది పొందాలని నాటి కాంగ్రెస్ ప్రభుత్వం వెంపర్లాడింది గాని, అందులో ఏమాత్రం సఫలం కాలేకపోయింది. నేతల భావదారిద్ర్యం వల్ల తామనుకొన్నదాన్ని బలంగా ప్రజల్లోకి తీసుకువెళ్లలేక చతికిలబడింది. తెలుగు భాషోద్యమ సమాఖ్య ప్రభుత్వం ముందుంచిన డిమాండ్లను నీరుగార్చాలని ప్రయత్నించిన ప్రభుత్వం, చివరకు మెట్టుదిగి సభల తొలిరోజునే కొన్ని వాగ్దానాలను ప్రకటించింది. అయితే అందులోనూ చిత్తశుద్ధిలేనందువల్ల, నాటి పాలకపార్టీ ఏమాత్రం లాభం పొందలేకపోయింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడగా మిగిలిన ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబుగారి తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం అనుసరించిన మోసపూరిత విధానాల వల్ల పాలనలో, చదువులో తెలుగు వినియోగం అట్టడుగుకు తొక్కివేయబడింది.

పట్టనితనంతో కాంగ్రెసు ప్రభుత్వాలు వ్యవహరిస్తే చంద్రబాబు తెలుగుదేశం ప్రభుత్వాలు మోసపూరితంగా వ్యవహరించాయి. సమైక్య రాష్ట్రంలో చంద్రబాబు పాలనలోనే విధ్వంసం మొదలైంది. నిరసనగా అప్పుడే తెలుగుభాషోద్యమాలు పుట్టుకొచ్చాయన్న సంగతిని మనం మరువకూడదు. తెలుగు భాషోద్యమ సమాఖ్య ఏర్పడి ప్రత్యక్ష చర్యలను మొదలుపెట్టింది అప్పుడే. చంద్రబాబు తొలినుండీ చేపట్టిన తిరోగమన విధానాలతోనే ఎన్టీరామారావు రాజకీయ, సాంస్కృతిక వికాసం కోసం చేపట్టిన చర్యలు ఛిన్నాభిన్నమయ్యాయి. ఆయన బొమ్మను పెట్టుకొని చంద్రబాబు సాగించిన పాలన- అభివృద్ధి పేరుతో రియల్‌ఎస్టేట్, ఐటి వంటి రంగాల అభివృద్ధినే రాష్ట్ర అభివృద్ధిగా చెప్పుకొనే దుస్థితికి చేరింది. మొత్తంగా రాష్ట్రప్రగతి మేడిపండులా మిగిలింది. జనసమూహాల్లో ఆయనపై నమ్మకం నశించడమేగాక, కొత్తగా వచ్చిన రాజకీయ పార్టీకి అవకాశాలు సమకూర్చినట్లయింది. మతం, కులం, వర్గం వంటి సున్నిత అంశాలన్నీ వైఎస్ఆర్ కాంగ్రెస్ యువనేతకు అందివచ్చాయి. నాణెం తిరగబడినా పాత విధానాలే మరోరూపంలో, కక్షతో, కసితో తాండవమాడు తున్నాయి. ఫలితాలు మరింత భయంకరంగా అనుభవంలో కొస్తున్నాయి.

అయితే చంద్రబాబు పోకడకు భిన్నంగా జగన్ ధోరణి స్పష్టంగా తెలుస్తున్నది. తెలుగులో పాలన, బోధనకు సంబంధించి ఆయన కుండబద్దలు కొట్టినట్లు తన విధానాలను ప్రకటించేశారు. ఇంగ్లీషే దైవం, ఇంగ్లీషే మార్గం, ఇంగ్లీషే భవిష్యత్తు అని అయనా, అయన ప్రభుత్వమూ స్పష్టం చేస్తున్నారు. అందుకు తగ్గట్లుగా తమ పాలనా విధానాలను తీర్చిదిద్దుతున్నారు. తరతరాలుగా మోసపోయిన తెలుగు ప్రజలకు తానే విముక్తి ప్రదాతనని ఆయన నమ్మబలుకుతున్నారు. చంద్రబాబు ఏనాడూ ఇట్లా నోటితో చెప్పలేదు. ఇంగ్లీష్ మీడియంను ప్రోత్సహించి ఉద్యోగాలకై యువత విదేశాలకు వెళ్లేందుకు బాటలు వేసింది తానేనని నిండు సభలో, అదీ తెలుగుభాషాదినోత్సవం నాడు ప్రభుత్వం ఏర్పాటు చేసిన సభలో ఆయన ప్రకటించుకున్నాడు. 13 జిల్లాల ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి తొలి ముఖ్యమంత్రిగా తన హయాంలో విద్యావ్యాపారస్తులకు మంత్రి పదవులు యిచ్చి వారి చేతుల్లో విద్యారంగాన్ని అప్పచెప్పిన ఘనత ఆయనదే! ప్రాథమిక స్థాయిలో కూడా తెలుగుకు ఉద్వాసన చెప్పే జీవోను ప్రాథమిక విద్యాశాఖ మంత్రి జారీ చేసినప్పుడు, ఎంఎల్‌సీలు దాన్ని ప్రశ్నించారు. ఉద్యమాలు నడిచాయి. తనకు తెలియకుండా జి.ఒ. వచ్చినట్లు అమాయకత్వాన్ని నటించి, ఆ

సంపాదక హృదయం

జి.ఒ ను రద్దు చేస్తున్నానని ప్రకటించిన పెద్దమనిషి, తర్వాత ఆ సంగతినే మరచిపోయాడు. తెలుగు భాషాభివృద్ధి సంస్థను ఏర్పరుస్తాననీ, దానికి జి.ఒ. యిస్తే విలువ ఉండదు గనుక దాన్నొక చట్టంగానే తెస్తానని బీరాలు పలికి, చివరకు ఒక జిఒతోనే సరిపెట్టాడు. తర్వాత ఎన్నికల్లో ప్రభుత్వమే మారడంతో అదంతా తుస్సుమంది. అన్నివిషయాల్లో అయనది ఇదే శైలి. ఆయన తన అజెండాను తాను అమలు పరుచుకుంటూ ముందుకు సాగిపోయాడు. కనుకనే అన్ని విధాలా ఆయన అపజయాల పాలవుతున్నాడు. నమ్మకాన్ని పోగొట్టుకొంటున్నాడు. మిత్రులను శత్రువులుగా చేసుకొంటున్నాడు. అల్లరి పాలవుతున్నాడు. ఆయన చిత్తశుద్ధిపై ఎవ్వరికీ నమ్మకం లేని స్థితి ఏర్పడుతోంది. ఐనా ఆయన మారతాడన్న ఆశ ఏమీ కన్పించడంలేదు.

మరి, ఇప్పుడున్న ప్రభుత్వం తన విధానాలను స్పష్టంగా ప్రకటించిన పరిస్థితుల్లో ఆంధ్రప్రదేశ్‌లో ప్రజల భాషగా తెలుగును కాపాడుకోవడం ఎలా? పాలనలో అడుగంటిపోయి, పాఠశాల విద్యలో సోదిలోకి కూడా లేకుండా పోతున్న మన అమ్మనుడిని కాపాడుకోవడం ఎలా? మన భాషతో మనం ఎదగడం అనే ప్రజాస్వామ్య విధానాన్ని, భాషారాష్ట్రాల లక్ష్యాన్ని సాధించడం ఎలా?

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఒక భాషగా తెలుగును ఉంచింది కదా అని పదవుల కోసం దాసోహం అన్న పెద్దలు కొందరు సన్నాయి నొక్కులు నొక్కుతున్నారు. అదంతా కల్లబొల్లి వ్యవహారం. ఆంధ్రప్రదేశ్ సంగతే కాదు, తెలంగాణ రాష్ట్రంలో పరిస్థితి కూడా ఏమీ బాగోలేదు. కాకపోతే వారు ఈ అంశంపై అంతగా స్పష్టత ఇవ్వరు. తెలంగాణ భాషా సంస్కృతుల రక్షణ పేరిట అధికారంలోకొచ్చాక భాషవిషయంలో వారు స్పష్టమైన చర్యలు ఏమీ తీసుకోలేదు. తెలంగాణ సంస్కృతి పేరిట చేతనైనంత  చేస్తున్నామంటున్నారు గాని, భాషను కోల్పోయిన జాతి తన సంస్కృతిని  కాపాడుకోలేదన్న వాస్తవాన్ని వారు గుర్తించరు!

అధికారంలోకి వచ్చిన ఏడాదికే తెలంగాణ ప్రభుత్వం కూడా ప్రపంచ తెలుగు మహాసభల్ని నిర్వహించింది. గొప్పగా ప్రచారం చేసుకొని అంత గొప్పగానూ సభలను జరిపింది. భాషవిషయంలో అందరికీ ఆదర్శంగా నిలబడతానని, తెలుగును కన్ననేల తెలంగాణలో అద్భుతాలు చేయబోతున్నామని ప్రకటించింది. ఆ తర్వాత వెంటనే మౌనం  వహించింది. సద్దుచెయ్యకుండా ఇతర భాషాధిపత్యవర్గాలు ముందుకు సాగిపోతున్నాయి!

సమైక్య రాష్ట్రంగా ఉన్నప్పుడే పీవీ నరసింహారావు గారు తన పాలనలో తెలుగుకోసం పటిష్టమైన, శాస్త్రీయమైన పద్ధతిలో పునాదులు వేశాడు. ఎన్టీరామారావు గారు తెలుగుజాతి అంతటికీ ప్రపంచంలోనూ దేశంలోనూ ఒక గుర్తింపు తెచ్చాడు. ఆ తర్వాత వచ్చిన పాలకులకు ఆ అవగాహనగానీ, ఆలోచనగానీ లేకపోగా, కళ్లు మూసుకొని రాజకీయ స్వార్థాలను పెంచిపోషించారు తప్ప, భాషారాష్ట్రాల లక్ష్యాలను గానీ తెలుగుజాతి శ్రేయస్సును గానీ పట్టించుకోలేదు.

అటు కేంద్ర ప్రభుత్వం మాతృభాషల్ని కాపాడతానంటూనే దేశంలో హిందీ, ఆంగ్లం విస్తరించడానికి దారులను విశాలం చేస్తూ ఉంటే తమ భాషల్ని కాపాడుకునేందుకు హిందీయేతర భాషారాష్ట్రాలు కృషి చేయవద్దా అనేది ప్రజలముందున్న పెద్ద ప్రశ్న.

అమ్మనుడుల ప్రాధాన్యతనూ భాషావైవిధ్యాన్నీ కాపాడుకోవాలన్న యునెస్కో పిలుపును పరిగణనలోకి తీసుకోక పోవడం తెలివి అవుతుందా? ఈ అంశాలపైన ప్రపంచంలో జరుగుతున్న చర్చను, ఉద్యమాలను పట్టించుకోవద్దా? దేశం వెలుపల నుంచీ, దేశం లోపలినుంచీ బలంగా తోసుకువస్తున్న ఆధిపత్య భావజాలాలు–ప్రజల మనుగడకు, గుర్తింపుకు ఆధారమైన భాషాసంస్కృతులకూ స్వతంత్ర అభివృద్ధికీ ముప్పుగా పరిణమిస్తున్న దశలో కూడా కళ్లు మూసుకొని వ్యవహరిస్తున్న పాలకవర్గాల దుర్మార్గాన్ని ఎదుర్కొనేందుకు ఏం చెయ్యాలి? మేధావులమనుకొనే ఆసంఖ్యాక పాండురాజుల కళ్లనూ, నోళ్లనూ తెరిపించడం ఎలా? సమాజ శ్రేయస్సును పట్టించుకొనే వారంతా ఆలోచించాలి.

అమ్మనుడులను రక్షించుకోవడమనే అవసరాన్ని రచయితలకో పండితులకో ఉపాధ్యాయులకో వదిలివేద్దామనే ధోరణికి కాలం చెల్లింది. ప్రజల్లో కదలిక వచ్చిందని అర్థమైతేనే రాజకీయ పార్టీలు కళ్లు తెరుస్తాయి. తమ విధానాల్లో ప్రాధాన్యతలను తిరుగరాసుకొంటాయి.

తేదీ:1 సెప్టెంబరు, 2023

సామల రమేష్ బాబు

నందివెలుగు ముక్తేశ్వరరావు
9491428078

# ప్రకటన మాత్రమే సరిపోతుందా...

ఇటీవల మన దేశ ప్రధాని భాష విషయంలో ఒక ప్రకటన చేసారు.రాబోయే రోజులలో మాతృభాషలో అన్ని స్థాయిల్లో డిగ్రీ, స్నాతకోత్తర స్థాయిలో కూడా విద్యాబోధన ఉంటుంది అన్నది ఆ ప్రకటన సారాంశం. జులై 28 వ తారీఖున జరిగిన అఖిల భారతీయ శిక్షా సమాగమ్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ క్రింది అంశాలని ప్రస్తావించారు.

1.మాతృభాషలో విద్యా బోధన అనేది భారతదేశంలోని విద్యార్థులకు సరికొత్త రూపంలో న్యాయం చేస్తుంది.
2.ఇది సామాజిక న్యాయానికి అతి ముఖ్యమైన మెట్టు .
3.ఏ విద్యార్థినైనా సామర్థ్య ఆధారంగా కాకుండా ఇంగ్లీషు భాష ఆధారంగా జడ్జ్ చేయడం అతిపెద్ద అన్యాయం.
4.విద్య మరియు నైపుణ్యాల పాఠ్యాంశాలు 12 భాషలల్లో అనువాదాలు విడుదల చేస్తున్నాం.
5.బోలెడన్ని వ్యవస్థితమైన ప్రాంతీయ భాషాలున్నా , వాటిలో చదువులని వెనకబాటు తనానికి గుర్తుగా చూపిస్తున్నాం.
6.ఆంగ్లంలో మాట్లాడటం రానివాళ్లను ఖాతరు చేయడం లేదు. వాళ్ల ప్రతిభా శక్తియుక్తుల్ని గుర్తించడం లేదు. అందువల్లే, పల్లెలనుంచి వచ్చిన పిల్లలు ఇబ్బంది పడుతున్నారు.
7.ప్రతి వాళ్ళు వాళ్ల భాషల్లో వాళ్ళు ఆత్మవిశ్వాసంతో ఉంటే వాళ్ల నైపుణ్యాలు , శక్తి యుక్తులు సహజంగానే వికసిస్తాయి.

పై ప్రకటన మొత్తం చూసిన తరువాత దేశంలో విద్యావిధానంలో ఉన్న సమస్యలకు మూలాలు కనుక్కోవడంలో ప్రధాని చాలా మంచి ప్రయత్నమే చేసారు అని తెలుస్తోంది. ఇది సమాజ పురోగతినీ దేశ ప్రజల అభివృద్ధినీ కోరుకుంటున్న ప్రతి ఒక్కళ్ళు ఆనందపడే విషయం. దీనిని సహృదయంగా స్వాగతిస్తాం. ప్రభుత్వాలు దీనిని మనసా, వాచా, కర్మణా అమలు చేస్తాయని ఆశిద్దాం. అయితే కేవలం సదాశయాలు, సదుద్దేశాలు లోకాన్ని ముందుకు తీసుకుపోవు. వాటితో పాటు కట్టుదిట్టమైన కార్యాచరణ విధానం రూపొందించుకోవాలి. అలా రూపొందించుకున్న కార్యాచరణ విధానాన్ని తు.చ. తప్పకుండా ఆచరించి తీరాలి. అప్పుడు మాత్రమే ఇలాంటి ప్రకటనలు సార్థకం అవుతాయి.

ఈ సందర్భంలో నేను ఒక ప్రధానమైన ఉదాహరణని పేర్కొంటున్నాను. ప్రపంచీకరణ విధానాలు వచ్చిన కొత్తల్లో చాలా దేశాలు మేమంటే మేమని అంతర్జాతీయ మార్కెట్ లోకి చొరబడవచ్చని పోటీ పడ్డాయి. కానీ, కొన్ని దేశాలు ప్రపంచం అంతా ఒక మార్కెట్ గా మారుతున్న తరుణంలో అన్ని దేశాలతో మనం ఎదురొడ్డి నిలవాలి అంటే మన ప్రమాణాల్ని కూడా అంతర్జాతీయ స్థాయికి తీసుకువెళ్లాలని గుర్తించాయి.ఆ మేరకు కొన్ని దేశాలు ఆ దేశపు రైతులని, ఆ దేశపు కార్మికులను, ఆ దేశపు పెట్టుబడిదారులను, ఆ దేశపు వృత్తి పనుల వారిని , అటు నైపుణ్యాలు పెంచడం, ప్రపంచ స్థాయిలో మేలైన ఉత్పత్తులని బయటకు తీసుకురావడం కోసం దాదాపు రెండు సంవత్సరాలపాటు శిక్షణ కార్యక్రమాలని నిర్వహించాయి. దీనితో పాటు ఆ దేశపు పరిశోధన-అభివృద్ధి (R&D) విభాగాలకు అంతర్జాతీయ ప్రమాణాల గురించి అవగాహన చేయించారు. ఇలా రెండు సంవత్సరాల కాలం పరిశోధన శిక్షణ కార్యక్రమాలని నిర్వహించడం వలన దేశంలోని అన్ని రంగాల ఉత్పత్తి వ్యవస్థలు సమూలంగా మారిపోయి అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలను ఆ దేశాలు చేరుకున్నాయి. అప్పటివరకు మిణుకు మిణుకు మంటున్న వాళ్ల ఆర్థిక వ్యవస్థలు ప్రపంచ స్థాయిలో అగ్ర రాజ్యాలుగా రూపొందాయి.

పైన చెప్పిన ఈ ఉదాహరణతో మనం నేర్చుకోవాల్సింది చాలా ఉంది. ఏదైనా సాధించాలి అంటే ప్రభుత్వాలు కేవలం అనుకున్నంత మాత్రాన సరిపోదు. దానికోసం సమాజాన్ని సన్నద్ధం చేయాలి. సమాజాన్ని మనం చేయాలనుకున్న అంశం వైపు మనం నడిపించాలి. ఆధునిక పరిపాలన భాషలో వీటిని కమ్యూనిటి మొబైలైజేషన్ అంటున్నారు. ఇలాంటి ప్రయత్నం లేకుండా ఫలితాలు రావు.

### దీనికోసం మనం ఏమి చేయాలి?

1.అధ్యయనం: ఇలాంటి కార్యక్రమం విజయవంతం కావాలంటే విద్యావ్యవస్థలో ఉన్న అనేక సంస్థలు వాటిల్లో పని చేసే అధ్యాపకులు అందరూ దీనిని కేవలం ఒక భావనగా మాత్రమే కాకుండా అవసరంగా గుర్తించాలి. దానికోసమని ప్రత్యేక శిక్షణ, వ్యవస్థ మార్గదర్శనం అవసరం అవుతుంది. కేవలం జి.ఒలతో పనులు జరగవు. ప్రస్తుతం సమాజంలో తల్లితండ్రుల అవగాహన ఏమిటి? ఆ అవగాహన అలా ఏర్పడటానికి మూల కారణాలు ఏమిటి ? ఇటు స్కూలు స్థాయిలోనూ ఉన్నత స్థాయిలోనూ అధ్యాపకులు ఏమి కోరుకుంటున్నారు, అలా అనుకోవడానికి కావలసిన పరిస్థితులు ఏమిటని క్షుణ్ణంగా అధ్యయనం చేయందే అర్థం కాదు.

2.భ్రమని తొలగించాలి : విద్యారంగంలో ఒక ప్రధానమైన సమస్య. ఏది భ్రమ , ఏది సత్యం అన్నదాంట్లో రావాల్సినంత స్పష్టత రాకపోవడం విచారకరం. ఉదాహరణకి శాస్త్రం, శాస్త్ర గ్రంథాలు, శాస్త్ర విషయాలు ఇంగ్లీషులోనే చెప్పాలని అనుకోవడం, ఇంగ్లీషు మీడియమే అన్నిటికీ పరిష్కారం అనుకోవడం లాంటి భ్రమలు చాలా పట్టి పీడిస్తున్నాయి. భ్రమల్ని తొలగించాలంటే ప్రత్యేక అధ్యయన నివేదికలు, కేస్ స్టడీస్ రూపొందించుకోవాలి. భ్రమలని శాస్త్రీయంగా కూలదోయాలి.

3.శాస్త్ర పరిభాషలని తయారు చేయడం : మన దేశం చాలా కాలం వలస పాలనలో ఉండటం ఒక సమస్య, వలస పాలన నెత్తికి ఎక్కించుకుని, వలసని కొనసాగించడం అసలైన సమస్య. ఏ

శాస్త్రమైనా నేర్చుకోవాలంటే దేశ భాషలే సరైన మార్గం అని దాదాపు వంద సంవత్సరాల క్రితం నుంచి కొమర్రాజు వేంకట లక్ష్మణ రావు గారు, మహాత్మా గాంధీ పేర్కొన్నారు. భౌతిక శాస్త్రాలు , జీవ శాస్త్రాలు , వైద్య శాస్త్రాలు , సాంకేతిక విజ్ఞానం మొదలైనవి మన ప్రాంతీయ భాషలో చెప్పుకోవడం ఏమాత్రం కష్టం కాదు, పైగా తేలిక! ఉన్న ఒకే ఒక్క సమస్య ఫలానా శాస్త్రంలో వాడే ఫలానా పదానికి సరిపోను పారిభాషిక పదం మన దగ్గర ఉండాలి. ఈ పారిభాషిక పదాలను మనం రూపకల్పన చేసుకోవాలి. ఈ సమస్య మన నెత్తినే పొద్దు పొడవలేదు. జపాన్ కూడా ఒకప్పుడు మనలాగే వలస పాలన అనుభవించింది. అయినా వలస పాలకులు ఉన్న రోజుల్లోనే దేశ భాషలలో విజ్ఞాన శాస్త్రాలు రూపొందించుకున్నది. దానికోసం ప్రత్యేకంగా అనువాద శాఖలని ఏర్పాటు చేసుకుని ఆయా శాస్త్రాల నిపుణులతో చర్చించి పరిభాషా పదకోశాలని నిర్మించింది. సాధారణంగా శాస్త్రాలలో వాక్య నిర్మాణం సులభంగా సూటిగా ఉంటుంది. ఆ నిర్మాణాన్ని కూడా అనువాదాల్లో అనువర్తింప చేసుకున్నారు. ఆ ప్రకారం సాఫ్ట్ వేర్ లను రూపొందించుకుని ప్రపంచ స్థాయిలో వచ్చే ఎంతటి మహత్తర శాస్త్ర గ్రంథమైనా ఒక్క రోజు తిరక్కుండానే ప్రామాణికంగా అనువాదం చేసే వ్యవస్థని ఆ దేశం నిర్మించుకుంది. అందువలన బడిలో చేరిన మొదటి రోజు నుండి , విశ్వ విద్యాలయ స్థాయి వరకు అన్ని విజ్ఞాన శాస్త్రాలని సాంకేతిక విజ్ఞానాలని జపనీస్ భాషలోనే అందిస్తారు. ప్రపంచ వ్యాప్తంగా పిల్లలు చూస్తున్న జపనీస్ కార్టూన్ లు , వీడియో గేమ్ లు ఎన్నో! పూర్తిగా జపనీస్ భాషలో ఉన్న ప్రజలు వాటిని భాష తెలియకపోయినా ఆదరిస్తూనే ఉన్నారు.

భిన్నత్వంలో ఏకత్వ భావన ఉన్న భారతదేశంలో దేశవ్యాప్తంగా ఒకేరకమైన పారిభాషిక పద కల్పన కష్టమేమీ కాదు. ఉత్తర భారతదేశం వారికి హిందీ ప్రధాన భాషగా ఎంపిక చేసుకొని పారిభాషిక పద కల్పన చేయవచ్చు. దక్షిణ భారతదేశంలో ఉన్నవన్నీ ద్రావిడ భాషలే. వాటిల్లోనూ తెలుగు తమిళ కన్నడ మలయాళ భాషలు ప్రధానమైనవి. లిపి లేని ఇతర భాషలు కొన్ని ఉన్నా అవి ఈ నాలుగు భాషలలో ఏదో ఒక భాషతో అనుసంధానమై ఉంటాయి. అందువల్ల ఈ నాలుగు భాషలకు ఉపయోగపడేటట్లు ఒకేరకం పారిభాషికపద కల్పన చేయాలి. టి.బరో,ఎంబి ఎమెనో రూపొందించిన ద్రవిడియన్ ఎటిమలాజికల్ డిక్షనరీఆధారంగా ఈ పారిభాషిక పద కల్పన చేసుకోవచ్చు.

పైచర్చకు సారాంశం ఏమిటంటే అనువాద శాఖలను నిర్మించడం, పరిభాషా పదకోశాలను తయారు చేయడం, యంత్రానువాదాలను (accurate) సులభతరం చేయడం.

**ఆఖరిగా బోధనా మాధ్యమం అనేది, యదార్థానికి, బోధనకి సంబంధించిన విషయం కాదు. తరగతి గదిలో భావ ప్రసారానికి సంబంధించిన విషయం. తరగతి గది ఉత్సాహంగా, ఉల్లాసంగా ఉండాలంటే నేర్చుకొనడం అనే ప్రక్రియ సహజంగానూ ఆనంద దాయకంగా ఉండాలంటే మాతృభాషలోనే విద్యావిధానం ఉండాలనేది సత్యం. అలాంటి రోజులు రావాలంటే అలాంటి పరిస్థితులు ఏర్పడాలంటే బోలెడంత సన్నాహక కార్యక్రమం (Preparatory work)) పైన పేర్కొన్న విధంగా చేయాలి. లేకపోతే ప్రధాని ఆశయం ముందుకు వెళ్ళదు. ఏదైనా సాధించాలి అంటే, సంకల్పంతో పాటు ప్రణాళిక, కట్టుదిట్టమైన కార్యాచరణ ఉండాలి. ఉంటుందని ఆశిద్దాం**

రచయిత సమైక్య తెలుగు రాష్ట్ర ప్రభుత్వంలో నల్గొండ జిల్లా పాలనాధికారిగా, రాష్ట్ర ప్రభుత్వ సాంస్కృతిక ,తెలుగు భాష శాఖ కార్యదర్శిగా పనిచేశారు. వీరు తెలుగు భాషోద్యమ సమాఖ్య ఉపాధ్యక్షులుగా ఉన్నారు.



సరైన నిర్ణయం

కృష్ణమూర్తి సుబ్రమణ్యం

# వాళ్ల భాష, వాళ్ల భవిష్యత్తు

'మాతృభాషలో బోధించడం వల్ల మెరుగైన నైపుణ్యంతో పాటు ఇంగ్లిష్‌పై మంచి పట్టు పెరుగుతుందని పరిశోధనలో తేలింది. ఇటీవల సీబీఎస్ఈ తీసుకున్న నిర్ణయం సరైన నిర్ణయమని ఐఎంఎఫ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పేర్కొన్నారు.'

మన అస్తిత్వం, సంస్కృతి, విద్య లను చర్చించే సందర్భంలో పరిశోధనల ఫలితంగా కొన్ని ఆధారాలు ఒక విషయాన్ని స్పష్టం చేశాయి: పిల్లలకు అర్థమయ్యే భాషలో బోధించడం ఒక అనివార్యమైన బోధనా పద్ధతి. అయితే ప్రపంచ జనాభాలో 40 శాతం మంది మాతృభాష కాకుండా వేరే భాషలో బోధిస్తున్నారని, ఇది అభ్యసన లోపాలు, సామాజిక అసమానతలకు దారితీస్తోందని యునెస్కో గణాంకాలు వెల్లడిస్తున్నాయి. బోధనలో మాతృభాషను ఉపయోగించడంపై సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) జులై 21న ఇచ్చిన ఉత్తర్వులు అద్భుతమైన చర్య.

భారతదేశాన్ని, దాని విజ్ఞాన వ్యవస్థను అసహ్యించుకోవడంతో పాటు ఆంగ్లవిద్య కోసం నిలబడిన థామస్ మెకాలే ఇలా భావించాడు 'మనకు, మనం పాలించే లక్షలాది మందికి మధ్య అనువాదకులుగా ఉండే ఒక వర్గాన్ని ఏర్పరచడానికి, రక్తంలో, రంగుల్లో భారతీయులుగా ఉండి – అభిరుచుల్లో, అభిప్రాయాల్లో, నైతికతలో, మేధస్సులో ఆంగ్లేయులుగా ఉండే వర్గాన్ని సృష్టించడం.'

ఈ నేపథ్యంలో చూస్తే పాశ్చాత్య విద్యపై గాంధీజీ వ్యక్తం చేసిన తీవ్ర ఆందోళనను చూసి మనం ఆశ్చర్యపోనవసరం లేదు. హరిజన్‌లో గాంధీజీ ఇలా వాదించారు: 'అన్ని విద్యా విభాగాలలో ఆంగ్లాన్ని బోధనా మాధ్యమంగా మార్చడం వల్ల కొద్దిమంది ఉన్నత విద్యావంతులు, అసలే విద్య గంధం లేని నిరక్షరాస్యుల మధ్య ఒక శాశ్వత అవరోధం ఏర్పడింది. ఇది అశేష ప్రజానీకానికి జ్ఞాన వ్యాప్తికి ఆటంకం కలిగించింది. ఇంగ్లిష్‌కు అధిక ప్రాధాన్యం ఇవ్వడం వల్ల విద్యావంతులపై భారం పడిందని, జీవితాంతం మానసిక వికలాంగులుగా, సొంత గడ్డకు దూరమయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు."

సి.రాజగోపాలాచారి, బాలగంగాధర తిలక్, గోపాలకృష్ణ గోఖలే, అనీబిసెంట్ వంటి ఇతర స్వాతంత్ర్య సమరయోధులు భారతీయులే స్వయంగా నియంత్రించే, రూపుదిద్ది కొనసాగించే విద్య యొక్క ప్రాముఖ్యతను గుర్తించారు. ఈ స్వేచ్ఛా పోరాట యోధులకు భారతదేశం గురించి అద్భుతమైన అవగాహన ఉన్నది. దాని ఆధ్యాత్మిక మరియు సాంస్కృతిక విలువల పట్ల గౌరవమూ ఉన్నది. అందువల్ల, జవహర్‌లాల్ నెహ్రూలా ప్రతి విషయాన్ని పాశ్చాత్యమైన ప్రతి విషయాన్ని వెనకేసుకొచ్చినట్టు కాకుండా, ఈ మహానుభావులు పాశ్చాత్య చింతనలో ఉండే ప్రయోజనాలపై సమతుల్యమైన అవగాహనని కలిగి ఉన్నారు. సహజంగానే, మన స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తి ప్రదాతలు తమ మాతృభాషలో విద్యాబోధన వల్ల మేధోశక్తి వికసిస్తుంది అని, ద్వితీయ భాషగా ఆంగ్లంలో వ్యక్తీకరణ పెరుగుతుందని కూడా భావించారు. అయినా వారి మూర్తిమత్వం భారతీయత నైతికతకు అనుగుణంగానే కొనసాగుతుందని భావించారు. అనీబిసెంట్ తన ప్రభావశీలమైన రచన ప్రిన్సిపుల్స్ ఆఫ్ ఎడ్యుకేషన్‌లో ప్రతి జిల్లాలో మాతృభాషలో బోధన ఉండే పాఠశాలల కోసం నిలబడ్డారు. అదే సమయంలో ఆంగ్లాన్ని రెండవ భాషగా కూడా చేర్చారు.

మాతృభాషలో విద్యాభ్యాసం విద్యార్థుల కెరీర్ అవకాశాలను దెబ్బతీస్తుందా? తీయదు! యునెస్కో తన గ్లోబల్ ఎడ్యుకేషన్ మానిటరింగ్ రిపోర్టుల ద్వారా 1953 నుంచి మాతృభాషలో విద్యను అందించాలని ఒకే తీరుగా వాదిస్తోంది. యునెస్కో తన 2016 నివేదికలో ఈ సందేశాన్ని పునరుద్ఘాటించింది: 'ఒకరి స్వంత భాషలో కాకుండా వేరే భాషలో బోధించడం నేర్చుకునే ప్రక్రియపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతుంది. ముఖ్యంగా పేద కుటుంబాలకు చెందిన పిల్లలకు మైనారిటీ భాష మాట్లాడేవారికి నేర్చుకునే ప్రక్రియలో అంతరాలను తగ్గించడానికి కనీసం ఆరు సంవత్సరాల మాతృభాష బోధన అవసరం' అని నివేదిక సిఫార్సు చేసింది. 2005 యునెస్కో నివేదికలో ఒక నేపథ్య పరిశోధన అధ్యయనం 'మాతృభాషలో నేర్చుకోవడం, రెండు భాషలలో నేర్చుకోవడం బోధనా తార్కానికి విరుద్ధం కావు' అని పేర్కొంది.

భారతదేశంలో ముఖ్యంగా సేవారంగంలో మంచి ఉద్యోగాలు పొందడానికి ఇంగ్లిష్ అవసరం అయితే, మాతృభాషలో విద్య ఈ క్రమాన్ని అమలు చేయడానికి దారితీస్తుందా? అలాంటి అవకాశాలను విద్యార్థులకు దూరం చేయదా? అంటే కాదు అని చెప్పవచ్చు! ప్రాథమిక స్థాయిలో మాతృభాషను మాధ్యమంగా ప్రారంభించి ఆ తర్వాత ఇంగ్లిష్‌ను ప్రవేశపెట్టడం ద్వారా ఇంగ్లిష్ నేర్చుకోవడం సులభమవుతుందని పరిశోధనలు చెబుతున్నాయి. పిల్లలు తరువాత జీవితం దశలో రెండవ భాషను నేర్చుకునేటప్పుడు, వారి ప్రారంభ సంవత్సరాలలో వారి మాతృభాషలో నేర్చుకునేటప్పుడు అభివృద్ధి చెందిన నైపుణ్యాలు అమూల్యమైనవిగా నిరూపించబడ్డాయి. కెనడాలోని ఒంటారియో విశ్వవిద్యాలయంలో చేసిన పరిశోధనలో పిల్లలు తరువాత జీవితంలో రెండవ భాషను పొందినప్పుడు, చిన్న పిల్లలుగా వారి మాతృభాషలో బోధించేటప్పుడు వారు నేర్చుకున్న నైపుణ్యాలను ఉపయోగించుకోవచ్చని చూపిస్తుంది. అమెరికాలో లాటిన్ అమెరికన్ సంతతి విద్యార్థులపై ఎనిమిదేళ్ల అధ్యయనంలో ఆంగ్లంలో బోధన జరిగినప్పుడు, ఆంగ్లంలో ప్రవీణ్యత తగ్గిపోయిందని కనుగొన్నారు. ప్రాథమిక పాఠశాలలో స్పానిష్ ఉపయోగించి బోధించిన విద్యార్థులు ప్రారంభం నుండి ఆంగ్లంలో బోధించే లాటిన్ అమెరికన్ సంతతి విద్యార్థుల కంటే ఆంగ్లంలో మెరుగ్గా ఉన్నారు. మొదటి భాష నైపుణ్యాలు ఎంత బాగా అభివృద్ధి చెందితే, రెండవ భాషలో మంచి ఫలితాలు వస్తాయి. ఎందుకంటే రెండవ భాషలో భాష మరియు జ్ఞానం మొదటి భాషపై నిర్మించబడతాయి. ఇదే భారతీయతకు అన్వయించుకుని చూస్తే,

**తరువాయి 13వ పుటలో**

సుప్రీం కోర్టు చారిత్రాత్మక తీర్పు:

గుంటుపల్లి శ్రీనివాస్
9394810088

# నాణ్యత లేని ప్రాథమిక విద్య... విద్యార్థుల ప్రాథమిక హక్కును హరిస్తుంది

**11/08/2023 న సుప్రీం కోర్టు ధర్మాసనం ఇచ్చిన తీర్పు :: నాణ్యమైన ఉపాధ్యాయులు లేకుండా, నాణ్యమైన ప్రాథమిక విద్య అందదు. (దేవేష్ శర్మ యూనియన్ ఆఫ్ ఇండియా, సివిల్ అప్పీల్ నంబర్ – 5068 of 2023).**

**'చరిత్ర'** :– గురువులకే గురువు అయిన గోపాలకృష్ణ గోఖలే, జాతిపిత మహాత్మా గాంధీలు కలలు కన్నట్లుగా భారత రాజ్యాంగంలో ప్రాథమిక విద్య 'నిర్బంధం చేయబడలేదు , మరియు అది కనీసం ప్రాథమిక హక్కుగా కూడా పరిగణించబడలేదు.'. ఈ లోపాన్ని సుప్రీమ్ కోర్టు వివిధ తీర్పుల ద్వారా సరిచేసి ... పాఠశాల విద్య పౌరుల ప్రాథమిక హక్కుగా నెలకొల్పింది . తదుపరి వాజ్‌పాయ్ ప్రధానిగా ఉన్నప్పుడు, కేంద్ర ప్రభుత్వం 2002 లో 86 వ భారత రాజ్యాంగ సవరణ చేసి, 6 నుండి 14 సంవత్సరాల వారికి ప్రాథమిక విద్యను, ఒక ప్రాథమిక హక్కుగా ఆర్టికల్ 21ఎ – కింద చేర్చింది.తదుపరి మన్మోహన్ సింగ్ ప్రధానిగా ఉన్నప్పుడు, రాజ్యాంగ సవరణ ద్వారా ఏర్పడిన ప్రాథమిక హక్కును ... అమలు పరచడం కోసం 'విద్యా హక్కు చట్టం –2009' తీసుకువచ్చారు.

విద్యాహక్కు చట్టం అమలులోకి వచ్చాక బడుల సంఖ్య పెరిగింది , కొన్ని మౌలిక సదుపాయాలు మెరుగుపడ్డాయి.... కానీ నాణ్యమైన విద్య అందడం అనేది ఒక కలగానే మిగిలిపోయింది. ఇందుకు ఒక ప్రధాన కారణం ' బాధ్యతాయుతం గా పాఠాలు చెప్పే ... సరైన శిక్షణ కలిగిన నాణ్యమైన ఉపాధ్యాయులు లేకపోవటం'.

ఒకప్పుడు బతకలేక బడిపంతులు అనే రోజులు పోయి ఇప్పుడు ఉపాధ్యాయుల జీతాలు వేలల్లో,లక్షల్లో ఉన్నాయి. ఒకప్పుడు 7 వ తరగతి పాస్ అయిన వారికి రెండు సంవత్సరాలు ఉపాధ్యాయ శిక్షణ ఇచ్చి ... వారినే సర్వీస్ లోకి తీసుకునేవారు. కానీ ఇప్పుడు పరిస్థితి అంతా మారిపోయింది... డిగ్రీ లు, పీజీలు చేసిన వారు మాత్రమే ఉన్నారు ( 96% పైగా). టీచర్లకు అయితే డిగ్రీలు ఉన్నాయి ... కానీ వారి బోధనలో నాణ్యత లేదు... కారణం వారికి సరైన శిక్షణ లేదు.

M.Sc,MEd చేసినవారు 1,2 తరగతుల పిల్లలకు పాఠాలు బోధిస్తున్నారు . అంటే అక్షరాలు , పదాలు , వాక్యాలు, కూడికలు , తీసివేతలు నేర్పాలి... చిన్న చిన్న కథలు చెప్పాలి , పాటలు నేర్పాలి.. ఎటువంటి శిక్షణ లేకుండా ఇవి M.Sc,MEd, B.Sc,BEd చేయగలరా ?

**'బడితె ఉన్నవాడిదే బర్రె! – నోరు ఉన్నవాళ్లు చెప్పిందే ప్రభుత్వాల విద్యా విధానం :'**

నిజానికి ఈ దేశంలో ఉపాధ్యాయుల శిక్షణ పై చెప్పుకోదగ్గరీతిలో , సరైన దిశగా చర్చ జరగలేదు.

ప్రాథమిక విద్యా బోధన చేసే ఉపాధ్యాయుల కోసం DEd, మాధ్యమిక విద్యా బోధన చేసే ఉపాధ్యాయుల కోసం B.Ed, కోర్సులు ఉన్నాయి.... వీరి ప్రాక్టికల్స్ శిక్షణ కూడా ఆయా కోర్సులకు తగినట్లుగానే ఉంటుంది.

**'కానీ దురదృష్టవశాత్తు ప్రైవేట్ కాలేజ్ ల లాబీయింగ్, బీ.ఎడ్ చదివిన విద్యార్థులు రాష్ట్రాలలో ఎక్కువగా ఉండటం వలన ... వారు రాజకీయ పార్టీలపై ఒత్తిడి తెచ్చి ....నిబంధనలు మార్పించుకొని 'తమకు ఎటువంటి శిక్షణ , నైపుణ్యం లేని... ప్రాథమిక విద్యార్థులకు పాఠాలు బోధించే టీచర్లు గా నియమితులయ్యారు. 'ఇది ఎలాంటిదంటే 'జనరల్ మెడిసిన్ చదివిన డాక్టర్ ... పిల్లల వైద్యుడి గా ఆసుపత్రిలో ఉద్యోగంలో చేరడం లాంటిది.'**

సుప్రీం కోర్టు చాలా స్పష్టంగా చెప్పిన అంశం ఏమిటంటే ప్రాథమిక స్థాయి విద్యార్థులకు బోధించడానికి ప్రత్యేక శిక్షణ అవసరం. ఆ శిక్షణ ( కోర్సు ) తీసుకున్నవారే అనగా D.Ed వారినే ప్రాథమిక టీచర్లుగా నియమించాలని,B.Edవారికి ఎక్కువ ఉద్యోగ అవకాశాలు కల్పించడం కోసం వారిని ప్రాథమిక టీచర్లుగా అర్హత ఇవ్వడం అనే నిర్ణయం .... ప్రాథమిక స్థాయి విద్యార్థుల యొక్క బోధనావసరాలను (learing necessities) , భవిష్యత్తును , శ్రేయస్సును దృష్టి లో పెట్టుకొని చేసింది కాదు అని.

**'మేధావుల , రాజకీయ పార్టీ ల మౌనం':–**

దురదృష్టవశాత్తు మన రాష్ట్రంలో నాణ్యత లేని పాఠశాల విద్య గురించి మేధావులు , రాజకీయ పార్టీలు మౌనం వహించడం చాలా బాధాకరం. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ గణాంకాల ప్రకారం : 4 వ తరగతి నుండి 10 వ తరగతి చదువుతున్న విద్యార్థులలో 10 లక్షల పైచిలుకు మందికి తెలుగు లో 3 సరళ ( చాలా తేలికైన ) వాక్యాలు ఉన్న పేరా ను తప్పులు లేకుండా చదవలేరు . 17 లక్షల పై చిలుకు మందికి' I like this book, this is my house లాంటి ఇంగ్లీష్ వాక్యాలు చదవడం రాదు. ( Ref:-బేస్ లైన్ పరీక్ష, 2022

విద్యార్థుల ప్రమాణాలు ఇంత ఘోరంగా ఉన్నా కూడా మేధావులు, రాజకీయపార్టీ లు నిమ్మకు నీరెత్తినట్లుగా ఉండటం, బాధ్యతారాహిత్యమే. ఎందుకంటే విద్య సామాజిక , ఆర్థిక , రాజకీయ సాంఘిక మార్పులకు దారితీస్తుందని.... తద్వారా సమానత్వం సాధించగలమని నమ్ముతున్నామో.... ఆ మార్పులు రావాలంటే కనీసం పిల్లలకు చదవడం , రాయడం రావాలి. అవి లేకుండా విద్య వలన ఏ విధమైన మార్పులు రావు.

**'అసలు ప్రశ్న'**

భాషకు లిపి వచ్చినప్పటినుండి పిల్లలకు వారి వారి మాతృభాషలో చదవడం, రాయడం, మరియు చిన్నపాటి లెక్కలు

అనే ప్రక్రియలు నేర్పడం అనేది అనాదిగా ప్రతీ సమాజం అమలు పరిచిన విధానం. రాజులు మారినా, మతాలు మారినా, పరిపాలన విధానాలు మారినా, ఇంకా ఇతర విషయాలలో మార్పు వచ్చినా సరే ... భారత దేశంలోని ప్రతీ గ్రామంలో, ప్రతీ పట్టణంలో ఈ బోధనా ప్రక్రియ కొనసాగింది. బ్రిటిష్ వాళ్ళు రాకముందే అన్ని వర్ణాలకు, అన్ని వర్గాలకు వీధి బళ్ళలో ప్రాథమిక విద్య ను బోధించారు. పిల్లల తెలివి తేటలమేర ఈ ప్రాథమిక విద్య రెండు నుండి నాలుగు సంవత్సరాలు జరిగేది. ఈ సమయంలో వారికి చదవడం, వ్రాయడం, సాధారణ గణితం నేర్పేవారు. బ్రిటిష్ వారు రాక ముందు భారత దేశంలో విద్య ఎలా ఉంది అన్న విషయం పై ... మద్రాసు ప్రావిన్స్ లోని అప్పటి బ్రిటిష్ కలెక్టర్లు వ్రాసిన రిపోర్టులను క్రోడీకరించిన బ్రిటిష్ గవర్నర్ జనరల్ థామస్ మన్రో, 1820 లలో పూర్తి రిపోర్ట్‌లో వ్రాశారు. అందులో పైన తెలిపిన అంశాలు మతాల, వర్ణాల వారీ గా బడిలో ఉన్న మగ పిల్లల గణాంకాలు ఉన్నాయి.(Ref:- the beautiful tree : indigenous Indian education in 18th century ).

స్వాతంత్ర్యోద్యమ కాలంనుండి .... 1980 ల ముందు వరకు కూడా చాలా ప్రాథమిక బడులు పూరిపాకల్లో , రేకుల షెడ్ల లలో ఉండేవి. అయినా పిల్లలకు చదవడం , రాయడం చక్కగా నేర్పారు. 'వేల సంవత్సరాలుగా వీధి వీధినా.. వీధి బళ్లలో చక్కగా నడిచిన ఈ బోధనా ప్రక్రియ, గత కొన్ని సంవత్సరాలుగా ఎందుకు ఇంత లోపభూయిష్టంగా తయారయ్యింది? రోజూ బడికి వెళ్ళే లక్షలాది మంది పిల్లలకు కనీసం చదవడం, రాయడం ఎందుకు నేర్పలేక పోతున్నాము?? అన్న ప్రశ్నకు నిజాయితీ గా పరిష్కారం వెతకాలి. లేనియెడల జాతి భవిష్యత్తు అంధకారమవుతుంది.

రచయిత ప్రముఖ వైద్యులు, తె.భా.స కార్యనిర్వాహక వర్గ సభ్యులు

## వాళ్ల భాష, వాళ్ల భవిష్యత్తు

11వ పుట తరువాయి

నా మాజీ సహోద్యోగి తరుణ్ జైన్ తన పరిశోధనలో కనుగొన్నది ఏమనగా, మాతృభాష కాకుండా వేరే భాషలో చదవడం వలన, అక్షరాస్యత రేటును 18% మరియు కళాశాల గ్రాడ్యుయేషన్ రేటును 20% తగ్గిపోతుందని కనుగొన్నారు. మాతృభాషలో విద్యాబోధన వల్ల కలిగే ప్రయోజనాలపై సాక్ష్యాధారాలు భారతదేశంలోనూ, ప్రపంచవ్యాప్తంగానూ చాలా స్పష్టంగా ఉన్నందున, విధాన రూపకర్తలు భారతదేశ పురోగతికి ఆంగ్ల విద్య అవసరమనే అశాస్త్రీయ వాదనల రణగొణ ధ్వనిని పట్టించుకోవడం మానేయాలి.

జాతీయ విద్యావిధానంలో పొందుపర్చిన మంచి ఉద్దేశాన్ని సీబీఎస్ఈ ఈ ఉత్తర్వుల్లో అనుసరిస్తున్నప్పటికీ, విధాన రూపకర్తలు మరింత పని చేయాల్సింది చాలా ఉంది. ఉపాధ్యాయ నియామకం, పాఠ్యప్రణాళిక అభివృద్ధి, బోధనా సామగ్రి సమకూర్చే రంగాల్లో పాఠశాలలు తమ విద్యార్థుల విభిన్న భాషా నేపథ్యాలకు అనుగుణంగా మారాలి. ఇందుకు కీలకమైన అడుగుగా కేంద్రీయ విద్యాలయాలు, నవోదయ విద్యాలయాల సొంత నెట్వర్క్ ఈ ఉత్తర్వులను అమలు చేయడంలో ముందడుగు వేయాలి. ఇంత పుష్టినిచ్చే మాతృభాషలో చదువుకోవడం ఈ దేశపు పిల్లల ప్రాథమిక హక్కు. ఇది మన ఆధ్యాత్మిక మరియు సాంస్కృతిక విలువలను గౌరవించే విద్యామార్గం, నేర్చుకొనడంలో సర్వోన్నత స్థాయిలో కూడా మన పిల్లలకు అర్థమయ్యే మరియు అన్వయించుకోగలిగిన ఉన్నత విద్యను అందించడం ద్వారా, మనము ఐకమత్యం, సహనం, విజయాలతో నిండిన సమాజానికి పునాది వేసిన వాళ్ళం అవుతాం.

*(పై వ్యాసాన్ని కృష్ణమూర్తి సుబ్రమణ్యం - టైమ్స్ ఆఫ్ ఇండియా వారి కోసం రాసారు. అది ఆగస్టు 11 తేదీన Their language- Their future అన్న శీర్షికతో ప్రచురించబడినది. దాని అనువాదం ఇది.*



సాంకేతికత

రహ్మానుద్దీన్ షేక్
94930 35658

# తెలుగు భాషా డిజిటీకరణ

సాంఖ్యీకరణ (డిజిటైజేషన్) అనేది ఏదైనా సమాచారాన్ని అంకెల (కంప్యూటర్‌కు అర్థమయ్యే) రూపంలోకి మార్చే ప్రక్రియ. ఈ ప్రక్రియ ద్వారా మనకొచ్చే ఫలితాలు బొమ్మ అయ్యుండొచ్చు, శబ్దం అయ్యుండొచ్చు, దస్త్రం అయ్యుండొచ్చు లేదా కంప్యూటర్లో క్రోడీకరించిన ఏదైనా కంప్యూటర్‌కి అర్థమయ్యే భాషలో వాక్యాలు లేదా ఆదేశాలు అయ్యుండొచ్చు. కానీ లోపల్లోపల ఇవన్నీ కూడా సున్నాలూ, ఒకట్ల సమ్మిళిత వాక్యాలుగానే ఉంటాయి. ఎందుకంటే కంప్యూటర్లకి సున్నా, ఒకటి – ఈ రెండు అంకెలు మాత్రమే అర్థమవుతాయి. 'సున్నా' అంటే అచేతనం చేయడం/కట్టేయడం/మూసివేయడం(ఆఫ్ చెయ్యటం) .ఒకటఅంటే సచేతనం చేయడం/తెరవడం(ఆన్ చెయ్యటం). సున్నా అంటే అచేతనావస్థలో ఉన్నట్టు. ఒకటి అంటే సచేతనావస్థలో ఉన్నట్టు. టివి ని స్విచ్ ఆన్ చెస్తే దాన్ని ఒకట్లో పెట్టాం అన్నమాట. టివి ని కట్టేసినప్పుడు దాన్ని సున్నాలో పెట్టాం అన్నమాట. అలాగే ఫ్యాన్ స్విచ్ కిందకి నొక్కినప్పుడు అది 'స్థితి'ఒకట్లో ఉన్నట్టు. పైకి నొక్కినప్పుడు అది 'స్థితి' సున్నాలో ఉన్నట్టు. సున్నా స్థితి అంటే అచేతనావస్థ. ఒకటి స్థితి అంటే సచేతనావస్థ. ఇలా ఏదైనా సమాచారాన్ని తీసుకొని సున్నాలూ, ఒకట్ల వాక్యాలుగా నిర్మించుకుంటే దానినే 'సాంఖ్యీకరణ' (డిజిటలైజేషన్) అంటారు.

ఎందుకని? పూర్వపు లాటిన్ భాషలో డిజిటస్ అంటే వేలు(చేతివేలు లేదా పాదపు వేలు). వేళ్ళతో మనం పూర్వం లెక్కలు చేసే వాళ్ళం. అలా డిజిట్ అంటే అంకె అని నిర్వచనమయింది. అయితే కంప్యూటర్ల రాక వరకూ ఈ పదానికి అంత ప్రాముఖ్యత లేదు. కంప్యూటర్లు వచ్చాక మాత్రం ఈ సాంఖ్యిక(డిజిటల్) పదం ప్రాముఖ్యతను సంతరించుకుంది. కంప్యూటరులో నిక్షిప్తం కానివి లేదా కంప్యూటరు తరానికి ముందు వచ్చినవన్నీ అనలాగ్(డిజిటల్ కానివి)గానూ, కంప్యూటరుకు అర్థమయ్యే, కంప్యూటరులో నిక్షిప్తమయ్యే వనరులన్నీ డిజిటల్ గానూ పిలవబడుతున్నాయి. ఉదాహరణ కోసం పాత రీళ్ళ కెమెరాలో ఫోటో తీసి స్టూడియోలో ల్యాబ్ లో దాన్ని రసాయనాలు వాడి ఫోటో కాగితంపై ముద్రిస్తే అది అనలాగ్ ఫోటో. కొత్త డిజిటల్ కెమెరాలో ఫోటో తీస్తే అది డిజిటల్ ఫోటో. పాత కెమెరాలో తీసిన ఫోటోను స్కానర్ లో స్కాన్ చేసి కంప్యూటరులో నిక్షిప్తం చేసినా, మొబైల్ కెమెరాలో పాత ఫోటోకు మళ్ళీ స్పష్టంగా ఫోటో తీసుకున్నా అది డిజిటల్ రూపం సంతరించుకుంటుంది. అలా పుస్తకాన్ని స్కాన్ చేసుకుని డిజిటల్ రూపం ఇవ్వవచ్చు. సంగీతాన్ని మొబైల్ లో రికార్డ్ చేసి డిజిటల్ రూపం ఇవ్వవచ్చు, కానీ పాత టేప్ రికార్డర్ వాడి ఆడియో కేసెట్ లో రికార్డ్ చేస్తే అది అనలాగ్ రూపం అన్నమాట. ఆ విధంగా అంతకు మునుపు ముద్రిత రూపంలో ఉన్న పుస్తకాలను, ఫోటోలను, సంగీతాన్ని, వ్యక్తుల సంభాషణలను, పత్రాలను, వ్యక్తుల నడవడిక–హావభావాలను కంప్యూటరుకు అనువుగా మార్చితే అవి డిజిటల్ రూపంలో ఉన్నాయని అంటాం.ఇలా మనం డిజిటీకరించిన అంశాన్ని బట్టి దాని ఫలితంగా తయారైన అంశాన్ని వివిధ పేర్లతో పిలుస్తాం. అవన్నీ కూడా ఈ సున్నాల, ఒకట్ల సమ్మిళితంగానే ఉంటాయి. ఆధునిక కాలంలో డిజిటైజేషన్ డేటా అంటే డిజిటీకరించిన సమాచారం మొత్తం కూడా సున్నాలు, ఒకట్లలో ఉంటుంది. ఈ సున్నాలు ఒకట్ల ఆధారంగానే అంకెలను, అక్షరాలను కంప్యూటరుకు అర్థమయ్యేలా నిక్షిప్తం చేస్తాం.ఇవన్నీ ఈ వ్యాసం పరిధిని దాటిన అంశాలు. అందుకని ఈ వ్యాసంలో ముఖ్యమైన విషయాలు మాత్రమే మాట్లాడుకుందాం.

**సాంఖ్యీకరణ (డిజిటైజేషన్) మరియు డిజిటలీకరణ ఒకటేనా? కాదు.**

'డిజిటల్' అంటే అంకెలకు సంబంధించినది. కంప్యూటర్‌లకు సున్నా, ఒకటి అంకెలు మాత్రమే తెలుసు. ప్రతీ విషయాన్ని కంప్యూటర్‌కు అర్థం అయ్యేలా చెప్పాలంటే, ఆ అంశాలను సున్నాలూ, ఒకట్లలోకి మార్చుకుని చెప్పాలి. డిజిటీకరణ అంటే అదే. కంప్యూటర్‌కు అర్థమయ్యేలా మన వనరులను మార్చుకోవడం. ఉదాహరణకు పుస్తకాన్ని స్కాన్ చేసి జెపిజి బొమ్మగా కంప్యూటర్‌కు ఇవ్వడం, ఒక వ్యక్తి పాడుతున్న పాటని, వాయిస్తున్న వాద్యపు సంగీతాన్ని ఎంపిత్రీ గా మార్చి కంప్యూటర్‌లో భద్రపరచటం వగైరా. చాలామంది డిజిటీకరణ, డిజిటలీకరణ పదాలను మార్చి మార్చి ఒకే విషయానికి వాడేస్తుంటారు. కానీ డిజిటీకరణ, డిజిటలీకరణ – రెండూ పూర్తిగా వేరే విషయాలు. డిజిటీకరణలో ఏదైనా సమాచారాన్ని మార్చి డిజిటల్ రూపంలో అందుబాటులోకి తెస్తాము. పుస్తకాన్ని స్కాన్ చేయటం, సంగీతాన్ని, సంభాషణలను ఎంపిత్రీ గా మార్చటం డిజిటీకరణకు ఉదాహరణలు.డిజిటలీకరణ అంటే మనం రోజువారీ చేసుకునే పనుల్లో డిజిటల్ ఉపకరణాలను వాడటం. ఉదాహరణకి ఒకప్పుడు వాషింగ్ మెషీన్లలో ఉండే స్విచ్‌లను మాత్రమే ఉపయోగించి, అవి పని చేయాల్సిన సమయం పావుగంట, అరగంట అని నిర్దేశించే వాళ్ళం. కానీ ఈరోజుల్లో ఉన్న డిజిటల్ మెషీన్లలో ఎంత సమయానికి నీళ్ళు రావాలి, ఎంత సమయానికి మెషీన్ ఆగిపోవాలి వంటి ఆదేశాలను మనం ఒకేసారి ఇవ్వగలుగుతున్నాం. ఇది డిజిటలీకరణ.

**డిజిటీకరణ ప్రాముఖ్యతను మనం తప్పకుండా తెలుసుకోవాలి.** డిజిటీకరణ ముఖ్య లక్ష్యం – సమాచారాన్ని భద్రపరచటం. అంటే ఆ సమాచారాన్ని కేవలం ఒక గ్రంథాలయానికో, ఒక ప్రదేశానికో, ఒక వ్యక్తికో పరిమితం చెయ్యకుండా అందరికీ అందుబాటులో ఉండేలా భద్రపరచటం. అందరికీ అందుబాటులో ఉండటం అంటే? ఒకరు ఒక పుస్తకాన్ని అక్షరాల రూపంలో చదవగలరు. మరొకరు చదవలేరు, అంటే వారికి ఆ భాష అర్థం కాదు, భాష చదవటం రాదు. కానీ భాష అర్థం అవుతుంది. అప్పుడు వారు ఆ పుస్తకాన్ని కంప్యూటర్కు ఇస్తే ఆ పుస్తకాన్ని కంప్యూటర్ చదివి వినిపిస్తుంది. అంటే భాష చదవడం రాని వాళ్ళు, భాష అర్థమయ్యే వాళ్ళు డిజిటీకరించిన పుస్తకాన్ని విని అర్థం చేసుకోగలరు. అలాగే

కనుచూపు లేని వారికీ, అటువంటి విభిన్న సామర్థ్యాలున్న వారికీ డిజిటీకరణ ద్వారా సమాచారాన్ని అందుబాటులో ఉంచగలుగుతున్నాం. ఆ విధంగా సమాచారాన్ని భద్రపర్చుకోవడం, అందుబాటులోకి తేవటమే కాదు,అందరికీ సులభంగా పంపిణీ చేయగలగాలి. ఇది డిజిటీకరణ ప్రాముఖ్యత. డిజిటీకరణ అనేది భాషకు విడిగా జరగదు. భాషలో ఉన్న వివిధ అంశాలు – అంటే తెలుగు భాషను మనం డిజిటీకరించడానికి తెలుగు భాషలో వచ్చిన అన్ని పుస్తకాలనీ, అన్ని వారపత్రికలనీ, అన్ని సినిమా పాటలనీ, అన్ని సినిమా వీడియోలనీ, అన్ని రంగస్థల నాటకాలనీ – వీటన్నిటినీ వీడియో రూపంలో, ఆడియో రూపంలో, పుస్తక రూపంలో, రాత ప్రతి రూపంలో భద్రపరుచుకో గలిగామంటే అదే భాష డిజిటీకరణ. ఈ డిజిటీకరణ జరగడం ద్వారా భాష పరిరక్షణ జరుగుతుంది.

ఒక్కోసారి మనకు మన భాషలో కొన్ని అంశాలు తెలియవు. కానీ ఒకప్పటివారికి తెలుసు. వారు ఆ కాలంలో భాషకు సంబంధించిన ఆ విషయాలను వారి కథల్లోనో, కవితల్లోనో, పుస్తకల్లోనో, నాటకాల్లోనో వాడుకున్నారు. అవి డిజిటీకరించిన సమాచారంలో మనకు అందుబాటులోకి వచ్చాయి. వాటిని మనం తిరిగి వాడుకోగలుగుతున్నాం. అంటే భాషకి మన కాలంలో లేని సత్తువని నిలుపుకోగలుగుతున్నాం. ఆ విధంగా భాష పరిరక్షణకు డిజిటీకరణ ఎంతో ఉపయోగపడుతోంది.

## డిజిటీకరణ జరగకపోతే ఏం జరుగుతుంది?

ఒకవేళ డిజిటీకరణ జరగకపోతే మొట్టమొదటగా జరిగేది ఆ పుస్తకం గానీ, ఆ సంగీతం గానీ, ఆ సినిమా గానీ పరిమితంగా అందుబాటులో ఉండటం. అంటే ముద్రిత పుస్తకం ఏ ఏ దేశాల్లో పంపిణీ చేయగలమో ఆ ఆ దేశాల వరకు మాత్రమే అందుబాటులోకి తేవచ్చు. ఒకవేళ ఏదైనా దేశంలో ఆ ముద్రిత పుస్తకం నిషిద్ధమైతే ఆ ప్రాంతం వాళ్ళు ఆ పుస్తకాన్ని చదవలేరు. అలాగే మనం ఒక సినిమాని తయారు చేసాం. అది వీడియో క్యాసెట్ రూపంలో ఉంది. లేదా సిడి లేదా డివిడి రూపంలో ఉంది, లేదా పెన్‌డ్రైవ్‌లో పెట్టి ఉంది. ఒకవేళ ఒక వ్యక్తి దగ్గర ఆ పెన్‌డ్రైవ్ గాని, సిడి గానీ, విఎచ్ఎస్ కాసెట్‌ను గానీ ఆడించగలిగే ఉపకరణాలు లేకపోతే వాళ్ళు ఆ సినిమాను చూడలేరు. అంటే డిజిటీకరణ చేయని సమాచారం ఎప్పుడూ పరిమితంగానే అందుబాటులో ఉంటుంది. విస్తృతంగా అందుబాటులో ఉండదు. ఒకవేళ అలా సిడిలలో, డివిడిలలో దాచిపెట్టిన సినిమా క్యాసెట్లు అరిగిపోతే, దానికి వేరే ప్రతులు లేకపోతే – అంతటితో మనం ఆ సినిమాను కోల్పోయినట్టే. అదెవ్వరికీ అందుబాటులోకి రాదు. అలా తెలుగులో వచ్చిన చాలా చిత్రాలకు సంబంధించిన వీడియోలు గానీ, ఆడియోలు గానీ మహారచయితల పుస్తకాలు గానీ మనం చాలా వరకు కోల్పోయాము. ఎందుకంటే అవి ఆ రోజుల్లో ప్రముఖంగా ఉండే రూపంలో అందుబాటులో ఉన్నాయి గానీ, భవిష్యత్ తరాలకు అందుబాటులో ఉండే రూపంలో వాటిని భద్రపరచలేదు. భవిష్యత్ తరాలకు అందుబాటులో ఉండేలా ఏదైనా సమాచారాన్ని ఒకవేళ భద్రపరచాలంటే డిజిటీకరణ ఉత్తమమైన మార్గం. ఇక వేరే మార్గం కూడా ఏమీ లేదు. అంటే ఒక గ్రంథాలయంలో ఉంచిన పుస్తకాలు, సిడిల్లో ఉండిపోయిన వీడియో, ఆడియోలు ఎన్ని విధాలుగా మనం ప్రయత్నించినా గానీ వాటిలోని సమాచారాన్ని నష్టపోయే పద్ధతిలోనే ఉంటాయి గానీ వాటికి శాశ్వతత్వం సంతరించదు. ఈరోజుల్లో అందుబాటులో ఉన్న సాంకేతికత వలన లేదా కంప్యూటర్ సామర్థ్యం వలన ఏ రూపంలో ఐనా మనం డిజిటీకరించిన సమాచారాన్ని భద్రపరచవచ్చు లేదా పంచుకోవచ్చు.

మరొక విషయం. ఏ భాషలో సమాచారం డిజిటీకరణ జరగలేదో ఆ భాష సాంకేతికంగా వెనకబడిపోతుంది. ఉదాహరణకి ఒక ప్రాంతపు వాతావరణ సమాచారం డిజిటీకరణ జరగలేదనుకోండి. ఆ ప్రాంతపు వర్షపు సమాచారాన్ని, రేపటి రోజు అక్కడి వాతావరణం ఎలా ఉంటుందనేది మనం తెలుసుకోలేము. అలాగే భాషకి సంబంధించిన కొన్ని వనరులు – నిఘంటువులు, వ్యాకరణం లాంటివి – డిజిటల్ రూపంలో అందుబాటులో లేకపోతే సాంకేతికంగా మనం వెనకబడే అవకాశం ఉంది. మరొక చిన్న ఉదాహరణ: భాష లేదా సమాచారం యొక్క సంక్లిష్టత పెరిగిపోతుంది. అదే డిజిటీకరణ జరిగిన పక్షంలో సమాచారం విస్తృతంగా అందరికీ అందుబాటులో ఉండటం వల్ల ఒకరికి కాకపోతే మరొకరికి అందులో ఉన్న క్లిష్టమైన అంశాలు అర్థమవుతాయి. కానీ పరిమితంగా (డిజిటల్ రూపంలో కాకుండా), ఇతరత్రా రూపాల్లో ఉన్నప్పుడు సంక్లిష్టత వల్ల చాలా అంశాలను మనం అర్థం చేసుకోలేము. డిజిటీకరణ జరగకపోతే పరిశోధనల్లో, ఆవిష్కరణల్లో చాలా లోపాలు వస్తాయి. ఉదాహరణకి తెలుగు భాష ఇలా వినిపిస్తుంది, తెలుగు భాషలో ఇలాంటి పదాలున్నాయి అనే అంశం డిజిటల్ రూపంలో ఒకప్పుడు లేదు. ఒక ముప్పై, నలభై ఏళ్ళ క్రితం గుజరాత్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ సరిహద్దు ప్రాంతంలో ఒక తెగవారు తెలుగు మాట్లాడుతున్నారు. తెలుగుకు సంబంధించిన ఒక యాసలో మాట్లాడుతున్నారు. కానీ ఆ మాటలను విని అక్కడి పరిశోధకులు వాళ్ళు మాట్లాడేది వేరే ఏదో, ఎవరూ గుర్తుపట్టని భాష అనుకున్నారు. అలాగే పదీ, పదిహేనేళ్ళు వాళ్ళ మీద పరిశోధనలు కొత్త భాష అన్నట్టుగానే జరిగాయి. మళ్ళీ ఆ విషయం ఎవరో ఒక ప్రొఫెసర్ ద్వారా బయటకు వచ్చి – అది తెలుగు భాషలోని ఒక యాస అని పరిశోధకులకు తెలిసింది. ఈ డిజిటీకరణ జరగకపోతే పరిశోధనల్లో, ఆవిష్కరణల్లో ఇలాంటి లోపాలు ఉంటాయి.

ఒక భాషకు డిజిటీకరణ జరక్కపోతే, దాని వనరులు ఎవ్వరికీ అందుబాటులో ఉండకపోవడం వల్ల ఆ భాష మాట్లాడేవాళ్ళు అంతరించిపోయినా, ఆ భాషలోని వనరులు ఇతరత్రా రూపంలో ఉన్నవి నశించిపోయినా ఆ భాష మనుగడే ప్రశ్నార్థకం అవుతుంది. ఆ భాష మాట్లాడేవారు అందుబాటులో లేకపోవడం వల్ల ఆ భాష నెమ్మదిగా కనుమరుగవుతుంది.

**కొన్ని కొన్ని సార్లు డిజిటీకరణ, డిజిటల్ రూపంలో భద్రపరచడం ఒకటే అనే అపోహ జనాల్లో ఉంది.** ఈ రెండింటికీ ఉన్న తేడాను చూద్దాం. ఒక పుస్తకాన్ని మనం స్కాన్ చేసి, భద్రపరిస్తే – అది డిజిటల్ రూపంలో భద్రపరచటం అవుతుంది (కంప్యూటర్లో నిక్షిప్తం చేసే రూపం). కానీ అది డిజిటీకరణ అవదు. డిజిటీకరణ అంటే, ఆ డిజిటల్ రూపంలోకి మార్చిన అంశాన్ని పూర్తి స్థాయిలో డిజిటల్ రూపంలోకి తేవాల్సి ఉంటుంది. అంటే ఒకవేళ బొమ్మలో పాఠ్యం ఉంటే, ఆ పాఠ్యాన్ని ఓసీఆర్(ఆప్టికల్ క్యారక్టర్ రికగ్నైజర్)

వాడి విడదీయాలి. ఆ పాఠ్యం మనకు చేరాక, పాఠ్యంలో మనం కావాల్సిన పదాల కోసం వెదకగలం. పాఠ్యంలో ఉండే విశిష్ట అంశాలను పరిశీలించగలం. బొమ్మగా ఉండగా ఆ పాఠ్యాన్ని వాడుకోవటంలో పరిమితులుంటాయి.

ఒక బొమ్మ ఉంటే, ఆ బొమ్మలో ఏమేం అంశాలున్నాయి – బొమ్మలో నది ఉందా, కొండ ఉందా, మనుషులున్నారా – ఇవన్నీ కంప్యూటర్ గుర్తుపట్టి ఆ బొమ్మ వెనుతలంలో ఏమేం ఉన్నాయి – ఆ అంశాలన్నిటినీ గుర్తించగలగాలి. ఇవన్నీ జరిగినప్పుడు దాన్ని డిజిటీకరణ అంటాము.

గ్రంథాలయాలూ, ఆర్కైవులూ, సంగ్రహాలయాలూ, ఇంకా చాలా చోట్ల కేవలం ఫొటోలు తీసి వస్తువులని భద్రపరిస్తే, అది డిజిటల్ రూపంలో భద్రపరిచాము అనుకుంటారు. కానీ ఒక గ్రంథాలయంలో గానీ, సంగ్రహాలయంలో గానీ ఒక పుస్తకం గానీ, ఒక వస్తువుగానీ ఉంటే దాని వెనుక చాలా చరిత్ర ఉంటుంది. ఆ చరిత్ర అంతటినీ రాసి, ఇంకొకరికి అందుబాటులోకి తేవడం డిజిటీకరణ. **డిజిటీకరణకు, డిజిటల్ రూపంలో భద్రపరచడానికి ఇదీ తేడా. అయితే డిజిటీకరణలో మొదటి మెట్టు డిజిటల్ రూపంలో భద్రపరచడం.**

## డిజిటీకరణ చేసే పద్ధతి:

డిజిటీకరణకు మొట్టమొదటగా కావాల్సింది డిజిటీకరణ చేయాల్సిన సమాచారాన్ని సేకరించడం. ఎక్కడెక్కడ, ఏ ఏ వనరుల నుంచి ఎంపిక చేయాలి అనేది చూసుకోవాలి. ఉదాహరణకి నేను కన్యాశుల్కం నాటకాన్ని డిజిటీకరించాలనుకుంటున్నాను. నేను ఈ మధ్య ముద్రితమై, మార్కెట్లో అందుబాటులో ఉండే ఒక పుస్తకాన్ని తీసుకొని, స్కాన్ చేసే 'కన్యాశుల్కం'ను పూర్తిస్థాయిలో డిజిటీకరించినట్టు కాదు. కొంతవరకే డిజిటీకరించినట్టు. పుస్తకం స్కాన్ అయ్యాక, స్కాన్ బొమ్మలలో ఉన్న పాఠ్యాన్ని సేకరించాలి. ఇందుకు ఆ స్కాన్ బొమ్మలలోని పాఠ్యాన్ని టైప్ చేయవచ్చు లేదా ఓసీఆర్ వాడి పాఠ్యాన్ని తెచ్చుకోవచ్చు.మొదటగా మనం చేయాల్సింది వనరుల ఎంపిక. ఆ వనరు ఏ ఏ రూపాల్లో ఉంటుంది? మన తెలుగు భాష వరకూ మనం చూసుకుందాం. తెలుగు పుస్తకాలు, తెలుగు వార్తా పత్రికలు, తెలుగు వారపత్రికలు, తెలుగు సినిమా సిడిలు, తెలుగు సినిమా ఆడియో క్యాసెట్లు, తెలుగు సినిమా వీడియో క్యాసెట్లు, తెలుగు సినిమా వినైల్ రికార్డులు, పాటల వినైల్ రికార్డులు, తెలుగు వ్యక్తుల ఫొటోలు, తెలుగు ప్రదేశాలకు సంబంధించిన ఫొటోలు ఇప్పటివైనా, ఎప్పటివైనా. వాటన్నిటినీ ఒక చోట పేర్చుకొని – ఇది ముఖ్యమైనది, ఇది ముఖ్యమైనది కాదు అనే భేదం లేకుండా – అన్నిటినీ మనం డిజిటీకరించుకోగలగాలి. ఎందుకని? ఒకప్పుడు కొన్ని పరిధులుండేవి. కంప్యూటర్లో ఎంత సమాచారం నిక్షిప్తం చేయగలం అనే దాని మీద ఒక పరిధి ఉండేది. కంప్యూటర్లు కూడా శక్తిమంతంగా ఉండేవి కాదు. ఒకేసారి వంద బొమ్మలని నేను స్కాన్ చేసిన వెంటనే ఆ స్కానర్ పాడయిపోవడం లాంటివి జరిగేవి. ఇప్పుడు శక్తిమంతమైన స్కానర్లు అందుబాటులోకి వచ్చాయి. ఎంత నిడివి ఉన్న బొమ్మలనైనా, దస్త్రాలనైనా మనం నిక్షిప్తం చేసుకోగలిగే సామర్థ్యం ఇప్పటి కంప్యూటర్లకు ఉంది. ఒకసారి మన వనరు ఏదో తెలుసుకుంటే – ఆ వనరు చిత్రమైతే, పుస్తకమైతే – దాన్ని స్కాన్ చెయ్యాలి. ఆ వనరు సంగీతానికి సంబంధించింది – ఆడియో క్యాసెట్ అయితే, వినైల్ రికార్డ్ అయితే – వాటిని ఆడిస్తూ, డిజిటల్ రూపంలోకి మార్చే పరికరాలు మనకు అందుబాటులో ఉన్నాయి. వీడియో క్యాసెట్ అయితే, వీడియో సిడి అయితే – ఆ సినిమాని, బొమ్మని, చలనచిత్రాన్ని ఆడిస్తూ, దాన్ని డిజిటల్ రూపంలోకి – అంటే ఎంపిఫోర్ లోకో, ఎవిఐ లోకో మార్చుకునే అవకాశం అందుబాటులో ఉంది. ఇలా వనరుని బట్టి డిజిటీకరణ విధానం మారుతుంది. ఒకసారి డిజిటీకరణ అయిపోయాక కంప్యూటర్ వరకు అది ఒక దస్త్రం. మనుషులకి వ్యత్యాసం చూపించటానికి వర్డ్‌ఫైలును ఒక రకంగా, సంగీతానికి సంబంధించిన ఫైలును ఒక రకంగా, వీడియోలకు సంబంధించిన ఫైలును ఒక రకంగా ఒక చిహ్నంతో చూపిస్తుంది. కానీ కంప్యూటర్ వరకు నిక్షిప్తం చెయ్యటంలో గానీ, గుర్తించటంలో గానీ దస్త్రాల మధ్య దానికి పెద్ద భేదం ఉండదు. ఆడించే సాఫ్ట్వేర్ ఏది అనే దగ్గర మాత్రమే అది ఎంపికను మార్చుకుంటుంది. ఆ విధంగా డిజిటీకరణ చేసాక వివరణకు వెతుక్కునేందుకు, తిరిగి పొందేందుకు వీలుగా ఏర్పాటు చేస్తుంది. తర్వాత దాన్ని ఆర్కైవ్ చేసి, భద్రపరుస్తుంది. ఇది డిజిటీకరణ పద్ధతి.

డిజిటీకరణ చేసుకునేందుకు మన దగ్గర చాలా ఉపకరణాలు ఉన్నాయి. స్కాన్ చేసేందుకు స్కానర్ కావాలి. ఆడియో రికార్డర్లో ఎవరి స్వరాన్నైనా ఆడియో రికార్డ్ చేస్తుంది. ఏదైనా సన్నివేశం జరుగుతున్నప్పుడు, దాన్ని మొబైల్ ఫోన్‌తో ఈ రోజు మనం వీడియో తీసి లేదా ఫోటో తీసి నిక్షిప్తం చేసుకోగలుగుతున్నాం. ఇవన్నీ అందుబాటులో ఉన్నాయి.

సరే కానీ వీటన్నిటికీ ఒక నిర్దిష్టమైన నిడివి ఉంటుంది. ఉదాహరణకి పుస్తకమైతే 300 డిపిఐ(డాట్స్ పర్ ఇంచ్ – బొమ్మలకు కంప్యూటరులో ఉండే నాణ్యత లెక్క)లో లేదా 150 డిపిఐలో స్కాన్ చేయాలి. బొమ్మ అయితే 300 నుంచి 600 డిపిఐ లో స్కాన్ చెయ్యాలి. 35 ఎమ్ఎమ్ సినిమా స్లైడ్ అయితే 1400 డిపిఐ లో స్కాన్ చెయ్యాలి. ఇలా రకరకాలుగా మనం తీసుకునే అంశాన్ని బట్టి దాన్ని ఎలా నిక్షిప్తం చెయ్యాలి, ఎలా డిజిటీకరణ చెయ్యాలి అనే అంశాల గురించి కొన్ని ప్రమాణాలున్నాయి. డిజిటీకరణ జరిగాక, ఆ డిజిటీకరించిన అంశాలను మనం ఇంటర్నెట్లో భద్రపరిచి ప్రపంచంలోని ఏ మూల నుంచైనా చూడొచ్చు.

## డిజిటీకరణకు అంతర్జాల ఉపకరణాలు:

ఇంటర్నెట్ ఆర్కైవ్, ప్రాజెక్ట్ గూటెన్బర్గ్, వికీసోర్స్, గూగుల్ బుక్స్, హాథీట్రస్ట్, ఒమేకా ఇలా వివిధ రకాల ఆన్లైన్ నెలవులు – డిజిటీకరించిన అంశాలను భద్రపరుచుకోవడానికి మనకు అందుబాటులో ఉన్నాయి. వీటిలో కాపీరైట్ హక్కుదార్లు వాళ్ళు స్కాన్ చేసిన పుస్తకాన్ని గానీ, స్కాన్ చేసిన ఫొటోను గానీ, రికార్డ్ చేసిన ఆడియోను గానీ, రికార్డ్ చేసిన వీడియోను గానీ అప్లోడ్ చేయొచ్చు. ఇంటర్నెట్ ఆర్కైవ్ అన్ని రకాల అంశాలనీ ఆర్కైవ్ చేయటానికి అనుమతిస్తుంది. ప్రాజెక్ట్ గూటెన్బర్గ్లో వాళ్ళు సూచించిన పుస్తకాల వరకూ మాత్రమే ఒక సముదాయంగా ఏర్పడి డిజిటైజ్ చేయవచ్చు. వికీసోర్స్లో కూడా కాపీరైట్ పరిధి దాటిపోయిన పుస్తకాలను తీసుకొని, వాటిని పాఠ్య రూపంలోకి మార్చుకోవచ్చు. గూగుల్ బుక్స్ – ఇది మిలియన్ బుక్ ప్రాజెక్ట్ కింద జరిగిన ప్రాజెక్టుల్లో అన్నిటికంటే పెద్ద ప్రాజెక్ట్.

ఇందులో గూగుల్ సంస్థ పెట్టుబడులు పెట్టి, సహాయం చేస్తే ఉపకరణాలను కొని, ప్రపంచంలోని అనేక గ్రంథాలయాలకు, యూనివర్సిటీలకు, పుస్తక భాండాగారాలకు ఈ ఉపకరణాలను పంపించి, అక్కడి సిబ్బందికి డిజిటీకరణలో ఉచితంగా శిక్షణ ఇచ్చి కొన్ని లక్షల పుస్తకాల స్కాన్ చేసారు. గూగుల్ బుక్స్లో గానీ, వికీసోర్స్లో గానీ, ఇంటర్నెట్ ఆర్కైవ్లో గానీ, గూటెన్‌బర్గ్‌లో గానీ కాపీరైట్ పరిధి దాటిపోయిన పుస్తకాలు మనకు అందుబాటులో ఉంటాయి. హాథీట్రస్ట్ లాంటి సంస్థలు కొంత రుసుము తీసుకొని మనకు కాపీరైట్ ఉన్న పుస్తకాలను కూడా అందిస్తాయి. ఆ రుసుములో కొంత భాగం పుస్తకం కాపీరైట్ హక్కుదారుకి వెళ్తుంది.

**డిజిటీకరణ చేయడం ద్వారా కాపీరైట్ హక్కులను ఏమైనా భంగపరుస్తున్నామా?**

అంటే ఒకవేళ డిజిటీకరించిన పుస్తకాన్నీ, బొమ్మనీ లేదా సంగీతాన్నీ, చిత్రాన్నీ మనం బయటికి తెచ్చి, అందరికీ ఉచితంగా పంచిపెట్టాం అనుకోండి, అది కాపీరైట్ చట్ట ప్రకారం నేరమవుతుంది. ఉదాహరణకి, ఒకరు థియేటర్లో సినిమా మొత్తాన్ని మొబైల్ ఫోన్లో రికార్డ్ చేసి, బయటకు తెచ్చి పంపిణీ చేస్తారు. దాన్ని సినిమా పైరసీ అని మనం వింటూ ఉంటాం. ఇది కాపీరైట్ ఉల్లంఘన. అలాగే కొందరు , పేరు మోసిన చిత్రకారుల పెయింటింగులకు నకిలీలు తయారు చేసి, ప్రింటులు తీసి వాటిని అమ్మేస్తూ ఉంటారు. ఇది కూడా కాపీరైట్ ఉల్లంఘనే. కాపీరైట్ చట్ట పరిధిలోనే మనం డిజిటీకరణ చేస్తే కాపీరైట్ కష్టాలు ఉండవు. కానీ మనం ఇంకొక వైపు నుంచి కూడా ఆలోచించాలి. భాషకు సంబంధించిన వనరులని ఆయా కాపీరైట్ హక్కుదారులు ముందస్తుగానే కాపీరైట్ పరిధి నుంచి విడుదల చేసేస్తే వాటిని విస్తృత ప్రజ చదివి లేదా చూసి అర్థం చేసుకుని ఇంకా ఎక్కువ లాభ పడతారు. ముద్రణకే పుస్తకాన్ని పరిమితం చేస్తే వెయ్యి పుస్తకాలే లేదా రెండొందల పుస్తకాలే లేదా అయిదొందల పుస్తకాలే మార్కెట్లోకి విడుదల అవుతాయి. అవి సరాసరి సంవత్సరం తిరిగేసరికి వెయ్యి మంది పాఠకులు చదివారా అంటే ప్రశ్నార్థకమే. అదే ఒక కథని ఒక ఆన్లైన్ వేదిక మీద పెడితే గంటల్లోనే వందల్లో, వేలల్లో జనాలు ఆ కథన్ని చదివేస్తున్నారు. ఇది మనం ప్రత్యక్షంగా ఫేస్‌బుక్‌లో ఇతరత్రా సామాజిక మాధ్యమాల్లో చూడవచ్చు. ఒక కథని పుస్తకంలో ప్రచురిస్తే దాని విస్తృతి ఒక పరిమిత స్థాయిలో ఉంటుంది. వార్తాపత్రికలో ప్రచురిస్తే, ఆ వార్తాపత్రిక సర్క్యులేషన్ ఎంత ఉందో అంత పరిధికి పరిమితి పెరుగుతుంది. వారపత్రికలో, మాసపత్రికలో ప్రచురిస్తే, ఆయా పత్రికల సర్క్యులేషన్ను బట్టి అది పరిమితమై ఉంటుంది. అదే ఇంటర్నెట్లో డిజిటీకరించి పెట్టిన కథలకి ఇలాంటి పరిమితులూ, హద్దులూ ఉండవు. అంటే ఒక పుస్తకంలో లేదా వారపత్రికలో నా కథను ప్రచురించాను అనుకుందాం. కానీ ఆ వారపత్రిక అమెరికా వెళ్ళదు, ఆస్ట్రేలియా వెళ్ళదు. అక్కడ ఉండే తెలుగు వారు నా కథను చదవాలంటే కచ్చితంగా అది డిజిటల్ రూపంలో ఉంటేనే ఈ రోజుల్లో సాధ్యమవుతుంది. లేదా ఈ పుస్తకాన్ని ఆ దేశాలకు పంపించటానికి ఖర్చు తడిసి మోపెడవుతుంది. అలా కాకుండా నా రచనను డిజిటల్ రూపంలో ఉంచితే గనక దాని విస్తృతిని కాలాతీతం, స్థానాతీతం చేయగలను. ఆ విధంగా స్థాన కాల పరిమితులని దాటి రచనలు బ్రతకాలంటే వాటి డిజిటీకరణ తప్పక జరగాలి.

**డిజిటీకరణలో జరిగిన కొన్ని విజయాలను చూద్దాం.**

మన తెలుగులో, తెలుగు పుస్తకాలను స్కాన్ చేసే మనసు ఫౌండేషన్ సంస్థ ఇప్పటి వరకు కోటీ నలభై ఐదు లక్షల పేజీలను స్కాన్ చేసింది. దీంట్లో ఎన్నో వేల పుస్తకాలు, పత్రికలు, మాసపత్రికలు ఉంటాయి. అలాగే మనసు ఫౌండేషన్ దగ్గర ఇప్పటి వరకు తెలుగులో వచ్చిన చిత్రాలు, అందుబాటులో ఉన్నంత వరకు, అన్నీ కూడా నిక్షిప్తమై ఉన్నాయి. తెలుగు సినిమా మొదటి పాట నుంచి మొదలుపెట్టి, కాపీరైట్ పరిధి దాటి పోయిన అన్ని చిత్రాల పాటలు డిజిటల్ రూపంలో మనకు అందుబాటులో ఉన్నాయి. అలా మనసు ఫౌండేషన్ ద్వారా తెలుగు భాషకు పెద్ద వనరును తాయారు చేసినట్టయింది. మనసు ఫౌండేషన్‌తో పాటుగా, ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడెమి వాళ్ళు – వాళ్ళకి అందుబాటులో ఉన్న తెలుగులో వచ్చిన తొలినాటి పత్రికల నుంచి 2000 సంవత్సరం వరకు వచ్చిన పత్రికలను చాలా వరకు స్కాన్ చేసి, అందుబాటులో పెట్టారు.ప్రాజెక్ట్ గూటెన్‌బర్గ్‌లో ఆరు పుస్తకాలను స్కాన్ చేసి పెట్టారు. తెలుగు వికీస్టోర్స్‌లో పద్దెనిమిది వేల ఆరు వందల అరవై ఎనిమిది తెలుగు పుస్తకాలు ఉన్నాయి. ఇందులో స్కాన్ చేసి, డిజిటీకరించినవి మొత్తం ఆరు వందల ఎనభై తొమ్మిది పుస్తకాలు. ఇక తెలుగు ప్రాంతాల బయట –డిజిటల్ పబ్లిక్ లైబ్రరీ ఆఫ్ అమెరికా (https://dp.la వారు బొమ్మలూ, పాఠ్యాలూ, వీడియోలూ, మొదలైనవి – అమెరికాకు సంబంధించినంత వరకూ సేకరించి, వాటన్నింటినీ స్కాన్ చేసారు. ప్రస్తుతం వాళ్ళ దగ్గర నాలుగు కోట్ల ఎనభై అయిదు లక్షల పది వేల మూడొందల అరవయొక్క బొమ్మలూ, పాఠ్యాలూ, వీడియోలూ, మొదలైనవి ఉన్నాయి. గూగుల్ బుక్స్ 2019 నాటికి నాలుగు కోట్ల పుస్తకాలను స్కాన్ చేసింది. బ్రిటిష్ లైబ్రరీ ఎన్ డేంజర్డ్ ఆర్కైవ్స్ కార్యక్రమం అనేది ఒకటి చేపట్టింది . ఇందులో భాగంగా ఆఫ్రికా, ఆసియా దేశాల్లో ఉన్న నిర్లక్ష్యానికి గురవుతున్న ప్రమాదంలో ఉన్న భాషలకు సంబంధించిన వనరులను డిజిటీకరించేందుకు పెద్ద నిధులను ఏర్పాటు చేసి, ఎవరైనా అభ్యర్థన చేసుకుంటే వారికి డిజిటీకరణలో సహాయం చేస్తుంది. అలాగే హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో, ఐఐటి హైదరాబాదులో శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీ – తిరుపతి శ్వేతా భవనంలో, ఆంధ్ర విశ్వవిద్యాలయంలో, నాగార్జున విశ్వవిద్యాలయంలో మనకు స్కానింగ్ చేసుకునే అవకాశం అందుబాటులో ఉంది. స్టేట్ ఆర్కైవ్స్ వారి దగ్గర ఉన్న వనరుల్లో చాలా భాగం వరకు – పత్రికలనూ, పుస్తకాలనూ, మొదలైన వాటిని వారు స్కాన్ చేశారు. metmuseum.org సంస్థ నాలుగు లక్షల తొంభై రెండు వేల ఫొటోలను నిక్షిప్తం చేయగలిగింది. ఇది ఒక్క న్యూ యార్క్ నగరం వరకు మాత్రమే సేకరించిన సమాచారం. ఇక డిజిటల్ ఇండియా కార్యక్రమం దేశంలో మొదలైన అతిపెద్ద డిజిటీకరణ కార్యక్రమం. ఇందులో డిజిటీకరణలో మన బ్యాకింగ్ వ్యవస్థ మొత్తం యుపిఐ కి మారి పెనుమార్పులు వచ్చేసాయి. ప్రతి ఒక్కరూ కూడా కేవలం మొబైల్ ఫోన్ సహాయంతో బ్యాంకింగ్ పనులను చాలా వరకు చేతి వేళ్ళ మీదే చేసుకోగలుగుతున్నారు. ఈ విధంగా డిజిటీకరణ చాలా, చాలా సహాయకరం అవుతుంది. అ

నందివెలుగు ముక్తేశ్వరరావు
9491428078

# పాలకుల అజ్ఞానం మనకు శాపం

**రాజ్యాంగం మనకు ప్రజాస్వామ్యాన్ని ప్రసాదించింది. ప్రజాస్వామ్యంలో ప్రజలే తమ పాలకుల్ని ఎంచుకోవచ్చు. దీనికి అయిదేళ్ళకొకసారి జరిగే ఎన్నికల పండగలో ప్రజలు ఓటు వేసుకునేందుకు అవకాశం లభిస్తుంది. అలా ఎన్నుకున్న ప్రజా ప్రతినిధి, ప్రజల విషయంలో ఎలా వ్యవహరించాలి? అన్నది మాత్రం అటు రాజ్యాంగంలో గాని ఇటు ప్రజా ప్రాతినిధ్య చట్టంలో గాని, ఎలాంటి నిబంధనలు లేవు. ఎలాంటి నిబంధనలు లేని చోట పాలకులు జ్ఞానవంతులు,ప్రజాహితవరులు అయితే ప్రజలకి అంతకంటే కోరుకోదగినది ఏమీ లేదు. కానీ, ప్రజా ప్రతినిధులు మాత్రం రానురాను కొత్త భ్రమలను సృష్టిస్తున్నారు. కొత్త భ్రమల్లో వాళ్లు ఊరేగుతున్నారు. అయిదేళ్లపాటు లభించిన ఈ అధికారాన్ని వాడుకుని ఏ విషయం అయినా ఎంత తల్లకిందులుగానైనా నిర్ణయం తీసుకోవచ్చు అనుకుంటున్నారు. జనం చదువులు, జనానికి కావలసిన నీళ్ళు, పాలు, భూమి మొదలైన సమస్త వ్యవహారాల మీద మాకు సర్వతంత్ర స్వాతంత్ర్య అధికారాలు ఉన్నాయి అన్నట్లు చట్టాలు చేస్తున్నారు. నిబంధనలు చేస్తున్నారు. జనజీవితపు నవనాడులు కుంగదీస్తున్నారు. భూమి, పర్యావరణం లాంటివే కాకుండా జనానికి సమాజ పురోగతికి అతి కీలకమైన విద్యారంగాన్ని కూడా వ్యాపారంగా మార్చేశారు. ముఖ్యంగా విద్యారంగ సమస్య మూలాల్ని ఒకసారి పరిశీలిద్దాం.**

విద్యారంగం మీద ప్రభుత్వం ఎందుకని దృష్టి సారిస్తుంది అంటే సార్వత్రిక విద్య (universal education) అందరికీ అందించడానికి, అందరినీ విజ్ఞానవంతులను చేయడానికి.దానికోసమనే వ్యవస్థీకృత విద్యావిధానం(organised system of learning) లో భాగంగా పాఠశాలలు అనేవి ఏర్పడ్డాయి.

పాఠశాలల్లో చదువులు, పరీక్షలు సర్టిఫికెట్లు నిజమైన పరమార్ధం కాదు. నిజమైన పరమార్ధం విజ్ఞానమయమైన ప్రపంచాన్ని నిర్మించడం. ప్రజలు శక్తివంతులు కావడం, సమాజాన్ని, ప్రకృతిని లోకాన్ని నడిపే అన్ని అంశాలు తెలుసుకోగలగడం ప్రధానం కావాలి. మరి అలాంటి పౌరులని తీర్చిదిద్దాలంటే ఎలాంటి విద్యావ్యవస్థ కావాలి? అన్న చర్చలోకి వెళ్తే **మనకు స్వాతంత్ర్యం రావడానికి ముందే - దేశంలో విద్యావేత్తలు, తత్త్వవేత్తలు, స్వతంత్రోద్యమ నాయకులు, సంస్కరణోద్యమ నాయకులు శోధించి తేల్చిన విషయం ఏంటంటే 'శాస్త్ర విజ్ఞానం దేశ భాషలలో ఉంటేనే ప్రజలకి జ్ఞానం, చైతన్యం, శక్తి లభిస్తాయి' అని.**

స్వాతంత్ర్యం వచ్చిన కొంతకాలం వరకు కూడా దేశ భాషల్లోనే విద్య కొనసాగింది. విద్యాహక్కు చట్టం కూడా బోధన శాస్త్రాల ఆధారంగా కనీసం ప్రైమరీ విద్య తప్పనిసరిగా దేశభాషలోనే ఉండాలని పేర్కొన్నది. ఇది చాలా వరకు పాటించబడుతూనే ఎనిమిదవ దశకం వరకూ నడిచింది. అప్పటిదాకా ఉన్న స్వాతంత్ర్య ఉద్యమంతో ప్రత్యక్షంగానో - పరోక్షంగానో, తీవ్రంగానో - సాధారణంగానో సంబంధం కలిగిన నాయకులు నెమ్మది నెమ్మదిగా కనుమరుగవడం, ఆ స్థానంలో రాజకీయ వ్యవస్థలోకి ప్రజా జీవితంతో సామాజిక జీవితంతో పెద్ద సంబంధం లేని వాళ్లు చేరడం మొదలైంది. రాజకీయ పార్టీలు అన్నీ తిలాపాపం తలాపిడికెడు అన్నట్టు ఒకళ్ళతో ఒకళ్ళు పోటీ పడి చరిత్ర పట్ల, సమాజం పట్ల అవగాహన లేని నాయకులకు సింహద్వారాలు తెరిచి ఉంచారు. ఆ తరువాత తొమ్మిదవ దశకం నుంచి అక్రమాల విక్రమార్కులు, దళారీలు, నడమంత్రపు శ్రీమంతులు కుప్పలు తెప్పలుగా రాజకీయ వ్యవస్థలోకి రావడం మొదలుపెట్టారు.

ఇప్పుడు విద్యా విషయానికి వస్తే హఠాత్తుగా మంత్రులు, ముఖ్యమంత్రులు విద్యారంగం మొత్తాన్ని అవపోసన పట్టిన వాళ్ళలా ప్రవర్తించసాగారు. అన్ని సమస్యలకి దేశ భవిష్యత్తుకి గ్యారంటీ ఇంగ్లీషు మీడియమే అనే కొత్త సూత్రీకరణతో గొంతెత్తి పాడటం మొదలుపెట్టారు.

వీళ్ళకి తెలియంది, అర్థం కానిది ఏమిటంటే విద్యకి మూల సూత్రం నేర్చుకోవడం. నేర్చుకోవడం అనే ప్రక్రియ నేర్చుకునే వాడు, నేర్పేవాడు కలిసి చేసే పని. నేర్చుకునే వాడిని నేర్పేవాడిని సులభంగా సహజంగా కలిపేది దేశ భాష / మాతృ భాష. దీని వలన విద్యార్థి బట్టీయం వేయాల్సిన అవసరం ఉండదు. పాఠాన్ని సులభంగా గ్రహిస్తాడు. గ్రహించింది త్వరగా ఆలోచించగలుగుతాడు. గ్రహించిన విషయాన్ని పరీక్షల్లోనే కాకుండా జీవితంలోనూ అనుసంధించుకోగలుగుతాడు. మాతృభాషలో విద్యాబోధన అన్నది ప్రపంచవ్యాప్తంగా, ముఖ్యంగా అభివృద్ధి చెందిన అన్ని దేశాలలో జరుగుతున్న విద్యావిధానం. **ఆఖరికి యూరప్ దేశాలు కూడా ఇంగ్లీషుని తగ్గించుకుని స్థానిక భాషలను పెంచుకుంటున్నాయి. అమెరికాలో కాలిఫోర్నియాలో జరిగిన ఒక ఉదంతం దీనికి ఒక పెద్ద ఉదాహరణ.**

**1998 ప్రాంతంలో రిఫరెండం పెట్టి ఇంగ్లీషు నేర్చుకుంటేనే గతీ,మోక్షం అని తల్లి తండ్రులు పెద్ద ఎత్తున తీర్మానం చేసారు. 2016 నాటికి అక్కడి తల్లితండ్రులు గమనించిన అంశం ఏంటంటే పిల్లలకుఅటు ఇంగ్లీషు రాలేదు, విషయ పరిజ్ఞానమూ రాలేద్కు, పిల్లలు రెంటికీ చెడిన రేవడిలా మారారు. దానికోసం మళ్ళీ రిఫరెండం పెట్టుకుని స్థానిక భాషలే కావాలని కోరుకున్నారు.**

వలస పాలనకు లోనైన జపాన్, చైనా లాంటి దేశాలవారు కూడా డిగ్రీ డాక్టరేట్ స్థాయి వరకు కూడా స్థానిక భాషలనే వాడుతున్నారు. ఇది ప్రపంచంలో ఉన్న వాస్తవ స్థితి.

ఇదేదీ పరిశీలించకుండానే మన నడమంత్రపు రాజ్యాధికార ప్రముఖులు,నాయకులు ఇంగ్లీషు మీడియం కోసమే పాటుపడుతున్నారు. అదేమిటంటే ఆ మధ్య కరోనా సమయంలో తల్లితండ్రుల దగ్గర సంతకాల సేకరణ చేసి అది తల్లితండ్రుల అభిప్రాయం అంటూ సన్నాయి నొక్కులు నొక్కుతున్నారు. ఎవరైనా ఒకరి వద్ద ఒక విషయం

గురించి అభిప్రాయం సేకరించాలంటే ప్రాథమిక సూత్రం – వాళ్ళకి ఆ విషయంలో ఉన్న రెండు కోణాల మీద పూర్తి స్థాయి సమాచారం ఇవ్వాలి. అలాంటి పూర్తి స్థాయి సమాచారం ఉభయ పక్షాలను విన్నమీదట చేసే నిర్ణయమే సరైన నిర్ణయం, సమాచార ఆధారిత నిర్ణయం అని అంటారు. ప్రభుత్వాలు ప్రజల నిర్ణయం అడిగేటప్పుడు సరైన సమాచారం సరైన రీతిలో అందించకపోతే ప్రజలు సరైన నిర్ణయాలు తీసుకోకపోతే ఆ పాపం ప్రభుత్వానిదే. సంక్షిప్తంగా ఇదీ జరుగుతున్న చరిత్ర.

**స్కూలు నడిపించడం అంటే దేశ భవిష్యత్తుని నిర్మించడం.**

ఇస్రో వారు అంతరిక్షంలోకి రాకెట్‌ని వదిలినట్టు, నవ చరిత్రలోపుటల్లోకి కొత్తతరాల్ని లాంచ్‌కి తయారుచేస్తున్నట్టు. ఇంత కీలకమైన పాఠశాల వ్యవస్థ నడిపించడంలో శాస్త్రీయమైన పద్ధతులు, శాస్త్రబద్ధమైన ఆలోచనలని మనం ఆచరించకుండా ముందుకు వెళ్ళడం ఊబి మీద ఈఫిల్ టవర్ కట్టాలనుకోవడం అవుతుంది. మన నమ్మకాలు, ఉద్యోగాలని ప్రాతిపాదిక చేసుకుని మాత్రమే పిల్లల చదువుల గురించి మూర్ఖపు నిర్ణయాలు తీసుకుంటే పోయేది స్కూళ్ళు మాత్రమే కాదు, ఒక జాతి భవిష్యత్తు. అందుకు తెలుగు మీడియంని బూచిగా చూపించడం మన మేధో దొల్లతనానికి పరాకాష్ట.

దీనిని మొత్తం సమీక్షించినప్పుడు ప్రభుత్వాల నిర్ణయాన్ని కూడా ఆలోచిద్దాం. ప్రభుత్వాలకు కూడా విద్యా విజ్ఞాన శాస్త్ర పరిజ్ఞానం లేదు. దానికి సంబంధించిన విద్వాంసుల దగ్గరనుంచి (experts నుంచి) అభిప్రాయాలు తీసుకోవడం లేదు. అకడెమిక్ కన్సల్టేషన్ లేదు. చిత్తశుద్ధి లేదు. ప్రభుత్వాలు తీసుకునే నిర్ణయాలు వాళ్ల ఇష్టాఇష్టాల మీద ఆధారపడి తీసుకోకూడదు. ఆ నిర్ణయం హేతుబద్ధం కావాలి ( objective) , శాస్త్రీయంగా ఉండాలి ( scientific ) . ఈ విషయాన్ని సుప్రీం కోర్టు పలు సందర్భాలలో అధికారం ఉంది కదా అని ఇష్టం వచ్చినట్టు నిర్ణయాలు తీసుకోరాదని అనేక తీర్పులలో పేర్కొన్నది. కానీ, ఇప్పుడు ప్రభుత్వం చేస్తున్న పని ఎవరేమనుకున్నా సరే ముందుకే పోతామనడం జాతికి అపకారం కలిగిస్తుంది.

అందువల్ల శాస్త్రీయ ఆధారాలు లేని, ప్రమాణాలు పాటించని వెర్రి మొర్రి నిర్ణయాల్ని ప్రశ్నించడం పౌరులుగా మన బాధ్యత. ప్రభుత్వం చేస్తున్న ఈ పిచ్చి నిర్ణయం వల్ల పిల్లల బాల్యానికి కొలుకోలేనంత దెబ్బ తగులుతుంది. బట్టీయంలో వచ్చిన విజ్ఞానం వంట పట్టదు. పౌరుడుగా ఆత్మ విశ్వాసం, చురుకుదనం కోల్పోతాడు. జాతి నిర్జీవం అవుతుంది.

ఆఖరిగా మాతృభాషలో విద్యావిధానం ఉండటం అనేది పిల్లల సహజత్వానికి, దేశ భవిష్యత్తుకి అత్యవసరంగా కావాల్సిన అంశాలుగా భావిస్తున్నాను. ఇది నాయకులం అని చెప్పుకుంటున్న అన్ని పార్టీల వారు కనీస అధ్యయనం చేసి ఇప్పటికైనా మాతృభాషలో విద్యావిధానం పట్ల, పాలనాభాషగా దేశభాషలని వినియోగించడం పట్ల తగినంత శ్రద్ధ కనబరచక పోతే, ఆ విషయాన్ని విధాన ప్రకటన చేయకపోతే దానికి ఆచరణయోగ్యమైన ప్రణాళిక ప్రకటించకపోతే వాళ్ళకు దేశ భవిష్యత్తు పట్ల, ప్రజా జీవితం పట్ల ప్రేమ గాని అవగాహన గాని లేదని మేము భావిస్తే అది మా తప్పు కాదు.

ఇప్పుడు మేము అంటున్నది ఏమిటో మీరంటున్నది ఏమిటో పరిశీలిద్దాం. దేశభాషల్లో విద్య అదేదో గొప్ప ఆదర్శం అంటున్నారు మీరు. మేము అవసరం అంటున్నాం. చదువు ఉద్యోగాల కోసం ఉపాధి కోసం చదువు యొక్క పరమార్థాన్ని తగ్గిస్తున్నారు మీరు. మేము పిల్లలు నేర్చుకునే ప్రతీదీ వాళ్ల అవగాహనని వాళ్ల ప్రపంచాన్ని విస్తృత పరుస్తుంది అంటున్నాం. మేము చెప్పున్న ప్రపంచంలో ఉద్యోగాలు ఉపాధి లాంటివి దొరకడమే కాక పిల్లలు అన్ని ఒత్తిడులను తట్టుకుని నిలబడగలుగుతారు. మేము దేశ భాషలని ప్రజల సమస్యగా భావిస్తున్నాం, మీరు భాషాసమస్యగా చూస్తున్నారు. ప్రజల బాగోగులను పట్టించుకోవడం అంటే ప్రజలకు అర్థం కావడానికి భాష మూలాధారం అని అంటున్నాం. మేము చెప్పే వాటికి శాస్త్రీయ ప్రాతిపదిక ఉంది, ప్రమాణాలు ఉన్నాయి, అధ్యయనం ఉంది, అధ్యయన నివేదికలు ఉన్నాయి. మీరు చెప్పే ఇంగ్లీషు సర్వ రోగ నివారిణి అని మీరంటున్న మాటకి ఒక్క అధ్యయనం నివేదిక కూడా ప్రపంచంలో లేదు. ఆఖరిగా ప్రజలు వాళ్ల విజ్ఞానం వాళ్ల సౌకర్యం వాళ్ల అభివృద్ధిని గురించి మేము మాట్లాడుతుంటే అరకొర అధ్యయనంతో అవగాహనా రాహిత్యంతో మీరు మాట్లాడుతున్నారు. అందువలన సమస్త రాజకీయ పక్షాలలో ఉన్న నాయకులందరికీ బహిరంగంగా బోధన భాషగా ఇంగ్లీషుని ప్రకటించడానికి మీ వద్ద ఉన్న అధ్యయన నివేదికలు, ఆధారాలు ఏమున్నాయో మీ విధానం ఏమిటో బహిరంగంగానే ప్రకటించండి.

ఇప్పటికైనా ప్రతీ పార్టీకి తెలుగు భాషోద్యమ సమాఖ్య తరపున మేం చేస్తున్న ఈ వాదనలోని సారాంశాలను గుర్తించాలని కోరుతున్నాం.

1. మేము భాషా సాహిత్యాలను గురించి మాత్రమే మాట్లాడటం లేదు
2.ప్రజలకి అత్యంత కీలకమైన విజ్ఞానాన్ని అందించే బోధన ప్రక్రియ మీద మేము మాట్లాడుతున్నాం. కాబట్టి ఇది ప్రజా సమస్యగా భావించాలి.
3. ఎంత సంక్లిష్టమైన విషయాన్ని కూడా మాతృభాషలో చక్కగా అర్థం చేయించవచ్చు. దీనిని మీకిష్టమైన స్కూల్ ని ఎంచుకుని ఒక సైన్స్ సోషల్ హిస్టరీ సంబంధించిన , అంతకు ముందు వాళ్లు వినని కాన్సెప్ట్స్ ని ఏ ప్రాంతపు పిల్లలకైనా చెప్పండి. ఆ పిల్లలకు ఎంత త్వరగా నేర్చుకుంటారో గమనించండి.
4. ఇంగ్లీషుని నేర్చుకోడాన్ని మేము వ్యతిరేకం కాదు. పిల్లలకు ఇంగ్లీషు రావాలంటే నేర్పేవాళ్ళకి రాయడం , చదవడం మాట్లాడటం వచ్చో లేదో మీరే స్వయంగా పరిశీలించుకుని చూడండి.
5. ఇంగ్లీషులో పై నైపుణ్యాలు లేని వాళ్లు పిల్లలకు నేర్పుతారని మీరు భావిస్తూ మొత్తం విద్యా వ్యవస్థను దేవతా వస్త్రాలతో ఊరేగిస్తున్నారు.

**ముక్తాయింపు :** మీరు ఇంత అకాండతాండవంగా ప్రచారాలు ఆర్భాటాలు చేసి, బడులన్నీ ఇంగ్లీషు మీడియం బడులుగా మార్చినామన మంత్రులు, మన యం. యల్. ఏ.లు, మన ఛైర్మన్ లు, మన కలెక్టర్లు పిల్లలెవరూ శాస్త్రానికి కూడా ఒకళ్ళు కూడా మన బళ్లలో చేరరు. గుమాస్తాలు, అటెండర్‌లు, ఆ బళ్ళో పనిచేసే మాష్టార్ల పిల్లలు కూడా ఘనత వహించిన మన బళ్లలో చదవడం లేదు.

**తరువాయి 22వ పుటలో**

తెలుగుజాతి మనదీ నిండుగ వెలుగు జాతి మనదీ!!

# సరికొత్త చైతన్యంతో తెలుగు భాషోద్యమం



తెలుగు భాషాదినోత్సవం- గిడుగు వేంకట రామమూర్తి పుట్టిన రోజు 29, అగష్టు 2023న విజయవాడలో తెలుగు భాషోద్యమ సమాఖ్య కేంద్ర కార్యాలయంలో జరిగింది.

గిడుగు వేంకట రామమూర్తిగారి 160వ పుట్టినరోజు నాడు జరుపుకుంటున్న తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా తెలుగు భాషోద్యమ సమాఖ్య కేంద్ర కార్యాలయం,విజయవాడలోని వెటర్నరీ కాలనీ, 4వ వీధి, 2వ అడ్డరోడ్డులో ఉన్న ప్లాటు నెం. 89, ఇంటి నెం.54లో పనిచేయడం మొదలుపెట్టింది. ఈ సందర్భంగా సమాఖ్య సర్వసభ్యసమావేశం కూడా జరిగింది.








**తెలుగు భాషోద్యమ సమాఖ్య కేంద్ర కార్యాలయం**
ప్లాటు నెం.89, ఇంటి నెం.54-1/4,1ఎ, వెటర్నరీ కాలనీ, 4వ వీధి, 2వఅడ్డరోడ్డు, విజయవాడ-520008.

తెలుగు భాషోద్యమ సమాఖ్య సమావేశకర్త డా. వెన్నిసెట్టి సింగారావు సభకు అధ్యక్షులుగా డా. సామల రమేష్‌బాబుగారిని, ముఖ్యఅతిథిగా అవిభక్త ఆంధ్రప్రదేశ్ న్యాయమూర్తి జస్టిస్ రామలింగేశ్వరరావు గారినీ తెలుగు భాషోద్యమ సమాఖ్య అధ్యక్షుడు గారపాటి ఉమామహేశ్వరరావు గారినీ వేదికపైకి ఆహ్వానించారు.జ్యోతి ప్రజ్వలనం, తెలుగు భాషోద్యమ సమాఖ్య జండా అందుకోలుతో సభ ప్రారంభమైంది.

సమాఖ్య గౌరవాధ్యక్షుడు డా. సామల రమేష్‌బాబు తమ తొలి పలుకులలో “ కొత్త కార్యాలయం నుండి తెలుగు భాషోద్యమ సమాఖ్య సరికొత్త కార్యక్రమాలను చేపట్టాలని ఆశిస్తున్నదని, ఇందుకు నూతన అధ్యక్షులు గారపాటి ఉమామహేశ్వరరావు గారికి మనందరి తోడ్పాటును అందించాలని విజ్ఞప్తి చేశారు. సమాఖ్య కార్యక్రమాలను ఆశీర్వదిస్తూ ప్రసంగించమని సభాధ్యక్షులు ఆహ్వానించగా, ఆంధ్రా లొయోలా కళాశాల ప్రిన్సిపాల్ రెవరెండ్ ఫాదర్ డా.కిషోర్ మాట్లాడారు. జనావాసాల మధ్య తెలుగు భాషోద్యమ సమాఖ్య కేంద్ర కార్యాలయం పనిచేయడం చాలా ముదావహం. సామాన్య జనంతో కలిసి ఉద్యమించడానికి ఇదే చక్కని అవకాశం. తెలుగు నేలపై తెలుగు కోసం ఉద్యమం చేయవలసిరావడమే దురదృష్టకరం. అయితే తెలుగు భాషోద్యమ సమాఖ్య అన్నింటా తెలుగు వాడకాన్ని పెంచే దిశలో తమ భవిష్యత్ కార్యక్రమాలను తీర్చిదిద్దేందుకు నడుం కట్టడం చాలా సంతోషం. దీనికి మా సహకారం ఎప్పుడూ ఉంటుంది.తెలుగు భాషోద్యమ సమాఖ్య ఈ విషయంలో తను అనుకొన్నది తప్పక సాధిస్తుంది అంటూ తమ శుభాశీస్సులు అందించారు.

ఆ తర్వాత, తెలుగు భాషోద్యమ సమాఖ్య ప్రస్తుత అధ్యక్షులు ఆచార్య గారపాటి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ తెలుగు భాషోద్యమ సమాఖ్య ఇప్పుడు రెండు పదులు నిండాయి.







## ముఖ్యఅతిథి జస్టిస్ ఎ.రామలింగేశ్వరరావు ప్రత్యేక సందేశం

ఏ ఉద్యమం చేసేటప్పుడైనా, అనుసరించవలసిన పద్ధతులను గుర్తించడం ముఖ్యం. భాషోద్యమంలో మేధావులు, కార్యకర్తలు వుంటారు. అందరూ ముఖ్యమే అయినా, భాషను రక్షించే విషయం లో ప్రభుత్వ విధానాలని గమనించి సరైన మార్గాన్ని ఎంచుకుని, అవసరమైతే మార్గనిర్దేశం చేయవలసిన అవసరం ఉంది. దానికి పాఠ్యాంశాల తీరు, బోధనా పద్ధతులు, బోధించేవారిని గమనించి ఉద్యమ శైలిని నిర్మించుకోవాలి. చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్లు పద్ధతులు ఉండకూడదు. ప్రభుత్వ విధానాలని గమనించడం చాలా ముఖ్యం. దీనికి తోడు ప్రజాదరణ కూడా పొందాలి. అప్పుడే రక్షణ సాధ్యమవుతుంది.

**" తెలుగు కవిత్వం సుమారు వెయ్యి సంవత్సరాలబాటు, నాలుగు చక్రాల రథల్లాంటి వ్యక్తులతో, సంస్కృత పద భూయిష్టమైన భాషతో సాగుతూ వచ్చింది. ఈ శతాబ్దారంభంలో గిడుగు రామమూర్తి వ్యవహారిక భాషావాదం లేవనెత్తడంతో తెలుగు కావ్య భాషా స్వరూపం మారిపోయింది. వారి భాషా సిద్ధాంతాల ప్రభావం మొదట వచనం మీదనూ, తర్వాత కవనం మీదనూ చెరగని ముద్రవేసింది. మహాప్రస్థానం గీతాలకు కారణం ఎవరంటే, భాషకు సంబంధించినంతవరకు గిడుగు వారే. గిడుగు రాంమూర్తి ఇటీవల మా ఇన్స్పిరేషన్". -శ్రీశ్రీ**

ఇప్పటివరకూ భాషోద్యమాన్ని అన్ని రంగాలకూ విస్తరించేందుకు ఒక సైద్ధాంతిక భూమికలో పోరాటాలు సలిపింది. ఆ వరవడిలోనే డా. సామల రమేష్‌బాబు 'అమ్మనుడి' మాసపత్రికను మాతృభాషోద్యమానికి అంకితం చేసి నడుపుతున్నారు. బాధ్యతగల పౌరులను మాతృభాషా హక్కులకోసం పోరాడేందుకు సమాయత్తం చేస్తూ వచ్చారు. ఇప్పుడు, మాతృభాషోద్యమాన్ని మరో దశకు చేర్చేందుకూ దీన్ని సామాన్య ప్రజలలోకి తీసుకువెళ్ళేందుకు అవసరమైన యువజనాన్ని సిద్ధం చేసేందుకు ఈ కొత్త కార్యాలయాన్ని రూపొందిస్తున్నాం. ఈ కేంద్ర కార్యాలయం, సమాజంలోని అతి ప్రధాన వర్గాలైన విద్యార్థులనూ, వారి తల్లిదండ్రులనూ, మేధావులూ వృత్తి విద్యావేత్తలనూ ఆపైన సామాన్య ప్రజానీకాన్ని వారిద్వారా రాజకీయనేతలకూ ఇతర అధికార గణానికీ అవగాహన కలిగించే రీతిలో ప్రసంగాలూ, ప్రచారం, ప్రచురణలూ, మొదలైన వివిధ కార్యక్రమాలను చేపట్టాలని ఆలోచిస్తున్నది. దీనిలో భాగంగా పట్టభద్రులైన యువజనం కోసం మాతృభాషల వాడకం ఆవశ్యకతపై ఈ రంగంలో లబ్ధప్రతిష్టులైన కొందరు మేధావుల ప్రసంగాలతో శిక్షణా శిబిరాలను నడపాలని నిర్ణయించింది.

ఇంతేగాక, తెలుగు వాడకాన్ని ప్రోత్సహిస్తూ అనేక రంగాలలో తెలుగులో విశేష కృషి చేస్తున్న యువజనాన్ని గుర్తించి తగిన పురస్కారాలను అందించాలని అనుకొంటోంది. ఈ కేంద్ర కార్యాలయాన్ని ఇప్పుడు ఉన్న చోటులోనే ఏర్పాటు చేయడానికి ముఖ్య కారణం పది కిలోమీటర్ల పరిధిలో ఉన్న అనేక విద్యాలయాలూ, వాటిలో ఇప్పటికే ఎందరినో కలవటం కలిసిన వారందరూ ఎంతో ప్రోత్సాహంగా మాట్లాడటం తమ వంతు సహాయాన్ని అందిస్తామని ముందుకు రావడం ఈ నిర్ణయానికి ఎంతో బలాన్ని ఇస్తోంది.తెలుగు భాషోద్యమ సమాఖ్య ఆశయాల సాధనకై తాను నిరంతరం కృషి చేయడానికి సిద్ధంగా ఉన్నానని, అందరం కలిసి మనం పనిచేయాలని, సమాఖ్యలో ఇంతకాలంగా సంబంధాలున్న అందరూ తనకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

తర్వాత ముఖ్య అతిధిగా పాల్గొన్న జస్టిస్ ఎ.రామలింగేశ్వరరావు ప్రసంగించారు.

సమాజంలో అనేక వర్గాలున్నాయి. కొంతమంది ప్రణాళికలు రూపొందించేవాళ్ళు కొంతమంది అమలు పరిచేవాళ్ళు మిగిలిన వాళ్ళు లబ్దిదారులు. ప్రణాళికలకు వాటి అమలుకు లబ్దిదారులకు సమన్వయం-ఆశించిన స్థితిలో లేకపోవడం, భాషవిషయంలో ఒక ప్రబల సమస్యగా తయారైంది.

ఇంగ్లీషు వస్తేనే ఉద్యోగాలు వస్తాయి అనుకొనే వాళ్ళు కొంతమంది జ్ఞానమే ఉద్యోగార్హత అని నమ్మేవాళ్ళు-వీళ్ళ ఆశలను సమన్వయపరిచేవారు లేకపోవడం విచారకరం. సమస్యకు పరిష్కారం కనుగొనే మార్గంలో తెలుగు భాషోద్యమ సమాఖ్య

పనిచేయాలని జస్టిస్ ఎ.రామలింగేశ్వరరావు గారు సమాఖ్య కేంద్ర కార్యాలయ ప్రారంభం సందర్భంగా అన్నారు..

డాక్టర్ గుంటుపల్లి శ్రీనివాస్ పాఠశాల విద్యలో భాషాబోధనలోని లోపాలని పరిష్కరించాలని సూచించరు. ఆధునిక అవసరాలకు దీటుగా జరగాలన్నారు. ప్రొఫెసర్ జి.కృపాచారి మాట్లాడుతూ తెలుగు పట్ల ప్రభుత్వ అధికారుల నిరాదరణ ప్రధాన అవరోధంగా కనబడుతోందన్నారు. ప్రపంచ తెలుగు రచయితల సంఘం అధ్యక్షులు శ్రీ గుత్తికొండ సుబ్బారావు మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాలలో తెలుగును రక్షించుకోవాలనుకొనే పరిస్థితి రావడం మన దురవస్థ అన్నారు.

ప్రొఫెసర్ వెలమల సిమ్మన్న మాట్లాడుతూ గిడుగువారి 'తెలుగు' పత్రిక, డా.సామల రమేష్‌బాబు నడుపుతున్న 'అమ్మనుడి' అప్పటికి ఇప్పటికి ఈ రెండే భాషా పత్రికలుగా పేరుపొందాయనడంలో సందేహం లేదు అన్నారు.

చిమ్మి జాన్‌బర్నబాస్ మాట్లాడుతూ తెలుగు భాషోద్యమ సమావేశాలను ప్రతిజిల్లా లేదా మండలంలో నిర్వహించాలని చెప్పారు. భాషాహక్కుల పరిరక్షణ అప్పుడే సాధ్యమవుతుందన్నారు.

తాళపత్ర గ్రంథాల పరిశోధనలో నేటి తెలుగు విద్యార్థులకు తగు శిక్షణ ఇచ్చే విధంగా కార్యశాలలు నడపాలని శ్రీ కుర్రా జితేంద్రబాబు అభిప్రాయపడ్డారు

డా.టి.లక్ష్మీప్రసన్న మాట్లాడుతూ తెలుగు టీచర్లు ఒక్కరే తెలుగు భాషాపరిరక్షకులు కాదు అన్నారు. అన్ని వర్గాల వారు భాషాపరిరక్షణలో పాల్గొనాలన్నారు. భాషా రచనలో తప్పులు దొర్లుతున్నాయని, వీటిని పరిహరించాల్సి ఉన్నదన్నారు. మహిళలను, ఉద్యోగులను ఉద్యమంలోకి ఆహ్వానించాలన్నారు.

తెలుగు భాషోద్యమ కార్యకర్త మావోసియాంగ్ మాట్లాడుతూ నల్లదొరతనంలోనే తెలుగుకు పట్టిన దురవస్థ నేడు అజ్ఞానులైన పాలకులు ఉండటం వల్ల మరింత దుర్భరంగా తయారైంది. పాలితుల దౌర్భాగ్యం. అది భాషారూపంలో కనబడుతుందన్నారు.

తరువాత ఆచార్య మునిరత్నంనాయుడు, డా.అద్దంకి శ్రీనివాస్, డా.శక్తి శివరామకృష్ణ, తదితరులు మాట్లాడారు.

సభాధ్యక్షులు డా.రమేష్‌బాబు తన ముగింపు మాటల్లో – ఆచార్య గారపాటి ఉమామహేశ్వరరావు తన అపార అనుభవంతో విద్యార్థులు, తల్లిదండ్రులు, వృత్తివిద్యా నిపుణులు, తదితర మేధావులు మొదలైన వర్గాలనుభాషోద్యమ సమాఖ్య చెంతకు చేర్చే కార్యక్రమాన్ని నిర్వహించాలని అన్నారు. సమాఖ్య ఇప్పటివరకు 20 ఏళ్లలో చేసిన దానికి మించి సమాఖ్య అధ్యక్షులు గారపాటి భవిష్యత్తులో కార్యక్రమాలను తీర్చిదిద్దగలరని దృఢవిశ్వాసాన్ని ప్రకటించారు. అ

**రెండు తెలుగు రాష్ట్రాలూ తమ భాషావిధానాన్ని ప్రకటించాలి**

## ఇవీ.సంగతులు 5వ పుట తరువాయి

అని నిపుణుల అభిప్రాయం. భాషా పరంగా అల్పసంఖ్యాకులకు ఇది నష్టం కలిగిస్తుందని తెలిసినా అక్కడి ప్రభుత్వం ఈ చట్టాలను తెచ్చింది.

**10. ఆదివాసీ విద్యార్థులకు అన్యాయం చేస్తున్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం.**

జాతీయ విద్యావిధానం ప్రకారం విద్యార్థి మాతృభాషలోనే విద్యను అందించాలని ప్రభుత్వాలకు కేంద్రప్రభుత్వ మార్గదర్శకాలున్నాయి. అయితే ఆంధ్రప్రదేశ్ లో ఆదివాసీ విద్యార్థులకు ముఖ్యంగా ఈ వైపుగా ఎలాంటి చొరవ రాష్ట్ర ప్రభుత్వం తరపున జరగటం లేదు.

**11.కృత్రిమ మేధ ఆధారిత పనిముట్టుతో జాతీయ విద్యా విధానానికి కావాల్సిన సామాగ్రిని సమకూరుస్తున్న ఐఐటీలు:**

ఐఐటీ మద్రాసు, ఐఐటీ బాంబే సంస్థలు ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ (కృత్రిమ మేధ) ఆధారిత అనువాద ఉపకరణాలను ఏ సంస్థకాసంస్థ రూపొందించాయి. ఐఐటీ మద్రాసు రూపొందించిన ఉపకరణాలు అన్నీai4bharat ప్రాజెక్టు కింద రూపొందిస్తున్నారు. ఐఐటీ బాంబే ఉడాన్ పేరుతో ఈ ఉపకణాలను సిద్ధం చేసింది. ఆంగ్లంలో ఉన్న పాఠ్యపుస్తకాలను భారతదేశ రాజ్యాంగపు ఎనిమిదవ షెడ్యూల్‌లోఉన్న అన్ని 22 భాషలలోకి సమర్థవంతంగా అనువాదం చేసేలా ఈ ఉపకరణాలు పనిచేస్తాయి.

**12. సాంకేతికంగా నేటి పెద్ద సంస్థల్లో ఒకటి మెటా:**

కొత్త కృత్రిమ మేధ భాషా మేల్బంతిని (లార్జ్ లాంగ్వేజ్ మోడల్) రూపొందించింది. ఈ మేల్బంతి తెలుగుతో సహా వంద భాషలలో అనువాదాలు, మాట నుంచి పాఠ్యం రూపాంతరం చేసే సామర్థ్యం కలిగి ఉంటుంది. విశేషమేమంటే Seamless M4T పేరుతో పరిశోధకులకు, సాఫ్టవేర్ తయారుచేసే నిపుణులకు ఈ మేల్బంతి వెనుతలంలో వాడే అనతులకట్టురమును (సోర్స్ కోడ్) అందుబాటులో దాచకుండా బయటకు విడుదల చేసారు. అ

## పాలకుల అజ్ఞానం 19వ పుట తరువాయి

దీని వల్ల మనకు ఏమి అర్థం అవుతోంది.**ఇది మీడియం సమస్య కాదు. నమ్మకానికి సంబంధించిన సమస్య. మన వ్యవస్థల మీద నమ్మకం పోవడానికి పాలకులుగా దాని నిర్వహణకి మనమే పూర్తి బాధ్యులం. ఇప్పటికైనా మీకు అర్థం కావలసిఉంది. మన వ్యవస్థ మీద నమ్మకం కలగాలంటే అవగాహన పెంచే – ఆలోచన పెంచే – వికాసాన్ని పెంచే విద్య కావాలి – అలాంటి విద్యని మనం అందిస్తున్నాం అన్న నమ్మకం జనాలకు కలగాలి. విద్యలో ప్రమాణాలు పెరగడానికి ఇంగ్లీషు మీడియంకి ప్రత్యక్ష సంబంధం గాని, కార్యకారణ సంబంధం కానీ లేదు. అవగాహన ఆలోచన పెంచడానికి అభివృద్ధి సాధించడానికి మాతృభాషతో కార్యకారణ సంబంధం ఉందనేది యావత్ భూమండలంలోని ప్రజలందరికీ అనుభవంలో ఉన్న మాట. ఇప్పటికైనా ఏలినవారు ఈ చిన్నసత్యాన్ని గుర్తు పడితే ప్రజందరూ సంతోషిస్తారు.**

రచయిత విశ్రాంత ఐ.ఏ.యస్, తెలుగు భాషోద్యమ సమాఖ్య ఉపాధ్యక్షులు

# ప్రజా చైతన్య కార్యక్రమంగా తెలుగు భాషాదినోత్సవం విజయవాడ, వెటర్నరీ కాలనీ పార్కులో...





సుమారు 100 మంది పార్కు వినియోగదారులు (నడక, సాంస్కృతిక కార్యక్రమాలు అనుదినం నడుపుకొనే వి.ఎం.సి.జిమ్ అండ్ వకర్స్ సొసైటీ, విజయవాడ-8 చొరవతో పాల్గొన్న సభ ఉదయం 7.30 గం. నుండి9.00 గంటలవరకు జరిగింది. మాతృభాష అవసరన్ని గుర్తించి సమాఖ్య అధ్యక్షులు ఆచార్య గారపాటి ఉమామహేశ్వరరావు, కార్యదర్శి డా. మొవ్వా శ్రీనివాస రెడ్డి చేసిన ప్రసంగాలను శ్రద్ధగా విన్నారు. కొందరైతే ఆసక్తిదాయకమైన ప్రశ్నలను అడిగి తెలుసుకున్నారు. సమాఖ్య సందేశం ప్రజలందరికీ అందుబాటులోకి తెచ్చే కార్యక్రమం జరిగినందుకు అందరూ సంతోషించారు.



# మైదుకూరులో ఘనంగా తెలుగు భాషాదినోత్సవం

గిడుగు రామమూర్తి పంతులు జయంతిని పురస్కరించుకుని కడపజిల్లా మైదుకూరులోని జిల్లా పరిషత్ బాలురఉన్నత పాఠశాలలో అగష్టు 29వ తేదీన తెలుగు భాషాదినోత్సవం ఘనంగా జరిగింది. తెలుగు భాషోద్యమ సమాఖ్య మైదుకూరు శాఖ, పాఠశాల యాజమాన్యంచే సంయుక్తంగా ఈ కార్యక్రమం నిర్వహించబడింది.

పాఠశాల ఉపాధ్యాయురాలు పద్మజ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులను ఉద్దేశించి తెలుగు భాషోద్యమ సమాఖ్య ప్రతినిధి తవ్వా ఓబుల్‌రెడ్డి మాట్లాడుతూ పాఠశాలల్లో తెలుగు మాధ్యమంలో బోధన జరిగినప్పుడే పాఠ్యాంశాలపై విద్యార్థులు సంపూర్ణ అవగాహన పెంపొందించుకుంటారని పేర్కొన్నారు. దైనందిన వ్యవహారంలో మాతృభాషలోనే మాట్లాడాలని సూచించారు.దేశంలో తెలుగు భాషా వ్యవహర్తల సంఖ్య తగ్గిపోతూ ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయని, రెండవ స్థానంలో ఉన్న తెలుగుభాష రోజురోజుకూ 3,4 స్థానాలకు దిగజారుతోందని తమిళులు,కన్నడిగుల వలె మనం కూడా స్వభాషాభిమానం పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎస్.వెంకటేశ్వర్లు, చౌడేశ్వరి, ఎల్ సూర్యనారాయణరెడ్డి, మణిప్రకాశ్, గోశెట్టి రామమోహన్, ఆవుల శ్రీనివాసులు, ఆనందరావు తదితరులు పాల్గొన్నారు. వ్యాసరచన పోటీలో విజేతలైన విద్యార్థులకు తెలుగు వ్యాకరణం పుస్తకాలను బహుమతులుగా అందజేశారు.





అప్పం పాండయ్య
9703079900

# ప్రాథమిక విద్య: స్థానిక భాష- మాండలికాలు

**1.ప్రాథమిక విద్య-విద్యార్థులపై ప్రభావం**

ప్రాథమిక విద్య విద్యార్థుల భవిష్యత్ జీవితంపై ప్రభావాన్ని చూపుతుంది. క్రమశిక్షణతోపాటు భాష వీరి జీవితంలో ముఖ్యపాత్ర వహిస్తుంది. విద్యార్థుల ఆలోచనా విధానాలు ప్రాథమిక విద్యలో చదివే మాధ్యమంపై ఆధారపడి ఉంటాయి. అయితే ఈ ఆలోచనా విధానాలు ఇంటి దగ్గర తల్లిదండ్రులతో మాట్లాడేటప్పుడు, పొరుగువారితో మాట్లాడేటప్పుడు, ఇంటి పరిసరాలలో మొదలై రోజు రోజుకు వికసిస్తూ నైపుణ్యాన్ని సాధిస్తాయని మనస్తత్వశాస్త్రజ్ఞులు అంటారు.

ప్రస్తుతం ఈ విధానం పాఠశాలలోని విద్యావిధానానికి భిన్నంగా ఉంది. పాఠశాలలో అధ్యాపకులతో మాట్లాడేటప్పుడు, పాఠాలు నేర్చుకొనేటప్పుడు అనుసరించే విధానం వేరుగా ఉంటుంది. పాఠశాల వాతావరణంలో నేర్చుకొనే భాష, లెక్కలు, సామాజికశాస్త్రాలు, విజ్ఞానశాస్త్రాలు వంటి పాఠ్యాంశాలు ఇంటి పరిసరాలకంటే భిన్నమైనవి. ఇవి తమ అనుభవంలోనికి రాని విషయాలు. ఈ విషయాలు ప్రత్యేక భాషద్వారా నేర్చుకోవలసి వస్తుంది. దీనినే "బడిభాష" అంటారు. ఈ బడిభాష విద్యార్థుల ఆలోచనా ధోరణులకు వైరుధ్యం కలిగిస్తుంది. చిన్నతనంలోనే మానసిక సంఘర్షణలవల్ల తమకు తెలియకుండానే ఇంటి పరిసరాలలో వికసిస్తున్న ఆలోచనలకు భంగం కలుగుతుంది. ఈ విధానంలో భాషలోను, విజ్ఞాన సముపార్జనలోను కొంత ఎదుగుదల కోల్పోతారని మనస్తత్వశాస్త్రజ్ఞులు అంటారు.

**2.ఇంటి పరిసరాలలో విద్యార్థుల అవగాహన**

1.విద్యార్థులు ప్రాథమిక విద్యాస్థాయిలోనే వ్యక్తిగతంగా సామాజిక, సాంస్కృతిక అంశాలను అర్థంచేసుకోవడంలో కొంత పురోగతిని సాధిస్తారు.

2.వారి వయసుతోపాటు మేధోవికాసం, ఆలోచనా శక్తి పెరుగుతుంది.

3.అంతర్గతంగా అభ్యాసాలకు సంబంధించి కొన్ని నైపుణ్యాలు అలవడుతాయి.

4.భావోద్వేగాలకు కూడా లోనయ్యే అవకాశాలు ఉంటాయి.

5.అన్నింటికి మించి ఇంటి పరిసరాలలోని భాషపై అవగాహన, నైపుణ్యం పెరుగుతాయి.

**3.ప్రాథమిక విద్యావిధానం-విద్యార్థుల నైపుణ్యాలు**

ప్రాథమిక విద్యావిధానంలోనే భాష, సాహిత్య, సాంస్కృతిక, వైజ్ఞానిక రంగాల్లోని నైపుణ్యాలకు ఉన్న ప్రాధాన్యం అర్థంచేసుకోవలసి ఉంటుంది. ఇవి సమాజానికి, సమాజ అభివృద్ధికి తోడ్పడే రంగాలు. ఇవి ఉన్నత విద్యకు, ఉద్యోగానికి దారిచూపిస్తాయి. ఇప్పటి విద్యావిధానం కేవలం "నేను చదువుకొన్నవాడిని" అనే గుర్తింపుకోసమో లేదా, కేవలం నిరక్షరాస్యతను దూరం చేయడంకోసమో కాక విద్యార్థుల జీవన ప్రమాణాలు, నైపుణ్యాలు పెంపొందించుకోవడానికి, తద్వారా సమాజాన్ని ముందుకు నడిపించడానికి ఉపయోగపడాలి. ఇటీవల విద్యా విధానంలో ఎన్నో మార్పులు వచ్చాయి. చారిత్రక పరిణామంలో ఇంకా ఎంతో అభివృద్ధికి అవకాశం ఉంది. ఆధునిక విద్యపై ప్రభుత్వాలు, విద్యావేత్తలు, పరిశోధకులు అత్యంత శ్రద్ధ చూపుతున్నారు. ఆధునిక విద్య ఎలా ఉండాలి అనే అంశంపై చర్చలు జరుగుతున్నాయి. ఆధునిక సాంకేతిక విద్యావిధానం ప్రాథమిక విద్యలోనే ప్రవేశపెట్టడం జరుగుతున్నది. ముఖ్యంగా ఈ సాంకేతిక విద్యా విధానంలో ఇంకా ఎక్కువ మార్పులు వచ్చే అవకాశం కనిపిస్తున్నది. ఈ సందర్భంగానే విద్యావిధానంలో విద్యార్థులలో విద్యానైపుణ్యాలు పెంచవలసిన అవసరం కూడా ఉంది.

**4.విద్యా నైపుణ్యాలు-భాషా సమాజాల పాత్ర**

విద్యార్థులకు విద్యానైపుణ్యాలు పెంచే విషయంలో మాతృభాషల (ఇంటిభాష), ప్రాంతీయ భాషల పాత్ర అత్యంత కీలకమైంది. విద్య సమాజంలో ఒక భాగంగా విడదీయరాని సంబంధం కలిగి ఉండే అంశం. సమాజాభివృద్ధి, విద్యాభివృద్ధి రెండూ ఒకదానిపై ఒకటి ఆధారపడుతూ పరస్పర చైతన్యం కలిగించే అంశాలు. పోటీ ప్రపంచంలో దేశం, రాష్ట్రం అన్నింటికంటే ముందు నిలవాలంటే సమాజంలో విద్యా ప్రమాణాలు, నైపుణ్యాలు పెరగాలి. సమాజానికి అనుగుణమైన విద్యలో సమాజం ప్రతిబింబించే విధంగా పురోగతిలో మార్పులు రావాలి. అందుకు అవసరమైన భాషాభివృద్ధి జరగాలి. భాష సుసంపన్నం కావాలి. ఒక సమాజంలోని భాష సుసంపన్నం కావడానికి ప్రాచీన సమాజంలోని చారిత్రక, పౌరాణిక, సాంస్కృతిక, సాహిత్య రంగాలలోని పదసంపదను వెలికితీయాలి. సమాజంలో అనూచానంగా వస్తున్న పదసంపదను మెరుగు పరచాలి.

**5. విద్యాప్రమాణాలు-బోధనాభాష**

విద్యాబోధన ప్రమాణ భాషలో జరగాలనేది ప్రభుత్వ నిర్ణయం. ప్రముఖ భాషావేత్తలు, మేధావులు ప్రతిపాదించిన భాషనే ప్రభుత్వం నిర్ణయించి పాఠ్యగ్రంథాలలో ప్రవేశపెట్టేది. విద్యాబోధన ప్రమాణభాషలో జరిగితే విద్యావంతులు ప్రమాణ భాషలో మాట్లాడతారనేది ప్రభుత్వ ఆలోచన. మాండలికాలకు ప్రస్తుతం విద్యాబోధనలో చోటు లేదు. అయితే ఆధునిక విద్యావిధానంలో అంటే ఇటీవలి కాలంలో ప్రామాణిక భాషలోని కొన్ని ప్రామాణిక లక్షణాలు తొలిగిపోయి వాటి స్థానంలో మాండలిక లక్షణాలు చోటు చేసుకొంటున్నాయి. అంటే మాండలికాలు ఇటీవల విద్యావిధానాన్ని ప్రభావితం చేస్తున్నాయి. మాండలికాలకు విస్తృతవ్యాప్తి ఏర్పడుతున్నది. భాషలో ప్రామాణికతకు లేని సృజనాత్మకత మాండలికాలకు పెరుగుతున్నది. మాండలికాలు సమాజంలోని వివిధ వృత్తి, వర్గాల, వ్యక్తుల నైపుణ్యాలకు సంబంధించింది. విద్యావిధానంలో మాండలికాలకు స్థానం కల్పించినట్లైతే ప్రజాదరణ పెరుగుతుంది. ఇది ప్రాథమిక విద్యనుంచే ప్రారంభం కావాలి. మాండలికాలలో ఉన్న భాషా

సంపన్నత, అందులోని మాధుర్యం, మమతానురాగాలు అనేవి ప్రజలకూ, భాషకూ ఉన్న విడదీయరాని సంబంధాన్ని తెలియజేస్తాయి. అలాంటి మన భాష, సంస్కృతి విద్యా విధానంలో ప్రతిబింబించాలి.

ప్రాథమిక విద్యావిధానంలో విద్యార్థుల భాషా విజ్ఞానం పెంపొందించే విధంగా పాటలు, పద్యాలు, కవితలు, కథలు, కథానికలు, పదాలు, పదబంధాలు, పలుకుబడులు, జాతీయాలు, సామెతలు మొదలైనవి ప్రవేశపెట్టాలని కూడా మేధావులు చెబుతున్నారు. భాషాజ్ఞానాన్ని కలిగించినప్పుడే విద్యార్థులలో శాస్త్ర విషయాల భావప్రకటన సామర్థ్యాలు పెరుగుతాయి. విద్యార్థుల భవిష్యత్తుకు చక్కని మార్గాలు ఏర్పడుతాయి. విద్యార్థులలో భాషాజ్ఞానాన్ని ఉద్యమరూపంగా ప్రవేశపెట్టి అవగాహన కలిగించాలి. ఇంట్లో ఒక భాష, బడిలో మరో భాష అనే వ్యవస్థను మార్చాలనేది ఉద్యమరూపంగా మేధావులలో వస్తున్న ఆలోచనలు. వీటిని స్వాగతించాల్సిన బాధ్యత ప్రజలపై ప్రభుత్వంపై ఉంది.

## 6. స్థానిక భాషలు

ప్రాచీనకాలంనుంచి కూడా మౌఖిక భాషకు స్థానిక భాషగా ప్రాధాన్యం కనిపిస్తుంది. సాధారణంగా మౌఖిక భాషలో మాండలిక లక్షణాలు, లిఖిత భాషలో ప్రామాణిక భాషా లక్షణాలు కనిపిస్తాయి. మౌఖిక భాషలో ప్రజల రోజువారీ వ్యవహారమేకాక సంప్రదాయానుసారంగా కొన్ని కుటుంబాలలో వివిధ వృత్తులలో గ్రామీణ, జానపద, గిరిజన కళారూపాలవంటి ప్రక్రియలలో స్థానికభాష లేదా మౌఖిక భాషలలో వైవిధ్యం కనిపిస్తుంది.

మాండలిక వైవిధ్యం, ప్రాంతీయత అంటే కేవలం తెలంగాణ భాష అనే కాకుండా ఏ ప్రాంతంలోనైనా కోస్తా లేదా రాయలసీమ ప్రాంతాలలో వ్యవహరించే మౌఖిక భాష. ఈ ప్రాంతాలలోని స్థానిక భాషలలో పౌరాణిక కథలు, చారిత్రక కథలు, సామాజిక కథలు, జానపద కథలు, బుర్రకథలు, నానమ్మ కథలు, కాకమ్మ కథలు, పంచతంత్ర కథలు, చిందు, యక్షగానం, వీధిభాగోతాలు, చిరుతల రామాయణం, తోలుబొమ్మలాట, చెక్కబొమ్మలాట, బుట్టబొమ్మలాట, గంగిరెద్దులాట వంటి వాటి విన్యాసాలలోని పలుకులు, పదబంధాలు, బతుకమ్మ పాటలు, మంగళహారతి పాటలు, కోలాటం పాటలు, భజన కీర్తనలు, కాటికాపడు వంటి పగటి వేషగాళ్ళ, పిట్టలదొరల మాటలు, పద్యాలు, జ్యావళులు, తత్వాలు ఆయా సమాజాలకు ప్రతీకలుగా నిలిచాయి. వీటిలోని భాష ఆయా ప్రాంతాలలోని మాండలికాలే. ప్రాంతీయ మాండలిక వైవిధ్యంలోని ప్రధాన లక్షణం ఆయా ప్రాంతాలను గుర్తించగలగడం. ఈ లక్షణం వల్లనే తెలుగులో వేరువేరు మాండలికాలు ఉన్నాయని గుర్తిస్తున్నాం. అట్లే పాఠ్య గ్రంథాలలో తప్ప తక్కిన శాస్త్ర, శాస్త్రేతర గ్రంథాలలోని భాష ప్రామాణికానికి భిన్నంగా ప్రాంతీయతకు లేదా మాండలికానికి లేదా స్థానిక భాషకు దగ్గరగా ఉన్నట్లు పరిశోధకులు గమనిస్తున్నారు.

లిఖితభాషను మరో విధంగా ప్రామాణిక భాష అంటున్నాం. ప్రామాణికం అనేది ఇప్పటి వరకు విద్యార్థుల పాఠ్యపుస్తకాలలో ఉండే భాష. అందుకే అది బడి భాష అయింది. ఒక విధంగా అది స్థానికేతర భాష. ఇంటి భాషను స్థానిక భాష అని, బడి భాషను స్థానికేతర భాష అని అనవచ్చు. ప్రాంతీయ భాషకు ఉన్న విస్తృత వ్యాప్తి స్థానికేతర భాషకు లేదు. అది బడికి, పాఠ్య పుస్తకాలకు, పరీక్షలకు మాత్రమే పరిమితమైంది.

ఇంటి భాష, బడి భాష అని రెండూ వేరువేరు భాషలవడంవల్ల ప్రాథమిక విద్యలోనే విద్యార్థులు అయోమయంలో పడిపోతున్నారనే విషయం అందరికీ తెలిసిందే. తద్వారా విద్యావికాసానికి, భాషా వికాసానికి అవరోధం ఏర్పడుతున్నదన్న విషయం కూడా అందరికీ తెలిసిందే. ఈ అవరోధం తొలగించి స్థానిక భాషలకు ప్రాధాన్యం కలిగించడంకోసం ప్రస్తుతం ఉద్యమాలు నడుస్తున్నాయి. ముఖ్యంగా భారతీయ భాషల సంఘం అధ్యక్షులు ఆచార్య గారపాటి ఉమామహేశ్వరరావుగారు ఉద్యమనేతగా చేస్తున్న నిరంతర కృషి ఫలితంగా ప్రామాణిక భాషలో స్థానిక భాషా వైవిధ్య లక్షణాలు చోటుచేసుకొన్నాయి. ఇలాంటివి ఇంగ్లీషు వాడుకను తొలగించి తెలుగు వ్యవహారంలో తెలుగుకే ప్రాధాన్యమివ్వాలనే వారి నినాద ఉద్యమ నేపథ్యంలో సాధించిన ఫలితాలని మనం భావించవచ్చు.

## 5. స్థానిక భాషల స్వరూపం (స్థూలంగా)

1. అర్ధానుస్వారం, శకటరేఫల వాడుక తొలగిపోవడం.
2. ఋకారానికి బదులు 'రు' వాడడం.
3. పదాలలో ఐ ఔలకు బదులు అయ్ అవ్‌లు వాడడం.
4. ఇంగ్లీషులోని '     ' ధ్వనికి ఉచ్చారణకు సన్నిహితంగా ఉన్న 'య్' ధ్వనిని వాడడం.
5. ఇంగ్లీషులోని ' f ' ధ్వనికి ఫకారం వాడడం.
6. పదాది సంయుక్తాక్షరాలోని రేఫ తొలగిపోవడం.
7. ద్విత్వ సహిత త్ర్యక్షర సంయుక్తాలు ద్వ్యక్షర సంయుక్తాలుగా రాయడం.
8. ప్రథమైకవచన ము వర్ణకానికి బదులు సున్నా రాయడం మొదలైనవి.

## 6. ప్రసార మాధ్యమాలపై స్థానిక భాషల ప్రభావం

సాధారణంగా వార్తా పత్రికలలో ఏకరూపతకోసం ప్రామాణిక భాషను ఉపయోగించాలనే సమిష్టి లక్ష్యం ఉన్నప్పటికీ కొన్ని పత్రికలు, కొన్ని ఛానళ్ళు తమ పూర్తి సమాచారాన్ని గ్రామీణ వాతావరణంలోని సామాన్య ప్రజానీకానికి చేరాలనే ఉద్దేశంతో భాషలో కొన్ని మార్పులను తెస్తూ ప్రాంతీయ ప్రయోగాలకు అవకాశం కల్పించడం జరుగుతున్నది. ఇది ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రంలో ప్రత్యేక రాష్ట్ర సాధనకోసం జరిగిన ఉద్యమ కాలంలో భాషలో, వివిధ భాషా రూపాలలో, సాంస్కృతిక కళారూపాలలో ఉన్న స్థానిక శక్తి ప్రభావంవల్ల ప్రసార మాధ్యమాలలో జరిగిన గొప్ప మార్పు. కొన్ని పత్రికలు, మాధ్యమాలు తమదైన భాషాశైలిని, ప్రత్యేక స్థానిక పదసంపదను రూపొందించుకొంటున్నాయి. కొన్ని పత్రికలు, మాధ్యమాలు పాత పద్ధతిలోని శైలీవిధానాలను వాడాలా లేదా కొత్త పద్ధతులను రూపొందించు కోవాలా అనే సందిగ్ధంలో ఉన్నట్లు తెలుస్తున్నది. అందుకు కారణం స్థానిక భాషలో ఉండే ఆత్మీయతను పంచే పలుకు బడులు, సామెతలు మొదలైనవి. వీటివల్ల మాధ్యమాలు ప్రజల హృదయాలలో నిలిచి ప్రజలకు దగ్గరవుతాయనే విశ్వాసం కలుగుతుంది.

ఇటీవల పత్రికలలో పద, వాక్య విన్యాసాలతో వచ్చే శీర్షికలు కూడా ప్రజలను ఆకర్షిస్తున్నాయి. అల్పాక్షరాలతో అనల్పార్థాన్ని సాధిస్తూ అక్షరాల, పదాల చమత్కారాలతో నూతన వరవడిని భాషలో సృష్టిస్తూ

స్థానిక భాషలకు ప్రాధాన్యాన్ని కల్పిస్తున్నాయి. ప్రజల మనోభావాలకు దగ్గరగా స్థానిక భాషలు విస్తృతమవ్వాలని పత్రికలు, మాధ్యమాలు భావిస్తున్నాయి. ఇలాంటి స్థానిక భాషలకు ప్రాధాన్యాన్ని కల్పించాలని మేధావి వర్గంకూడా భావిస్తున్నది.

### 7. స్థానిక భాషలు-సామాజిక చైతన్యం

స్థానిక భాషలపై ముఖ్యంగా తెలంగాణ భాష, యాసలపై ఇప్పటివరకు ఉన్న చిన్న చూపును దూరం చేసి తెలంగాణ భాషను కీర్తి పతాకకు ఎక్కించాలనే భావన పత్రికల్లో ఉదయించడం ఒక సామాజిక చైతన్యం. ఈ చైతన్యం తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కె.సి.ఆర్. ఉపన్యాసాల వల్ల, పత్రికా సమావేశాలవల్ల, పలువురి బహిరంగ ఉపన్యాసాలవల్ల, తెలంగాణ పాటలవల్ల, వాటిని విని తమ భాషపట్ల హర్షం వెలిబుచ్చే తెలంగాణ ప్రజల ఆనందకోలాహలవల్ల ఏర్పడిరదని చెప్పవచ్చు. ఈ చైతన్యమే ప్రత్యేక తెలంగాణను సాధించేటట్లు చేసిందనడంలో అతిశయోక్తిలేదు. అంటే భాషకు అంత గొప్పతనం ఉందని గుర్తించాలి.

### 8. స్థానిక భాషలు-అన్యభాషా ప్రభావం

తెలంగాణ ప్రాంతంలో ప్రాచీన కాలంనుంచి కూడా సంస్కృతం, ప్రాకృతం, పోర్చుగీసు, అరబిక్, పర్షియన్, ఉర్దూ, ఇంగ్లీషు మొదలైన భాషలనుంచి ఎన్నో పదాలు వచ్చి చేరాయి. తెలంగాణ చాలా కాలం మొహమ్మదీయుల పాలనలో ఉండడంవల్ల, ఉర్దూ అధికార భాష కావడంవల్ల ఉర్దూ పదాలు ఎక్కువగా చోటు చేసుకొన్నాయి. తెలంగాణలో స్థానికంగా స్థిరపడిన అన్యదేశ్యపదాలు తెలంగాణలోని సామాన్య ప్రజల వ్యవహారంలో మనోభావాలనుంచి విడదీయరాని విధంగా దగ్గరయ్యాయి. ఈ పదాలకు స్థానికంగా ప్రాచుర్యం పెరుగుతున్నది. ఉదా: సంస్కృతంనుంచి సుతి, నిష్ఠురం, గనం, ఇంగం, సింగారం, కంచం, అన్యాలం మొదలైనవి. పర్షియన్, అరబిక్, ఉర్దూ నుంచి దివాన్, కోత్వాలు, ఖరీదు, పాదుషా, ఫర్మానా, హుజూరు, కితాబు, సిపాయి, తుపాకీ, బందూక్, బందోబస్తు, కుర్చీ, మేజా, కౌలు, కుష్కీ, కలంకారీ, జంపుఖానా, కుల్లాయి, దుకాణం, ఖూనీ, జమీందారు, జమానా, జప్తు, జాగీరు, ఖాళీ, తారీఖు, గరీబు, గులాము, దర్యాప్తు, తుకుడా, ఛత్రి, కబ్జా, నకలు, గస్తీ, జాగా, సిఫారసు, హాజరు, దస్కత్, బదనాం మొదలైనవి. పోర్చుగీసునుంచి అనాస, బొప్పాయి, టమాట, అల్మారా, మేస్త్రీ, ఇస్త్రీ, కమీజు, కాజా, బంకు, గోదాం మొదలైనవి. ఇంగ్లీషునుంచి టీ, కాఫీ, టిఫిన్, కార్, బస్, రేడియో, టి.వి. ఫోన్, కెమెరా, కంప్యూటర్ మొదలైనవి. ఈ పదాలు పూర్వ పరిశోధనలవల్ల తెలిసినవే. ఇలాంటి పదాల స్థానంలో ప్రత్యామ్నాయ పదాలు రాకపోవడం వల్ల వీటిని స్థానిక పదాలుగానే భావిస్తున్నాం.

### 9. స్థానిక భాషలను బోధన భాషలుగా ప్రవేశపెట్టడం

గతంలో ఉన్న గ్రాంథిక భాషను పూర్తిగా సంస్కరించాలని, అన్యభాషా పదాలు స్వీకరించకపోతే వ్యవహార హాని సంభవిస్తుందని, అక్షర సమామ్నాయం నుంచి అర్ధానుస్వారం, శకటరేఫ, ఋ ౠలు తొలగించి స్థానిక భాషలకు స్థానం కల్పించాలని ఉద్యమ స్థాయిలో వాదోపవాదాలు చెలరేగాయి. ఆంధ్రప్రదేశ్ అవతరణ తరవాత పాఠ్య పుస్తకాలలో ఆధునిక భాషా శైలిని ప్రవేశ పెట్టడంకోసం ప్రభుత్వం నియమించిన వివిధ భాషా సంఘాల వారి నివేదికల ప్రకారం భాషా శైలిలో ఆధునికతను ప్రవేశ పెట్టడానికి ప్రభుత్వం అంగీకరించింది. తెలుగును అధికార భాషగా గుర్తిస్తూ ప్రభుత్వం 1966లో అధికార భాషా చట్టాన్ని రూపొందించి తెలుగును ఆధునికీకరించడానికి, విశ్వవిద్యాలయాలలో తెలుగును బోధన భాషగా అమలుచేయడానికి అప్పటి విద్యాశాఖ కార్యదర్శి జె.పి.ఎల్.గ్విన్ అధ్యక్షులుగా నియమించిన కమిటీవారి సూచనల మేరకు ఒక స్వతంత్ర సంస్థగా "తెలుగు అకాడమి"ని 1968లో స్థాపించడం జరిగింది. తెలుగు అకాడమి అప్పటినుంచి ఆధునిక ప్రమాణ భాషను రూపొందించి 1968 నుంచే ఉన్నత విద్య పాఠ్య గ్రంథాలలో ప్రవేశపెట్టింది. ఈ ప్రామాణిక భాషనే అప్పుడు మేధావులు, విద్యావేత్తలు, ఆచార్యులు, సంపాదక రచయితలు, పత్రికాధిపతులు ఆహ్వానించారు. అప్పటినుంచి ఈ భాష విస్తృత ప్రచారంలోకి వచ్చింది.

ఈ ప్రమాణ భాషలోనే ఆ తరవాత అన్యభాషా పదాలకు, మాండలిక పదాలకు భేదం సన్నగిల్లుతూ విస్తృత వ్యాప్తిలోకి వచ్చింది. అట్లే శాస్త్ర సాంకేతిక పదాల విషయంలో నూతన అనువాద పద్ధతులను, లిప్యంతరీకరణ పద్ధతులను, నూతన సృజనాత్మక పద్ధతులను అనుసరిస్తూ ప్రామాణిక లక్షణాలలో కొంత సడలింపుతో అనంతర ఆధునిక భాషగా రూపొందింది. శాస్త్ర విషయాల పరిశోధనలలో, సాంకేతిక విజ్ఞానం మొదలైన రంగాలలో తెలుగు వెనకబడి పోగూడదనే ఉద్దేశంతో ఈ అనంతర ఆధునిక భాషలో ఎన్నో స్థానిక మార్పులు చోటుచేసుకొన్నాయి.

ఈ సందర్భంగానే స్థానిక భాషల ప్రభావం బలం పుంజుకొన్నది. ముఖ్యంగా స్థానిక భాషల ప్రభావంవల్ల వివిధ కళారూపాలలో పాటలు ఉద్యమ రూపంలో వచ్చాయి. స్థానిక పలుకుబళ్ళు, జాతీయాలు, పదబంధాలు, సామెతలలో సృజనాత్మకత పెరిగింది. సృజనాత్మకత పెరిగిన స్థానిక భాషలను పాఠ్యగ్రంథాలలో ఉపయోగించాలని మేధావులలో చర్చలు జరుగుతున్నాయి. స్థానిక భాషలలో ఉండే వైవిధ్యాన్ని ఆహ్వానిస్తూ ప్రామాణికానికి కొత్త రూపం కల్పిస్తున్నారు. అందుకు మాధ్యమాలు సహకరిస్తున్నాయి. దీనివల్ల విద్యార్థులను అయోమయంలో పడవేసే ఇంటి భాష, బడి భాష అనే రెండు రకాల వ్యవహారానికి ఉండే భేదం కూడా సన్నగిల్లడం ప్రారంభమైంది.

### 10. స్థానిక భాషగా మాతృభాష

విద్యార్థులలోని రెండు రకాల వ్యవహారంలో ఒక వ్యవహారానికి మాత్రమే సాధికారత ఉంటుంది. ఈ సాధికారత మాతృభాషకే ఉంటుందనేది ప్రత్యక్ష అనుభవంలో ఉన్న విషయమే. భాషావేత్తలు అనే విషయం కూడా ఇదే. అందుకే సాధికారతతో కూడిన మాతృభాషా వ్యవహారాన్నే బోధనలో ప్రవేశపెట్టాలనేది మేధావుల ఆకాంక్ష. మాతృభాష అన్ని భాషలలోకన్నా బలమైన భాష. విద్యాభ్యాసంలో అవగాహన శక్తి, ఆలోచన శక్తి, వ్యక్తీకరణ శక్తి మాతృభాషకు ఉన్నంతగా ఇతర భాషలకు, ఇతర వ్యవహారాలకు ఉండదు. మాతృభాషలో ప్రావీణ్యం సంపాదిస్తే ఇతర భాషలలో ప్రావీణ్యం సంపాదించడం సులభం. మాతృభాష విద్యార్థి వ్యక్తిత్వం, సామాజిక, సాంస్కృతిక గుర్తింపును పెంచుతుంది. మాతృభాష విద్యార్థి ఉన్నత ఆలోచనలను, విమర్శనాత్మక ఆలోచనలను, అక్షరాస్యత

నైపుణ్యాలను, విద్యానైపుణ్యాలను పెంపొందిస్తుంది. ఒక్కసారి మాతృభాషలో నేర్చుకొన్న విషయాలను, పాఠ్యాంశాలను రెండో భాషలో విపులీకరించి చెప్పవలసిన అవసరం ఉండదు. ఇంటి పనిలో తల్లిదండ్రుల సహాయం తీసుకోవడం సౌకర్యంగా ఉంటుంది. మాతృభాష అంటే పిల్లలు పుట్టినప్పటినుంచే ఉపయోగించే భాష. తల్లిదండ్రుల భాష. సమాజంలోని అందరూ ఉపయోగించే భాష. ఈ భాషలో నేర్చుకొనే విద్యా నైపుణ్యాలకు సమాజం కూడా సహాయపడుతుంది. అందుకే విద్యావిధానంలో మాతృభాషనే కొనసాగించాలని భాషావేత్తలు, మేధావులు ఉద్యమాలు నిర్వహిస్తున్నారు.

## 10. స్థానిక భాష - యాస

స్థానిక భాషలను ప్రధానంగా గుర్తించగల వైవిధ్యం యాస. ఇది సమాజంలోని వ్యక్తులు పరస్పరం తమ ఆత్మీయతను వ్యక్తం చేసుకోడానికి ఉపయోగించే స్థానిక భాషా రూపం. తెలంగాణ ప్రాంతంలోను, కోస్తా ప్రాంతంలోను, రాయలసీమ ప్రాంతంలోను ప్రాంతీయంగా వేరు వేరు యాసలు ఉన్నాయి. ఈ యాసలే ఒకవిధమైన మాండలికాలు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రూపొందిన ప్రమాణ భాష ఒక వైపు, ప్రాంతీయ యాసలు మరో వైపు సమాజాలలో కొనసాగుతూ వస్తున్నాయి. యాసలు ప్రామాణిక భాషను ప్రభావితం చేస్తూ కొనసాగే భాషా వైవిధ్య రూపాలు. సమాజంలోని, సంస్కృతిలోని నమ్మకాలు, భావాలు మొదలైనవి యాసలకు ప్రేరణ కలిగిస్తాయి.

యాస మాండలిక అస్తిత్వంపై ఆధారపడి ప్రాధాన్యాన్ని సంతరించు కొన్న స్థానిక భాష. ఉచ్చారణపరంగా, పదజాలంపరంగా, వ్యాకరణపరంగా ప్రత్యేకంగా మాండలికానికి, ప్రామాణికానికి భిన్నంగా ఉంటుంది. దీనిలోని పదాలు ప్రత్యేకమైనవి. ఇది వ్యక్తిగత వైవిధ్యానికి సంబంధించింది. స్పష్టమైన నైఘంటిక అర్థాలు, పారిభాషిక పదాలు ఉండవు. యాసను ఉపయోగించడంలో సృజనాత్మకత ఎక్కువగా ఉంటుంది.

యాసకు ప్రత్యేకమైన, స్పష్టమైన, సమగ్రమైన నిర్వచనం లేదు. ఇది భాషా సంస్కృతులలో నిరంతరం మారుతూ ఉండే ఒక భాషాదృగ్విషయంగా భాషాశాస్త్రజ్ఞులు అంగీకరిస్తున్నారు. ఇది ఒక వ్యక్తిని లేదా కొందరు వ్యక్తుల సమూహాన్ని గుర్తించే విధంగా ఉంటుంది. దీనిని అధికారిక ప్రసంగాలలో గాని, ప్రభుత్వ ఉత్తర్వులలోగాని, పాఠ్యాంశాలలోగాని ఉపయోగించరు. అలా వీటిలో ఉపయోగిస్తే వాటి స్థాయి, విలువ తగ్గించి నట్లువుతుందనేది ఒక అభిప్రాయం. ఇది సాధారణంగా ఇద్దరు సుపరిచితుల మధ్య, ఒకే ప్రాంతం, ఒకే సమాజం, ఒకే జాతికి చెందిన వాళ్ళలో ప్రధానంగా కనిపిస్తుంది. బాధ్యతాయుతమైన సమాజంలో సామాజికంగా ఉన్నత స్థాయి ఉన్న వర్గంలో, ఉపన్యాసాలలో దీనిని నిషిద్ధంగా భావిస్తారు. కొన్ని సందర్భాలలో సంప్రదాయంగా అసౌకర్యం, అస్పష్టత కలిగించే పదాల స్పష్టతకోసం పర్యాయంగా కూడా వాడతారు. ఇది పరిమితమైన భాష. యాసలో ఉపయోగించే పదాలకు లేదా ఉచ్చారణకు సృజనాత్మక లక్షణాలు ఉండడంవల్ల సృష్టించిన ఆ వ్యక్తి ఉన్న సమాజం ఆకర్షింపబడుతుంది. అయితే ఇది ఏ సందర్భంలో, ఏ అభిరుచులతో, ఏ ఉద్దేశాలతో ఉపయోగిస్తారో చెప్పడం అసాధ్యమని భాషాశాస్త్రజ్ఞులు అంటారు.

ఇటీవలి కాలంలో యాసలోని పదాలను సేకరించి యాస వెనక ఉన్న ప్రేరక శక్తులను, ఉల్లాసభరితమైన శక్తిని, సృజనాత్మక శక్తిని పరిశోధిస్తున్నారు. ఏ సందర్భాలలో ఇది ఆమోదయోగ్యమో, ఏ సందర్భాలలో ఇది ఆమోదయోగ్యం కాదో కూడా పరిశీలిస్తున్నారు. కొన్ని సందర్భాలలో యాస ప్రాధాన్యాన్ని కూడా సంతరించుకొంటున్నది. నిఘంటువులకు ఎక్కడం, సాహిత్యంలో చోటు చేసుకోవడం, మీడియా అంగీకరించడం వంటి సామాజిక అంశాలలో తన అస్తిత్వాన్ని నిలుపుకొంటూ తన స్థాయిని పెంచుకొనే ప్రయత్నం చేస్తున్నది. భాషకు మారే స్వభావం ఉంది కాబట్టి ఇటీవలి కాలంలో యాస పదాలు విలువైన పరిభాషగా నిలుస్తుందని, భాషలోని వైవిధ్యాన్ని అధ్యయనం చేయడానికి యాస ముఖ్యమైన అంశంగా మారబోతున్నదని భాషావేత్తలు భావిస్తున్నారు.

చిన్న పిల్లలు ముద్దు ముద్దుగా మాటలు నేర్చుకొని మాట్లాడేటప్పుడు లేదా వాళ్ళతో పెద్దలు మాట్లాడేటప్పుడు సృజనాత్మకత తెలుస్తుంది. పిల్లలకు అర్థమయ్యే విధంగా అత్యంత సరళీకరణం చేసి స్పష్టమైన అర్థంలేని కొన్ని శబ్దాలకు ప్రత్యేకార్థాలను సృష్టించి నేర్పడం జరుగుతుంది. ఈ మాటలకు ఇతరత్ర ప్రయోగం ఉండదు. తెలంగాణలో సుప్రసిద్ధులైన ఆచార్యులు శ్రీమతి పాకాల యశోదారెడ్డిగారి యాస తెలంగాణ ప్రముఖులకు సుపరిచితమే. ఆయా సందర్భాలలో వారు ప్రసంగించిన ప్రసంగాలను ప్రచురించిన గ్రంథాలలోవారి యాస పదాలు కొన్ని ఉదాహరణగా ప్రస్తుతించవచ్చు. గుసగుసలుపోవు, మాసర, మిద్కు, త్యాప, బిర్రు, జిగి, న్యాల, కూతలు, నిల్కడకువచ్చు (నిర్ణయానికి వచ్చు), యాదన్న (ఏదైనా), యాదానికి, లెక్క, సడాకు, తెత్తాన్న, పోతాన్న, గాడు, గీడు, పెద్దిర్కం, తెలంగాణపోండ్లు, నీల్గు, అంగిరీజోల్లు, నకురాలు మొదలైనవి. అట్లే అందరికి సుపరిచితమైన రాష్ట్ర ముఖ్యమంత్రి కె.సి.ఆర్. ఉపన్యాసాలపై చేసిన పరిశోధనలో సూచించిన కొన్ని యాస మాటలు: వచ్చుడో సచ్చుడో, సద్దకట్టు, జబర్దస్తీ, చెప్రాసీ, ధమాక్, జేజమ్మ, దందా, టక్కుటమారు విద్యలు, జిజ్జు, మిడిసిపడు, ఎలగబెట్టు, తాట, బడాయి, ఉల్టాపల్టా, పొట్టుపొట్టు, మస్తు, పిట్టబెదిరింపులు మొదలైనవి. అట్లే యాసలో పలువురు ప్రయోగిస్తున్న మరికొన్ని పదాలు: మోపు, రంది, గాయ్, గోస, సైసు, పరాష్కం, రుబాబు, పైలం, ఏతులు, తున్కలు, సోది, ఫుకట్, దూప, రికాబు, బర్కత్, శరం, సుత, ఒర్రె, ఇల్లెటం, బొజరు ( బావిలోనుంచి నీళ్ళు తోడేటప్పుడు నీళ్ళు పడే ప్రదేశం), పాసుట్టు, లెంకులాడు, ఇకిలించు, కుతికెవడు, దొర్కవట్టు, అగో, ఇగో ...వంటివి తెలంగాణ మొత్తానికి యాస ఎలా ఉంటుందో అద్దంలో ప్రతిబింబించే విధంగా నిర్వచనంగా ఉండే మాటలు. వినోదాత్మకంగా ప్రసారం చేసే టీ.వీ. ఛానళ్ళలోని వార్తలలో కూడా తెలంగాణ యాస అందరినీ ఆకర్షిస్తున్నది. ఒక సమూహంలో విశిష్ట సంస్కృతులను అనుసరించే విధంగా పరిభాషలో యాస సంస్కృతి బాగా వ్యాప్తి చెందుతున్నది.

## 11. యాస - గుప్త ప్రతిష్ఠ

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరవాత రాజకీయ కారణాలవల్ల తెలంగాణ మాండలికానికి లేదా యాసకు ప్రతిష్ఠ పెరుగుతున్నది.

ఇది తెలంగాణలో రహస్యంగా పెరిగిన ప్రతిష్ఠ. ఇప్పటివరకు గౌరవం ఉన్న భాష ప్రామాణిక భాష. అదే ప్రతిష్ఠాత్మకమైంది. అధికారులు, విద్యావేత్తలు ప్రోత్సహిస్తున్న భాష. ఇది ఒక భాషా భావన. ఈ భావన ఒక సందర్భంలో ఒక రకంగా మరో సందర్భంలో మరో రకంగా ఉంటుందనేది భాషాశాస్త్రజ్ఞులు చెప్పే సత్యమే. భాషా గౌరవం అనేది సందర్భోచిత అంశాల ప్రకారం స్థానికమైంది. స్థానిక అంశాలపై అంటే మాట్లాడే వ్యక్తి మనవాడు, మంచి సంస్కృతి ఉన్నవాడు, విద్యావంతుడు, సామాజిక సేవాపరాయణుడు, అన్నింటికి మించి నీతిమంతుడు, సమాజాన్ని ముందుకు నడిపించేవాడు వంటి అంశాలపై ఆధారపడిన వ్యక్తి, లేదా సమాజం మాట్లాడే భాషకు ఒక గౌరవం ఉంటుంది. ఆ గౌరవం రహస్యంగా దాగి ఉంటుంది. దీనినే గుప్త ప్రతిష్ఠ లేదా అంతర్గత ప్రతిష్ఠ అంటారు. సామాజిక భాషాశాస్త్రంలో ప్రతిపాదించిన ఒక భాషా భావన ఇది. ఇది అప్రామాణికం లేదా తక్కువ గౌరవం ఉన్న భాష అని అన్నప్పటికీ సమాజంలోని కొన్ని సాంస్కృతిక విలువలను, పరస్పర సంబంధాలను ప్రతిబింబిస్తుంది. వాటికి గౌరవం కలిగించాలనేది అందరూ తమలోతాము గుప్తంగా భావిస్తారు. ఈ విషయంలో పురుషులు ఎక్కువ ఉత్సాహం చూపుతారని, ఆ గౌరవాన్ని సాధిస్తూ వర్గసమైక్యతకు పాటుపడతారని  కొందరు భాషావేత్తలు భావిస్తారు.

భాషావైవిధ్యానికి ఉండే ఈ గుప్త ప్రతిష్ఠ సమాజంలోని శ్రామిక వర్గంవారిలో ప్రధానంగా కనిపిస్తుంది. వీరు మాట్లాడే భాష లేదా యాస తక్కువ గౌరవం, అప్రామాణికం అని తెలిసినప్పటికీ సమాజంలో అంతర్గత గుర్తింపుకోసం సృష్టిస్తారు. ఈ గుర్తింపు వారి నిజాయితీ, సహృదయత, కార్యదీక్షత, అంతర్గత సంస్కృతికి, వారి అనుబంధానికి గుర్తింపుగా వస్తుందని భావిస్తారు. తద్వారానే భాషలో వైవిధ్యం లేదా ఒక ప్రత్యేకత ఏర్పడుతుంది.

ఈ ప్రతిష్ఠ సంస్థాగతంగా పొందకపోవచ్చు. ఆధికారికంగా ప్రభుత్వ పరంగా పొందకపోవచ్చు. ఇది సామాజికంగా పొందే గౌరవ ప్రతిష్ఠ. కొన్ని వార్తా పత్రికల్లో ఇది కనిపించకపోవచ్చు. అయితే ఇటీవల కొన్ని సమాచార మాధ్యమాలు ఈ ఆధునిక గౌరవ ప్రతిష్ఠను సమర్థిస్తున్నాయి. ఇది తెలంగాణ ప్రాంతీయత లేదా స్థానికత గొప్పతనానికి సంకేతం. తెలంగాణ ప్రాంతీయ భాష ఈ ప్రతిష్ఠకు ప్రాణం పోస్తున్నది. ముఖ్యంగా తెలంగాణ భాషకు అంతర్గత ప్రతిష్ఠ రావడానికి కారణం కొంతమంది ప్రముఖుల ఉపన్యాసాలు, సంభాషణలు, వాద వివాదాలు, కథాకథనాలు, జాతీయాలు, నుడికారాలు, సామెతలు మొదలైనవి. వారిలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కె.సి.ఆర్.ను ప్రధానంగా చెప్పుకోవచ్చు. ఆ తరవాత చెప్పుకోవలసినవారిలో తెలంగాణ భాషపై అమితమైన ప్రేమాభిమానాలు ఉన్న ప్రముఖ ఉపన్యాసకులు, మాండలిక సాహిత్య సృష్టికర్తలు, కవులు, కళాకారులు, గాయకులు, నటులు మొదలైనవారు. అట్లే తెలంగాణ ప్రజల ఆదరాభిమానాలు చూరగొంటూ వినోదాత్మకమైన వార్తా సమాచారాలను, వినోద విజ్ఞాన కార్యక్రమాలను ప్రసారంచేస్తున్న టి.వి. ఛానళ్ళు, వీటిని ఆదరించి ఆహ్వానించే  తెలంగాణ ప్రజలు అందుకు కారణం.

ఇదంతా తెలంగాణలోని గొప్ప వారసత్వ సంపదే అయినా ఇప్పటివరకు ప్రామాణికం లేదా ఉన్నత వర్గంవారి భాష అనే ముసుగులో ఎవ్వరూ ఈ దృక్కోణంతో పరిశీలించడానికి వీలుకలగలేదు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరవాతే ఈ విషయంపై స్పృహ కలిగింది. తెలంగాణ ఉద్యమస్ఫూర్తితో వెలువడిన పాటల, ఉపన్యాసాల వెనక ఉన్న తెలంగాణ భాషాతత్వం ఉద్యమాన్నే కాకుండా భాషపై పునరాలోచనకు ప్రేరణ కల్పించింది. పాటలు, ప్రదర్శనలు, ఉపన్యాసాలు తెలంగాణ అంతర్గత ప్రతిష్ఠకు ప్రతిబింబంగా నిలిచాయి. ఈ ప్రతిష్ఠకోసమే తెలంగాణలో ప్రజాసాహిత్యం విస్తృతంగా సృష్టించడం జరుగుతున్నది.

ఇలా ప్రతిష్ఠాత్మకమైన ఈ స్థానిక భాష తదనంతర కాలంలో ప్రధానభాషగా లేదా అనంతర ఆధునిక ప్రామాణికభాషగా రూపొందడం సహజ పరిణామం. వ్యాకరణాలు రూపొందడం, ధ్వనిశాస్త్రం పెంపొందడం, పదసృష్టి జరగడం, నిఘంటువులు వెలువడడం వంటివి అందుకు తోడ్పడతాయి. భాషాశాస్త్రజ్ఞులు చెప్పే మరో విశేషమేమంటే తెలంగాణలో ప్రతిష్ఠాత్మకంగా రూపొందనున్న ఈ స్థానిక ప్రామాణికం, కోస్తాలోనిస్థానిక ప్రామాణికం, రాయలసీమలోని స్థానిక ప్రామాణికం ఈ మూడింటి సంపర్కంవల్ల కూడా భాషాభివృద్ధి జరుగుతుంది అని. అలా అభివృద్ధి పొందిన భాషపై భాషాశాస్త్రీయ పరిశోధనలు కూడా విస్తృతమవుతాయి. ఇలాంటి దశలోనే ప్రస్తుతం తెలంగాణ భాష-యాస ముందుకు సాగుతున్నది. ఒకప్పుడు లేదన్న గౌరవం ఇప్పుడు అందరూ ఉందంటున్నారు. ఈ అంతర్గత ప్రతిష్ఠతో కూడిన పాటలు, మాటలు, ఉపన్యాసాలు మొదలైనటువంటి వాటిలోని భాషనే తెలుగు రాష్ట్రాలలోని రాజకీయ నాయకులు, గాయకులు, కళాకారులు, తదితరులు అనుసరిస్తున్నారు. గుప్త ప్రతిష్ఠకు అంత శక్తి ఉందని ఇప్పుడిప్పుడే తెలుస్తున్నది. ఇది ఒక తెలంగాణ మాండలిక ప్రాంతంలోనే కాక తెలుగులోని అన్ని మాండలిక ప్రాంతాలకు సంబంధించి ప్రాచుర్యం పొందుతున్న పరిశోధనాంశం.

---

రచయిత  డా. అప్పం పాండయ్య
తెలుగు అకాడమీ, హైదరాబాదు, పూర్వ ఉపసంచాలకులు

**దేశభక్తి అంటే మా దృష్టిలో భాషమీద అభిమానమే. మాట్లాడుతున్న భాషను కాదని, మృతభాషను పూజించడం ఎలాంటిదంటే, ఆకలితో మాడిచస్తున్న సాటిమనిషికి అన్నం పెట్టకుండా, చనిపోయిన వారిపేరుతో శ్రాద్ధ భోజనాలు పెట్టడం లాంటిది.**

**- గిడుగు వెంకట రామమూర్తి**

**"సమాజ సంస్కరణకు పూనుకొని జనసామాన్యంలో అధునిక భావదీప్తికి కందుకూరి  తన జీవితాన్ని అంకితం చేశారు. గురజాడ మేథోపరమైన కృషిని సాహిత్యపరంగా, చారిత్రకంగా కొనసాగించాడు. గిడుగు భాషాశాస్త్ర, నృశాస్త్రాలలోతమ మేథను పండించుకున్నాడు.   -యు.వి.నరసింహమూర్తి"**

పరిశోధన పత్రం

భమిడిపాటి గౌరీశంకర్
9492858395

# సంఘసంస్కరణ దిశగా సాగిన కన్నడ వచన సాహిత్యం

*ఏ భాషా సాహిత్యమైన ఆ భాష సొగసును, సమాజం పరమైన కష్టసుఖాలను, సమస్యలను ఎత్తి చూపించేదిగా ఉండాలి. అటువంటి మార్గంలో రచింపబడిన ఏ సాహితీ ప్రక్రియ అయినా ఉత్తమమైనదే....* **– ప్రేమ్ చంద్**

ఆనాటి ఏ భాషా సాహిత్యాన్ని మనం పరికించినా సమాజ సమస్యలకు దర్పణంగానే ఉండేది. కేవలం సమాజపరమైన సమస్యలను మాత్రమే ఎత్తి చూపకుండా వాటికి పరిష్కారాలు సైతం సూచించేది. సంఘసంస్కరణ ధ్యేయంగా సాగిన కన్నడ వచన సాహిత్యపు రీతిని గమనించవలసిన అవసరం నేడుంది.

తెలుగు సాహిత్యం మాదిరిగానే కన్నడ సాహిత్యంలో సహితం ప్రారంభంలో (కావ్య) 'పద్య' రచనలే అధికంగా ఉండేవి. సింగన జోస్యులు, పద్మ సిన్న, జిన వల్లభుడు, పంపన, రేచన వంటి వారు కన్నడంలో గొప్ప రచనలు చేసి కన్నడ సాహిత్యంను పరిపుష్టం చేశారు. అయితే వీరి రచనలను గమనిస్తే మనకు ఓ విషయం అర్థమవుతుంది. అదేమిటంటే కన్నడ కవులు కేవలం 'ప్రాసను' మాత్రమే పాటించి 'యతిని' విడిచిపెట్టారని. కన్నడంలో 'యతి'కి పట్టింపు లేదని రేచన చక్కని ఉదాహరణలు చెప్పారు. పాలుకురికి సోమనాథుడు సహితం కన్నడలో పెక్కు రచనలు చేశాడు. వాటిలో ముఖ్యమైనవి సద్గురు రగడ, చెన్న బసవ రగడ, శరణు బసవ రగడ, అక్షరాంక పద్యములు.

కాలక్రమంలో కన్నడ సాహిత్యంలో సామాజిక విప్లవం వచ్చింది. (దీనికి మూలం వీరశైవులుగా పేర్కొంటారు.) తెలుగు సాహిత్యంలో కందుకూరి, గురజాడ, చిలకమర్తి వంటి వారి రచనలు ఎలా ఖ్యాతి పొందాయో అదేవిధంగా కన్నడ సాహిత్యంలో సహితం విప్లవ పంథాలో వచ్చిన "వచనం" పండిత పామరుల నాలుకలపై నాట్యం చేశాయి. చేస్తున్నాయి. వచన కవిత్వంకు పూర్వం కన్నడలో శాస్త్రీయ పద్ధతి (సంప్రదాయ పద్ధతి అంటారు దీనిని)లో సాగిన కావ్య రచన. ఇది ఆరంభమైన తర్వాత ఈ దిశగానే సాగింది. దీనినే 'దేశి' సర్వతని అంటారు. తర్వాత కాలంలో ఒక కుదుపు కుదిపి శాశ్వతంగా సాహిత్యంలో స్థిరపడిపోయింది.

అయితే క్రీస్తు శకం 815–877 మధ్య కాలంలోనే కవిరాజు మార్గంలోనే 'గద్యం' కావ్య లక్షణంగా చెప్పబడింది. (కొందరు సాహితీకారులు గద్యం వచనం కు తేడా లేదన్నారు) ఈ లక్షణంలోనే మన సంస్కృత గద్య కావ్యాల విషయం చెప్పారు. "పద పాద నియత నియమాస్పద మల్ల దళంకృతం, క్రియా కారకళ్ దోళ్ పుధిధర్భ వ్యక్తీయనేపుదు "గద్య"మనేక రూప భేద విభక్తం" దాని ప్రభావమే తర్వాతి పదాల పై ఉందని సాహితీకారుల అభిప్రాయం.

ఈ విధంగా ఆవిర్భమైన వచనం వైపుకు 'భక్తి కవిత్వం' కూడా ఆకర్షించబడిందనే చెప్పాలి. వచనంకు మూలమైన శైవం 10వ శతాబ్దం నాటికి సంపూర్ణంగా ఆవిష్కరించబడింది. (వీరశైవ మతం హిందూ మతానికి శాఖగా గుర్తించాలి.) వీరశైవం ఆనాడు సంఘ పరంగా పేర్కొని పోయిన మత మౌఢ్యం, వర్ణ, వర్గ వ్యవస్థను తీవ్రంగా గర్హించింది. బలీయమైన దేవాలయాలలో కేంద్రీకృతమైన జమీందారీ వ్యవస్థ వైభోగాలకు పరాకాష్టగా నాటి సమాజంలో ప్రతిష్టించబడిరది. ఆకలి కేకలు, దరిద్రుల దీనారావాలు వారి చెవికెక్కేవి కావు. ఇటువంటి సమయంలోనే ఒక విశిష్ట ప్రక్రియగా వచనం ఎంచుకున్నారు వచనకారులు. బసవణ్ణ బలహీనుల కోసం పోరాటం చేశారు. వర్ణ వ్యవస్థను నిరసించారు. వర్గ (వర్ణ) విభజనను ఎదిరించారు. 'ఊళ్ళ వరు శివాలయన కట్టునరు' (ఉన్నవాడే నాకు దేవాలయం కట్టగలడు) అంటూ "నా వంటి నిరుపేద ఏమి చేయగలడు?" అని ప్రశ్నిస్తాడు. కనుక దేహమే దేవాలయం అని, ఆత్మ దేవుడని, మానవునికి సేవ చేస్తే అది శివుడికి చేసిన సేవ అవుతుందని ఎలుగెత్తి చాటాడు. అంతేకాక అద్భుతమైన అద్వైతను బోధించాడు. (తన "వచనాలు" ద్వారా) ఇందుకు ఉదాహరణ ఈ క్రింది భాగాలు:–

"నీవు నా హృదిని ఆవరించావు / జగతిని మించిన వాడవు నీవైతే / నిన్ను మించిన వాడను నేను/ అద్దంలో కొంచమైన కొండలా/
'నాలో దాగి, చిక్కి ఉన్నావు నీవు తండ్రి"

అని అంటాడు బసవణ్ణ. సరళమైన, మృదువైన భాషలో రచనలు సాగించి, సంఘాన్ని సంస్కరించి తన రచనలలో కొత్త రకాన్ని సృజించిన యుగకర్త బసవణ్ణ.

ఈ విధమైన పద్ధతిలోనే రచనలు చేసి సమాజ సమస్యలను సృజించిన వారిలో అభుదేవా, చిన్న బసవణ్ణ, అక్కమహాదేవి, హరిహర, శివయోగి, సిద్ధ రామ, అల్లమ ప్రభు వంటి వారు ముఖ్యులు.

భక్తి – ముక్తి గురించి సిద్ధి రామ **"అత్యాసెనెంబు దొహిన, చేరే పాప వింబుదిల్ల, కండయ్యి పరిణామ వెంబుది పరమానంద చేరే పరలోక విల్లకందిరే అయ్యి ఇహ పరదాసే ఇల్లుదుదే శివయోగి"** ఇలా ఆశ మంచిది కాదని సమస్త అనర్థాలకు మూలం 'ఆశ'యని దానిని విడనాడితేనే నిజమైన ముక్తి కలుగుతుందని నిస్వార్థంతో కూడుకున్న భక్తియే ముక్తి సోపాన పదమని వివరిస్తారు. అక్కమదేవి మహా భక్తురాలు. ఈమె ఆరాధ్య దైవం శివుడు. కనుకనే తమ వచనాలకు అంకితనామంగా 'చెన్నమల్లికార్జున' అనే మకుటం ఉంచింది. ఈమె చరిత్ర ఒక ఇతిహాసం. దాసిమయ్య అనే వచనకారుడు పర స్త్రీ వ్యామోహం గురించి తెలియజేస్తూ – **"గుండా సుళ్ళమ్మక గౌరీ ఎందుకండదీ, భూమండలక్కి అరసాహి ఘటువ్వనాతను...."** అని అంటాడు. హింసను (ముఖ్యంగా జంతుబలులను) గురించి".... ప్రాణి గలనట్టి కొందరె, ప్రతిష్టి సిద్దేశ్వర ఇక దీర్పనే నకరదరి?" (ప్రాణులను వెంటాడి చంపితే–వాటిని ప్రతిష్టించిన ఈశ్వరుడు నరకంలో పడవేయడా?")

కన్నడ సాహిత్యంలో ఒక విశిష్ట కవి మనకు దర్శనమిస్తాడు. (ముఖ్యంగా 'వచన' ప్రక్రియను జనబాహుళ్యంలోనికి ఇతని వలె మరెవ్వరూ తీసుకురాలేకపోయారు) అతడే సర్వజ్ఞ కవి. ఇతను 'వచన'

సాహిత్యమునకు మకుటం లేని మహారాజు. ఇతనికి మన వేమనకు సామీప్యం ఉంది. (సుమారు 400 సంవత్సరాల క్రితం ఇతడి జీవించి ఉండవచ్చునని ఒక అభిప్రాయం) సర్వజ్ఞ కవి యొక్క జీవిత చరిత్ర ఎవరికీ తెలియదనే చెప్పాలి. (నేను గమనించిన మేరకు ఇతని జీవిత చరిత్ర ఏ పుస్తకంలోనూ చూడలేదు. ఈ విధంగా ఇతని 'ప్రసక్తి' (ప్రశస్తి గ్రంథస్తం చేయ చూడలేదు) వెనుక పద్యాలు మాదిరిగానే ఇతని వచన రచనలు పండిత పామరులను ఆలరించాయి నాలుక పై నేటికీ నాట్యం చేస్తున్నాయి. మనుజులలో గల కులమతాలను ఇతను తీవ్రంగా విమర్శించారు"...... **"నడెవుదొందెభూమి, కుడివు దొందెనీరు, మడవగ్ని యెందె ఇరుతెరలు – కులగోత్రనడువె ఎత్తగదు సర్వజ్ఞ"** ( ఒకే భూమిపై నడుస్తాం, అందరినీ ఒకే అగ్ని కాల్చుతుంది. ఒకే నీటిని తాగుతాం. అటువంటిది మధ్యలో కుల మత గోత్రాలు ఎక్కడివి?") అంటాడు. తెలుగు సాహిత్యంలో కూడా కులాలపై ధ్వజమెత్తిన వారు అనేకమంది ఉన్నారు. సిద్దయ్య..... " ఏ కులమని నన్ను వివరమడిగితే ఏమని దెల్పుదు, లోకులకూ పలు గాకులకు దుర్మార్గులకు నిరుష్టులకు..." అని నిరసించారు. మానవులలో పేరుకుపోయిన కులమౌఢ్యమును హేళన చేస్తూ వేమన **"కూడదేలి జేసే కులమేమి చేసెను భూమి యేమి జేసె బొంది కట్టి – నరుడు బడేదు పాట్లు నగుబొట్లు చూడగా"** అని విమర్శించాడు. కవికోకిల దువ్వూరి రామిరెడ్డి, గుర్రం జాషువా వంటి వారు అనేకమంది కులంను వెలివేశారు. తమ రచనల ద్వారా అందుకే తెలుగు, కన్నడ సాహిత్యాలకు సామీప్యం ఉందని సాహితీకారులు అభిప్రాయపడుతుంటారు.

ఈ విధంగా కన్నడలో వచ్చిన సాహిత్యమును పరికిస్తే సాంఘిక సంస్కరణ ధ్యేయంగా వచనకారులు రచనలు చేశారని అనిపిస్తుంది. గమనించదగ్గ విషయం ఏమిటంటే వచన రచనలన్నీ కూడా శివభక్తిని ఎలుగెత్తి చాటేవిగా ఉంటాయి.

"ప్రాచీన కన్నడ సాహిత్యం చంపూశైలి (మన ప్రబంధాలను పోలినది)లో ఉంటూ ప్రబంధాలకు తప్పనిసరిగా ఉండాల్సిన లక్షణాలను కలిగి ఉన్నది. ఇవి ఇతరుల కోసం రచింపబడ్డాయి. కానీ వచనాలు ఆత్మ పరిశోధనం కోసం రచింపబడ్డాయి. వీటిలో అంతర గర్భితంగా ఛందో సంప్రదాయం ఉంది. సంస్కృతమునకు దూరంగా ఉంటూ అచ్చు కన్నడాన్ని ప్రోత్సహించాయి. ప్రజల వ్యవహారిక భాషను సాహిత్యంగా మలిచాయి. వచనాలలో 'నీతి', 'శీలం' లను చక్కగా చెప్పగలిగారు వచనకారులు. సౌశీల్యత కన్నడ ప్రజలలో ఇంకా మిగిలి వారి సంస్కృతిలో సమ్మిళితమై ఉందంటే అది వచనకారుల ప్రభావమే. వీటిని 'కన్నడ' ఉపనిషత్తులుగా పేర్కొనవచ్చు. వాటితో ఆత్మ శోధన పరాకాష్టకు చేరుకోవచ్చు. అష్టాదశ వర్ణనలు లేకపోవచ్చు కానీ ఉపమానాది అలంకారాలు, కవి సమయాలు, నవరసాలు, భావ గర్భితమై ఉంటూ వాటికి కావ్యత్వాన్ని చేకూర్చాయి అని అంటారు ఏఎస్ జయచంద్ర గారు ఒకానొక వ్యాసంలో..

చివరిగా–/తెలుగులో వలెనే కన్నడ సాహిత్యంలో కూడా సంఘసంస్కరణ అభిలాష తోనే ఒక విశిష్ట ప్రక్రియగా వచనం ఎంచుకొని ఆ దిశగానే సాగిపోయారు వచనకారులు.

---

రచయిత–గాయత్రి కాలేజ్ ఆఫ్ సైన్స్ అండ్ మేనేజ్‌మెంట్ (శ్రీకాకుళం)లో తెలుగు శాఖాధిపతి

## పుస్తక పరిచయం

# బడి బువ్వ, మరికొన్ని పిల్లల కతలు



**'బడిబువ్వ', మరికొన్ని కతలు**
రచన:గరిపెల్లి అశోక్
వెల:రూ. 80/-
ప్రతులకు:
గరిపెల్లి సరోజన
404, వి.ఎల్.ఆర్.రెసిడెన్సీ
సిద్ధార్థ స్కూల్ ప్రక్కన
శ్రీనివాసా నగర్
సిద్దిపేట – 502 103
ఫోన్: 98496 49101

బడిబువ్వ కతలు పెద్దమనసున్న ఒక అమ్మాయి కథలు. ఇవి కతలా, సంఘటనలా, అనుభవాల, ముచ్చట్లా, జ్ఞాపకాలా ఎవరు ఎలా భావించినా పర్వాలేదు కానీ, నా దృష్టిలో ఇవి పెద్దక్క కతలు.

మధురమైన బాల్యం మహోన్నతమైంది కొందరికి. చేదు జ్ఞాపకాల దొంతరలు మరి కొందరికి. పూట గడవని స్థితి, జానెడు పొట్ట నింపుకోవడానికి కన్న ఊరు వాడ వదిలేసి మరో ఊరిలో నివాసం బతుకు తెరువు కోసం. కొడుకుల కంటే కూతురే మిన్న అని భావించిన పెద్దక్క తల్లిదండ్రులు. మొదట్లో పెద్దక్కంటే ఒక విధమైన మామూలు ఏహ్యభావన. తరువాత పెద్దక్కలాంటి కూతురుంటేనే బాగుంటుందని ఆలోచన చదివే బడిలో పిల్లలనుంచి పెద్దసారు దాకా. ఈమెకు పెట్టిన పేరు పద్మావతి. ముద్దుగా పిలిచే పేరు పద్దు. పద్ది. హాజరు రిజిష్టర్‌లో పద్మావతే. ఆట పాటల్లోనూ, చదువు సంధ్యల్లోనూ, వినయ విధేయతల్లోనూ, పద్దుకు మరెవ్వరూ సాటిలేరు. బడి పిల్లగాడి సందేహం తీర్చాలన్నా, సార్లకు రికార్డులు తీసి ఇవ్వాలన్నా పెద్దక్క, పెద్దక్క విద్యార్థే కాదు. అప్పటిడప్పుడు టీచరైతది. అప్పుడప్పుడు వంటలక్కైతది, అప్పుడప్పుడు నర్సైతది, పర్యావరణవేత్తైతది. అంతేగాక మరెన్నో, ఇంటా బయట తోడునీడైతది అందరికీ. తనకు పరాయి వారెవరూ లేరు. అందరూ తనవారే. అలాంటి పద్మావతి కతలు ఇవి. ఎంకటి గురించి రాసినట్లు మీ బడిలో అమ్మాయిలు లేరా, అలాంటి అమ్మాయిల గురించి రాయాల్సిన అవసరముంది అని పదే పదే ప్రోత్సహించిన డా. భూపాల్, చొక్కాపు వెంకటరమణ, పెద్దింటి అశోక్ కుమార్, డా.వి.ఆర్.శర్మ, డా. పత్తిపాక మోహన్, డా. సిరి, పైడిమర్రి గిరిజ, డా. అమరవాది నీరజ గార్లకు కృతజ్ఞతలు చెప్పక తప్పదు.

ఈ కథలన్నీ బడిలో జరిగినవే: వీటికి నేను కల్పన జోడించాను. ఒక్కసారి చదివితే మీ కర్థమైతది. ఇలాంటి సంఘటనలు మా బడిలో కూడా జరిగాయి. ఇంకా జరుగుతున్నాయి అని బడి పరిసరాల్లోకి తప్పకుండా మీ మనసు వెళ్ళిపోతుంది. ఇవి కొన్ని మాత్రమే. మరిన్ని కూడా ఉన్నాయి. ఇవి చదవితే బడి, పిల్లలు, ఉపాధ్యాయులు, పరిసరాలు కన్పడుతాయి. ఒక్కసారి ఈ కథల్ని మనసారా చదివితే గొప్ప అనుభూతి పొందగలరని నాకు ప్రగాఢ విశ్వాసం ఉంది.

పరిశోధన పత్రం

కొత్తిరెడ్డి మల్లారెడ్డి
9154690580

# మైళ్ళ దూరంలో మాతృభాషామాధ్యమబోధన

తెలుగు భాష ద్రావిడభాష నుండి వేరై అనేక మార్పులకు లోనైంది. ఎన్నో ఉద్యమాలు, వాదోపవాదాల తర్వాత నేటి ఆధునిక రూపం సంతరించుకుంది. ఆధునిక తెలుగు భాషాభివృద్ధికి భాషాభిమానులెందరో అవిరళ కృషి సల్పారు. ఆధునిక తెలుగు భాషాభివృద్ధికి తెలుగుభాషా సమితి స్థాపించబడింది. ఇది తెలుగులో విజ్ఞాన సర్వస్వాల కూర్పుతో తెలుగుభాషాభివృద్ధికి తోడ్పడింది. తెలుగు విశ్వవిద్యాలయంలో విజ్ఞాన సర్వస్వాల శాఖ ఏర్పడడంతో ఈ సమితి అందులో అంతర్లీనం చేయబడింది. ఆంగ్ల పరిపాలన కాలంలో విశాఖ, గోదావరి జిల్లాలకు పాఠశాల పరీక్షాధికారిగా వున్న జె.ఎ.యేట్స్ మొదటిసారి తెలుగు బోధనా విధానం పరిశీలించి పాఠ్యపుస్తకాలలో ఉండే తెలుగుకు, బోధించే తెలుగుకు, వ్యవహారంలో ఉన్న తెలుగు మధ్యనున్న భాషాభేదాన్ని గుర్తించి రెనిసెన్స్ అనే వ్యాసంలో సమగ్రంగంగా వివరించారు. దీంతో భాషాబోధనలో గ్రాంథిక, వ్యవహారిక భాషా వివాదాలు మొదలయ్యాయి. ఈ వివాదాన్ని పరిష్కరించేందుకు అప్పటి మద్రాసు విశ్వవిద్యాలయం 8 సెప్టెంబర్ 1911లో ఒక సంఘాన్ని నియమించింది. ఇందులో గ్రాంథికభాషావాదులైన వేదం వెంకటరాయ శాస్త్రి, జయంతి రామయ్య పంతులు, కె.వి.లక్ష్మణరావు, జి.వెంకటరంగయ్య వ్యవహారిక భాషావాదులైన గిడుగు రామ్మూర్తి పంతులు, గురజాడ అప్పారావు, పి.టి. శ్రీనివాస అయ్యంగారు, బుర్రా శేషగిరిరావు తటస్థులైన ఆచార్య రంగాచారి, థామ్సన్ మొదలైనవారు సభ్యులు. ఈ సంఘం శిష్టవ్యావహారికంవైపు మొగ్గు చూపడంతో విద్యార్థులు గ్రాంథిక, వ్యవహారిక భాషల్లో దేన్నైనా ఎంచుకొనే అవకాశం కలిగింది.

ఈ విషయాన్ని జీర్ణించుకోలేని గ్రాంథికవాదులు ఆంధ్రసాహిత్య పరిషత్తును స్థాపించి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చారు. దీన్ని పరిష్కరించేందుకు ప్రభుత్వం మరొక ఉపసంఘాన్ని నియమించింది. ఇందులో వేదం వెంకటరాయశాస్త్రి, కొమర్రాజు లక్ష్మణరావు, గురజాడ అప్పారావు సభ్యులు. ఈ సంఘంలో రాయలసీమ నుండి కోలాచలం శ్రీనివాసరావు, బారిస్టర్ కె.సుబ్బారెడ్డి, నాగపూడి కుప్పుస్వామయ్య, టి.శంకరలింగం పిళ్ళే సభ్యులుగా వున్నారు. ఇందులో ఎక్కువమంది గ్రాంథిక భాషా వాదులు కావడం వల్ల కమిటీ తీర్మానం గ్రాంథిక భాషకు అనుకూలంగా రావడంతో అసంతృప్తి చెందిన గురజాడ తన నిరసన ప్రకటిస్తూ డిసెంట్ పత్రాన్ని ప్రకటించాడు. గిడుగు రామ్మూర్తి పంతులు ఎ మెమొరాండం ఆన్ మోడరన్ తెలుగును, జయంతి రామయ్య పంతులు ఎ డిఫెన్స్ ఆఫ్ లిటరరి తెలుగు ప్రచురించారు. 1936లో నవ్య సాహిత్య పరిషత్ స్థాపించబడి అద్ర పతిభ పత్రికను వెలువరించి సృజనాత్మక సాహిత్య సృష్టికి కావల్సిన ఆధునిక వ్యవహారిక భాషను ప్రోత్సహించింది. 1937 లో వెలువడిన జనవాణిలో ఎడిటర్ తాపీ ధర్మారావు ఆధునిక ప్రామాణిక తెలుగు భాషను ప్రయోగించారు. పాఠ్యపుస్తకాలలో ఉండవలసిన భాష శైలిని నిర్ణయించేందుకు 1965లో తిరుపతిలో పండితగోష్ఠి జరిగింది. పి.ఎస్.ఆర్.అప్పారావు అధ్యక్షతన పాఠ్యపుస్తక జాతీయీకరణ సంఘం ఏర్పడింది. ఈ కమిటీ తెలుగు పాఠ్యపుస్తకాలను మాతృభాషగా తెలుగు నేర్చుకొనే వారి పుస్తకాలు, ద్వితీయ భాషగా తెలుగు నేర్చుకొనే వారి పుస్తకాలని రెండుగా విభజించింది. ఈ కమిటీ మొదటి రకం పుస్తకాలలో సరళ గ్రాంథికం, రెండవ రకం పుస్తకాలలో శిష్టవ్యవహారికం ఉండాలని తీర్మానించింది.

1966 మే14 న తెలుగును అధికారభాషగా గుర్తిస్తూ అప్పటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అధికార భాషాచట్టం రూపొందించింది. ఈ శాసనానుసారం వావిలాల గోపాలకృష్ణయ్య గారి అధ్యక్షతన అధికార భాషాసంఘం ఏర్పడింది. ప్రభుత్వరంగ కార్యక్రమాల్లో తెలుగుభాష అమలు, తెలుగు బోధనాభాషగా అభివృద్ధి చేసి అమలు చేయడం, శాస్త్రసాంకేతిక వాణిజ్య రంగాలకు అవసరమైన తెలుగు పదాలను సమీకరించి నిఘంటువులు తయారు చేయడం లాంటి కార్యక్రమాలు చేపట్టింది. తెలుగును అధికార భాషగా అమలు పరచడానికి తగిన సూచనలిచ్చేందుకు జే.పి.ఎల్. గ్విన్ అధ్యక్షతన ఒక కమిటీని నియమించింది. ఈ కమిటి ప్రభుత్వానికి సమర్పించిన నివేదికలో (29.03.1967) తెలుగు భాషాభివృద్ధికి ఒక సంస్థను స్థాపించాలని సూచించింది. ఈ కమిటీ సూచన మేరకు 1968 లో తెలుగు అకాడమి స్థాపించబడింది. ఆ తర్వాత గ్రాంథిక భాష సమస్యను పరిష్కరించేందుకు మాజీ మంత్రి యం.ఆర్.అప్పారావు అధ్యక్షతన కమిటీని నియమించింది. ఈ కమిటీ తెలుగు మాతృభాషగా చదివే విద్యార్థుల పాఠ్యపుస్తకాలలో నాటకాలు, కథలు లాంటివి వ్యవహారికభాషలో, ప్రాచీన రచనలు గ్రాంథిక భాషలో దామాషా పద్ధతిననుసరించి నిర్ణయించాలని తీర్మానించింది. దీంతో తెలుగు భాష బోధనలో వ్యవహారిక భాషకు స్థానం దొరికింది. 1968లో స్థాపించిన కొత్తలో తెలుగు అకాడమి విశ్వవిద్యాలయ స్థాయి పాఠ్య, పాఠ్యేతర గ్రంథప్రచురణ కార్యక్రమం అకాడమీ ప్రధాన కర్తవ్యమైంది. తెలుగు భాష పురాతన చరిత్ర కలిగున్నప్పటికీ కాలక్రమంలో క్రమ పరిణామం చెందుతూ వస్తుంది. అక్షరమాల, లిపి, పదజాలం, పదనిర్మాణం, వాక్యనిర్మాణంలో అనేక మార్పులు చోటు చేసుకున్నాయి. లిపి పరిణామంలో కొన్ని అక్షరాలు లోపించాయి. అక్షరాలు రాసే విధానం మార్పు చెందింది. ముద్రణా యంత్రం వచ్చిన తరువాత అక్షరాలు అనేక విధాల ముద్రణకనుకూలంగా రూపాంతరం చెందాయి. పదనిరాణంలోను, పదాల అర్థబోధనలో కూడా మార్పులు సంభవించాయి. కొఠారి కమిషన్ (1964-66) భారతీయ విద్యావిధానంలో 10+2+3 విద్యా విధానంతోపాటు త్రిభాషా సూత్రాన్ని ప్రతిపాదించింది. 1986 జాతీయ విద్యావిధానమునసరించి భాష

పాఠ్యప్రణాళికలో భాషాజ్ఞానం, భాషా నైపుణ్యాలైన శ్రవణం, భాషణం, పఠనం, లేఖనంతోపాటు పరిశీలన, పరిశోధన, పరిష్కరణ, ప్రదర్శన, భావ వ్యక్తీకరణ లాంటి నైపుణ్యాలు కూడా పెంపొందించబడాలని పేర్కొంది. పాఠ్యప్రణాళిక ద్వారా భాషా పరిజ్ఞానం, భావవ్యక్తీకరణ సామర్థ్యం, భాషోచ్ఛారణ స్పష్టత, సాహిత్యావగాహన, సృజనాత్మక ఆలోచనా సరళి పెంపొందాలి.

తెలుగు పాఠ్యప్రణాళిక పూర్వకాలపు సాంప్రదాయిక పద్ధతులనే నేటికి అనుసరిస్తోంది .తెలుగు పాఠ్యప్రణాళికలో ప్రయోగాత్మ (ప్రాక్టికల్) బోధన ప్రవేశపెట్టలేకపోవడం మరొక పెద్ద లోపంగా చెప్పవచ్చు. వివిధ భాషల్లో భాషాప్రయోగశాలలు నెలకొల్పబడ్డాయి. వాటిలో ప్రయోగాత్మక భాషా బోధనాభ్యసన ప్రక్రియ నిర్వహించబడుతువుంది. కృత్యాధార బోధన ద్వారా విద్యార్థుల్లో భాషాకౌశలాలు సమర్థవంతంగా, సమగ్రంగా రూపొందించబడుతున్నాయి. తెలుగు భాష పాఠ్య ప్రణాళికలో అలాంటి ప్రయోగాలుకాని, భాష ప్రయోగశాలలు కాని ఎక్కడా కనిపించవు. తెలుగుభాషమీద పరిశోధన కూడా అంతంత మాత్రంగానే జరుగుతోంది. తెలుగుభాష సంస్కృత జన్యం కాదు, మూలద్రావిడ భాష నుండి ఉద్భవించిందని బ్రిటిష్ భాషావేత్త బిషప్ కాల్డ్వెల్ చెప్పేవరకు తెలుగువారు గుర్తించలేకపోయారు. చారిత్రక సత్యాలను గుర్తించిన వ్యావహారిక వాదులు భాషాసంస్కరణ చేయాలని, మన సారస్వత(గ్రాంథిక) భాష ఇప్పటికే వ్యవహారానికి దూరమైపోతుందని భావిస్తున్నారు.

ఏదైనా పాఠ్య ప్రణాళిక రూపొందించడంలో భాష ప్రధాన పాత్ర పోషిస్తుంది. ఏపాఠ్యాంశాన్ని బోధించాలన్నా ఏదో ఒక భాషామాధ్యమం కావాలి. మానవ నిత్యావసరాలలో భాష ప్రధానమైంది. భావ వ్యక్తీకరణకు, విషయ అవగాహనకు, ఆలోచనా పరంపరల నమోదుకు భాష కావాలి. సహ విద్యార్థులతో, తల్లిదండ్రులతో, అధ్యాపకులతో, మిత్రులతో, సమాజంలోని వ్యక్తులతో సంభాషించడానికి భాష తోడ్పడుతుంది. సమస్యల పరిష్కారానికి, సందర్భానికనుగుణమైన స్పందనకు భాషే ముఖ్యం. భాషేతర పాఠ్యప్రణాళికావసరాలు తీర్చగలిగింది భాషైనప్పుడు భాషా పాఠ్యప్రణాళిక రూపొందించడం విద్యాబోధనకే పెద్ద సవాలు. తెలుగులో ఇతర విషయాలు నేర్చుకోవడంకూడా భాషా కౌశలంపైనే ఆధారపడుంటుంది. మాతృభాషా ప్రయోగంలో నిపుణత సంపాదించిన వారు భాషేతరాంశాలు కూడా సులభంగా నేర్చుకోగలుగుతారు. అందుకే భాషేతరాంశాలను సమర్థవంతంగా బోధించగలిగే భాషానిర్మాణం ప్రణాళికలో చేర్చగలగాలి. అప్పుడే భాషా వికాసం జరుగుతుంది. ప్రస్తుత తెలుగుభాషా బోధనలో పాఠ్యప్రణాళిక ఆధునికావసరాలకనుగుణంగా రూపొందించకపోవడం ముఖ్యమైన లోపంగా చెప్పవచ్చు. ఒక దశలో భాషను బోధిస్తున్నామా, సాహిత్యం బోధిస్తున్నామా నిర్ణయించుకోలేని స్థితిలో తెలుగుభాష పాఠ్యప్రణాళిక నిర్మాణం జరుగుతుంది. ప్రాథమికస్థాయి నుంచి ఇంటర్ మరియు డిగ్రీ స్థాయి వరకు తెలుగును భాషాబోధనగానే వ్యవహరిస్తున్నారు. బోధకులను భాషోపాధ్యాయులు అంటున్నారు. స్నాతకొత్తర స్థాయిలో మాత్రం తెలుగు సాహిత్యం బోధిస్తున్నారు.

అయితే పాఠశాల స్థాయి నుంచి కళాశాల స్థాయి వరకు భాషను పరిచయం చేస్తున్నట్టుగాని, భాషా నిర్మాణం బోధిస్తున్నట్టుగాని, భాషాచరిత్ర వివరిస్తున్నట్టుగాని ప్రణాళికలో ఎక్కడా కనిపించదు. కవుల పరిచయం, కావ్యాల పరిచయం లాంటి సాహిత్యాంశాలు ప్రాథమిక దశ నుంచి కళాశాల స్థాయి వరకు పరిచయం చేస్తున్నట్టుగా తెలుగుపాఠ్యప్రణాళిక రూపొందించబడింది. అందుకే డిగ్రీ పూర్తి చేసుకొన్న విద్యార్థులు కూడా బయటి సమాజంలో సాధారణమైన దరఖాస్తు కూడా తెలుగు భాషలో రాయలేకపోతున్నారు. కంప్యూటర్ పరిజ్ఞానం వ్యాప్తిలోకి వచ్చిన తరువాత ఈ సమస్య మరింత జటిలమైంది. కంప్యూటర్ యుగంలో దానికి సంబంధించిన భాషాంశాలు పాఠ్యప్రణాళికలో శూన్యం. అందుకే తెలుగుభాష నేర్చుకొంటున్న విద్యార్థులు భాషాకౌశలాల నిర్మాణంలో పూర్తిగా వెనకబడిపోతున్నారు. తద్వారా తెలుగుభాషపై మమకారం లోపిస్తుంది. భాషా ప్రచారం, భాషా వ్యాప్తికి కూడా ప్రతిబంధకాలు ఏర్పడుతున్నాయి. తెలుగుభాష వ్యవహర్తల సంఖ్య క్రమంగా తగ్గిపోతోంది. తెలుగు మీడియంలో బోధన తగ్గిపోతూవుండడం, ఉన్నంతలో కూడా తెలుగు పాఠ్యప్రణాళిక సమగ్ర భాషాభివృద్ధిచెందే విధంగా రూపొందించకపోవడం చేత తెలుగుభాషా వికాసం కుంటుపడుతూ వుంది. నిజాం కాలంలో ఉర్దూ భాష ప్రభావం, ఆంగ్లేయుల కాలంలో ఆంగ్లభాష ప్రభావంతో తెలుగు భాష పాఠ్యప్రణాళిక వెనుకబడి పోయింది. విద్యావ్యవస్థలో ప్రైవేట్ యాజమాన్యం ప్రవేశించడంతో, ఆంగ్లభాషపై తల్లిదండ్రులు, విద్యార్థుల మోజు పెరుగడంతో తెలుగు భాషాబోధన, తెలుగు మాధ్యమం ద్వారా బోధన క్రమంగా తగ్గిపోయింది. ప్రస్తుత తెలుగు పాఠ్యప్రణాళిక ఏదో మొక్కుబడిగా కొనసాగించబడుతూవుంది. ఇలాంటి విపత్కర పరిస్థితులలో వున్న తెలుగుపాఠ్యప్రణాళికను ప్రస్తుత అవసరాలకనుగుణంగా విద్యార్థులను ఆకర్షించేవిధంగా రూపొందించవలసిన అవసరమెంతైనా వుంది. పదజాల విస్తృతి, నూతన సాంకేతిక పదజాల సృజనలాంటి అంశాలు పాఠ్యాంశాల్లో ఎక్కడ కూడా కనిపించవు. తెలుగు వ్యాకరణాంశాలలో సంధులు, సమాసాలు, అలంకారాలు, ఛందస్సు లాంటి సాహిత్యాంశాలు తప్ప భాషాపరమైన అంశాల పరిచయం పాఠ్యప్రణాళికలో ఎక్కడ కనిపించదు. తెలుగు భాషా బోధన అన్న పేరేగాని పాఠ్యప్రణాళికలో భాషాంశాలకన్నా సాహిత్యాంశాలే ఎక్కువగా కన్పిస్తాయి. స్నాతకోత్తర స్థాయిలో మాత్రం సాహిత్యంతోపాటు భాషాశాస్త్రం కూడా బోధించబడుతుంది.

ప్రాథమిక స్థాయినుంచి మాతృభాషలో విద్యాబోధన జరిగితేనే విద్యార్థుల సృజనాత్మకత వెల్లివిరుస్తుందనేది విద్యావేత్తల అభిప్రాయం. భాషేతర పాఠ్యాంశాలు మాతృభాషలోనే బోధించాలనే వాదన బలపడడానికి గాంధీ, తిలక్, కొఠారి కమిషన్ లాంటి విద్యా సంఘాలు సూచించాయి. ప్రాథమిక స్థాయిలో పాఠ్యాంశాల కూర్పు వారికి బోధించే ఉపాధ్యాయులతోనే చేయించాలి. పాఠ్యాంశాలు విద్యార్థులకు

**తరువాయి 37వ పుటలో**

**భాష నశిస్తే జాతి నశిస్తుంది.**

రాగ్యానాయక్ ఆడావతు
9133220230

# జాతరల్లో గ్రామదేవతలను ఆరాధించే విధానం - విశ్వాసాలు, ఆచారాలు

జానపదుల జాతర్లలో మంత్రంకంటే తంత్రానికి ఎక్కువ ప్రాధాన్యత ఉంటుంది. గ్రామదేవతలను అలంకరించి గుగ్గిలం, సాంబ్రాణి ధూపం వేస్తారు. భక్తులు వారి వారి ఇష్టం మేరకు అమ్మవారికి ఆరగింపులు తెస్తారు. జాతర రోజు అమ్మవారి మందిరాన్ని వేప, మామిడి ఆకులతోఅలంకరిస్తారు. భక్తులు జాతరకు దూరప్రాంతాలనుండి బండ్లు కట్టుకొని వస్తారు. మొక్కులున్నవాళ్ళు బోనం సమర్పిస్తారు. కోడిని, వేటను బలిగా సమర్పించే సంప్రదాయం నడుస్తోంది. జాతర రోజులలోభక్తులు గొర్రెలతో బండ్లు లాగిస్తూ ఆ బండ్లపై అమ్మవారి ప్రతిమ ఉంచి సాంబ్రాణి ధూపంతోఅమ్మవారి గుడి చుట్టూ తిప్పుతారు. జాతరరోజు సాయంత్రం అమ్మవారి రథోత్సవం జరుగుతుంది.అదేరోజు రాత్రి అన్నము వండి అమ్మవారి ఎదుటపోసి దానిపై కుంకుమచల్లి ఆరగింపచేసి ఆ అన్నాన్నిగ్రామ సరిహద్దులలో చల్లుతారు.

జాతర రెండవరోజు రంగం అనే కార్యక్రమం జరుగుతోంది. ఈ కార్యక్రమంలో పెళ్ళికానిఅమ్మాయి పచ్చికుండపై నిలిచి భవిష్యద్వాణి చెబుతుంది. ఈ భవిష్యద్వాణి చెప్పె అమ్మాయికివివాహబంధం ఉండదు. ఆమెకు గుడివాళ్ళు ఏడాది, ఏడాది గ్రాసం కొలుస్తారు. లేదా డబ్బుఇస్తారు. జాతరలలో చివరి కార్యక్రమం ఈకార్యక్రమంలో పూర్వకాలంలో 'గావు' అయితే జంతువును కొరికి పోతురాజు తలను మొండేన్ని వ్యతిరేక దిశలో గుడిముందు విసిరేస్తాడు. అక్కడితో జాతరకార్యక్రమం విజయవంతంగా ముగుస్తుంది. అయితే ఈనాడు ఆనపకాయను కొరికి పారవేయడం గమనించవచ్చు.

తెలంగాణ విఖ్యాతికి దోహద పడుతున్న శక్తి జాతర్లను, ఆయా శక్తి దేవతల పురాణ గాథను,శక్తి ఆకృతిని, జాతరాంశాలను పరిశీలనాత్మకంగా అన్ని కోణాల్లో విశదం చేశాను.ఈ పరిశోధనాత్మక అధ్యయనంలో సాహిత్యం, లభ్యమైన ఆధారాలు, వ్యక్తుల ద్వారా సేకరించిన పాటలు, విశేషాలతోపాటు సాంకేతిక పరంగా వస్తున్న ఆధారాలను పరిగణనలోనికి తీసుకున్నాను. అంతేకాక మతసామరస్యానికి ప్రతీకగా భిన్నత్వంలో ఏకత్వాన్ని చాటిచెప్తూ మెదక్ జిల్లాలో సహజీవనం సాగిస్తున్న అనేక మతాల వారు, వారి జీవన సంస్కృతిలో భాగమైన ఉత్సవాలు,జాతర్లను అధ్యయనం చేయడం జరిగింది. ప్రతిజాతికి, దేశానికి ఆద్యమై అవ్యాహతంగా సాగివచ్చు ప్రత్యేక ఆచారాలు, సంప్రదాయాలు కొన్ని కలవు. ఆయా ప్రజల మానసిక దృక్పథం, వారి వారి జీవిత పరిధుల ననుసరించి ఆచారాలు రూపొందును. అవి ఒక్కొక్క దేశానికి, జాతికి విభిన్నములై ఆయా దేశాల మరియు జాతుల ప్రత్యేకతలనుఎత్తి చూపును. తెలుగువారిలోనే జానపదుల కొన్ని ఆచారాలు నాగరికుల ఆచారాలకంటే భిన్నమై తమ ప్రత్యేకతనుఆది నుండి నిలబెట్టుకొన్నవి. శైవ, వైష్ణవ మతాలతోపాటు జానపదుల గ్రామదేవతారాధన పల్లెల్లోను, పట్టణాల్లోను ప్రక్కప్రక్కనే సమాంతర రేఖలవలె వేటికవే స్వతంత్రప్రతిపత్తితో ప్రాచీనకాలం నుండి మనుగడ సాగిస్తున్నవి. అగ్రవర్ణాలవారు గ్రామదేవతలు, క్షుద్రదేవతలుగా పరిగణించినా, ఆపదలు కలిగినపుడు, అంటువ్యాధులు వ్యాపించినపుడు వారు కూడా గ్రామదేవతలకు మ్రొక్కుదురు. ఆ మొక్కులను తీర్చెదరు. గ్రామదేవతల పండుగలు, ఉత్సవాలు, జాతరలలో అగ్రవర్ణాలవారు అగ్రస్థానం వహించకపోయినా, ధన ధాన్య సహాయాన్ని జేయుదురు. ఉత్సాహంతో వారు ఉత్సవాలలో పాల్గొందురు. శైవ, వైష్ణవమత ప్రభావం గ్రామదేవతారాధన పైసను, గ్రామదేవతారాధన ప్రభావం శైవ వైష్ణవ మతారాధనలపైనను కొంతవరకు ప్రసరించినవి. మన దేశం అనేక విదేశీయుల విజాతీయులదాడికి గురైనను, అనేక మతాలు, మత ప్రవక్తకులు పుట్టి గిట్టినను, మనుగడను సాగిస్తున్నను అనేకవేల సంవత్సరముల నాటి గ్రామ దేవతలకు వారి ఆరాధనకు క్షతి సంభవించలేదు.

ఆశ్వయుజ దశమినాడు విజయదశమి పండుగను, ఆశ్వయుజ బహుళ చతుర్దశినాడు నరకచతుర్దశి పండుగను, మాఘ బహుళ చతుర్దశినాడు మహాశివరాత్రిని సంవత్సరానికొక మారు నిర్ణీత దినాలలో జరుపుకుంటాము. కాని సాధారణంగా గ్రామదేవతల పండుగలకు నిర్ణీత దినం నిర్ణయించలేదు. గ్రామదేవతల పండుగలను సంవత్సరానికొకమారైనను 2, 3,5,7 సంవత్సరములకొకమారైనను జరుపుతారు. సామాన్యంగా పంటలు పండిన తర్వాత విశ్రాంతి సమయాలలో జరుపుతారు. అంటువ్యాధులు, పశురోగాలు ప్రబలినపుడు, కరువుకాటకా లేర్పడినపుడు, గ్రామదేవతల కాగ్రహం కలిగినదని భీతిచెందినపుడు, జానపదులు దేవతలకు బలులనిచ్చి పండుగలనుచేస్తారు. జాతర, ఉత్సవం, సంబరం, తిరునాళ్ళు, పండుగ ఇత్యాదివన్నియు సమానార్థకాలే. వీనిప్రస్తావన ప్రాచీన గ్రంథాలందు కూడ గోచరించును. జాతర ప్రస్తావన పాండురంగ మహత్యం మహభారతంలందు కనపడును.

'అత్తటి దన్నగరీపతి
జాతర చాటించె బశువిసరమని తరసా
ధ్యాతత పాతా మయనిర్వతాహుతి
దూలగాలి గంగల కెల్లన్ 1

(తెనాలి రామకృష్ణుడు- పాండురంగ మహత్యం-1, 14ప)

జాతర సేయగా వలయు సర్వజనంబులు నంబురాశికిన్. మహాభారతమున సంబరం గురించికూడా ప్రస్తావన కలదు. గోవింద సంబరం సంభావింపు జాతరనే 'పరస' అని కూడా అందురు. ఈ పరస పదాన్ని పాల్కురికి సోమన, శ్రీశైల యాత్రోత్సవం పరంగా ప్రయోగించెను. ఈదెమ్మ కథలో 'పరసి' పదం అమ్మవారి జాతరకు

పర్యాయంగా వాడెను.

ఒక్కొక్క ప్రాంతంలో ఒక్కొక్క గ్రామదేవత ప్రాముఖ్యం వహించునట్లుగా వివిధ ప్రాంతాలలో వివిధ ఆచారాలు ఆచరిస్తారు. ఈ ఆచారాలలో సాధారణ అంశంగా కనపడు విషయం బలి, బలి జంతువుగా దున్నపోతును గాని, గొర్రెనుగాని, మేకనుగాని, కోడిని గాని దేవతకు సమర్పిస్తారు. జంతుబలులు నిషేదించడం వల్ల జంతువులకు మారుగ గుమ్మడికాయలను పగులగొట్టుదురు. నలభై, యాభై సంవత్సరాలకు పూర్వం దున్నపోతులను బలిగానిచ్చెడి ఆచారం ప్రచురంగా నుండెను. నేడది అరుదుగా కనిపిస్తుంది. జానపదులు జంతువులలో సామన్యంగా దున్నపోతును, మేకను బలిఇవ్వుగుటలో ప్రాచీన కాలం నుండి వారికి ప్రాముఖ్యం కలదని విదితమగును. కాళికాదేవి మహిషాసుర మర్ధిని, గ్రామదేవతలకు మహిషంనే బలినిచ్చుట గమనించదగిన అంశం. ప్రపంచపర్యాప్తంగా వ్యాపించిన బలినిచ్చే ఆచారం ఎప్పుడెచ్చట ఎందుకు ఏర్పడినదను అంశము నేటికీ వివాదస్పదమే. బలినిచ్చే ఆచారంలోని మొదటి దశ నరబలి. ఈ నరబలి మన భారతదేశంలోఆర్యుల ఆగమనానికి పూర్వమే సింధు నాగరికతయందే ప్రచారంలో ఉండెనని హరప్పా, మొహంజోదారో అవశేషాల వల్ల నిరూపితమైంది. శిధిలాల్లో లభించిన ఒక ఫలకం పైన పురుషుడు కత్తిని చేతిలో ధరించి యుండగా, స్త్రీ వంగి తన చేతులను పైకి లేపినట్లున్న చిత్రం బలిని సూచిస్తుంది. శతపథ బ్రాహ్మణంలో, సంస్కృత పురాణములందు నరబలి ప్రసక్తి కనబడుతున్నది. భాగవతమందు శునశ్శేపుడు హరిశ్చంద్రునికి యాగపశువుగా తండ్రి చేత అమ్మబడెను. యాగపశువుగా యూపస్తంభమునకు కట్టి వేయబడిన శునశ్శేపుడు బ్రహ్మాది దేవతల వినుతిసేయుచు మెప్పించి, పితృదేవతలచే విముక్తుడయ్యెను.

రామాయణమందు కూడా శునశ్శేపుడు విశ్వామిత్రుడువదేశించిన మంత్ర ప్రభావంచే విముక్తుడయ్యెను. పురాణకాలమందు రాజులు తమ కోరికలు నెరవేరుటకు, దేవతల అనుగ్రహాన్నిపొందుటకు యాగఫలమునకు నరబలుల నొసంగు సంప్రదాయ ముండెడిదని ఈ కథల ద్వారా స్పష్టమగుచున్నది. వివిధ మేధాలలో జానపదుల కథల యందు కూడా నరబలి తరచుగా కనపడును. నిర్జీవాలైన నదులు, నిధులు, కోటలు, భవనాలు, తటాకాలు, నూతులు నరబలులను కోరును. జానపద కథలలోని నరబలులకు సంబంధించిన కథలలో ఎక్కువగా గర్భిణీ స్త్రీలను కోరుటలో సఫలతా ప్రాధాన్యం గోచరిస్తుంది. జపాన్, ఆఫ్రికా, గ్రీకు, పాలినేషియా, ఫిజి దేవాలయాలలో పూర్వం నరబలులు, జంతుబలులుండేవి. ఖురాన్లో కూడా నరబలి ప్రసక్తి కలదు. కెల్టిక్ జాతివారు భగవంతుని రిక్తహస్తాలతో పూజించిన, అతనికి ఆగ్రహం కలుగునని భయబడతారు. ప్రళయం, కరువుకాటకాలు,ఆపదలు, భగవంతుని నిర్లక్ష్యం కావించుట వల్ల సంభవించునని భావించి, భగవదనుగ్రహం కొరకు బలులనిస్తారు. ఒక ప్రాణమునకు మారుగ మరియొక ప్రాణమునిచ్చినప్పుడే భగవంతుడు తృప్తిజెందునని వారి విశ్వాసం. మన పల్లె ప్రజలు అంటువ్యాధులు వ్యాపించినపుడు దేవతల కాగ్రహం కలిగిందను భ్రమతో బలులనిచ్చిన విధంగా, కెల్టిక్ జాతి వారు ప్లేగు మొదలగు వ్యాధులను నిర్మూలించుటకు బలి నిచ్చేవారు.

ఆత్మనివేదన వలన భగవంతుని అనుగ్రహాన్ని పొందెదమను విశ్వాసం ప్రాచీనులలో ప్రబలెను. నవవిధ భక్తి మార్గాలలో ఆత్మ నివేదనయందు ప్రాణి భగవంతుని శరణ్యమనే భావన మన హిందూమతమందు కలదు. కాలక్రమేణ తనను తాను భగవంతునికి అర్పించుకొనుటకు మారుగ మరియొకప్రాణిని బలిగానిచ్చిన కోరికలు ఈడేరుననే భావన ప్రాచీన మానవుని మనస్సులో జనించి ఉండవచ్చును. ఈ భావనయే నరబలికి మారుగా జంతుబలిగా రూపొందింది. ఈ భావనకు ఉపబలకంగా శతపథ బ్రాహ్మణంలో తొలుత దేవతలకు మనుష్యుని బలిగా నొసంగిరి. వాడు బలిగానొసంగినపుడు యజ్ఞతత్వము వారి నుండి వెడలి ఎద్దుయందు ప్రవేశించెను. అప్పుడు వారు ఎద్దును బలినిచ్చిరి. దానినుండి యజ్ఞతత్వము గొట్టెలోనికి, గొట్టెనుండి పుడమిని జేరి అచ్చట నుండి వారి, యవలలో ప్రవేశించును. అని బలులలో వచ్చిన పరిణామాలను పేర్మొనిరి. ఒకదానికి బదులుగా మరొక దానిని సమర్పించే సంప్రదాయం ముఖ్యంగా క్రైస్తవ మతంలోను. యూదుమతంలోను మనకు ప్రస్ఫుటంగా కనపడును. ఈ సంప్రదాయమునకు అంకురార్పణ బాబిలోనియాలో దేవతలకు గొర్రెలను బలి నిచ్చినప్పుడు పఠించు మంత్రంలో కనపడును. ఆ మంత్రార్థం మానవునికి బదులుగా ఈ గొర్రెను మీకు నివేదనగా సమర్పిస్తున్నాము. తన ప్రాణమునకు బదులుగా గొర్రె ప్రాణమును నీకు సమర్పిస్తున్నాను అని కలదు. జానపద సాహిత్యమందు కూడా నరబలి నిషేధించిన తర్వాత జంతుబలి ప్రచారంలోనికి వచ్చినదను అంశం స్పష్టం చేయు కథ ఒకటి కలదు. పురాణ కాలంలో కలరా నగరమంతటా వ్యాపించి యువకులను, వృద్ధులను మృత్యుదేవత గొని పోతుండెను. ఆ రాజ్యపు ప్రభువు అమ్మవారికి బలినివ్వగూడదని నిషేధించెను. అమ్మవారాగ్రహంతో, రాజు స్వప్నంలోకనిపించి,'నాకొక నరబలినిచ్చి, వరమును తీసుకొనుము. లేనిచో నిన్ను చంపివేయుదును' అని ఆదేశించెను. రాజు పూజారిని, నీవు దేవతకు బలికావలెనని ఆజ్ఞాపించెను. అతను రేపు రాత్రికివస్తానని మాట ఇచ్చెను. పూజారి దేవతను నేనిన్ని రోజులు తప్పింపలేమని ప్రత్యుత్తరమిచ్చెను. పూజారి చేసేది లేక మాటప్రకారం రాజు కడకు వెళ్ళెను. రాజు పూజారిని దేవతకు బలినివ్వగానే,ఆమె సంతసించి, ఏదైన వరమును కోరుకొమ్మనెను. రాజు పూజారిని పునర్జీవితును చేయుమనివేడెను. దేవత పూజారిని బ్రతికించెను. కాని భక్తులు జంతుబలిని ఒసంగిన అభ్యంతరం జెప్పకూడదని శాసించెను. నాటి నుండియే నరబలికి మారుగ జంతుబలి ప్రచారంలోనికి వచ్చెను. జైన, బౌద్ధమత ప్రచార ప్రభావములచేత హిందుమతంలో జంతుబలి అణచివేయబడింది. జంతుబలి స్థానములో కొబ్బరికాయలు, గుమ్మడికాయలు ప్రవేశించినవి. మానవుని ఆలోచనా సరణిని అనుసరించి ఆచారంలో కూడా మార్పు సంభవించునని ద్యోతకమగును.

బలి పుట్టుకను గూర్చి పలువురు పలువిధాలైన అభిప్రాయాలను వెల్లడించిరి. సెన్సర్ ప్రాజ్ఞానవుడుచనిపోయిన వారి సమాధుల ముందు నీరు, ఆహారమును పెట్టెడి ఆచారమే దేవతలకు బలినివ్వడమను ఆచారముగా రూపొందినదని భావించెను. వైట్ హెడ్ ప్రాచీన మానవుడు బలికి ఇచ్చుటలోని ముఖ్యోద్దేశం భగవంతునితో సంబంధం పెట్టుకోవాలనియే. కాని భగవంతునికి కానుక నిచ్చుటకాదని

వివరించెను. రాబర్ట్ స్మిత్ భగవంతుని విగ్రహము కడ నివేదించిన మాంసం లేదా ఫలమును ఆరగించుట వలన, భగవంతునితో సంబంధము పెట్టుకొనినానని ఆదిమ మానవుడు భావించెడివాడు.అని తన అభిప్రాయాన్ని ప్రకటించెను. మానవశక్తికి అతీత శక్తికి మధ్య సంబంధం కల్పించునది బలి అను తలంపు ప్రాజ్మానవుల కుండెడిదని పలు మానవశాస్త్రవేత్తలు భావించిరి. ప్రాచీనుల ఆలోచనా విధానం మనకు స్పష్టం కాకపోయినను, నేటి జానపదులు మాత్రం భగవంతుడు తమకోరికలను తీర్చినచో బలులనిచ్చెదమని మొక్కుకొని మొక్కులు తీరుస్తారు.

బలులు గణవ్యవస్థ కాలములో జన్మించినవని వైట్ హెడ్ వివరించెను. ప్రాజ్మానవునిజీవితములోని జంతు ప్రాధాన్యం, గణసంకేతాలుగా జంతువుల నేర్పరచు కొనుట మూలకారణమైంది.కొంతకాలం గడిచిన తర్వాత గణ సంకేతంగా గుర్తింపబడిన జంతువు గణదేవతా ప్రతీకయైనది. గణదేవతా ప్రతీకతో సంబంధాన్ని కల్పించుకొనుటకే ప్రాచీనులు బలినిచ్చెడి వారని వైట్ హెడ్ ప్రతిపాదించెను. బలికి ముందు జంతువును పసుపు కుంకుమలతో అలంకరించుట, ఊరేగించుట,ఊరేగించునపుడు ప్రతి ఇంటి ముందు దాని కాళ్ళపైన నీరు పోయుట మొదలగు ఆచారాలు పూజావిధానాలకి ఉపబలకంగానున్నవి. కనుక ప్రాచీన కాలములో బలిగా ఇవ్వబడే జంతువు, గణదేవతాప్రతీకగానే ఎంచబడెదను అంశము ఉపపాదకంగా ఉన్నది. జంతువును బలినిచ్చు విధానాన్నిగూర్చి జానపదులలో ఒక కథ కలదు. పూర్వకాలంలో పంచమ జాతీయుడొకడు వేదపఠనము గావించు ఒక గ్రామమునకు పోయెను. అతను బ్రాహ్మణుడు, పండితుడని ఆ గ్రామ పెద్దలు భ్రమించి, గ్రామకరణము కూతురినిచ్చి పెళ్ళి చేసిరి. ఆ దంపతులకు సంతానము కూడా కలిగెను. కొన్నిసంవత్సరాలు గడిచిన తర్వాత పంచమ యువకుని మోసమును తెలుసుకొని బ్రాహ్మణయువతి సజీవదహనమయ్యెను. మరణమునకు పూర్వము బ్రాహ్మణయువతి, గ్రామస్థులను తనభర్త తలను ఖండించి, అతని నోటిలో మోకాలును పెట్టవలయుననియు, తలపైన దీపమును వెలగించవలయుననియు ఆదేశించెను. మరణానంతరము ఆ విప్ర యువతి దేవతయై వెలసెను. గ్రామపెద్దలు బలినొసంగిన పంచమ యువకుడు, మరుజన్మలో దున్నపోతుగా జన్మించెను. నాటినుండియు దున్నపోతును దేవతకు బలినిచ్చుట, దాని కుడి మోకాలిని నరికి, శిరస్సు ఖండించి నోటియందు మోకాలిని పెట్టుట ఆచారముగా మారింది. కన్నడ దేశమందు కూడా ఈ ఆచారము కనబడుచున్నది. అచ్చట ప్రచారంలో నున్న కథ తెలుగుదేశమందు వ్యాప్తిలో వున్న కథను పోలివుంది. ఒక చండాల జాతివాడు బ్రాహ్మణుడుగా వ్యవహరించి,శాస్త్రముల నభ్యసించి, బ్రాహ్మణ కన్యను పరిణయమాడెను. కొన్ని సంవత్సరములకు గడిచిన అనంతరం ఒకనాడు చండాల జాతివాడు తెగిపోయిన పాత చెప్పును కుట్టుకొనుట అతని కుమారుడు జూచి తల్లికి తెలిపెను. తల్లి తనతపశ్శక్తి చేత జరిగిన మోసమును గ్రహించి, తానుమారి దేవతగా వెలుస్తానని తెలిపి, తన భర్తదున్నపోతుగ ననుసరించి ఆనాటి నుండియే మారిదేవత ఉత్సవములందు, దున్నపోతును బలియిచ్చిదాని కుడి మోకాలును నోటియందు పెట్టుదురు.

మోకాలును ఖండించి నోటిలో పెట్టు ఆచారములోని అంతరార్థమును గూర్చి మహారాజా వి.యస్. రంగారావు ఒక అభిప్రాయయాన్ని వెలిబుచ్చిరి. హీనజాతివారు గ్రామ పెద్దను క్షమార్పణలు కోరుటకు వెళ్ళునపుడు గడ్డిపరకను అడ్డముగా నోటిమీద పెట్టుకొందురు. పశువుల వలె చేసిన తప్పును, ఈ చర్య సూచించును. గడ్డిపరక లభించనిచో కుడిచేతి చూపుడు వ్రేలును నోటిమీద అడ్డముగాపెట్టుకొందురు. భగవంతుని ముందు తప్పులను క్షమించమని తమ వేలిని నోటిమీదపెట్టుకొనుటకు మారుగ జంతువు కుడి మోకాలును నోటియందు పెట్టెదరని రాజాగారు తెలిపినట్లుగా వైట్ హెడ్ పేర్కొనెను, ఎల్మోర్ పండితుడు ఈ ఆచారము జయింపబడిన శత్రువును క్రూరముగా శిక్షించు విధానమును సూచించుచున్నదని భావించెను. దున్నపోతు మెడలో హారమును వేసి ఊరేగించుట శత్రువును చంపుటకు ముందు విజయాన్ని ప్రదర్శించుటను సూచిస్తుందని అతడు ఉల్లేఖించెను. ఈ జంతుబలి కార్యక్రమము సూచిస్తున్నదని ఎల్మోర్ పండితుడు ప్రవచించెను. కాని ఆర్యులు భారతదేశంలోనికి అడుగిడుక మునుపే అనార్యులలో బలినిచ్చు ఆచారం ఉండెడిదని హరప్పా మొహెంజదారో శిథిలా శేషముల వలన విదితమగుచున్నది. కనుక ఎల్మోర్ పండితుని అభిప్రాయం అసమంజసమనవచ్చును.

విద్వాంసులనేకులు జంతుబలిని సఫలతా కర్మకాండలకు ప్రతిగా భావించిరి. బలిగా ఇవ్వబడు జంతువు సస్య ప్రతీక. దానిని భూమికే అర్పితము గావించిన ఆమె సఫలతాశక్తి అధికమగునని ప్రాజ్మానవుని భావన కావచ్చును. ఈ ఆచారము ప్రి హిలినిక్ డైనమిషన్ పండుగలను తలపిస్తుంది. జంతువును బలిగా దేవతకు సమర్పించు సమయాన రక్తమును నైవేద్యపు టన్నములోనికి పట్టి దానిలో వేపాకు, పసుపు కలిపి ఆ మిశ్రమాన్ని ఇళ్ళ పైనను, పొలాల్లో చల్లుతారు. బీరప్ప పండుగకు గొల్లవారు తమ సంపదయైన గొర్రెలమందపైనను రక్తమును చల్లుతారు. రక్తమును జల్లు సమయమున నోటిలో బలియైన జంతువు కాలేయమును నిమ్మకాయ దోషహారిణియని జానపదుల నమ్మకము. గుండె,మెదడు, కాలేయము మొదలగు వానిలో నాత్మయుండునన్న భావనయే బలిపశువు చంపినపు డాయా యంగములే ప్రత్యేకముగా దేవతల కాహార భూతములగుటకు కారణమని డా. కృష్ణకుమారి గారు ప్రవచించిరి.

17వ శతాబ్దంలో ఒక పర్షియా వేదాంతి శరీర నిర్మాణ ప్రథమ భాగములు - ఆత్మకాధారాలైన, మేధస్సు, కాలేయము, హృదయము అని తెలిపెను. సిలోన్ లోని వెద్దా తెగవారు, ఇండో చైనాలోని వివిధ తెగలు, ఆఫ్రికాలోని బకోంగో, ఉత్తర అమెరికాలోని మిక్ మ్యాక్ ఇండియన్స్ వధింపబడిన తమ శత్రువుల కాలేయాన్ని తిన్నచో వారి ధైర్యం బలం, తమకు సంక్రమించునని విశ్వసిస్తారు. ఎస్కిమోలు ప్రతీకారవాంఛ తగ్గునను నమ్మకము కలదు. ప్రాచీన ఆరాధనా విధానాలలో లివర్ డివినేషన్ కూడా ఒకటి. మట్టితో, రాతితో చేసిన కాలేయములు పురాతత్త్వ శాస్త్రజ్ఞులచేత కనుగొనబడినవి. ఈ ప్రాచీన విశ్వాసాలు ఆచారాల వలన ప్రాజ్మానవ మతం నుండి కలదని స్పష్టమగుచున్నది.

**తరువాయి 39వ పుటలో**

పరిశోధన పత్రం

బండారి ప్రేమ్ కుమార్
9492788752

# 'భాషాపరిరక్షణ' నిలయం

**ఉపోద్ఘాతం:**

తెలుగు భాషను వ్యవహరించే రాష్ట్రాలలో, ఇతర భాషలు రాజ్యమేలుతున్న తరుణంలో తెలుగు భాషా వ్యాప్తికై ఎన్నో సంస్థలను ఏర్పాటు చేశారు. తెలుగు మాట్లాడేవారిలో ఆత్మస్థైర్యాన్ని పెంపొందించడానికి ఈ సంస్థలు ఎంతగానో కృషి చేశాయి. అటువంటి సంస్థల్లోమొట్టమొదటిది. శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయం. ఈ భాషానిలయం కృషివల్లే మన భాషా మూలాల్ని ఆ తరంనుంచి, ఈ తరం వరకు బాషలోవచ్చిన మార్పుల్ని తెలియచేయగలుగుతున్నాం. భాషకుజీవం పోయడంలో శ్రీకృష్ణదేవరాయాంధ్ర తెలుగు భాషా నిలయం ఎంతగానో కృషి చేసి భాషా విస్తృతికి దోహదపడింది.

**శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయ ఆవిర్భావం:**

నిజాంపరిపాలనలో రాజభాషగా ఉర్దూ చలామణి అయ్యేది. దీనివల్ల తెలుగు భాష వినియోగం, ప్రాముఖ్యత చాలావరకు తగ్గిపోయింది. తెలుగు భాషా ఉనికే ప్రశ్నార్థకం అవుతున్న తరుణంలో తెలుగు భాషా అభిమానం కలవారు(మునగాల సంస్థానాధీశుడు నాయిని వెంకట రంగారావు, రావిచెట్టు రంగారావు, కొమర్రాజు వెంకట లక్ష్మణరావు) ఈ త్రయంతో శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషానిలయం అంకురార్పణ జరిగింది. నిజాం పాలనలో ఆనాటి సమాజ పరిస్థితుల దృష్ట్యా తెలుగు మాట్లాడటమే నిషిద్ధమైన సందర్భాల్లో ఈ భాషా నిలయమే ప్రజలందరిలో కొంత ధైర్యాన్ని నింపింది. హైదరాబాదు రామ్‌కోఠిలోని రావిచెట్టు రంగారావు జాగీర్దార్ బంగ్లాలో, 1901లో ఈ భాషా నిలయానికి పునాది వేయడం జరిగింది.

శ్రీకృష్ణదేవరాయల కాలంలో తెలుగు భాష, సాహిత్యాలకు అష్టదిగ్గజ కవులు పట్టం కట్టారు. శ్రీకృష్ణదేవరాయల కాలం తెలుగు భాష, సాహిత్యాలకు స్వర్ణయుగం లాంటిది. కాబట్టి వారి సాహిత్య కృషిని స్మరిస్తూ నిజాం రాష్ట్రంలో స్థాపించబడిన మొట్టమొదటి గ్రంథాలయమే శ్రీకృష్ణదేవరాయ తెలుగు భాషా నిలయం. ఈ విధంగా స్థాపించబడిన సంస్థకు ఒక నిర్దిష్టమైన భవనం ఉండాలని రావిచెట్టు రంగారావుగారి సతీమణి, రావిచెట్టు లక్ష్మీనర్సమ్మ స్థలానికై 3వేల రూపాయలను విరాళం ఇచ్చారు. ఆ విరాళంతో ప్రస్తుతం ఉన్న భాషానిలయం స్థానంలోని పెంకుటిల్లును విక్రయించి గ్రంథాలయంగా మార్చారు. ఈ భాషా నిలయం తెలుగు భాషా సాహిత్యాలను సుస్థిరం చేయడానికి ఏర్పాటుచేయబడిన సంస్థ. ఈ భాషా నిలయం ఇచ్చిన సూచనలతో రాష్ట్రంలోని నలుమూలల అనేక గ్రంథాలయాలు ఏర్పాటు చేయబడ్డాయి. ఈ భాషా నిలయం మాతృకగా ఉంటూ గ్రామాలలో గ్రంథాలయాలను ప్రారంభించి, ప్రజల్లో తెలుగు భాషా సాహిత్యాల పట్ల ఆసక్తిని కలిగించడంలో ఎంతగానో కృషి చేసింది.

తెలుగు భాషకు ఒక నిర్దిష్ట రూపాన్ని తీసుకువస్తూ సామాన్యుడి చెంతకు చేరేలా ఎంతోమంది ప్రముఖ సాహితీవేత్తల రచనలను అందించి, తెలుగు భాషా సాహిత్యాల పట్ల మక్కువను కలిగించింది. నిజాం నిరంకుశ పాలనలో సాహిత్య సంస్థగానే కాకుండా, జాతీయోద్యమ స్ఫూర్తిని నింపి, ఎంతోమంది ఉద్యమకారులను తీర్చిదిద్దటంలో ఈ గ్రంథాలయం కీలకపాత్ర పోషించింది. ఉద్యమకారుల సభలు, సమావేశాలకు, చర్చలకు ఈ గ్రంథాలయం కేంద్రస్థానంగా పనిచేసింది.

సాహిత్యపరంగా సభలు, సమావేశాలు, సాహిత్య గోష్టులు నిర్వహిస్తూ, ఔత్సాహిక రచయితల్లో సాహిత్యాభిమానాన్ని పెంపొందించడమే కాకుండా ఎంతోమంది యువతీ యువకులు విద్యావంతులు కావటానికి తోడ్పడింది. ఎన్నో దినపత్రికలు, మాసపత్రికలు, వారపత్రికలు మొదలైన వాటిద్వారా ఎంతోమంది ఔత్సాహిక రచయితల రచనలను పరిచయం చేస్తూ, భాషాపరిరక్షణే ధ్యేయంగా కార్యకలాపాలను నిర్వహించింది.

శ్రీకృష్ణదేవరాయాంధ్రభాషా నిలయానికి అధ్యక్షులుగా మునగాలరాజా నాయిని వెంకటరంగారావు,(1901-1939) వరకు బాధ్యతలు నిర్వర్తించాడు. తర్వాత నాయిని వెంకట రంగారావు, రాజాబహద్దుర్ వేంకటరామారెడ్డి, బూర్గుల రామకృష్ణారావు, వల్లూరి బసవరాజుగార్లు అధ్యక్షులుగా వ్యవహరించారు. ప్రస్తుతం కె.వి. రమణాచారి ఈ భాషా నిలయానికి అధ్యక్షులుగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. భాషానిలయానికి కార్యదర్శులుగా రావిచెట్టు రంగారావు, మాడపాటి హనుమంతరావు, బూర్గుల రామకృష్ణారావు, ఆదిరాజు వీరభద్రారావు, ఖండవల్లి లక్ష్మీరంజనం, బిరుదురాజు రామరాజుగారు, ఎమ్.ఎల్. నరసింహారావు వంటి ప్రముఖ సాహితీవేత్తలెందరో ఈసంస్థ కార్యక్రమాలు నిర్వహించడంలో ముఖ్యపాత్రను పోషించారు. ప్రస్తుతం టి. ఉదయవర్లు గారు ఈ బాధ్యతను భుజాలకెత్తుకున్నారు.

**భాషా పరిరక్షణ:**

భాషా పరిరక్షణకోసం ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో ఏర్పాటు చేయబడిన మొట్టమొదటి సంస్థ శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషానిలయం. ఈ సంస్థ నిజాం నిరంకుశ పాలనలో తెలుగు మాట్లాడే పరిస్థితులే లేని క్లిష్ట సమయాల్లో, తెలుగు భాషా పరిరక్షణకై కొన్ని కార్యక్రమాలను నిర్వహించింది. తద్వారా ప్రజల్లో భవిష్యత్తులో మళ్ళీ, తెలుగు భాషకు పూర్వవైభవం కలుగుతుందనే ధైర్యాన్ని నూరిపోసింది. ప్రజల్లో భాషపట్ల అభిమానాన్ని, పరిరక్షించుకోవాలనే సంకల్పానికి ఈ సంస్థ ప్రాణం పోసింది.

ఎంతోమంది ఔత్సాహికులైన యువతీ యువకుల్లో భాషమీద అభిమానాన్ని కలిగించడానికి అనేక సదస్సులు, సమావేశాలు ఏర్పాటు చేసింది. అంతేకాకుండా పురాణాలు, వేదాలు, ప్రాచీన కావ్యాలువంటి

మన తెలుగు భాషా సాహిత్య సంపదను భద్రపరిచి, భవిష్యత్ తరాలకు అందిస్తుంది.

గ్రంథాలయాలు పఠనాసక్తిని పెంపొందిస్తాయి. ప్రజలను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో వాటి పాత్ర మరువలేనిది. ఆ కాలంలో శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషానిలయంలో ఉన్న గ్రంథాలన్నింటిని పఠించి, జ్ఞానాన్ని సముపార్జించుకొని, తెలుగు భాషా పాండిత్యాన్ని పెంపొందించుకొని గొప్ప సాహితీవేత్తలుగా, రాజకీయ ప్రముఖులుగాఎదగటంలో ఈ సంస్థ ఎనలేని కృషి చేసింది.

ఈ సంస్థ భాషా పరిరక్షణతోపాటు సంస్కృతి, సాంప్రదాయాల పరిరక్షణకు ఎంతగానో కృషి చేసింది. వివిధ ప్రాంతాలలో గ్రంథాలయాలను ఏర్పాటు చేయడానికి పరోక్షంగా కృషి చేసింది. ప్రజలను ఉత్తమమైన పౌరులుగా తీర్చిదిద్దడంలో భాషానిలయాలు ఎంతగానో తోడ్పడుతున్నాయి.

ప్రస్తుతం ఇంగ్లీషు మాధ్యమాల ప్రభావం తట్టుకోలేక తెలుగు కనుమరుగయ్యే పరిస్థితులు ఎదురవుతున్నాయని, అటువంటి ప్రతికూల పరిస్థితుల్ని అధిగమించేందుకు భాషా పరిరక్షణ కార్యక్రమాలకు ప్రణాళికలను రూపొందించి, వాటిని అమలు చేయటంలో శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయం ముందంజలో ఉంటుంది.

**పురస్కారాలు:**

భాషా పరిరక్షణ కోసమే, సాహిత్యంలో విశేషంగా కృషి చేసిన ప్రముఖులను స్మరిస్తూ, వారి జ్ఞాపకార్థంగా వారి సేవలు సమాజంలో చిరస్థాయిగా నిలిచిపోవాలనే ఉద్దేశ్యంతో పురస్కారాలు ఏర్పాటుచేసి, ప్రస్తుత సమాజంలో వివిధ రంగాలలో సేవలందిస్తున్న ప్రముఖులకు ఈ పురస్కారాలను ప్రధానం చేయడం జరుగుతుంది.

బూర్గుల రామకృష్ణారావు (1988, మార్చి13)గారి జయంతిని పురస్కరించుకొని స్మారక పురస్కారాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. వారి పేరుతో స్మారక పురస్కారాన్ని అందుకున్న వారిలో కాళోజి నారాయణరావుగారు ప్రథములు.

మహాకవి దాశరథి కృష్ణమాచార్యుల జయంతి సందర్భంగా దాశరథి కృష్ణమాచార్య పురస్కారం ఏర్పాటు చేసి, ప్రతి ఏటా ఆ పురస్కారాన్ని సాహిత్య రంగంలో విశిష్ట సేవలను అందించిన వారికి ప్రధానం చేయడం జరుగుతుంది. భాషానిలయం స్థాపనలో కీలకపాత్ర వహించిన రావిచెట్టు రంగారావు జయంతి సందర్భంగా వారి జ్ఞాపకార్థంగా రావిచెట్టు రంగారావు తెలుగు భాషా వికాస పురస్కారం ఏర్పాటు చేసి, ప్రధానం చేయడం జరుగుతుంది.

పి.వి.నరసింహారావు గారి జయంతి సందర్భంగా పి.వి.నరసింహారావు గారి స్మారక పురస్కారం ఏర్పాటు చేసి, ప్రముఖులకు ఇవ్వడం జరుగుతుంది.

రావిచెట్టు లక్ష్మీనరస్మమ్మగారి జ్ఞాపకార్థం రావిచెట్టు లక్ష్మీనరస్మమ్మ స్మారక పురస్కారం ఏర్పాటు చేసి ప్రధానం చేయడం జరుగుతుంది. డా.ఎమ్.ఎల్. నరసింహారావుగారి జయంతి సందర్భంగా ఎమ్.ఎల్. నరసింహారావు సాహిత్య సేవ పురస్కారం, సాహిత్యంలో బహుముఖీన ప్రజ్ఞ కనబరిచి, భాషావిస్తృతికి పాటుబడిన వారికి అందజేయడం జరుగుతుంది. వీటితోపాటు మాడపాటి హనుమంతరావుగారి జయంతి, రాజాబహద్దూర్ వెంకటరామిరెడ్డిగారి జయంతుల సందర్భంగా స్మారక ప్రసంగాలు ఏర్పాటు చేయడం జరుగుతుంది.

**ముగింపు:**

తెలుగుభాషాపునరుజ్జీవన నిలయాలేఈభాషానిలయాలు. భాష అంతరించి పోతుందనుకున్నతరుణంలో, భాషమనుగడే ప్రశ్నార్థకం అవుతున్న క్లిష్టపరిస్థితుల్లో, ఆ బాధ్యతను ఈ భాషానిలయాలు స్వీకరించాయి.

శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయం మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా సాంకేతికతను జోడించుకొని, ప్రాచీన అమూల్యమైన గ్రంథాలను డిజిటలైజేషన్ చేయాలి. వాటిని అంతర్జాలంలో అందుబాటులోకి తీసుకువస్తే భాషాంతరాలను పూడ్చివేసి, భాషకు సజీవత్వాన్ని కల్పించి, తరతరాలకు భాషా సాహిత్యాలను అందించడంలో, భాషాపరిరక్షణలో శ్రీ కృష్ణదేవరాయాంధ్ర భాషానిలయం ముందంజలో ఉంటుంది.

రచయిత డా.బండారి ప్రేమ్‌కుమార్
హైదరాబాదు(ఖైరతాబాద్)లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సహాయ ఆచార్యులు

## మైళ్ళ దూరంలో.... 32వ పుట తరువాయి

ఆసక్తికరంగా, భాషానైపుణ్యాలు పెంపొంధించేవిధంగా వుండాలి. పాఠ్యాంశాలు కుల, మత, వర్గాలకతీతంగా విద్యార్థుల మూర్తిమత్వ వికాసానికి తోడ్పడే విధంగా రూపొందించాలి. మానవీయ జీవన విలువలు, జాతీయ అంతర్జాతీయ శాంతి సౌభ్రాతృత్వాలు పెంపొందించే పాఠ్యాంశాలు పొందుపరచాలి.

పాఠ్యాంశాలు విద్యార్థి సమగ్రాభివృద్ధికి భౌతిక, సామాజిక, సాంస్కృతికాభివృద్ధికి తోడ్పడే విధంగా ఉండాలి. ఇవి భాషా సామర్థ్యాలు పెంపొందించడానికి, భాషాభిరుచి కలిగించడానికి, నేర్చుకొన్న భాషాంశాలు ఆచరణలో పెట్టడానికి మానవీయవిలువలు పెంపొందించడానికి, సంస్కృతీ సంప్రదాయాల అభివృద్ధికి, క్రమశిక్షణ, వినోద, విజ్ఞానం కలిగించడానికి తోడ్పడేవిధంగా ఉండాలి

–రచయిత అసోసియేట్ ప్రొఫెసర్, తెలుగు విభాగం,
శ్రీ రాజరాజేశ్వరి ప్రభుత్వ ఆర్ట్స్,సైన్స్ కళాశాల
(స్వయం ప్రతిపత్తి) కరీంనగర్, తెలంగాణ,

**"వ్యవహారికవాదం ప్రజాశ్రేయస్సును ఆకాంక్షించి పుట్టింది. అందుకే మానవతావాదం గిడుగు ఉద్యమానికి పునాది" –కె.వి.రమణారెడ్డి**

**"గిడుగు వారు ఎలా రాయాలో చెప్పారు కాని, ఏం రాయాలో చెప్పలేదు" –కె.వి.రమణారెడ్డి**

బద్రి కూర్మారావు
97047 98643

# అమ్మ నోటి సాయి(హి)త్యం – శ్రీకాకుళం యాస, బాసలో

మాది సికాకుళం జిల్లా. పలాస, ఉద్దానంలో రంగోయి అనే పల్లె. అమ్మ పేరు లచ్చిమమ్మ. అయ్య పేరు అప్పన్న. అమ్మకు సిన్నప్పుడే పెళ్ళి సేసారు. వారి పెళ్ళి వారికి గయితి (జ్ఞప్తి) లేదు. అయ్య మాత్రం రేతిరి బడిలో పొరుగూరు (ప్రక్క ఊరు) కరణాల వద్ద రెండక్షరాలు నేర్చుకున్నాడు. రాత్రి పూట పదాలు, రామ రామ శతకం పాడేవాడు. బర్మా గురించి, పల్లె కతలు సెప్పేవాడు. అమ్మకు అచ్చరం ముక్క రాదు. 8 మంది సంతానం. అయ్య కూడుకు సంపాదిస్తే, అమ్మ కూరకు సంపాదించేది. సెంటు భూమి కూడా లేని కుటుంబాన్ని జీవితాంతం కాయకష్టం సేసి పెంచినారు. బండెడు సంసారాన్ని మోయలేక పిల్లలు కొద్దిగా పెద్దైన తరువాత ఖుర్దారోడ్, కలకత్తా, అండమాన్‌లకు బతుకు తెరువుకు పంపించేసారు. అయ్య రాతిరి బడిలో నేర్చిన అచ్చరాలతో ఊర్లో ఉత్తరాలు రాయటం, సదవటం సేసి జీవనోపాధి సేసాడు. ఆరోగ్యం బాగులేక దేశాలు (ఇతర రాష్ట్రాలుకు) వెళ్ళలేదు.

అమ్మ ఉడుపులు (నాట్లు), కోతలు, పొలం పనులు, ఇంటి పనులు, పశువులకు గడ్డి వగైరా చూసేది. అమ్మ కోడి కూసిన పెందిళి (తెల్లవారి) లేసింది మొదలు పలకర్ర (పల్లుదోము పుల్ల) చేసి ఇంటిలో కసవలు తుడిసి, వాకిలి తుడిసి, ఆవుపేడతో కళ్ళాపి సల్లి ముగ్గులు వేసేది. శనివారం పూట అరుగులు, గడపలు అలికేది. వంటికి తానం చేసి, పసుపు రాసి రూపాయి బిళ్ళంత బొట్టు పెట్టేది. పొయ్యిలో అగ్గి రాజేసి కూడు, అంబలి, కూర, పులుసు వండేది. అమ్మకు అచ్చరము ముక్క రాదు. రాకపోతేనేమి! అమ్మ నోటి నిండా పురండాలు (పురాణాలు), సామెతలు. ఆ మాటకొస్తే మా ఊర్లో అందరి అమ్మలది అదే బాస, అదే యాస.

అమ్మగొంది (దేవుడుగది)లోకి వెళ్ళి వాసనపుల్ల (అగరబత్తి) ముట్టించి దేవుడా! నా పిల్లలకు నీవే దిక్కు, ఏ ఆపదారానీయకు, వాళ్ళు ఎక్కడకు వెళ్ళిన వారి అరికాళ్ళకు ముల్లు గుచ్చకుండా చూడు. నా పిల్లలకు జయం కలిగేటట్లు చూడు. నీళ్ళల్లముంచినా, పాలల్లముంచినా నీదే బారం అని దండంపెట్టేది. దానప్ప, గుర్రప్ప, దేవుడు (సింహాద్రప్పన్న) కు, కొండూరు అమ్మోరికి, ఉజ్జిడమ్మకు దండం పెట్టేది. నా పిల్లలకు అంబలి పొక్కంత ఆవుసు (ఆయుస్సు) ఉంటే చాలని మొక్కేది. పెనకకు అమ్మ కోకను ఊయాలగా కట్టి పిల్లలను తొగుండేసి (పడుకోబెట్టి)

పిల్లమ్మ నీకళ్ళు పిత్తపరిగులు,/ కాకమ్మ నీకళ్ళు కలువ రేకులు,/ పిల్లిరాయే! పిల్లి పిల్లలకు తల్లి..... అంటూ జోలపాడేది.

మాఊరికి బతుకు తెరువు కోసం వచ్చిన పిడిమందస పణితులు (పండితులు) వారికి జాతకాలు చూపేది. పండగపూట పెద్దలకు జావ (పాయసం), మడపల్లు (నైవేద్యం) పెట్టేది. మైనపువత్తులు (కొవ్వొత్తులు) వెలిగించేది. గాలివాన, ముసుర్లు పెట్టినప్పుడు తగ్గిపోవాలని అమ్మవార్లకు ముర్రాట (పసుపు నీళ్ళు) యిచ్చేది. ఎన్ని మొక్కులు మొక్కినా మన పని మనం చేయాలి అనేది. గాలిలో దీపం పెట్టి దేవుడా! నీవే ఉన్నవంటే కుదరదు. మన ప్రయత్నం మనం చేయాలి అనేది. ఇటిమి పున్నమి, ములుకోలు పున్నమి, గంధమామాస, చైత్రం, వైశాఖం, జేష్టం, ఆషాడం, ఆవేటి వారాలు ఇవి అమ్మ క్యాలండర్.

ఉడుపులు, కోతలకు వెళ్తే పొద్దంతా నడుము ఎత్తుకుండా పనిచేసేది. కొండకు కర్రలు (కట్టెలు) కెళ్ళి పర్వతమంత మోపు బుర్ర (తల)పై మోసుకొచ్చేది. పొలంపనులకెళ్ళి, సాయంత్రం ఇంటికొచ్చి రోకలితో ధాన్యం దంచేది. తిరగలిలో సోళ్ళు (రాగులు) ఇసిరేది. వంట చేసి తొంగున్న (పడుకున్న) పిల్లలను లేపి బువ్వపెట్టేది. ఎవ్వరైనా లచ్చిమమ్మా! నీ జీవితానికి సుఖములేదేటె! అంటే ఏమిసేస్తా నప్పా (అక్క) పేదింట్లో పుడితే సచ్చిన వరకు తప్పదు అనేది.

ఇక అమ్మకు అచ్చర జ్ఞానం లేదు కాని అమ్మనోట ఎన్నెన్ని సామెతలు! అవన్నీ జీవితం కాచి వడబోసినవి. చిన్నప్పుడు విన్న ఆ సామెతలు ఇప్పుడు నా జీవితంలో ఎంతో ఉపయోగపడుతున్నాయి. అమ్మ కడుపులో నేను ఐదవ వాడను. అమ్మనోటి మాటలు వరాలమూటలు. జీవితపాఠాలు. అమ్మ అప్పుడు ఎందుకనేదో తెలిసేదికాదు. నేను భగవద్గీత, బైబిల్, ఖురాన్ చదువుకోలేదు. కాని అప్పుడు అమ్మనోట విన్న సామెతలు నా జీవితానికి ఉపయోగించుకుంటున్నాను. జీవితంలో సందర్భం బట్టి ఆ సామెతలు ఉపయోగపడుతున్నాయి. అందులో కొన్ని మచ్చుతునకలైన సామెతలు.

➪ఎన్ని జపతపంబుల చేసిన ఒక తితపప్పుకు వచ్చును? (తిత్త, పప్పా, వలపులు, దాపలు ఎద్దులు కట్టి దున్నటం) అనగా రైతులు పంటలు పండించకపోతే ఎన్ని జపతపములు చేసినా ఏమి లాభం అని అర్థం.

➪అమ్మ! అమ్మోరుకు కోడికోస్తున్నాం. అమ్మోరు తింటాదా అని అడిగితే అమ్మవారిది ఆయ....మనది గాయ అనేది.

➪ఇంతమంది దేవుళ్ళ ఎందుకమ్మా! అంటే ఏకోనారాయణ అనేది. సత్తులు (శక్తి) ఒక్కటే. పేర్లు వేరనేది.

➪అమ్మ వచ్చి ఏడు మనం పండుగ బాగాచేసుకుందామా? అంటే ఎందుకు నాయనా ముందు ఆలోచనలు ముదుకులు తెగుతాయనేది. (అనగా దేనిని అతిగా ఊహించుకొని సంబరపడొద్దని దానర్థం)

➪లచ్చిమమ్మా! పిల్లలు ఎలాఉన్నారే, ఏమి చేస్తున్నారు అని ఎవ్వరైనా అడిగితే ఏమి చేస్తాం అప్పాకాసి, పూసుకున్నాం గాని వారి కర్మలు మనం ఇవ్వలేము కదా! అనేది.

➪అమ్మకు బాగా విసిగిస్తే, నాకళ్ళు మూసుకుపోతే నెనెక్కడో మీర్కెడో అనేది. అమ్మ అప్పుడప్పుడు పిల్లలకు తిండి పెట్టి తను పస్తులుండేది. అమ్మ పనిచేసుకుంటూ సందర్భం బట్టి పలికిన పలుకులలో మరికొన్ని.

➪వానరాకడ ప్రాణం పోకడ ఎవరు చెప్పగలరు.
➪నిందలేక బొంది (ప్రాణం) పోదు.
➪అలుడు (అల్లుడు)కు బలుదు, బలుదుకు బ్రహ్మదేవుడు.
➪సా(చా)వు సొరగం, పురుడు పుణ్యం.
➪ఒళ్ళువంగని వాడికి ఇల్లు యచ్చాయం (వ్యవహారం) అబ్బదు.
➪మారటితల్లి (సవతి)కి పిల్లలు పోతేనేమి. కంబారోడికి (పాలేరు, పనివాడు) బక్కలు (పశువులు) పోతేనేమి.
➪పత్తేత్త (పతివ్రత) పందిరేస్తే తొండొచ్చి తోసేసింది.
➪కోడలుకి చెప్పి అత్త తెడ్డునాకింది.
➪పరుగెట్టి పాలుతాగడం కంటే నిలబడి నీరుతాగడం మేలు.
➪ఊరుని చూసి ఉడత గుడ్లు పెట్టింది.
➪శకునాలు చెప్పే బల్లి కుడితిలో పడ్డాది.
➪ఒక ఊరి నాయుడు ఇంకో ఊరికి బారికి.
➪రోగానికి మందుగాని యోగానికి మందులేదు
➪ఆడపిల్ల జీవితం అరిటాకులాంటిది.
➪కొండంత ఎండకు ఓర్వగలం గాని సిండంత చినుకుకు ఓర్వలేము
➪మహరాజ అంటే! మరిరెండు తన్నమన్నాడట.
➪పుట్టుకతో వచ్చిన బుద్ధులు పుడకలతో గానిపోవు.
➪అడవికొట్టిన వాడికి మూడు అణపతాలు (మాటలు) చెప్పేవాడికి ఆరు.
➪పిత్తుకు జడిసి పప్పువండటం మానేస్తమా?
➪ఎవరి కర్మకు వారే కర్తలు.
➪మనమతులెలా ఉంటే, మనగతులు అలానే వెళ్తాయి.
➪అడ్డాలు నాడు బిడ్డలు గాని గడ్డాలు నాడు బిడ్డలా?
➪ఆకలేనపుడు వాకాయపండైన చాలు.
➪ఏమే సాని నీ ఆట ఒంకర అంటే మీ వాకిలే వంకర అన్నదట.
➪చెడిపోయి స్నేహితుని దగ్గరకు వెళ్ళాలి. బతికి బాగారి (దాయాది దగ్గర ఉండాలి.
➪స్నేహమే పిడికెడు ధనం. అలాగని అధిక స్నేహం పనికిరాదు.
➪దిక్కులేని వారికి దేవుడే దిక్కు.
➪విచారమే ముసలి (తనం) సంతోషం సగం బలం.
➪ఏది జరిగినా మన మంచికే.
➪కాళ్ళు (య) కష్టాన్నే నమ్ముకోమంది.
➪ఆకాశానికి భూమికి మధ్య వంగి ఉండమంది. (అంటే అణకవుగా).
➪నాలుక దాటితే నరకమే (ఎంత రుచికరమైన పదార్థమైన గొంతులోకి వెళ్ళిన వరకే)

రోజంతా ఇలా ఎన్ని సామెతలో, అమ్మనోటి నుండి అలా వరుసగా వచ్చేవి. ఈ సామెతలన్ని తరువాత నా జీవితంలో ఎన్నో సందర్భాలలో ఉపయోగపడ్డాయి. ఉపశమనమిచ్చాయి. ఇన్ని మంచిమాటలు చెప్పిన అమ్మ ఇప్పుడు లేదు. అమ్మతోపాటు ఈ భాష, సాహిత్యం అంతరిస్తోంది. జీవితసత్యం చెప్పే తల్లులు లేరు. ఈ అనుభవాలు చెబితే విని వంటబట్టించుకున్నవారులేరు.

ఇప్పుడు పల్లెలలో కూడా మమ్మీ డాడీ చదువులొచ్చాయి. అమ్మనాన్న పిలుపులు లేవు. అమ్మభాషలేదు. సెల్, టివిలు తప్పా పిల్లలకు అమ్మ భాష అక్షరాలు నేర్పడం కూడా కష్టమైంది. తిరిగి రాని లోకానికి వెళ్ళిన అమ్మ నోటిమాటలు ఇంకా చెవిలో రివ్వుమంటూనే ఉన్నాయి. అ

## మైళ్ళ దూరంలో...

35వ పుట తరువాయి

వైట్ హెడ్ పండితుడు ప్రతిపాదించిన సిద్ధాంతం ననుసరించి గణదేవతా ప్రతీకగా భావింపబడుచున్న జంతువు శక్తి కాలేయము ద్వారా సంక్రమించునను ప్రతీకగా భావింపబడుచున్న జంతువు శక్తి కాలేయము ద్వారా సంక్రమించునను నమ్మకం నాధారం జేసుకొనియే ఈ ఆచారంఏర్పడవచ్చును. బీరప్ప పండుగ సందర్భంలో బలిగా నిచ్చిన గొట్టెల యొక్క కాలేయాన్ని నూనెలోవేయించి ఆ ముక్కలను ప్రసాదంగా ఇస్తారు.

బలి జంతువు యొక్క రక్తముతో మిశ్రమమైన అన్నమును బలి అన్నమని అందురు. దీనిని ఇళ్ళపైన, పొలాలపైన జల్లినచో దేవత వానిని రక్షించునని గ్రామస్థుల విశ్వాసం, వైట్ హెడ్ రక్తాన్ని జల్లుట పేగులను మెడలో వేసుకొనుట, కాలేయాన్ని నోటిలో పెట్టుకొనుట, ఈ చర్యలన్నియు గణదేవతతో సంబంధం పెట్టుకున్నానను ప్రాచీన విశ్వాసాన్ని ప్రకటిస్తుందని ప్రవచించెను. ఈ భావనకు ఉపపాదకంగా ఆఫ్రికాయందుగల అనేక ఆటవిక తెగలలోని ఆచారాలను వివరించెను. ఆఫ్రికాలోని మమ్మెట్టర్ తెగవారు పరస్పరంగా గాయాలు చేసుకొని గాయాల నుండి స్రవించు రక్తాన్ని పీలుస్తారు. యున్యోరల కొన్లీ లోని ప్రజలు రెండు కాఫీ బెర్రీలను రక్తంలో ముంచి తింటారు.సందేహ్ తెగవారు ఒకరు గాయంలోని రక్తాన్ని మరొకరి గాయంలోనికి ప్రసరింపజేస్తారు. రక్తసంబంధంచేత విభిన్న తెగల మధ్యన సంబంధం, బంధుత్వమేర్పడునను విశ్వాసం పైన పేర్కొనిన తెగ ప్రజలలో కలదు. అదే విధంగా గణదేవతయైన జంతువు రక్తమును త్రాగుట వలన, ఇళ్ళ పైన, పశువులపైన, పొలాలపైన జల్లుట వలన, దేవతకు వానికి మధ్యన సంబంధమేర్పడునను విశ్వాసం ప్రాచీన మానవులకుండెడిదని స్పష్టమగుచున్నది. పేగులు జంతువుల ప్రాణాలకు ముఖ్యమైనవి గనుక వానిని ధరించుట. గణదేవతతో సంబంధము పెట్టుకొనుటేనని ప్రాచీనుల విశ్వాసమై ఉండవచ్చు. రక్తం ప్రాణమునకు ప్రతీకగా పురాణకాలం నుండి పరిగణిస్తున్నారు. పురాణాలలో రక్తబీజుని కథలో అతని రక్త బిందువులు ధరణిపై పడగానే వానినుండి రాక్షసులుద్భవించిరి. దేవి నాలుకను భూమిపై పరచి రక్తమునంతయు త్రాగెను. జానపద సాహిత్యంలోని గ్రామదేవతల కథలలో, పౌరాణిక గాథలలో రక్తపు బిందువుల నుండి రాక్షసులు, వీరులు జనించినట్లుగా వర్ణితం. రక్తం సఫలతకు చిహ్నమను రక్తం ప్రవహించుట, దానిని అన్నంత, మట్టితో కలుపుట సపలత కొరకు జరిపే ప్రార్థనలని, ఈ ఆచారమంతయు వ్యవసాయ ప్రధానమైనదని జానపదుల నమ్మకం.

రచయిత హైదరాబాదు విశ్వవిద్యాలయంలో అతిథి ఆధ్యాపకులు




# చంద్రిక కథ

## అరవంలో వ్రాసిన అసంపూర్ణ నవలకు

## బంగోరె 'ముందుమాటలు'

(గత సంచిక తరువాయి)

**వీరేశలింగం – భారతి : కొన్ని సామ్యాలు**

ఈ సందర్భంలో ఈ చంద్రిక కథ నవలాకర్త అయిన సుబ్రహ్మణ్య భారతి కూడా జంధ్యాన్ని తీసిపారేసి వర్ణభేదాన్ని పాటించని వ్యక్తేనని గమనించాల్సి ఉంది. భారతి జంధ్యాన్ని తీసిపారేయడమే కాదు– పాండుచ్చేరిలో ఉండగా నాగరత్నం అనే హరిజనబ్బాయికి గాయత్రీమంత్రం ఉపదేశించి జంధ్యం గింధ్యం తగిల్చి ఆ జంధ్యం యొక్క పవిత్రతను ఛిన్నాభిన్నం చేస్తాడు. ఈ సంఘటన తర్వాతనే భారతిగారు తన జంధ్యాన్ని తీసిపారేసినట్లు కె.ఎస్. రామస్వామి శాస్త్రిగారు Subrahmanyam Bharati: His mind and art (1951) అనే గ్రంథంలో పేర్కొన్నారు. భారతిగారి సోదరులు శ్రీ సి. విశ్వనాథన్ వ్రాసిన Bharati and his works(1929) అనే గ్రంథంలో కూడా భారతి ఇట్లా పేర్కొన్నట్లుగా చెప్తారు : "Well, brother, if I wear this thread, you brand me as Brahmin for ever; But I am as much a Christian, a Mussalman or a jew as I am a Brahmin. Humanity is my community and love is my creed" అని భారతిగారు అన్నారట. అంతేకాదు, కేవలం అనడమేగాకుండా ఇతర మతస్తులతో, కులస్తులతో కలిమిడిగాకల్సి భోంచేస్తూ తిరుగుతూ వర్ణభేదాల్ని దగ్గరికి రానియ్యకుండా వుండినందువల్ల భారతిగారు ఎన్నో సమకాలిక విమర్శలకు గురికావల్సి వచ్చారని ప్రేమానందకుమార్ కూడా పేర్కొన్నారు. కులవ్యవస్థతో కలుషితమైపోయిన భారతీయ సమాజం బాగుపడి వొకవిధమైన సర్వజనసౌందర్యం ఏర్పడాలంటే వర్ణాంతర వివాహాలు విరివిగా జరగాలని భారతి పలు వ్యాసాల్లో వెలిబుచ్చినట్లు కూడా చెప్తారు. తమిళ వ్యాసాల్లో ఏమి వ్రాసారో ఏమో కానీ సి.ఆర్.రెడ్డి, కె.ఎస్. వెంకటరమణి గారలు సంకలనం చేసిన భారతి ఆంగ్లరచనల్లో The crime of caste, Love and marriage అని రెండు ఉదాత్తమైన వ్యాసాల్లో నుండి మచ్చుకు కొన్ని వాక్యాలు ఉదహరిస్తున్నాను:

" The sole remedy is in inter-dining and inter-marrying.The others are mere quack remedies of an anaesthetic character... sometimes people who seem half inclined to admit the injustice and inutility of caste suddenly turn round and shout: "But they have similar prejudices in south Africa, north America and oceania... If other people are fools that is no reason why we should be such...."

(The crime of caste.)

"My youthful brothers and sisters of the Motherland, my appeal is to you: Defer marriage as long as possible, even after reaching adolscence. And when you feel sure that you have found out your soul's true companion, love, claim and win - and praise the Gods! If any self constituted guardians of effete forms and conventions stand in your way ask them to mind their own business-away!

'...........We live because we love; not because we make compromises. Love is life. Custom is nothing." (Love and marriage.)

ఈ వొకటి రెండు వ్యాసాల నుండి భారతి నవ్యదృక్పథాన్ని కొంతైనా అర్థం చేసుకోవచ్చు.

సాహిత్యపరంగా కూడా వీరిద్దరి మధ్యా కొన్ని సామ్యాలున్నాయి. వీరేశలింగంగారు కవుల చరిత్రను వ్రాసినట్లే, భారతిగారు కాంగ్రెసు చరిత్రను 50 అధ్యాయాల్లో వ్రాసారు. ఇద్దరూ సరళమైన వ్యవహారిక భాషనే అనుసరించారు. తెలుగులో వీరేశలింగంగారు సైన్సు విషయాలను గూర్చి గ్రంథాలు వ్రాసినట్లే భారతి కూడా 'మొక్కల్లో జీవం' గూర్చి జె.సి.బోస్ సిద్ధాంతాలను గూర్చి తమిళంలో వ్రాసారు. వీరేశలింగంగారు 'వివేకవర్ధని' వంటి ఫైర్ బ్రాండ్ పత్రికను నడిపి ఆ పత్రిక వ్రాతలమూలంగా కోర్టుకు లాగబడినట్లే, భారతి కూడా తమిళంలో 'ఇండియా' అనే ఫైర్ బ్రాండ్ పత్రికను నడిపారు, ఇందుమూలంగా ప్రభుత్వ నిషేధాలకు భారతి గురికావల్సి వచ్చింది కూడా – తమిళంలో మొదటిసారిగా కార్టూన్లు ప్రవేశపెట్టింది ఈ పత్రికద్వారా భారతిగారేనని అంటారు. కవిత్వం సాహిత్యంతో బాటు భారతి రాజకీయాల్లో, అతివాద రాజకీయాల్లో

తలమున్కలైనాడు.వీరేశలింగంగారు సారస్వతమూర్తి, రాజకీయాలకు దూరంగా వుండినా సంఘసంస్కరణ రంగంలో తలమున్కలై గురుతరమైన స్థానాన్ని ఆక్రమించారు.

**జి. సుబ్రహ్మణ్యయ్యర్**

వీరేశలింగంగారితోబాటు ఈ నవలలో జి. సుబ్రహ్మణ్యయ్యర్ గారు కూడా మరొక పాత్రగా ప్రవేశపెట్టబడినారు. వీరిని గూర్చి రమణారెడ్డిగారు కొంత చెప్పి ఉన్నారు, మరికొంత కూడా సంక్షిప్తంగా తెల్సుకోవాల్సి ఉంది. 1878 సెప్టెంబరు 20 తేదీన వారపత్రికగా తర్వాత కొంతకాలం త్రైవారపత్రికగా, ఆ తర్వాత 1889 నుండి దినపత్రికగా ఆవిర్భవించి నేటివరకు దాక్షిణాత్యుల అత్యంత ఆదరాన్ని పొందుతూ వస్తున్న ఇంగ్లీషు 'హిందూ' పత్రిక సంస్థాపకుల్లో వొకరుగా, దాని తొలి సంపాదకుడుగా రెండు దశాబ్దాల పాటు పనిచేసి ప్రఖ్యాతిబడసిన వ్యక్తి. జననం 1855, మరణం 1916. 1882లో 'హిందూ' పనిచేస్తూనే తమిళంలో 'స్వదేశమిత్ర' పత్రికను ప్రారంభించి, 1889లో దాన్ని దినపత్రికగా కూడా రూపొందించిన ప్రఖ్యాత పురుషుడు. 1898లో 'హిందూ'తో సంబంధాన్ని వదులుకోవల్సి వచ్చింది. పత్రికా సంపాదకుడుగా ఉండి 'సంఘ సంస్కార' భావాలకు వేదిక కల్పించిన ఆధునికుడు. ఫైనాన్స్, ఎకనమిక్స్, వ్యవసాయార్థిక విషయాలపై సర్వంకషమైన పరిజ్ఞానమున్న పత్రికా రచయితగా కీర్తిబడసిన వ్యక్తి. 1885లో అఖిల భారత కాంగ్రెస్ ఆవిర్భవించినపుడు సుబ్రహ్మణ్యయ్యర్గారు దాని సంస్థాపక సభ్యుల్లో వొకరు. బొంబాయిలో జరిగిన దాని మొట్టమొదటి సమావేశంలో మొట్టమొదటి తీర్మానాన్ని ప్రవేశపెట్టిన ఆద్యుడు అయ్యర్గారు. ఇంగ్లీషులో Some economic aspects of British rule in India (1903) అనే పుస్తకం కూడా వ్రాసారు.1897లో లండన్ వెళ్ళివచ్చారు కూడా. తన స్వదేశమిత్రన్ పత్రికలో భారతిగార్ని మొదట నియామకం చేసుకుని జర్నలిస్టుగా తీర్చిదిద్దింది సుబ్రహ్మణ్యయ్యర్‌గారే.

**కల్పనా సాహిత్య ప్రక్రియల్లో పాత్రగా వీరేశలింగం**

కథావ్యాయంలో కందుకూరివారికి స్థానం కల్పించిన కథకులలో, తెలుగు తమిళ భాషలలో సుబ్రహ్మణ్య భారతియే ఆద్యుడనడం సాహసం కాదనుకుంటాను - అన్నారు డా. రాధాకృష్ణశర్మగారు తన పరిచయవ్యాసంలో.

అరవకవి సుబ్రహ్మణ్యభారతి తన ఈ సంపూర్ణ రచనలో వీరేశలింగం గారిని పిలిచి పెద్దపీట వెయ్యకముందే, తెలుగుకవి గురజాడ అప్పారావు అంత పనీచేసి కూర్చున్నాడు. 'కన్యాశుల్కం' నాటకం తొలికూర్పు పాతాన్ని ఒళ్ళు దగ్గర బెట్టుకుని చూస్తే, ఆ నాటకకథకు నాయకస్థానంలో ఉండిన సంస్థాకల్పుడైన వ్యక్తి వీరేశలింగమేనని బోధపడుతుంది. 'వీరయ్యపంతులు' అనే నాటకపాత్రకు ఆ రచనలోవున్న కీలకస్థానాన్ని తెలుగు సాహిత్య విమర్శకులు సరిగా గుర్తించేందుకు మరి కొన్నేళ్ళయినా అవసరమయ్యేట్లుంది. అయినా అది ఇంకా వివాదంలోపడి నలుగుతుంది కాబట్టి ప్రస్తుతానికి దాన్ని విడిచేద్దాం – అన్నారు కె.వి. రమణారెడ్డిగారు తన పీఠికలో. నేనూ దీనికి 'డిటో' అంటున్నాను.

మొట్టమొదటి కన్యాశుల్క నాటకంలో నేరుగా 'వీరేశలింగం పంతులుగారు' అని వొక సంభాషణలో ప్రయోగింపబడి ఉన్నది కూడా. ప్రథమాంకం 2 స్థలంలో గిరీశం – 'వీరేశలింగం పంతులుగారు కన్యాశుల్కము విషయమై వ్రాసిన పాంప్లెంట్ ట్రంకులో నుంచి తియ్యి. మామగారికి లెక్చరు ఇవ్వడానికి కత్తీ ఖటార్నారాలి' – అనే సంభాషణ క్రింద నా 'స్కాలర్స్ ఎడిషన్' (1969)లో ఫుట్‌నోట్స్ వ్రాస్తూ – 'మొత్తం 'కన్యాశుల్కం' నాటకంలో వీరేశలింగం పేరు పూర్తిగా పేర్కొనబడింది ఈ వొక్కచోటనే. ముందు ముందు అనేక చోట్ల వీరయపంతులనీ, రాజమండ్రి అనీ, విడో మేరేజి హోము అనీ ప్రస్తావనలు కనపడ్తాయి. వీరేశలింగంగారు లేవనెత్తిన సంఘసంస్కరణ బావుటాకు వొక సమగ్ర సుందరమైన కళారూపమైన జోహారే కన్యాశుల్కమని తోస్తుంది. బహుశా ఇందువల్లనేమో – నన్నడిగితే కన్యాశుల్క నాటక నాయకుడు కందుకూరి వీరేశలింగం పంతులంటాను –అంటారు రమణారెడ్డిగారు (చూ. వారి గురజాడ వెలుగుజాడ)"– అని వ్రాసాను.

దీన్ని పట్టుకొని శ్రీ కొడవటిగంటి కుటుంబరావు గారు – 'ఈ మాటలు దాదాపు ప్రతి ఒక్కరినీ దిగ్భ్రమంలో ముంచజాలి ఉన్నాయి... ఇలా అనడానికి ఏ మాత్రం ఆధారం కనపడదు..' అంటూ – ఆయన యోధుడు, కార్యవాది, ఈయన కళాకారుడు, శిల్పి (ఎవరు కాదన్నారు? - బం.గో.రె.) అని చెప్తూ చాలా సుదీర్ఘమైన చర్చ చేసారు.కడకు 'అటువంటి అప్పారావు రచించిన నాటకానికి వీరేశలింగంగారు నాయకుడనడం, మృదువుగా చెప్పాలంటే, హాస్యాస్పదం' అని నిష్కర్షగా తేల్చిపారేశారు కుటుంబరావుగారు. ('సృజన' పత్రికలో పడిన సమీక్ష వ్యాసం.)

ఒక్కసారి కుటుంబరావుగార్ని ఆ నా ఫుట్ నోట్సులోని వాక్యాల నిజాలకు పెడార్థాలు తీయకుండా పునరాలోచించమని సవినయంగా కోరుకుంటూ వొక మాటంటున్నాను. వీరేశలింగంగారు లేకపోతే అప్పారావుగారి కన్యాశుల్కమే లేదు.ఆయన నడిపిన సంఘ సంస్కరణ ఉద్యమాలన్నిటికీ సవివరమైన కళారూపమైన దర్పణం కన్యాశుల్కం. ఆ నాటకంలో రెండు ఎడిషన్లలోనూ, నేరుగానూ పరోక్షంగానూ వీరేశలింగంగారి ప్రస్తావనలున్నాయి. గిరీశమో, రామప్పంతులో, సౌజన్యరావుగారో నాయకుడనిపించేటట్లున్నా ఈ విధంగా పరోక్షనాయకుడు వీరేశలింగమే ననిపిస్తుంది. కుటుంబరావుగారు సమీక్షా వ్యాసంలో లేవదీసినట్లుగా వారిద్దరి కార్యక్షేత్రాలు వేరైనపుడు వీరేశలింగంగారు గొప్పా, గురజాడవారు గొప్పా అనే ప్రశ్న వుత్పన్నం కానవసరం లేదు. వీరేశలింగం గారు నడిపిన బహుముఖమైన సంస్కరణోద్యమాల భూమిక కన్యాశుల్కానికి వొక విధంగా సంకీర్ణ కథావస్తువై అప్పారావుగారి కళాలోకి పరివర్తన పొంది ఆ ఉద్యమపరిధులను రసాత్మకంగా సాహిత్యపరంగా చర్చించడం జరిగిందనుకోవడంలో విడ్డూరం ఏమీ కనపడదు.

**నవలను గూర్చి నాలుగు మాటలు**

ఈ నవలను ఎన్ని కోణాలనుండైనా పరిశీలించవచ్చు. కె.ఎస్. రామస్వామిశాస్త్రిగారు తన గ్రంథంలో ఈ నవలను గూర్చి ఇట్లా పేర్కొన్నారు :

"Chandrikain Kathai is a full-dress novel but is incomplete. Though it is longish, it is amorphous and unimpressive. The story is supposed to be that of a child named Chandrika but what we have of it is

that of its aunt Visalakshi, a young widow who is eager for remarriage but fails to secure a mate and whom a married man tries to secure but fails. Social reform is much to the fore in the work but the story moves along slowly and haltingly. Bharati has introduced into it one of charming lyrics- that on Nanda Lala."
["Subrahmanya Bharati: His mind and art" (1951)]

రామస్వామిశాస్త్రి గారికి ఈ నవలలో పేర్కొనతగింది ముఖ్యంగా ఃనందలాలాః పాటగానే కనపడ్డది. భారతిగారిపాటల్లో దానికి వొక ప్రత్యేకమైన స్థానమున్నట్లు చాలామంది పేర్కొనివున్నారు. తెలుగువాళ్లమైన మనకు అందులోని తియ్యదనం అంత సులభంగా బోధపడకపోవచ్చు. అందువల్లనే నేను నవలా భాగంలో క్రింద ఫుట్ నోట్సుగా పూతలపట్టు శ్రీరాములురెడ్డిగారి తెలుగు అనువాదం కూడా ఇచ్చాను. తెలుగు అనువాదంలో ఆ పాట తియ్యదనం చచ్చిందనే అనుకోవాలి! ఏమైనా రామస్వామిశాస్త్రి గారి దృష్టి ఆ వైపుకే సాగింది.

ఇక శ్రీమతి ప్రేమానందకుమార్ ఈ నవలను మరి కాస్త ఉదారమైన దృష్టి నుండి పరిశీలించింది, ఆమె వాక్యాలను కొన్నిట్ని పరిశీలిద్దాం:

Chandrika's Story, his second attempt at writing a novel was also left incomplete at his death. The first nine chapters only remain, but these are enough to illustrate the raciness of Bharati's narrative art. The novel begins in 1901 wih an earth quake in a Village. A young widow, Visalakshi, survives along with her niece, a new-born babe, Chandrikai. Three years later, tired of the ceaseless struggle to survive with honour in the Hindu society... Two social reformers help her, and she marries an ex-sanyasin... suddenly he becomes mad, and there the story breaks off.

But, then, this is merely the prologue. As Bharati's title indicates, the central character is to be Chandrikai, who is still a child. It is possible that, in chandrikai, Bharati wanted to depict his idea of the modern girl that India needs - educated, bold,strong, fearless, and yet womanly. No doubt he wanted to describe in terms of fiction his ideas on women's emancipation and independence. But speculations apart, Chandrikai's Story has many points of interest. There is, for example, the introduction of real-life characters (like the social reformers G. Subramanya Iyer and Veeresalingam Pantulu) in a fictional narrative- something not attempted before in Tamil fiction. There is, then, Bharati posing the question : family life or asceticism? Bharati did not like the 'refusal of ascetic' at all...

We have the character of Nityananda (Viswanatha Sarma),a young sanyasi. Bharati seizes this chance to debunk the wrong notion of renunciation that long prevailed in India... when he marries Visalakshi... (and) becomes insane some years later,

Bharati hints at a Freudian cause-the result of years of suppressing Nature, followed by the sudden joys of a husband and a father.

Bharati had evidently lost his heart to Chandrikai. Her childhood is presented with poetic feeling and colourful imagery... A song that Chandrikai sings at Pantulu's house (Nanda Lala) also deserves mention here. It is a lyric on Krishna,one of the best that Bharati wrote.. Like unheard melodies, the little we see of the child Chandrikai fills with visions of the future." --[Subrahmanya Bharati
by Premanandkumar,
(Rao & Raghavan, Mysore, 1964)]

శ్రీమతి ప్రేమానందకుమార్ గారు కొంత ఉదారంగానే ఈ నవలను గూర్చి చర్చించారు. సమగ్రంగా కూడా. ఇక ఆమె నార్లగారి 'వీరేశలింగం' ఆంగ్ల గ్రంథంపై, మొదటనే పేర్కొన్న 'స్వరాజ్య' పత్రిక సమీక్షావ్యాసంలో ఆమె ఈ నవలను గూర్చి వ్రాసిన వాక్యాలను కూడా దిగువన ఇస్తున్నాను.

"In his unfinished novel Chandrikayin Kathai, Subrahmanya Bharati introduces Veeresalingam Panthulu and his wife as two benevolent characters with an important mission. There are charming passages which bring out the domestic felicity of this aged couple and the warm hearts they posseessed towards the weak and the doun- tradden in Hindu society. That was no mere fictionalised tribute given to Veeresalingam by the great poet of Tamilnadu. Here was a living truth. For in real life, Veeresalingam was a tremendous personality and the Father of the Modern Andhra Renaissance...

"... In his (Veeresalingam's) social reform activities he was ably assisted by his wife, Rajyalakshmi. The domestic life of Veeresalingam and Rajyalakshmi has been brilliantly portrayed by Bharati in the pages (of this novel). The silent heroism of Rajyalakshmi deserves a book by itself."
("Swarajya", Nov. 2, 1968)

పైదాంట్లో ఆఖరువాక్యంలో, రాజ్యలక్ష్మమ్మను గూర్చి చెప్పిన వాక్యంలో, శ్రీమతి ప్రేమానందకుమార్‌గారు తెలుగు మహిళ గాకపోయినా – ఎంత చక్కగా అంచనా కట్టింది! వీరేశలింగం గారు తన స్వీయచరిత్రలో తన భార్య రాజ్యలక్ష్మమ్మ చనిపోయినప్పుడు వ్రాసిన వ్యాసం చదివినప్పుడు ఆమె ఉదాత్తమైన వ్యక్తిత్వం తెల్సివస్తుంది. అందుకే సి.ఆర్. రెడ్డిగారు The lives of Veeresalingam and Rajyalakshmamma are a splendid chapter in the history of Indian liberalism –– అని అంటాడు వీరేశలింగం పైన వ్రాసిన వ్యాసంలో (చూ: Speeches and Essays of Dr. C.R. Reddy, Progressive Union, Nellore, 1970.)

ఈ నవలను గూర్చి ఈ వుల్లేఖనల్ను పక్కకునెట్టి దీనికి ఎందుకు దాసుణ్ణయ్యానో చెప్పుకోవాల – వొక ఆంద్రేతరుడు వ్రాసిన నవలలో వీరేశలింగంగారు, ఆయన భార్య రాజ్యలక్ష్మమ్మ పాత్రలుగా వుండబట్టే దీనికి ప్రత్యేకతవుంది అనే ధోరణికి తెలుగువాణ్ణిగా నేను

**తరువాయి 49వ పుటలో**

మధురాంతకం నరేంద్ర
9866243659

# నా సాహిత్య ప్రపంచం



సాహిత్యం ఎన్నో తరాలుగా మాకుటుంబంలో అంతర్వాహినిగా సాగుతోంది. అయితే కథానిక అనే ఆధునిక సాహిత్య ప్రక్రియ మాత్రం నేను పుట్టడానికి ఐదారేళ్ళముందు మాత్రమే మా యింట అడుగుపెట్టింది. సరిగ్గా నేను పుట్టిన 1957 లోనే మా నాన్న రాసిన కథ ఆంధ్రపత్రిక ఉగాది ప్రత్యేక సంచికలో వచ్చింది. తన రచనా వ్యాసంగంలో దాన్ని ముఖ్యమైన మైలురాయిగా మా నాన్న భావించేవారు. నీటిలో చేపపిల్ల ఈదినంత సహజంగా నేను కథారచనను ప్రారంభించాను. నా పదారోయేట, మా కాలేజీ లెక్చరరొకాయన కాలేజీ మాగజైనుకు కథ రాయమని అడిగినప్పుడు అదేదో మామూలు పనేనయినట్టుగా ఒక మిత్రుడి జీవితాన్ని ఆధారంగా చేసుకొని రాసేసాను. తర్వాత పదేళ్ళపాటూ అచ్చులో పేరు చూసుకోవాలన్న ఏకైక లక్ష్యంతో రాస్తూవెళ్ళాను. వాటిలో ఎక్కడైనా మెరుపులు కనిపిస్తే అవి మా నాన్నవే! 1979 లో ఇంగ్లీషు ఎంఏలో చేరినప్పటినుంచీ 1983లో ఏం ఫిల్ ముగించేవరకూ నేనేమీ రాయలేదు. పూర్తిగా చదువుపైన్నే దృష్టి పెట్టాల్సి వచ్చింది. 1984 లో మళ్ళీ కథలు రాయడం మొదలుపెట్టేటప్పటికి నా ధోరణి పూర్తిగా మారింది. ఒక్కమాటలో చెప్పాలంటే నావైన కథల్ని రాయడం అప్పుడే ఆరంభించాను. అప్పటికి మా తమ్ముడు కూడా రాయడం ప్రారంభించాడు. 1990 వచ్చేసరికి మేమిద్దరమూ మా మా బాణీల్లో కథలు రాయడంతో సాహితీ ప్రపంచంలో మాదైనా ఉనికి మాకొచ్చింది. మేము రాయడం ప్రారంభించేసరికే మా నాన్న పేరున్న కథకుడు. అయినా ఆయనెప్పుడూ గురుపీఠాన్నెక్కాలని గానీ, తన అభిప్రాయాల్ని మా పైన రుద్దాలనిగానీ అనుకోలేదు. గొప్ప సాహిత్య ప్రజాస్వామిక వాతావరణంలో స్వేచ్ఛగా ఎదిగే అవకాశం కల్పించారాయన. నాకు సాహిత్య అకాడమీ అవార్డును ప్రకటించిన తర్వాత చాలా మంది మిత్రులు, సన్నిహితులూ తండ్రికీ, కొడుక్కీ యిలా అవార్డు రావడం యిదే తొలిసారని హర్షం వెలిబుచ్చారు. దానికి క్రెడిట్ అంతా మా నాన్నదే అన్నదే నా సవినయ సమాధానం. ఆంగ్లసాహిత్యాన్ని బోధించడం, పరిశోధనలకు పర్యవేక్షకుడుగా వ్యవహరించడం నా మనో పరిధిని బాగా విస్తరించాయి. క్రమ క్రమంగా రాయడమన్నది ఒక సాహస యాత్ర అనీ, నాలోలోపలికి తొంగిచూసుకోడానికో సాధనమనీ , ప్రపంచాన్ని అర్థం చేసుకోడానికో వేదిక అనీ, సత్యాన్వేషణకో మార్గమనీ తెలుసుకున్నాను. రచయిత తనకోసమే రాసుకుంటాడనీ, ఆదారిలోనే ఇతర పాఠకుల్నీ చేరుకుంటాడనీ నేను తెలుసుకున్నాను. నా చుట్టూ వున్నవ్యక్తులు నాకు భిన్నంగా లేరనీ, నన్ను అర్థం చేసుకోడంద్వారానే యితరుల్నికూడా అర్థం చేసుకోగలుగుతున్నాననీ తెలుసుకున్నాను. రాయడమన్నది నాకో సాహసకృత్యంగా పరిణమించింది. నా బాటను నేనేవేసుకుని, యితరులెవరూనడవని బాటలో నడవడం నాకిష్టమనీ, నా ప్రయాణమలా సాహసమవుతుందన్న నమ్మకం కలిగినప్పుడే బయలుదేరడానికి వుత్సాహం ఉంటుందనీ తెలుసుకున్నాను. .

నాఉద్యోగమూ, జీవితమూ, వెసులుబాటునిచ్చిన పరిధిలోనే రాయడం కొనసాగించాను. కథావస్తువుకోసం పనిగట్టుకుని వెతుకులాడ్డం నాకు రుచించని అంశం. చాలాకాలం పాటూ నన్ను వదలకుండా వెంటాడే అనుభవాలకూ, అనుభూతులకూ సాహిత్య వ్యక్తీకరణనివ్వడానికి ప్రయత్నించాను . సాహిత్యం జీవితానికో ఉపనది మాత్రమేనని నమ్ముతాను. జీవితంలోనూ, సాహిత్యంలోనూ చాలా ప్రశ్నలకు సమాధానాలు దొరకవనీ, అయినా రచయితలు సమాధానాలకోసం, సత్యం కోసం వెతుకుతూనే ఉండాలనీ నమ్ముతున్నాను. జీవితానికీ సాహిత్యానికీ మధ్య స్పర్థొకటి కొనసాగడం నేను గమనించాను. రచయిత వాస్తవాన్ని గమనించి వ్యక్తపరిచేలోగా, అది అనూహ్యమైన మార్పులుచెంది, భిన్నరూపాల్ని పొంది, సాహిత్యాన్ని పరిహసిస్తూవుంటుంది. క్షణాల్లో చేజారిపోయే ఆ కదలికను పట్టుకోవడంకోసం రచయితలు ప్రతీకలు, ఉపమానాలు, మెటాఫర్లు, మాంత్రిక వాస్తవికత మొదలైన కళాత్మకమైన ఉపకరణాల్ని వాడుకోవాల్సివుంటుంది. ఎప్పటికప్పుడు అలాంటి ఉపకరణాలను కొత్త వాటిని కనిపెట్టడంద్వారా రచయితలు తమను తాము ఆధునీకరించుకోవాలని తెలుసుకున్నాను. ఒకే మూసలో రెండోసారి రాయడమన్నది నాకు విసుగ్గావుంటుంది. కొత్త పద్ధతుల్ని నేర్చుకోవడం, కనిపెట్టడం నాకు అనివార్యమైపోయింది. నాకు నాతోనూ, నేనున్న ప్రపంచంతోనూ సామరస్యం కుదుర్చుకోడానికి రచన ఒక మానసికమైన అవసరంగా పరిణమించింది. రచన మనసులోకి నిశితంగా చొచ్చుకుపోయే ప్రక్రియగావడంతో రాయడం బాధ అనీ, వ్యధ అనీ అవగతమయ్యింది. కానీ కథనో, నవలనో ముగించినప్పుడు దొరికే ఎపిఫానీ అనిర్వచనీయమైన ఆనందాన్ని కలిగిస్తోంది. మరో రచనను చేపట్టాలనే కోరికను పుట్టిస్తోంది.

తిరుపతిలో ఇల్లుకట్టుకున్నప్పుడు శ్రామికుల్ని దగ్గరగాచూసే అవకాశం దొరికింది. భౌతిక శ్రమే పెట్టుబడిగా జీవించే ఆ సాదా సీదా మనుషుల్లో మానవజీవన చలనసూత్రాలు స్పష్టంగా కనబడతాయి. జ్ఞాపకాలై వెంటాడిన వాళ్ళ జీవితాలానాధారంగా చేసుకుని వరసగా 14 కథలు రాసాను. 15 వ కథ కథా పరిధిని దాటి నవలై పోయింది. ఆ పద్నాలుగు కథలనూ కలిపి ప్రచురించిన సంపుటికి రెండేళ్ల

పద్నాలుగు అని పేరు పెట్టాను. రెండేళ్లు పద్నాలుగవడం గణితంలో సత్యమే. అయితే రెండేళ్ళలో రాసిన పద్నాలుగు కథలన్నది దానికున్న యింకో అర్ధం. ప్రతికథలోనూ పైకి కనిపించే కథతోబాటూ, మరో నిగూఢమైన అంతరార్ధం వుండేలా ఆ కథలు రూపొందాయి.నాటకానికి అంతగా ప్రాచుర్యంలేని ప్రాంతంలో నేనున్నాను. కానీ నాటకప్రక్రియ నాకెంతో యిష్టం. ఆకాశవాణి శ్రవ్యనాటకాల్ని రాసే అవకాశాన్ని నాకిచ్చింది. నేను రాసిన నాటకాలన్నీ నేను రాసిన కథలనాధారంగా చేసుకుని రాసినవే! కథల్ని నాటకాలుగా మలిచే క్రమంలో ఆ వస్తువుల్ని మరోసారి తరచి చూడడం, ఒకోసారి విస్తరించగలగడం థ్రిల్లింగ్ గా ఉంటుంది.నేను పంతొమ్మిదేళ్ళప్పుడు తొలినవలను రాసాను. రెండు దశాబ్దాలక్రితంవరకూ బాగా ప్రాచుర్యంలోవుండిన తెలుగునవల ఆధునీకరించుకోడంలోమాత్రం వెనుకబడిపోయింది. నవలారచనకు పరిశ్రమ, పరిశోధనా చాలా అవసరం. ఒక గ్రామం పట్టణంగా పెరిగేతీరును భూచక్రంలోనూ, మతాలవుట్టుకా, మతచాందసధోరణులగురించి ఆంస్టర్‌డాంలో ఆద్భుతం లోనూ, ప్రజాస్వామ్యం నిరంకుశత్వంగా మారి అహంకారులు నాయకులయ్యేతీరును కొండకింద కొత్తూరులోనూ చిత్రించడానికి పూనుకున్నాను.

సంగీత కళ గురించిన లోతుపాతులు నాకు తెలియవు. అయితే చిన్నప్పటినుంచీ కర్ణాటక సంగీతాన్ని వినడం నాకిష్టం. దశాబ్దాలుగా ఇంగ్లీషు దినపత్రికల సాంస్కృతికానుబంధాల్లో వచ్చే సంగీతాన్ని గురించిన వ్యాసాల్ని చదువుతున్నాను. సంగీతం నుంచీ, సంగీతకారులనుంచీ రచయితలు నేర్చుకోవలసినదెంతో వుంది. ఈ మధ్యకాలంలో గొప్ప సంగీత విదుషీమణుల జీవితకథలు చాలా వచ్చాయి. వాటిలో కొందరు స్త్రీలు అలా వచ్చి, ఆ ముఖ్య వ్యక్తి జీవితంలో గణనీయమైన పనేదో చేసి, యిలా మాయమైపోయారు. వాళ్ళ ఉనికీ, అస్థిత్వమూ నిరాదరణకు గురయ్యాయనే బాధ నన్ను చాన్నాళ్లు వెంటాడింది. వాళ్లందరికీ గొంతు నివ్వాలనే కోరికలో నుంచీ, నిమనోధర్మం పరాగం నవల భీజమై పుట్టి పురివిప్పుకుంది. ఒక ప్రసిద్ధమైన సంగీతకారిణి జీవితాన్ని అవసరమైనంతమేరకు దారం లా తీసుకుని దానికి మిగిన స్త్రీల జీవితాల్ని పువ్వులుగా కుట్టి ఈ నవలామాలికను తయారుచేయడానికి సిద్దమయ్యాను. ఆ ప్రముఖ విదుషీమణి జీవితంలో అందరికీ తెలిసిన విషయాలెన్నున్నాయో, తెలియకుండా కల్పన చేయడానికి కావాల్సిన ఖాళీలన్ని ఉండడం నాకు దోహదపడింది. ఆమె అందరికీ తెలిసిన వ్యక్తి గావడంతో పాఠకుడికి ఆసక్తిని కలిగించడం సులువయ్యింది. అయితే యింతా చేసి ముందుగా నేను పట్టుకున్నదొక తీగను మాత్రమేననీ, దాన్ని లాగి , నేను నాకు తెలియకుండానే పెద్ద డొంకనంతా కదిలించాననీ ఆ తరువాతే నాకు తెలిసింది.

పితృస్వామిక వ్యవస్థ దక్షిణ భారత దేశంలో దేవాలయాలకోసం దేవదాసీలనే పవిత్రమైన కులాన్ని తయారుచేశామని భుజాల్ని చరచుకుంది. దేవాలయాల్లో దేవదాసీల నృత్య సంగీతాలను నిషేధించడంద్వారా అప్పటి బ్రిటీషు ప్రభుత్వం వాళ్ల జీవితాల్ని అతలాకుతలం చేసేసింది. పితృస్వామిక వ్యవస్థ నిర్దాక్షిణ్యంగా,దుర్మార్గంగా వ్యవహరించిన క్రమం లోనే దేవదాసీలకొక room of their own తయారయ్యింది. దానిలో జీవిస్తూ వాళ్ళు అయిదారు శతాబ్దాల పాటూ, కర్ణాటక సంగీతాన్నీ, సదర్ అనే భారతనాట్యాన్నీ దీపధారులుగా మోసుకొచ్చారు. వారెన్నుకున్న కళల్లో అనితరసాధ్యమైన నైపుణ్యాన్ని ప్రదర్శించారు. వాళ్ళ జీవితాల్ని చిత్రిస్తున్నప్పుడు కళకూ కళాకారుడికీ , స్త్రీకీ పురుషుడికీ, మనస్సుకూ శరీరానికీ , మధ్యవుండే సంబంధాలను విశ్లేషించే అరుదైన అవకాశం దొరికింది.అంతే గాకుండా ఈ నవల నాకూ, నాదైన తొండనాడనే ప్రాంతానికీ, తెలుగూ తమిళమూ చేయీ చేయి పట్టుకుని శతాబ్దాలపాటూ నడచిన దక్షిణ భారతదేశానికీ మధ్య వుండే ప్రగాఢమైన అనుబంధాన్ని ఎరుకకు తెచ్చింది. కన్యాకుమారినుంచీ, చెన్నయ్ వరకూ వ్యాపించిన ఈ విశాలమైన ప్రాంతపు ఏకీకృతమైన విశిష్టమైన సంస్కృతిని చూపెట్టింది. తెలుగు తమిళ స్నేహంలో గొప్ప సాహిత్యమూ, సంగీతమూ, నాట్యమూ విలసిల్లాయి. నాకు చిన్నప్పటినుంచీ కర్ణాటకసంగీతమంటే వుండే యిష్టం ఈ ప్రాంతపు ప్రభావంనుంచే పుట్టిందని తెలుసుకున్నాను. చెంజి కోట దగ్గరున్న వెంకటాపురం అనే కుగ్రామం నుంచీ మా ముత్తాత అప్పటి ఉత్తర ఆర్కాట్ జిల్లాలో ఉత్తరపు చివర్లో వుండే రవణయ్యగారిపల్లె అనే యిరవయ్యియిదిళ్ల వూరికి, ఆ ఊరివాళ్ల అభ్యర్ధనతో తెలుగు బోధించటానికి వలసొచ్చాడు. దానితోబాటూ ఆట అని పిలిచే జానపద నాటకాల్నీ నేర్పించడం ఆయన పని. అవన్నీ రామాయణ, భారత, భాగవత కథల నాధారం చేసుకున్న పద్య నాటకాలే! భాషాప్రయుక్తరాష్ట్రాలనే పేరుతో దక్షిణ భారతదేశమంతా వ్యాపించిన తెలుగు వాళ్ళను చిన్న రాజకీయ హద్దుల్లోకి లాక్కురాలేని పరిస్థితుల్లో జరిగిన సాంస్కృతిక విధ్వంసాన్ని ఇంతవరకూ గుర్తించలేకపోయాం. కొన్ని దశాబ్దాల క్రితం తొండనాడు అని పిలవబడిన ఈ ప్రాంతపు విశిష్టమైన సంస్కృతీ, నాగరికతల వారసత్వాన్ని మళ్ళీ అందిపుచ్చుకోవాల్సిన బాధ్యతను ఈ నవలారచన గుర్తు చేసి హెచ్చరించింది.

రాయడం ముగించాక నాకోసం మరో సాహస యాత్ర వేచివుందని తెలిసింది.యిప్పుడు నేను మరో కొత్త నవల ప్రారంభంలో నిలబడివున్నాను.(మార్చి 12 న కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీతల స్వీయ పరిచయాల సభలో చేసిన ప్రసంగపు సంక్షిప్త రూపం)

---

ఇంగ్లీషు నుంచి తెలుగు అనువాదం :
దాసరి అమరేంద్ర

**“ బహుముఖ ప్రజ్ఞావంతుడు విభిన్న రంగాలలో విశిష్ట విజయాలను సాధిస్తాడు. ఇతరులకు అసాధ్యాలుగా తోచేవాటిని తన దీక్షతో, దక్షతతో ప్రజల కోసం పాటుపడి సఫలం చేసినవారు ఆ కార్యసాధన కోసమే పుట్టారని లోకులు భావించడం మన పూర్వాచారం. అలాంటి ప్రసిద్ధులను కారణజన్ములని లోకం కొనియాడుతుంది.” – ఆరుద్ర**

పి. శివరామకృష్ణ 'శక్తి
94414 27977

# శంకరన్ గారి తరం ముందు-తరువాత-2



**శంకరన్, ఏజెన్సీ భూముల సర్వే కార్యక్రమం. గురుకుల పాఠశాలలు ప్రారంభించారు. ఆహారభద్రత అమలుకోసం సుప్రీం కోర్టు నియమించిన కమిషనర్‌గా కొంతకాలం పనిచేసారు. అటవీ హక్కుల గుర్తింపు చట్టం అమలుకు రూల్స్ తయారు చేసిన కమిటీకి అధ్యక్షత వహించారు. కన్నబిరాన్‌కు అనుంగు మిత్రులు.**

షెడ్యూల్ జాతుల తెగల కమిషనర్‌గా పనిచేసిన బి.డి శర్మ గిరిజన సమస్యల పరిష్కారానికి అటవీ సంరక్షణ చట్టానికి ఆరు మార్గదర్శక సూత్రాలను రూపొందించారు. గిరిజన ప్రాంతాలకు ప్రత్యేకమైన పంచాయతీ రాజ్ చట్టం రావటానికి పునాది వేసిన (పేసా) భూరియా కమిటీ నివేదిక తయారు చేయటంలో పనిచేసారు.., యుగంధర్, బందో పాధ్యాయలు పశ్చిమ బెంగాల్ లో భూసంస్కరణల అమలులో పనిచేసారు. బీహార్ ముఖ్యమంత్రిగా నితీష్ కుమార్, బందోపాధ్యాయ నాయకత్వంలో భూసమస్యలమీద ఒక కమిటి వేసారు. భూస్వాముల సమాచారం ఇవ్వవలసిందిగా ఆయన మార్క్సిస్ట్ లెనినిస్ట్(మాలె) గ్రూప్‌లను అడిగితే, మీ దగ్గర ప్రభుత్వ రికార్డులు ఉంటాయికదా మీరే చూసుకోండి అన్నారని ఆయన ఎకనామిక్ పొలిటికల్ వీక్లీలో రాసారు. వసంతాడ రామలింగాచారి శ్రీకాకుళోద్యమం అనుభవాలలో శ్రీకాకుళం కలెక్టర్‌గా ఉన్నప్పుడు, పార్వతీపురం కుట్రకేసులో సికిందరాబాద్ జైలులో ఉన్నప్పుడు, యుగంధర్ తనను కలిసినట్లు రాసారు.

అయితే భూమి రికార్డులు నవీకరించి ముందే పంచి పెట్టి, కబ్జాదారుల తనిఖీ చేపట్టాలనే పశ్చిమ గోదావరి, ఖమ్మం గిరిజనుల ఉద్యమానికి స్పందిస్తూ మార్గదర్శకాలు జారీచేయటంలో ప్రముఖ పాత్ర వహించిన వారు, అధికారులలో మరోవర్గంలో సాంఘిక సంక్షేమ ముఖ్యకార్యదర్శి స్మరజిత రే. 87లో శంకరన్ వగైరాలను బందీ చేసి నక్సలైట్లను విడిపించుకుంటే, స్వచ్ఛంద సంస్థ నాయకత్వంలో '97 లో జరిగిన ఈ ఉద్యమంలో అధికారులను బందీ చేసి గిరిజనులు పోలీసు చెరనుండి తమ నాయకులను విడిపించుకున్నారు' 'వెలుగు'లో 'బేర్ ఫుట్' బృందం ముందు శక్తి ద్వారా ప్రారంభించి, తరువాత కమ్యూనిటీ సర్వేయర్‌లను, పారా లీగల్ బృందాలను ఏర్పాటు చేసింది కే.రాజు.

కమిషనర్‌గా పదవీవిరమణ చేసిన శర్మగారు కమిషనర్‌గా తను ఇచ్చిన నివేదికను పార్లమెంట్ ముందు పెట్టనందుకు కోర్టు కెక్కారు. తను కలెక్టరుగా పనిచేసిన బస్తర్‌లో ఉక్కు ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా ఉద్యమించారు. తరువాత భారత్ జనాందోళన్ వేదిక ప్రారంభించిన ఆయన అటవీ సమస్యలమీద తన ఆరు సూత్రాల అమలుకోసం పూనుకుంటే బాగుండేది. పల్లె పల్లెనా పెసా గ్రామసభలు ఏర్పాటుకోసం 'మా ఊళ్ళో మారాజ్యం' ని పిలుపునిచ్చారు. ఆ పిలుపుతో తమ పెత్తనం సమర్ధించుకునే మాలె సంఘాలకు చేరువైనారు.

పదవీ విరమణ తరువాత శంకరన్ హైదరాబాద్ నివాసం, ఆయన అభిమానులకు కేంద్రమైంది. ఆయన, తనకు అధికారులలో తనపట్లగల ఆదరణను ఉపయోగించుకుని తను ప్రారంభించిన ఏజెన్సీ సర్వే రికార్డుల అమలు,ఆరు సూత్రాల అమలు, భూమి రికార్డుల మీద పౌరహక్కుల సంఘాలలో విషయ పరిజ్ఞానం పెంపుమీద దృష్టి పెట్టి ఉంటే బాగుండేది. ఏదో ప్రజా సమస్య మీద కలిసిన వారికి, తన పూర్వ సహచరులకు ఉత్తరాలు రాసివ్వడం వరకే పరిమితమైనారు. 'ఉద్యోగులు భూమి సమస్యల పట్ల సానుకూలంగా స్పందించేలా చూడటం అవసరం'.( శంకరన్. సాహితీ మిత్రులు. 214) అనుకున్నారు గాని, ఎంతపెద్ద అధికారి అయినా, ఆ పదవిలో ఉండే ప్రాధాన్యతల బట్టి నడుచుకోక తప్పదని ఆయనకు తెలియనిది కాదు. అందువల్లనే 'ఒక వ్యవస్థ దాని నిరంతర నియమాలవల్ల పద్ధతుల వల్ల పేరుతెచ్చుకోవాలి అయితే ఎక్కడో ఒకసారి ప్రమాద వశాత్తూ జరిగిన ఘటనల వల్ల కాదు.(పుట 226. 24 గంటలు ) అంటారు కన్నబిరాన్.'శంకరన్ క్షేత్రస్థాయిలో పౌరహక్కుల ఉద్యమంలో క్రియాశీలకార్యకర్త కాదు. కాకున్నా ఆయన జీవితాంతం శ్రమించింది పౌరహక్కులు మానవ హక్కుల కోసమే. వామపక్ష భావజాల పక్షపాతిగా చెప్పుకోవచ్చు.(31)

అప్పటికే పౌర హక్కుల ఉద్యమంలో పెరుగుతున్న అవాంఛనీయ పరిణామాలను కన్నబిరాన్ ఏకరువు పెట్టారు పౌరహక్కుల ఉద్యమ రాజకీయాలలోకి,పార్టీ రాజకీయాలు ప్రవేశించి ఉండవలసింది కాదు.(169) కమ్యూనిస్టు ఉద్యమం మొత్తంగానే ఉదార భావాలను తిరస్కరించటం మొదలుపెట్టింది.అది దురదృష్టకరం ( 24 గంటలు) కాని ఆంధ్ర ప్రదేశ్‌లో పౌరహక్కుల ఉద్యమాలు ఇటువంటి వామపక్షాల మీదనే ఆధార పడ్డాయి. అందువల 'ప్రముఖులైన న్యాయమూర్తులు బేర్ ఫుట్ లాయర్స్, సామాన్యుడి ముంగిటిలోకి న్యాయం చట్టమే ప్రజల దగ్గరకు పోవటం వంటి ఆలోచనలు' (12) పౌరహక్కుల నాయకులు ముందుకు తీసుకుపోలేక పోయారు.

క్షేత్ర స్థాయిలో పనిచేస్తూ ,వామ పక్షాల ఆధిపత్య దోరణిని నిరసించేవారు వీరికి దూరంగా ఉండిపోయారు.ఈ హక్కుల రంగంలో పనిచేసిన బాలగోపాల్‌కు, లా కాలేజ్‌లో అధ్యాపకుడు సుబ్రహ్మణ్యానికి 15ఏళ్ళ పాటు రోజూ కలిసిన సాన్నిహిత్యం ఉంది.(మరపురాని లోకసంచారి.25) ఈ సుబ్రహ్మణ్యం ఒక విదేశీ సంస్థకు, ప్రభుత్వేతర సంస్థలు ఏమీ పనిచేయటం లేదని రిపోర్ట్ ఇచ్చాడు. ప్రచార సాధనాలలో

బలం సాధించిన వీరి రాతలు, వామపక్ష పక్షపాతం, క్షేత్ర స్థాయిలో గుణాత్మకంగా జరుగుతున్న కృషిని మరుగున పడేశాయి .( నల్లమల చెంచుల పట్ల బాలగోపాల్ తపన . లోకసంచారి') పీపుల్స్ వార్ పట్టు బిగించినప్పటికీ, నల్లమలలో చెంచులు ఓటర్లుగా నమోదు, ఋషుల చెరువు వారికి దక్కటం, అప్పాపూర్ పంచాయతీ ఏర్పడటం, చెంచులు ప్రచురించుకున్న వారి పాటలు' గిరిగింజ గిరిమల్లెలు' ఆయనకు ఆనలేదు. ఆయన సిద్ధాంతంలో ఖాళీలను వెతుక్కుంటూ వాటిని సవ్యంగా పూరించటం గూర్చి ఆలోచించే వారు.(108) అందువల్ల ఆయన నిజనిర్ధారణలు ప్రథమ సమాచారం (యఫ్.అయి.అర్.), పంచనామా, చార్జ్ షీట్‌లా కాక ఎకనామిక్ పొలిటికల్ వీక్లీ వ్యాసాలవలె ఉండేవి. ఆయన లెక్కల మాస్టారే కాని ప్రజలకు కావలసిన శంకరన్ రూపొందించిన అటవీ హక్కుల గుర్తింపు చట్టం లెక్కలు పట్టించుకోలేదు. నిబంధనలు , అంతకు ముందు జీవవైవిధ్యచట్టం తరహాలో సంప్రదాయ హద్దులు కాక పంచాయతిని పరిధిగా చేసాయి. ఈ లోపాన్ని చూపిన ప్రజాహిత వ్యాజ్యం గమనించి కేంద్రం నిబంధనలను సవరించుకుంది. ఈ నిబంధలను తయారుచేసిన కమిటిలో సభ్యురాలు ఢిల్లీ విశ్వవిద్యాలయం ఆచార్యురాలు నందిని సుందర్ బస్తర్‌లో సల్వాజుడుం మీద కోర్టుకెక్కారు.అప్పటికే ఒక విశ్రాంత ఉన్నతాధికారి యన్.సి సక్సేనా గుర్తింపులో లోపాలమీద నివేదిక ఇచ్చారు. ఆమె వాటిమీద కూడా పనిచేస్తే బాగుండేది. మరింత గిరిజనుల మద్దతు దొరికేది. అంతకు ముందు నందిని, పైన పేర్కొన్న ఆరు సూత్రాలలో ఒకటి ఉమ్మడి అటవీ యాజమాన్యం మీద మాత్రమే పనిచేసారు.

'హక్కుల ఆధారిత దృక్పధాన్ని హింసాయుత విప్లవం ద్వారా తేవటం సాధ్యం కాదని నాకనిపిస్తుంది.(223) పశ్చాత్తాపం కూడా ప్రకటించని వామపక్ష ఉద్యమం పేద ప్రజలకోసం వాగ్దానం చేస్తున్న సమాజాన్ని తీసుకు రాజాలదు' (377.220 24 గంటలు) అని నమ్మినప్పటికి కన్నబిరాన్, శంకరన్ ప్రభుత్వం, వారిమధ్య చర్చలకోసం కృషి చేసారు. అత్యుత్సాహంతో రిపోర్ట్ చేసిన ప్రచార సాధనాలు, పరిష్కరించవలసిన సమస్యలు , అసంపూర్తిగా మిగిలిపోయిన పనులు, అమలులో పక్కదారులు పౌర హక్కుల సంఘాల పాత్ర, ఏ స్థాయిలో ఎటువంటి నిర్ణయాలు తీసుకోవాలో నొక్కి చెప్పలేకపోయాయి. చర్చల సందర్భంగా జరిగిన ఉత్తర ప్రత్యుత్తరాలను శంకరన్ ప్రచురించారు. చర్చలకు ముందు ఏ సమస్యల కోసం చర్చ జరగాలో కూడా ప్రచురించి ఉండవలిసింది. భూమి అడవి నీరు, పోలీసు కేసులమీద పాఠాలు ప్రాథమిక స్థాయిలో పెట్టవలసిందిగా అటువంటి అధికారులు కృషిచేస్తే క్షేత్ర స్థాయిలో ఎంతో మార్పు వచ్చేది.

'ఆయన చిరునవ్వు వెనుక కొండంత దిగులు, చెరువంత విషాదం కనిపించేవి' (శంకరన్ 38) నిజమే. 'ఉద్యమాలకు భావాత్మకంగా కట్టుబడి ఉంటే చాలు, వ్యక్తిగత ఆచరణ అవసరం లేదనే వైఖరి ఇప్పుడు రాజ్యమేలుతున్నది.(మరపురాని లోకసంచారి 88) వ్యక్తిగతమైన నిబద్ధత మెప్పు పొందటంతో పాటు నిష్పాక్షికత, ప్రజలలో విషయపరిజ్ఞానం పెంచవలసిన ఈతరుణంలో శంకరన్ పేరిట 'సాహితీ మిత్రులు' తెచ్చిన ఈ సంచిక అభిమాన బృందానికి అధ్యక్షత వహించిన న్యాయవాది పి.పి రావు వాదించిన ఒక కేసును గుర్తుచేస్తూ ఈ వ్యాసం ముగించటం మంచిది.

ఏజెన్సీలో ముఠాదారీ వ్యవస్థ రద్దు చేసి రైత్వారీ విధానం ప్రవేశ పెట్టినప్పుడు, సాగు చేస్తున్నామని బొంకి కలప వ్యాపారులు వేలాది ఎకరాల అడవికి పట్టాలు తెచ్చుకున్నారు. అడ్డుగా ఉన్న చెట్లు నరికి కలప రవాణా కోసం పర్మిట్ల కోసం కోర్టు కేక్కేవారు. ఈ నరుకును నియంత్రిస్తూ ప్రభుత్వం చట్టం సవరించింది. దానినుండి మినహాయింపు ఇస్తూ, నాటి మంత్రి నేదురుమల్లి జనార్ధనరెడ్డి ఉత్తర్వులిచ్చారు. దాన్ని శక్తి తరపున న్యాయవాదిగా రామలింగేశ్వరావు సవాల్ చేసారు. ఢిల్లీనుండి రోజూ వచ్చి కలప వ్యాపారుల తరపున పిపి రావు వాదించేవారు.మంత్రి ఉత్తర్వులను కోర్టు కొట్టేసింది. పిపి రావు సుప్రీం కోర్టులో అప్పీల్ వేసారు.'శక్తి' తరపున నేటి అటార్నీ జనరల్, ముందు పి పి.రావుగారి శిష్యుడు (జూనియర్) వెంకట రమణి, శక్తి తరపున వకాలత వేసారు. ప్రధాన న్యాయమూర్తి వెంకటాచలయ్య ప్రాథమిక దశలోనే పిపి అప్పీల్ కొట్టేసారు.

**"గిడుగు ప్రతిభావంతుడే కాక కృషీవలుడు. పట్టుదల గలవాడు. స్వయంకృషితో భాషాశాస్త్రం (లింగ్విస్టిక్స్) శిక్షాశాస్త్రం (ఫోనిటిక్స్) చదివాడు. మొదట ఆయన్ను ఆకర్షించింది సవర భాష. ఆస్ట్రోఏసియాటిక్ భాషా కుటుంబం నుంచి వేరైన శాఖలు భారతదేశంలో అనాదిగా ఉన్నవి ముండా భాషలు. సవర దక్షిణముండా భాష. గిడుగు వారు మూడు దశబ్దాలపాటు ఆభాషను, సవరల సంస్కృతిని అధ్యయనం చేసి, ఆ భాషకు వ్యాకరణకోశం తయారుచేశారు. మొట్టమొదటి ముండా భాషాశాస్త్రజ్ఞుడని గిడుగుకు గుర్తింపు వచ్చింది. ఇక ఆయన సాధించిన రెండవ విజయం ఆధునిక రచనా సాధనంగా వ్యావహారిక భాషను ప్రతిష్టించడం. ఇది 30 ఏళ్ళ ఉద్యమ కృషి ఫలితం ఆధునిక భాషలో ఈనాడు రాయగలిగి, రాస్తున్న వారంతా చారిత్రకంగా గిడుగువారి రుణం తీర్చుకొంటున్న వాళ్ళే" – భద్రిరాజు కృష్ణమూర్తి**

" రామమూర్తిగారి వ్యక్తిత్వం విశిష్టమైనది. వీరేశలింగం గారి వలె ఈయన నిర్భయుడు. తను నమ్మిన ఆశయాల విషయంలో రాజీపడడు. గురజాడ అప్పారావు గారివలె లౌక్యుడు కాడు. ఆశయసాధనకోసం కష్టాల నెదుర్కోగల ధైర్యశాలి ఈయన". –చేకూరి రామారావు

ఈమని శివనాగిరెడ్డి-స్థపతి
98485 98446

## అడుగుజాడలు-ఆనవాళ్ళు:26

# మూసాపేట - సంకలమద్ది యాత్ర

తిరుపతిలో టిటిడీ నిర్వహిస్తున్న శిల్ప కళాశాలను 1960లో అప్పటి ఈవో చెలికాని అన్నారావుగారు స్థాపించారు. దేవషణ్ముఖనాథ స్థపతి వ్యవస్థాపక ప్రిన్సిపాల్. అప్పుడు కేవలం నాలుగేళ్ల సర్టిఫికేట్ కోర్సు నడిపేవాళ్లు. ప్రస్తుతం ఆ శిల్ప కళాశాలలో నాలుగేళ్ల డిప్లమో కోర్సును ఆలయ వాస్తు, శిల్పం, సుధాశిల్పం, లోహశిల్పం, దారుశిల్పం, సంప్రదాయ, కలంకారీ చిత్రకళల్లో శిక్షణనిస్తున్నారు. ఆ కళాశాలలోనే నేను 1973-77 మధ్య చదువుకొన్నాను. కె. వెంకటరెడ్డి ప్రస్తుత ప్రిన్సిపాల్. ప్రపంచ ప్రఖ్యాత సమతామూర్తి విగ్రహ శిల్పి డి.ఎన్.వి. ప్రసాద్, యాదాద్రి నిర్మాణ శిల్పులైన వేలు స్థపతి, డా. పి. సుబ్రమణి స్థపతి, సుధాకర్‌సింగ్, వెంకటరెడ్డి, మోతీలాల్, మొగిలి, బుద్ధవనం శ్యాంసుందర్, ఇక్కడి విద్యార్థులే! ఆ కళాశాలలో చిత్రకళ అధ్యాపకునిగా ఉన్న డా. గిన్నె వెంకటేశ్వరసాగర్ నన్నెప్పట్నుంచో వాళ్ల ఊరు మూసాపేట రమ్మని, అక్కడి చారిత్రక విశేషాలను పరిశీలించాలని కోరుతూనే ఉన్నారు.

మహబూబ్‌నగర్ జిల్లా, మూసాపేట ఒక మండల కేంద్రం. కర్నూలు-హైదరాబాదు జాతీయ రహదారిపై, జడ్చర్ల- కొత్తకోట మధ్యలో ఉంటుంది. అదే జిల్లా భూత్‌పూర్ మండలం, అన్నా సాగర్‌లో, ఆంజనేయ, సీతారామ రాజరాజేశ్వరాలయ సముదాయాన్ని, శిల్పకళాశాల పూర్వ విద్యార్థి భీమవరపు వెంకటరెడ్డి నిర్మించాడు. ఆ ఆలయ నిర్మాణంలో నేను గౌరవ సలహాదారుణ్ణి. ఆ ఆలయ ప్రతిష్ట కార్యక్రమం 19.8.2023 ఆ రోజు అక్కడే ఉండి, ఆ మరుసటి రోజు, మూసాపేటకు వస్తానని స్థానిక చంద్రశేఖర్‌శెట్టికి ముందుగానే చెప్పాను. రాత్రికి, భూత్‌పూర్ మున్సిపల్ ఛైర్మన్ బసవరాజ్‌గౌడ్ గారి విశాలమైన ఇంట్లో బస చేశాను.

20.8.2023 ఉదయాన్నే బయలుదేరి మూసాపేట చంద్రశేఖర్‌గారింటికి చేరుకొన్నాను. అంతకుముందు రోజు నేనుకోరుకొన్నట్లుగా, జొన్నరొట్టెలు వడ్డించారు. అవి గట్టిగా ఉన్నాయి. పెరుగు, ఆవకాయ కూడా వడ్డించారు. పుంటికూర (గోంగూర) కోసం అటూ ఇటూ చూస్తున్న నాకు, ఈ రోజు శ్రావణ ఆదివారం మా ఇంట్లో పుంటికూర వండమని తేల్చి చెప్పేసరికి కొంత అసంతృప్తికి గురైనా తిని, బయలుదేరాం. బయటికి రాగానే బసవేశ్వరుని గుడిలో, నంది ప్రధాన దేవతగా గర్భాలయం మధ్యలో ప్రతిష్టించబడిరది. శివలింగం ఒక మూలన ఉంది. దర్శనం తరువాత, గుడి ముందున్న రెండు స్థంభాలను చూచి ఇవి రాష్ట్రకూటుల (సా.శ. 9వ శతాబ్ద) నాటివని చెప్పాను. కొంచెం ముందుకెళ్లగానే చక్కటి కొయ్యశిల్పం గల స్థంభాలు, దూలాలు, బాల్కానీ, తలుపులు, ధర్వాజాలు నన్ను ముందుకెళ్ల కుండా ఆపేశాయి. కారుదిగాను. పరిశీలిస్తే దాన్ని 150 ఏళ్ల క్రితం ఒక వ్యాపార కుటుంబం నిర్మించిందని, దాన్ని వాళ్లు అలానే కాపాడుకొంటున్నారని తెలిసి, ఇంటి యజమానిని అభినందించాను. ప్రయాణం ముందుకు సాగి, జాతీయ రహదారి దాటి, అయ్యప్ప దేవాలయం తరువాత ఘాట్ రోడ్ మొదట కారాపి, కిందికి దిగాం. కొత్తగా రోడ్డు వేస్తున్నారు. ఒక ట్రాక్టర్ ఇంజన్‌పై కూర్చుని కొందరు, మోటారు సైకిళ్లపై కొందరు, ఒక కారులో మరికొందరు, మొత్తం ఇరవైమంది దాకా రామస్వామి గుట్టపైకి పోతున్నాం. ఎగుడు దిగుడు తోవ చుట్టూ కొండలు, కోనలు, పచ్చటి చెట్లు, పక్షుల కిలకిల రావాలు. ఎన్నేళ్లయిందో వాటిని విని, ట్రాక్టర్ దిగాను. చుట్టూ పరిశీలిస్తుంటే ఒక శిథిలాలయం కనిపించింది. అది వినాయకాలయమన్నారు. గుప్త నిధులకోసం, లోపల అంతా తవ్వేశారు. 10వ శతాబ్ది ఆలయం శిధిలమైంది.



మాతో వచ్చిన చంద్రశేఖర శెట్టి, వీరేశ్వర్, కొండయ్యలు, ఆ గుడికి కుడి వైపు నున్న పూడుకుపోయిన కోనేరు చూపించారు. పనికి ఆహార పథకంలో భాగంగా, ఆ కోనేరులో గుంటలు తవ్వారు. పరిశీలించి చూస్తే రెండు అడుగుల లోతున 60-30-7 సెం.మీ.ల కొలతలు గల ఇటుక రాతి గోడ పునాదులు కనిపించాయి. తవ్వి పోసిన మట్టిలో నునుపైన ఎర్రటి కుండపెంకులు కనిపించాయి. ఈ రెండు ఆనవాళ్లూ (సా. శ.1-2 శతాబ్దాల నాటి) శాతవాహన కాలానికి చెందినవేనని, ఇంతకు ముందు ఇలాంటి ఆనవాళ్లు పక్కనున్న కందూరు, రాచాలలో కనిపించాయనీ చెప్పాను.

ముందుకుసాగాం. మెట్లు కనిపించాయి, కొంచెం ఎక్కగానే ఒక పెద్ద బండ, దానికింద మరొకటి. ఒక గుహలా ఉంది. కిందిబండ పైన సా. శ. 8వ శతాబ్ది నాటి శివలింగ పానవట్టం చెక్కి ఉంది. లింగానికి చెక్కిన గుంట ఉంది. లింగం లేదు. ముందుకు పోగా, కుడివైపున ఒక మధ్యయుగాల నాటి మండపం, చుట్టూ పెద్ద పెద్ద బండలు కనిపించాయి.

ఆ మండపం, ముందు, మరోవైపు అరుగులు వాటిపైన చిన్న స్థంభాలు, లోపల నేలపై నుంచి పెద్ద స్థంభాలున్నాయి. స్థంభాలన్నీ

ఒకేలా లేవు. కొన్ని 10-13 శతాబ్దాల నాటివైతే మరికొన్ని 16-17 శతాబ్దాల నాటివి. మండపం కింద రాళ్లను పరచారు. మండపంలో ప్రవేశించి కుడివైపుకు తిరిగి చూస్తే, ఒక బండపై 9-10 శతాబ్దాల నాటి తలపై కిరీటం లేని, వినాయకుడు, నిలబడి మహిషాసురుని మర్ధిస్తున్న దేవి విగ్రహాలు చెక్కి ఉన్నాయి. రాష్ట్ర కూటుల పనితనం కనిపించింది.

ఈ విగ్రహాలకు ఎదురుగా మండపంలో మూడు ఆలయాలున్నాయి. ఒకటి చెన్నకేశవాలయం. అందులో ఒక పెద్ద పానవట్టం, రెండోదానిలో శివలింగం మూడో దానిలో చక్కటి సరస్వతి విగ్రహం ఉన్నాయి. ఇవన్నీ భిన్నమైనవే. చెన్నకేశవ విగ్రహం కళ్యాణ చాళుక్యుల కాలానిది. శివలింగం కూడా అప్పటిదే. అందరూ దాన్ని రామలింగేశ్వరుడంటారు. మాతో ఉన్న వీరేశ్వర్ మాత్రం దాని పేరు జమదగ్ని రామలింగేశ్వరుడంటారని చెప్పాడు. చెన్నకేశవాలయం ద్వార శాఖలు కళ్యాణ చాళుక్యశైలిలో ఉన్నాయి. శివాలయ గడప కాకతీయులది.



సరస్వతీ ఆలయం బయటికి రాగానే ఎడమవైపు ఒక పొడవాటి బండ కనిపించింది. సార్ ఇక్కడొక శాసనముందని కొండయ్య చెప్పాడు. దాని మీద ఒక వైపు క్రీ.శ. 17వ శతాబ్ది నాటి సప్త మాతల శిల్పాలు, మరోవైపు, శివలింగం, నంది, శాసనం ఉన్నాయి. పరిశీలించి చూస్తే అది 12వ శతాబ్ది శాసనమనిపించింది. పక్కకు తిప్పి చూస్తే అడుగున కూడ శాసనముంది. ఆ శాసనబండను మండపం బయటికి మోసుకొచ్చారు. అరుగుకు నిలబెట్టి, అక్షరాలపై విభూది పూస్తే కొంచెం కన్పించాయి. దానిమీద స్వస్తి సమస్త భువనాశ్రయ చాళుక్య కులతిలక శ్రీమత్ త్రిభువన మల్లదేవర అని చదవ గలిగాను. అది కళ్యాణ చాళుక్య త్రిభువనమల్ల ఆరో విక్రమాదిత్యునిదని చెప్పాను. దీనిలో తేదీ లేదుగాని, ఠెంకల మద్దిలోని జమదగ్ని రామలింగేశ్వరుని అర్చనల కోసం కొంత భూమిని దానం చేసిన వివరాలున్నాయి. రామస్వామి అని పిలుచుకొనే రామలింగేశ్వరు, జమదగ్ని రామలింగేశ్వరుడని, ఆ వూరి పేరు ఠెంకల (లెంకల) మద్ది అనీ ఆ శాసనంలో ఉంది. ఆ లెంకల మద్ది, ప్రస్తుతం సంకలమద్ది అయింది. ఠెంక అంటే లెంక. రాజు చక్రవర్తి, అంగరక్షకులను లెంకలంటారు. వారి అధీనంలో కొన్ని గ్రామాలుంటాయి. ఈ గ్రామంలో బహుశ లెంకలు ఎక్కువగా ఉండటాన, అక్కడొక పెద్దమద్ది చెట్టు ఉండటాన, సా.శ. 12వ శతాబ్దిలో ఆ వూరుకు లెంకలమద్ది అని పేరొచ్చిందని చెప్పాను. ఆ శాసనం చదువుతున్నంతసేపూ, ఆ వూరి వారందరి కళ్లలో వెలుగు, ముఖాల్లో ఆనందం చూశాను.

మండపం అరుగుమీద పగిలిన శిల్పం ముక్కలు కనిపించాయి. అన్నింటినీ నేలపై జోడిరచగా, ఒక చక్కటి కాల్భైరవ శిల్పమైంది. ఎంతటి పనితనం. నల్ల శాసనపు రాతిలో త్రిభంగిమలో,



ఎగిరి పడుతున్న కుక్క బొమ్మతో, కేవలం భైరవుని తల మాత్రమే మిగిలింది. చుట్టూ ఉన్న ప్రభామండలం, దానిపైన అలంకారాలు (సా.శ. 13వ శతాబ్ది) కాకతీయుల కాలం నాటిదనిపించింది. ఇంతకు ముందు, మూడో ఆలయంలో పద్మాసనంపై కూర్చుని, చేతుల్లో అక్షమాల, పుస్తకం, పాశాంకుశాలను ధరించిన సరస్వతీ విగ్రహం, భైరవ విగ్రహాలు రెండూ కాకతీయుల కాలానివేనని వివరిస్తుంటే, అందరూ ఆసక్తిగా వినటమే కాక, మా వూరికి ఇంత చరిత్ర ఉందా అని ఆశ్చర్యపోయారు. మండపంలో పరిశీలించి చూస్తే, సా.శ. 12వ శతాబ్ది సూర్యుని శిల్పం కనిపించింది. అక్కడక్కడా, పోతపోసి కాల్చిన ఇటుకలు కనిపించాయి. అవి ఆలయ శిఖరానివి. వాస్తురీత్యా 13వ శతాబ్దానివి. వీటి వల్ల, ఈ మూడు గుహాలయాలపై నగల బండల మీద ఇటుకరాతి శిఖరాలుండేవనీ వారికి చెప్పానో లేదో, సార్ పైనున్న శిఖరం దగ్గరకు రావాల్సిందేనని పట్టుబట్టారు.

సరేనని వారి వెంట బయలుదేరాను. ఈ మండపం ఎదురుగా మరో బండపై సా.శ.6వ శతాబ్ది నాటి ఆంజనేయాలయం ఇటుకలతో నిర్మించి, సున్నపు పూత పూశారు. గర్భాలయంలో ఆంజనేయుడులేడు. కొంచెం ముందుకు సాగిన తరువాత, అక్కడ చీల్చబడిన రెండు బండల పైన గల క్వారీ గుర్తులు కనిపించాయి. నాతో ఉన్న వాళ్లకు, ఆరాళ్లను ఆ కాలంలోని శిల్పులు, ఎలా విడగొట్టే వారో వివరించాను. పైకి వెళుతుంటే బండపైన 9 అంగుళాల చదరంతో 3 అంగుళాల లోతున్న ఒక గుంటను చెక్కుకొన్నారు. ఇదేమీటని చంద్రశేఖర్ అడిగాడు. ఆలయం ఉత్సవాల సందర్భంగా గానీ, లేక రాజ ప్రముఖులొచ్చినపుడుగానీ, ఈ గుంటలో ఒక కొయ్య స్థంభాన్ని పాతి, పైన గుడారంగానీ, పెద్ద గొడుగునుగానీ అమర్చే వారని చెప్పాను. ఒక్కొక్క బండ, ఎక్కుతూ రొప్పుతూ, రోస్తూ, ఒకరి వెంట ఒకరం నడుస్తూ, పైకి చేరుకొన్నాం. శిఖరాగ్రంలో ఒక లింగంపై ఇటుకలతో కట్టిన ఆలయశిఖరం. ఆశ్చర్యం. అంత ఎత్తున ఎలా కట్టారో అనిపించింది. అక్కణ్ణించి చూస్తుంటే పరిసరాలు ఆహ్లాదకరంగా ఉన్నాయి. నేను ఒక్క బండ కిందున్నాను. వారు పైకి రమ్మంటున్నారు. ముందుగా కొండయ్య, వీరేశ్వర్ ఎక్కారు. నాకు చేయినందించి పైకి లాగారు. కొంచెం లావుగా ఉండటాన, చంద్రశేఖర్‌ను ఇద్దరు ముగ్గురు కలిపి ఎలాగో పైకి ఎక్కించారు.

అక్కణ్ణుంచి చుట్టూ చూశాను. రామస్వామిగుట్ట, చుట్టూ కొండలు, కోనలు, లోయలు, జాతీయ రహదారిపై చీమల్లా కనిపిస్తున్న వాహనాలు, మూసాపేట చెరువు, కందూరు కొండ, ప్రకృతి సోయగమంతా ఇక్కడే ఒదిగిపోయిందా అనిపించింది. ఇంతలో నేను



కిందికి జారాను. జాగ్రత్త సార్ అని ఆ ముగ్గురూ నన్ను హెచ్చరించారు. అక్కడ ఒక పెద్ద రాయి రెండుగా పగిలింది. పెద్ద దానిపై ఆలయ శిఖరం నిర్మించారు. పగిలి పక్కకు ఒరిగిన బండకు నేను ఆనుకొని పకృతి అందాల్ని తిలకించి, పులకిస్తూ, జారి, ఒరిగిన బండపై చేయి పెట్టి జాతీయ రహదారిపై చూస్తున్నాను. ఆ బండపై ఏవో అస్పష్టరేఖలు కనిపిస్తున్నాయి. మొబైల్‌లో ఫోటో తీసి, పెద్దగా చేసి చూశాను. అదొక ఎద్దురేఖా చిత్రం. దాని కింద మరికొన్ని జంతువులు, మనుషుల బొమ్మలు. ఒక్కసారిగి కేరింతలుకొట్టాను. ఏమైందిసారూ అని చంద్రశేఖర్, వీరేశ్వర్‌లు అడిగారు. కొత్తరాతియుగపు ఎద్దు బొమ్మ కనిపించిందన్నాను. ఊరుకోండి సార్ ఇక్కడ ఎద్దు బొమ్మ ఎందుకుంటుందన్నారు. వాళ్లను దగ్గరకు రమ్మని చూపించాను. అవి ఎలా చెక్కారని అడిగారు. కొత్త రాతియుగంలో జంతువుల మచ్చిక, వ్యవసాయం, స్థిరనివాసం ప్రారంభమైనాయని, నిత్యం వారితో ఉన్న జంతువుల బొమ్మల్ని, తాము వాడే రాతి పనిముట్లతో చెక్కేవారనీ, వీటిని ఇంగ్లీషులో రాక్ బ్రూజింగ్స్ అంటారనీ, పక్కనున్న తాటికొండ, అస్నాపూర్‌లలో ఇలాంటివి ఉన్నాయని, ఇవి ఇప్పటికి 4000 సం. నాటివని చెప్పాను. వాళ్ల కళ్లల్లో మరిన్ని వెలుగుల్ని చూశాను.



మూసాపేట– సంకలమద్ది ఆదిమ మానవుని ఆవాసమని, అన్ని చారిత్రకయుగాల ఆనవాళ్లున్నాయని చెప్పాను.

వాళ్లంతా అక్కడి నుంచే మన వూరుకు చాలా చరిత్ర ఉందని పెద్దగా చెప్పారు. కిందికి దిగటం ప్రారంభించాం. మళ్లీ ట్రాక్టర్‌పై ఎక్కి, ఘాట్ రోడ్ దిగి జాతీయ రహదారి పక్కన చాయ్ తాగి, సాక్షి విలేకరి వెంకటేష్, ఆంధ్రజ్యోతి విలేకరి తిరుపతయ్యలకు వివరాలు చెప్పి, కారెక్కి హైదరాబాద్ బయలుదేరాం. కారులో వెళ్తన్న నాకు మిగిలిన బండలపైన శిలాయుగపు చిత్రాలేమన్నా ఉన్నాయేమో గుట్టంతా అణువణువూ గాలించాలనిపించింది. శిథిల వినాయ కాలయాన్ని, జమదగ్ని రామలింగేశ్వరాలయ మండపాన్ని పునరుద్ధరించక పోతే ఎలా అన్న ప్రశ్న వేధిస్తూనే ఉంది. ముక్కలు చెక్కలైన కాలభైరవ, సరస్వతీ విగ్రహాలను ఉన్నంత మేరకు ఖాళీలను పూరించి, కళ్యాణీ చాళుక్య శాసనాన్ని ఒక దిమ్మెపై ప్రదర్శించి, రాతికి చెక్కిన శిల్పాల గురించి, కోనేరు గురించి, చారిత్రక వివరాలతో బోర్డులపై రాసి, ప్రదర్శించకపోతే ఎలా అన్న ఆలోచనలు నా ఎదలో రోదపెడుతూనే ఉన్నాయి. ఇంతలో సార్ మీ ఇల్లొచ్చిందని వెంకటరెడ్డి చెబితే గాని నేను మళ్లీ ఈ లోకంలోకి రాలేకపోయాను. అ

## చంద్రిక కథ

42వ పుట తరువాయి

దాసుణ్ణయ్యాను. నేటి నవీన ధోరణులనుబట్టి నేడు అనంతంగా వచ్చి పడ్తున్న నవలాశిల్ప రీతుల్నిబట్టి చూస్తే ఈ నవలలో చాలా 'వీక్ స్పాట్స్' కానరావచ్చు. కాని పూర్తికాకుండా అసంపూర్ణంగా మధ్యలో చిత్తుగా వొక ముసాయిదాలా నివేదికలా వుండిపోయిన వొక రచనాశకలాన్ని బట్టుకుని రసచర్చకు శిల్పచర్చకు పూనుకొనడం న్యాయం కాదేమో.

1901లో వొక మారుమూల కుగ్రామంలో వచ్చిన భూకంపంతో నవల ఎత్తుగడ, ప్రారంభం – పెద్ద సంకేతంగానే ఉంది. కథ కొనసాగిన తీరునుబట్టిచూస్తే పెద్ద ప్రణాళిక వేసుకుని పెద్ద 'కాన్వాస్' మీద నవలను రచించాలనుకొన్నాడా అన్పించకపోదు. నవల పేరునుబట్టి చూస్తే ఇంతవరకూ సాగిన ఎనభై పేజీల కథ కేవలం 'నాందీ ప్రస్తావనలు' గానే కనపడ్తుంది. పేరునుబట్టి చూస్తే నవలలో ప్రధానపాత్ర 'చంద్రిక' కథ గాబట్టి ఇంతవరకూ జరిగిన భాగంలో చంద్రిక బాల్యం మాత్రమే ప్రస్తావనకొచ్చి ఆగిపోయింది కాబట్టి నవల పూర్తంటూ అయివుంటే విస్తృతిలో చాలా పెద్దదిగా ఉండేదని మాత్రం చెప్పవచ్చు – రచనాధోరణీ, రచనా ప్రణాళికా చూస్తే ఆఖరున 'వైద్యుల్ని గూర్చి ఇంకా చెప్పదల్చిన సంగతులు మున్ముందు చెప్తాను' అనే మాట చూస్తే ఈ నవలారూపంలో భారతిగారు చాలా చాలా విషయాలు చెప్పాలనుకున్నట్లే ఉంది. ఉత్తరోత్తరా భారతిగారు 'చంద్రిక'లో వొక భారతీయ 'మాడ్రన్ గర్ల్' కుండాల్సిన లక్షణాలన్నింటినీ పొందుపర్చి చిత్రించదల్చినట్లూ స్త్రీ జన పునరుద్ధరణ గూర్చీ, స్త్రీ స్వాతంత్ర్యాన్ని గూర్చీ ఈ నవలలో చర్చించదల్చినట్లు స్ఫురించకపోదు.

మొత్తం మీద ఇదొక పెద్ద literary piece గాకపోవచ్చు, వున్నంతలో వీరేశలింగం గార్ని గూర్చి వచ్చిన వొక చిన్న histori-cal curiosity గా మాత్రం దీనికి విలువ లేకపోలేదు, ఎంత కనీస పక్షంగా చూచినా. ఎంత సుప్రసిద్ధులయిన సమకాలికవ్యక్తులు అచ్చంగా కావ్యనాయకులు, కథానాయకులు కావడమనే సంప్రదాయం మన అలంకార శాస్త్రరీత్యా కాస్త విరుద్ధమైన విషయమే. కేవలం సమకాలిక వ్యక్తులే గాదు, సమకాలిక సమస్యలకు కూడా మన సాహిత్యం దూరంగా వుంటూ వచ్చింది. (ఈ గొడవల్లోకిపోతే పెద్ద మీమాంసే అవుతుంది గనుక వదిలేస్తాము.) అట్లాంటి దశలో కందుకూరి వీరేశలింగంవంటి తెలుగు మహాపురుషుడు – తమిళ జాతీయకవిగా ప్రఖ్యాతుడయిన సుబ్రహ్మణ్య భారతిగారి నవలకు కథావస్తువు గావడమే వొక విచిత్రమైన సంగతి గదా. ఈ వొక్క గుణంవల్లనే 'చంద్రిక కథ'కు మన 'దేశవాళీ' నవలల్లో వొక ప్రత్యేక స్థానం ఉంది.

.. ముగింపు వచ్చే సంచికలో

# లూలామాలం

జి.వి.పూర్ణచందు
9440172642

శీలంబు న్విడనాడి సిగ్గుచెడి శుష్కీభూతవృతిం గడున్
వ్యాలోలంబుగ బుద్ధినిం బఱపుచున్ వర్తించువటేగాని యే
లీలం జూచిన బారమార్థికపు జోలింబోవ దేమందు? నీ
లూలామాలపు జీవిచైదము నిలన్ లోకజ్ఞ సర్వేశ్వరా!

శ్రీ పింజల సోమశేఖరరావు వ్రాసిన సర్వేశ్వర శతకంలోది ఈ పద్యం. శీలం, సిగ్గు వదిలేసి, గాలికి తిరుగుతూ, బుద్ధి చాంచల్యంతో గడపటమేగాని, పారమార్థిక చింతన జోలికే పోకుండా లూలామాలపు బతుకు బతకటాన్ని ఈ పద్యం తీవ్రంగా నిరసిస్తోంది. లూలామాలపు బతుకు అంటే మోసంచేసి బతకటం, లూలామాలపు చేష్టలు, మాటలు అసాంఘిక జీవనానికి తొలిమెట్లు.

సాధారణంగా కవిసమ్మేళనాల్లో ఎవరు పట్టుకోగలర్లే అనుకుని ఎవరో రాసిన కవిత తెచ్చి చదవటం లాంటి లూలామాలం పనులు చేసి కొందరు దొరికిపోతుంటారు. తన మీద జాలిపడి శివుడు వ్రాసి ఇచ్చిన శ్లోకం తెచ్చి ఓ పేదకవి రాజ్యసభలో చదివాడు. నత్కీరుడనే విమర్శకుడు దాన్ని ఎర్రచేతుల్తో (రెడ్ హ్యాండెడ్) పట్టుకున్నాడు. ఓ మంచి శ్లోకం చదివితే రాజుగారు ధనసాయం చేస్తాడని ఆశించిన ఆ పేదకవికి నిరాశ ఎదురైంది. గిరి తనయా ఘన కచభారంబు సహజ గంధంబు పార్వతి కేశాలకు సహజమైన గంధపరిమళం ఉంటుంది... అనేది ఆ పద్యం సారాంశం. స్త్రీ కేశాలకు సహజపరిమళం ఉండదు కాబట్టి ఈ శ్లోకానికి బహుమతి యోగ్యత లేదన్నాడు నత్కీరుడు.

దాంతో శివుడే వచ్చి సాక్ష్యం చెప్పాడు. అయినా నత్కీరుడు ఒప్పుకోలేదు. నేను శివుణ్ణి, ఆ పార్వతి నా భార్య, నాకంటే నీకు ఎక్కువ తెలుసా? అన్నాడు కోపంగా శివుడు. తన నిజంబగు రూపం బాలోనఁ దెలుపవలెఁనని నిటలనేత్రం అంటే మూడో కన్ను తెరిచి చూపించాడు. దానికీ బెదరకుండా 'తల చుట్టు వాఁడఁ గన్నులు గలిగినఁ బద్యంబు దప్పు గాదన వశమే' తలకాయంతా కళ్ళుపెట్టుకున్నా పద్యంలో తప్పు ఒప్పు కాబోదు పొమ్మన్నాడు.

విమర్శకుడంటే ఎలా ఉండాలో నత్కీరుడు రుజువు చేశాడు. నత్కీరుడు ప్రదర్శించిన ధైర్యము, అసూయాదోషదూషితులు చేయ గలిగింది కాదు, నత్కీరుని వాదమే సమంజసమైన దనక తప్పదు అని నోరి నరసింహశాస్త్రిగారు నత్కీరుని వాదనని సమర్థించారు. తన భార్య జుట్టుకు సహజపరిమళం ఉన్న సంగతి ఒక్క శివుడికి మాత్రమే తెలుసు. ఆ విషయంలో నత్కీరుడికి ఎలాంటి అభ్యంతరం లేదు. కానీ, మనం శివలోకం వాళ్లం కాదు, ఈ లోకానికి అది విరుద్ధమే అనేది నత్కీరుని వాదన. అలా లోకవిరుద్ధమైంది లూలామాల.

ఒక ప్రాంతానికి చెందిన సంస్కృతి, భాష, ఆచారాలు, వనరులు, అక్కడ పుట్టిన సిద్ధాంతాలు అ ప్రాంతానికే అనుకూలంగా ఉంటాయి. ఏ ప్రాంతానికి చెందిన రోగికి ఆ ప్రాంతంలో దొరికే మూలికలతో వైద్యం చేయాలన్నాడు చరకుడు. మంచుకొండల్లో జీవించేవారికి చెమట తక్కువ కాబట్టి, ఉప్పు అవసరం కూడా తక్కువే! అక్కడి సిద్ధాంతాన్ని ఆరుగాలం కష్టించే ఉష్ణప్రాంతం రైతన్నలకు కూలన్నలకు చెప్తే ఉప్పు చాలక కొత్త సమస్యలొస్తాయి. దేశకాలమాన పరిస్థితులు ఎరక్కుండా చెప్పే సిద్ధాంతాలు లూలామాలపు సిద్ధాంతాలే! మన సమాజానికి తగనివాటిని ప్రచారం చేయటం లూలామాలపు పనే అవుతుంది.

తలవంపులు తెచ్చేదంతా లూలామాలమే! తిరుమల కొండకు సూటూ బూటూ వేసుకుని వెళ్ళటం లూలామాలతనమే! ఎప్పుడు ఎక్కడ ఏది చేయాలో అది చేయకపోవటం లూలామాలం. పెళ్ళిలో చావు మేళాలు వాయించటం లాంటిది.

'ఆలాగున గొనిపోయి నృ/పాల ప్రియ పాన్పు క్రిందఁ బాదుకలిడి యా/లూలామాలపు నాలి గ/యాళి తనుం గానిదాని యటువలె నుండెన్' అని చేమకూర వెంకటకవి సారంగధర చరిత్రలో లూలామాలపు ఆలిఁ అనే కొత్త ప్రయోగం చేశాడు.

'మాయ' 'కల్ల' 'అసత్యం' 'కపటం' లటవటం,కుటిలం' ' కుత్సితం' 'కూచిమారం' 'మటుమాయతనం' 'మందుమ్రాకు' 'అటమటం' ఇవన్నీ లూలామాలపు గుణాలే నంటుంది ప్రభులింగలీల కావ్యం.

'కష్టమర్లకు లూలామాలవేసి ఫలానా ఛిట్ ఫండ్ కంపెనీ బోర్డు తిప్పేసింది' అంటే, టోకరా వేసిందని! 'ఎన్నికలొచ్చేసరికి ముక్కూ మొఖం ఎరుగని వాళ్లొచ్చి లూలామాలపు మాటలతో ఊరిస్తారు', 'నిత్యపెళ్లికొడుకు వేసింది వరమాల కాదు లూలామాలు లాంటి మాటలు నయవంచనను సూచిస్తాయి.

'ఎవడో లూలామాలపు మాట విసిరాడని భార్యను వదిలేస్తారా ఎవరైనా?' అని దుగ్గిసెట్టి వేంకటరమణయ్య 'రమణీయ రామాయణం'లో గట్టిగానే అడిగారు.

రాజకీయాలకూ లూలామాలపు తనం ఉంటుంది. అయినా, ప్రతిసారీ మనం పాపుల్ని క్షమిస్తూనే ఉంటాం.

దారిద్ర్యానికి లూలామాలపుతనం ఉన్నా సాధుసన్యాసులు బిచ్చమెత్తుకు తిరుగుతారు. 'పాతకాలంలో సన్యాసులు దారిద్ర్యాన్ని ఆరాధించినట్టే, యుద్ధానికి కూడా ఒక నైతిక ఈక్విలెంట్ లాంటి దేదైనా దొరకనచ్చునని తరచు అనుకుంటాను' అంటారు ఆచార్య తిరుమల రామచంద్ర, '20వ శతాబ్ది అమెరికాలో మతం' అనే అనువాద గ్రంథంలో!

సెలవు ఇవ్వాలంటే మెడికల్ సర్టిఫికేట్ కావాలంటాడు పై అధికారి. లూలామాలం లేకుండా సర్టిఫికేట్ వస్తుందా?

పైకి 'అలాయిబలాయిగా కన్పించినా, లోపల 'లూలామాలం లడాయి'గా ఉంటాయి కొన్ని వ్యవహారాలు. లూలామాలమానుష విగ్రహ రూపుల లీలలు కొల్లలు. 1971లో 60 లక్షల చెక్కు మీద ఇందిరాగాంధీ సంతకాన్ని లూలామాలం చేసిన రుస్తుం సోరబ్ నగర్వాలా అనే ప్రబుద్ధుడి గురించి కథలుగా చెప్పుకునేవారు.

ఒకప్పుడు ఈ లూలామాలం బాగా వాడుకలో ఉన్న పదమే! అనేక అర్థాల్లో ప్రయోగించేవారు. ఇప్పటి రోజుల్లో పెద్ద పెద్ద స్కాములు ప్రభుత్వాలకు సహజ భూషణాలయ్యాయి. పెద్దపెద్దస్కాముల్ని లూలామాలం అని మనమూ పిలవొచ్చు. మీడియా వాళ్లు ఇలాంటి లోతైన భావాన్ని అందించే చక్కని తెలుగు పదాల్ని వాడకంలో పెడితే జనానికి అలవాటవుతాయి. లేకపోతే, వాడకంలోంచి తప్పుకుని 'డీలాయమానం' లో పడుతుంది భాష!

Owned, printed & published by Samala Lakshmana Babu (9440448244) and printed at Sri Mahalakshmi Offset Printers, 16-7-20, Veera Raghavulu Street, Sharabu Bazaar, Tenali, Guntur Dist. and published from 8-386, Jivaka Bhawan, Angalakuduru Post, Tenali Mandal, Guntur Dist. - 522211. Editor: Dr. SAMALA RAMESH BABU (9848016136), RNI-APTEL/2015/62362

# శ్రద్ధాంజలి



## అంతర్జాతీయ తెలుగు ప్రముఖుడు
## భారత-అమెరికన్ గణాంకవేత్త
# సి. ఆర్. రావు

పత్రికల్లో వచ్చిన వార్తల ప్రకారం కల్యంపూడి రాధాకృష్ణరావు అనే ఈ ఎఫ్ఆర్ఎస్ అధికారి సెప్టెంబరు10, 1920లో జన్మించి ఆగష్టు 22, 2023న మృతిచెందారు. సాధారణంగా వీరిని సి.ఆర్.రావు అని పిలుస్తారు. ఈ భారతీయ అమెరికన్ గణిత శాస్త్రజ్ఞుడు మరియు గణాంకవేత్త పెన్సిల్వేనియా స్టేట్ యూనివర్శిటీలో ప్రొఫెసర్ ఎమెరిటస్ మరియు బఫెలో విశ్వవిద్యాలయంలో రీసెర్చ్ ప్రొఫెసర్‌గా సేవలందించారు. రావు అనేక గౌరవ డిగ్రీలు మరియు ఫెలోషిప్‌లచే సత్కరించబడ్డారు. 2002లో యుఎస్ నేషనల్ మెడల్ ఆఫ్ సైన్స్‌ను అందుకున్నారు. అమెరికన్ స్టాటిస్టికల్ అసోసియేషన్ అయనను "లివింగ్ లెజెండ్‌గా" అభివర్ణించింది. టైమ్స్ ఆఫ్ ఇండియా రావుగారిని ఎప్పటికప్పుడు టాప్ 10 భారతీయ శాస్త్రవేత్తలలో ఒకరిగా గుర్తిస్తున్నది..

2023లో రావుకు గణాంక శాస్త్రంలో అంతర్జాతీయ బహుమతి లభించింది. ఈ అవార్డును నోబెల్ బహుమతికి సమానమైనదిగా అభివర్ణిస్తారు. రావు ఇండియన్ హార్ట్ అసోసియేషన్ అనే సేవా సంస్థకు సీనియర్ పాలసీ మరియు స్టాటిస్టిక్స్ సలహాదారుగా కూడా ఉన్నారు. భారతదేశాన్ని బ్రిటిష్‌వారు పరిపాలించిన కాలంలో మద్రాసు ప్రెసిడెన్సీలోని బళ్లారి, హూవినా హడగలిలో ఒక తెలుగు కుటుంబంలో జన్మించిన పదిమంది పిల్లలలో సిఆర్‌రావు ఎనిమిదవవారు. వీరి పాఠశాల విద్య ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని గూడూరు, నూజివీడు, నందిగామ మరియు విశాఖపట్నంలో పూర్తయింది. ఆయన 1943లో ఆంధ్ర విశ్వవిద్యాలయం నుండి గణిత శాస్త్రంలో ఎం.ఎస్.సి మరియు కలకత్తా విశ్వవిద్యాలయం నుండి గణాంకాలలో ఎం.ఏ పట్టా పొందారు. 1948లో ఆర్.ఎ.ఫిషర్ ఆధ్వర్యంలో కేంబ్రిడ్జిలోని కింగ్స్ కాలేజీలో పిహెచ్.డి పట్టా పొందారు. దానికి అయన 1965లో కేంబ్రిడ్జ్ నుండి డి.ఎస్‌సి డిగ్రీని కూడా పొందారు.

ప్రముఖ తెలుగు భాషోద్యమ కార్యకర్త, పరిశోధకుడు, రచయిత స.వెం.రమేశ్ ఈ సందర్భంగా మరికొంత విలువైన సమాచారాన్ని అందించారు. ఆయన తెలియజేసిన వివరాలు ఆయన మాటల్లోనే.....

*సి.ఆర్.రావు అంటే స్టాటిస్టిక్స్ రంగంలో ప్రపంచవ్యాప్తంగా ఎక్కడవున్నవారికైనా బాగా తెలిసిందే. 102 ఏళ్ల ఈడులో 22 ఆగష్టున కన్నుమూసినారు. వీరు తెలుగు వారు. కర్నాటకలోని హూవిన హడగలిలో పుట్టిన వాళ్లనీ... ఇంకా గూగుల్లో కొంత సమాచారం దొరుకుతుంది.*

*సి.ఆర్.రావు అంటే కల్యంపూడి రాధాకృష్ణరావు అని ఉంటుంది గూగుల్లో. గూగుల్లో దొరకని మరికొన్ని ముచ్చట్లు చెప్పుకోవాలి మనం. మనమంటే అమ్మనుడి చదువరులం. మద్రాసు మాగాణంలోని చెంగల్పట్టు జిల్లాలో ( ప్రస్తుతం తమిళనాడులోని కంచి జిల్లా ) ఉత్తర మల్లూరు తాలూకాలో కలియాంపూండి అని ఒక పల్లెటూరు ఉండేది. ఇప్పటికీ వుంది అది. తమిళులు కలియాంపూండి అని అంటారు. తెలుగువారు కలిసెపూడి అంటారు. ఇది సి.ఆర్.రావుగారి సొంత ఊరు. రావుగారి నాన్నగారు మద్రాసు దొరతనంలో పోలీసు పని చేసేవారు. ఆ పనిమీద మద్రాసు మాగాణమంతా కుటుంబంతోపాటు తిరుగుతా ఉండేవారు. మద్రాసు మాగాణంలోనే బళ్ళారి జిల్లా కూడా ఉండేది. ఉద్యోగరీత్యా బళ్ళారి జిల్లాలోని హూవిన హడగలిలో వీళ్ళ కుటుంబం ఉన్నప్పుడు అక్కడ సి.ఆర్.రావుగారు పుట్టారు. వీరి సొంత ఊరు అయిన కలిసెపూడిలో దేసూటి కాపులు, పద్మవెలమలు, గాజుల బలిజలు, ఈండ్ర వారు, గొల్లవారు, చాకలివారు, కంసాలి వారు తెలుగు కులాలు. చేరిసెట్లు, మంగలివారు, మాలవారు తమిళ కులాలు. 50 ఏళ్ళ క్రిందటి వరకు కలిసెపూడిలో 80శాతం తెలుగు, 20శాతం తమిళం వారు ఉండేవారు.*

*తెలుగువారు వలస పోవడం, దళితుల జనాభా పెరగడం వల్ల ఇప్పుడు తమిళ లెక్కే పెద్దది. అయితే 1980 వరకు కలిసెపూడి బడిలో తెలుగు తరగతి నడిచింది.'కలిసె' అనేది తెలుగులో ఒక తీగజాతి మొక్క పేరు. పొదపత్రి ఆకులను పోలి ఉంటుంది 'కలిసె' తీగ ఆకు. ఈ కలిసె ఆకు ఎక్కువగా దొరికే చోటు కాబట్టి కలిసెపూడి అని పేరు పెట్టుకున్నారు ఆ ఊర్లో ఉంటున్న తెలుగువారు.*

*తెల్లవారి ఏలుబడిలో కరణాలుగా పనిచేసిన కణకుపిళ్ళై కులం వారికి తీవ్రమైన తమిళ దురభిమానం ఉండేది. వారు ప్రతి ఊరి పేరుని తమిళంలోకి మార్చి మరీ రికార్డుల్లోకి ఎక్కించినారు. అప్పుడు వారు ఈ 'కలిసె' అనే పదాన్ని సంస్కృతంలోని కలశం అనుకున్నారు. 'కలిసె' అనే తీగ తెలుగు పేరు వారికి తెలియదు. కలశంగా అనుకుని (కలశాన్ని తమిళంలో కలయం అంటారు) దానిని కల్యంగా మార్చి కలిసెపూడిని కల్యంపూడిగా మార్చినారు. అదే పేరును సిఆర్ రావు కుటుంబం వారు కొనసాగించగా, వారి ఇంటిపేరు కల్యంపూడిగా మారింది. నిజానికి వారి ఇంటిపేరు అది కాదు. సి.ఆర్.రావుగారు పద్మవెలమ కులానికి చెందినవారు. వారి ఇంటి పేరు కమలంపూడి. గోత్రం పద్మనాభ గోత్రం. 150 ఏళ్ళలో తెలుగు నేల, తెలుగునుడి ఎంతగా కుదించుకుపోయినాయో అనేదానికి ఇది ఆనవాలు. ఈ సి.ఆర్.రావు గారి ఇంటిపేరు సేకరించడంలో సాయపడిన అగస్త్యరెడ్డి దామోదరరెడ్డి గారికి మప్పిదాలు.*

అమ్మనుడి తెలుగుజాతి పత్రిక
AMMANUDI (Telugu Monthly)
September 2023 Vol :9, Issues: 7

Date of publication : 1st of every month
Date of posting : 3rd & 6th of every month

RNI-APTEL / 2015/62362
Postal Reg NO. TEN/14/2021-23




If not delivered, please return to : 'The Publisher, AMMANUDI Monthly,
8-386, Jivaka Bhavanam,ANGALAKUDURU (po),TENALI-522 211,Guntur (dt) A.P. Cell:94929 80244